సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 129

మంగళవారం 30-7-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్ర్యానికి అర్థం లేదు'



క్లీన్‌స్వీప్ లక్ష్యంగా...
శ్రీలంక జట్టుతో నేడు చివరిదైన మూడో టి20 మ్యాచ్ ఆడనున్న భారత్. - 16లో




నిఫ్టీ 25,000కు చేరి.. వెనక్కి
రికార్డు స్థాయి నుంచి రివర్స్.. ఐటీ, ఎఫ్ఎంసీజీ షేర్లలో లాభాల స్వీకరణ -17లో



మోదీ చక్రవ్యూహంలో దేశం
మోదీ సర్కారుపై రాహుల్ మండిపడ్డారు. ప్రధాని మోదీ పన్నిన చక్రవ్యూహం దేశాన్ని సర్వనాశనం చేస్తోందని ఆరోపించారు.
- వివరాలు 6లో



ఇనుప గొలుసుతో చెట్టుకు కట్టేసి..
మహారాష్ట్ర సింధుదుర్గ్ అడవుల్లో ఇనుప గొలుసుతో చెట్టుకు కట్టేసి ఉన్న ఓ మహిళ కనిపించింది. ఆమె చిక్కి శల్యమైపోయింది.
- వివరాలు 6లో



వెనిజులాలో మళ్లీ పాత కథే!
వెనిజులా అధ్యక్ష ఎన్నికల్లో ఊహించిందే జరిగింది. అధ్యక్షుడు నికొలస్ మదురో వరుసగా మూడోసారి విజయం సాధించారు.
- వివరాలు 6లో



కేజ్రీవాల్ బెయిల్‌పై తీర్పు రిజర్వు
ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో సీఎం కేజ్రీవాల్ పెట్టుకున్న బెయిల్ పిటిషన్‌పై తీర్పును హైకోర్టు రిజర్వులో ఉంచింది.
- వివరాలు 6లో

'పవర్' ప్రకంపనలు

అధికార, విపక్షాల ఆరోపణలు, సవాళ్లతో అట్టుడికిన శాసనసభ

అవినీతి వ్యవహారాల నుంచి వ్యక్తిగత అంశాల దాకా పరస్పరం మాటల దాడులు

చర్చను ప్రారంభించిన కాంగ్రెస్ సభ్యుడు రాజగోపాల్‌రెడ్డి

గత ప్రభుత్వ విధానాలతో విద్యుత్ రంగం తీవ్ర నష్టాల్లోకి వెళ్లిందని ఆక్షేపణ

కాంగ్రెస్ సర్కారు కక్షపూరితంగా రాద్ధాంతం చేస్తోందన్న బీఆర్ఎస్ సభ్యుడు జగదీశ్‌రెడ్డి

గత ప్రభుత్వ విద్యుత్ ఒప్పందాలన్నీ అవినీతిమయమన్న సీఎం రేవంత్

దీనితో జగదీశ్‌రెడ్డి, రేవంత్, మంత్రి కోమటిరెడ్డిల మధ్య వాగ్వాదం



దొంగతనాలు చేసినోడివి.. సంచులు మోసి జైలుకెళ్లినోడివి!

అసెంబ్లీలో సీఎం రేవంత్, మంత్రి కోమటిరెడ్డిలకు.. మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డికి మధ్య మాటల యుద్ధం

జగదీశ్‌రెడ్డిపై రైస్‌మిల్లు, పెట్రోల్ బంక్ దొంగతనాల ఆరోపణలు చేసిన రేవంత్, కోమటిరెడ్డి

ప్రతిగా రేవంత్‌కు చర్లపల్లి జైలు గుర్తొస్తున్నట్టుందంటూ జగదీశ్‌రెడ్డి విమర్శలు

- వివరాలు 2లో

సాక్షి, హైదరాబాద్

'విద్యుత్' పద్దుపై సోమవారం అసెంబ్లీలో జరిగిన చర్చ ప్రకంపనలు రేపింది. అధికార, విపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదం, సవాళ్లు– ప్రతిసవాళ్లు, ఆరోపణలు– ప్రత్యారోపణలు, రాజీనామా డిమాండ్లతో సభ అట్టుడికింది. అదే సమయంలో ఇరుపక్షాల నేతల మధ్య వ్యక్తిగత దూషణలూ చోటుచేసుకోవడం ఉద్రిక్తతకు దారితీసింది. ఈ ఏడాది విద్యుత్ రంగానికి బడ్జెట్‌లో నిధుల కేటాయింపుపై సోమవారం శాసనసభలో చర్చ జరిగింది. కాంగ్రెస్ సభ్యుడు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చర్చను ప్రారంభించారు. గత ప్రభుత్వ విధానాల వల్లే విద్యుత్ రంగం నష్టాల్లోకి వెళ్లిందని ఆక్షేపించారు. విద్యుత్ కొనుగోళ్లలో భారీ అవినీతి జరిగిందని, ఆ కథంతా వెలికి తీస్తామని పేర్కొన్నారు. అనంతరం బీఆర్ఎస్ సభ్యుడు జగదీశ్‌రెడ్డి మాట్లాడారు. తమ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తిని పెంచామంటూ పలు గణాంకాలను వివరించారు. అవినీతి అంటూ కాంగ్రెస్ సర్కారు కక్షపూరితంగా రాద్ధాంతం చేస్తోందని మండిపడ్డారు. ఈ దశలో సీఎం రేవంత్ జోక్యం చేసుకున్నారు. బీఆర్ఎస్ హయాంలోని విద్యుత్ ఒప్పందాలన్నీ అవినీతిమయమంటూ తీవ్రంగా మండిపడ్డారు. దీనికి కౌంటర్‌గా జగదీశ్‌రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రతిగా సీఎం రేవంత్, మంత్రి కోమటిరెడ్డి ఇద్దరూ వ్యక్తిగత ఆరోపణలతో విరుచుకుపడ్డారు. ఈ సమయంలో ఇరుపక్షాల సభ్యులు తీవ్ర నిరసన వ్యక్తం చేయడంతో శాసనసభ దద్దరిల్లింది.

'విద్యుత్' ఒప్పందాల కథ వెలికితీస్తాం..

- గత పదేళ్ల ఇష్టానుసార నిర్ణయాలతో విద్యుత్ సంస్థలకు నష్టాలు: రాజగోపాల్‌రెడ్డి
- సభకు రాకూడదనుకుంటే కేసీఆర్ ప్రతిపక్ష నేత హోదా వదులుకోవాలి

- వివరాలు 2లో

'విద్యుత్'ను బలోపేతం చేసిందే మేము

- రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం పెంచాం: జగదీశ్‌రెడ్డి
- రైతులకు, ఇతర అన్నివర్గాలకూ 24 గంటల విద్యుత్ ఇచ్చాం
- విద్యుత్ కొరత తీర్చేందుకే కొనుగోళ్లు
- వ్యవస్థల బలోపేతం కోసమే అప్పులు అయ్యాయి - 2లో

కేసీఆర్‌కు క్లీన్‌చిట్ రాలేదు

- 'విద్యుత్' కమిషన్ చైర్మన్‌ను మార్చాలనే సుప్రీం చెప్పింది
- శాసనసభలో విద్యుత్ పద్దుపై చర్చలో సీఎం రేవంత్‌రెడ్డి
- కమిషన్‌ను రద్దు చేయాలన్న విజ్ఞప్తిని కోర్టులు తిరస్కరించాయి
- యాదాద్రి ప్లాంట్‌లోనూ రూ.10వేల కోట్ల అవినీతి - 2లో

శ్రీశైలం ప్రాజెక్టు మూడు గేట్ల ద్వారా దిగువకు పారుతున్న వరద నీరు



సాగర్ వైపు కృష్ణమ్మ పరుగులు

- 879.3 అడుగుల వద్ద 184.70 టీఎంసీలకు చేరిన నిల్వ.. ప్రాజెక్టు 3 గేట్లు ఎత్తి 76,056 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల
- నాగార్జునసాగర్ ప్రాజెక్టులోకి గంటగంటకూ పెరుగుతోన్న వరద - 7లో

శాంతిస్తున్న గోదావరి

- ప్రాణహిత, ఇంద్రావతి, శబరిలలో వరద తగ్గుముఖం
- భద్రాచలం వద్ద 42.90 అడుగులకు తగ్గిన నీటిమట్టం - 7లో

నేడు రెండో విడత రుణమాఫీ

- రూ.లక్షన్నర వరకు అప్పులున్న రైతుల ఖాతాల్లో జమ
- దాదాపు 7 లక్షల మందికి లబ్ధి!
- రైతు వేదికల్లో ప్రత్యక్ష ప్రసారం: మంత్రి తుమ్మల
- తొలి విడతలో రూ.లక్ష వరకు రుణాలున్న 11.50 లక్షల కుటుంబాలకు ఇప్పటికే రూ.6,098.94 కోట్లు విడుదల



సాక్షి, హైదరాబాద్: రెండో విడత రుణమాఫీకి ప్రభుత్వం సిద్ధమైంది. మంగళవారం దాదాపు 7 లక్షల మంది రైతులకు సంబంధించిన రుణాలు మాఫీ చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు సమాచారం. రూ.లక్షన్నర వరకు రుణాలున్న వారి బ్యాంకు ఖాతాల్లో ఈ సొమ్ము జమ చేస్తారు. రుణమాఫీ మొదటి విడతలో రూ.లక్ష లోపు రుణాలకు సంబంధించి 11.50 లక్షల కుటుంబాలకు రూ.6,098.94 కోట్లు విడుదల చేసిన సంగతి తెలిసిందే. కాగా వీటిలో.. రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా నుంచి ప్రభుత్వానికి అందిన సమాచారం ప్రకారం 11.32 లక్షల కుటుంబాలకు రూ.6,014 కోట్లు జమయ్యాయి. కొన్ని సాంకేతిక కారణాలతో 17,877 ఖాతాలకు చెందిన రూ.84.94 కోట్లు రైతుల ఖాతాల్లో జమ కాలేదు. కాగా రెండో విడత రుణమాఫీ చెల్లింపులకు సంబంధించి సోమవారం రాత్రి వరకు మండలాల్లోని వ్యవసాయశాఖ అధికారులకు కూడా లబ్ధిదారుల జాబితా అందలేదని సమాచారం. రాత్రి పొద్దుపోయాక జాబితా అందుతుందని భావిస్తున్నారు. మొదటి విడతలో లక్ష వరకు మిగతా 3వ పేజీలో ▶

న్యూస్‌రీల్

జీఎస్టీ స్కామ్ సీఐడీకి



రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖలో వెలుగులోకి వచ్చిన రూ.1,000 కోట్ల జీఎస్టీ స్కామ్ కేసును సీఐడీకి బదలాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ గోల్‌మాల్‌లో ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్‌తో పాటు వాణిజ్య పన్నుల శాఖ అధికారులు నిందితులుగా ఉన్న విషయం తెలిసిందే.

- వివరాలు 8లో

సీఎం అబద్ధాలకు అంతేలేదు: హరీశ్‌రావు



శాసనసభలో పాలకపక్షం ఆత్మరక్షణలో పడినప్పుడల్లా సీఎం రేవంత్‌రెడ్డి సభా నాయకుడిగా ఉన్న అవకాశాన్ని ఉపయోగించుకుని అబద్ధాలతో చర్చలను పక్కదారి పట్టిస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. వరుస అబద్ధాలతో సభ ఔన్నత్యాన్ని తగ్గిస్తున్నారని విమర్శించారు.

- వివరాలు 3లో

డ్రగ్స్, గంజాయి కట్టడికి ఒక్కరోజు చాలు: అక్బరుద్దీన్



'డ్రగ్స్, గంజాయి ఎక్కడ్నుంచి వస్తున్నాయో పోలీసులకు తెలుసు. నిజంగా నిర్మూలించాలనే ఉద్దేశం ఉంటే పోలీసులకు ఒక్కరోజు చాలు. కానీ ఆ పని చేయకుండా వేడుక చూస్తున్నారు. నేరగాళ్లను వదిలేసి సామాన్యులను వేధిస్తున్నారు' అని ఎంఐఎం పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ అసెంబ్లీలో ధ్వజమెత్తారు.

- వివరాలు 2లో

14 నుంచి వైద్య కోర్సులకు కౌన్సెలింగ్

- వివరాలు 5లో

బీజేపీ విప్‌గా విశ్వేశ్వర్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: లోక్‌సభలో బీజేపీ విప్‌గా చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని ఆ పార్టీ అధిష్టానం నియమించింది. డాక్టర్ సంజయ్ జైస్వాల్‌ను పార్టీ చీఫ్ విప్‌గా నియమించగా.. విశ్వేశ్వర్ రెడ్డితో పాటు మొత్తం 16 మందికి లోక్‌సభలో విప్‌లుగా అవకాశం కల్పించారు. ఈ మేరకు బీజేపీ పార్లమెంటరీ పార్టీ కార్యాలయ కార్యదర్శి డాక్టర్ శివ్ శక్తినాథ్ బక్షి సోమవారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ అందజేశారు.

హైవే ఎక్కితే టోల్!

కాస్త దూరమే ప్రయాణించినా రుసుం వసూలు

త్వరలో గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టంతో టోల్ వ్యవస్థ అనుసంధానం

టోల్ రోడ్లపై, వాహనాల్లో ఇందుకోసం సాంకేతిక ఏర్పాట్లు

ఇక టోల్ బూత్‌లే ఉండవు.. ఆటోమేటిగ్గా ఖాతాలోని డబ్బులు కట్

కర్ణాటక, హరియాణాల్లో ప్రయోగాత్మకంగా పరిశీలన

ఏడాది తర్వాత దేశవ్యాప్తంగా అమలుకు యోచన



సాక్షి, హైదరాబాద్: హైవే మీద కాస్త దూరమే ప్రయాణించినా ఇకపై సదరు వాహనం సంబంధిత ఖాతా నుంచి టోల్ రుసుము కట్ కానుంది. ప్రస్తుతం టోల్ ప్లాజాల్లోంచి వాహనం వెళ్తేనే టోల్ చెల్లించాల్సి వస్తోంది. టోల్ బూత్ వచ్చేలోపు రోడ్డు దిగిపోతే చెల్లించాల్సిన అవసరం ఉండటం లేదు. ఇకపై అలా కాకుండా హైవే ఎక్కితే చాలు రుసుము చెల్లించేలా కేంద్ర ప్రభుత్వం కొత్త విధానానికి శ్రీకారం చుట్టనుంది. వచ్చే సంవత్సరానికి ప్రాథమిక స్థాయిలో ఇది అమల్లోకి మిగతా 5వ పేజీలో ▶

ఇదండీ సంగతి



మరో కాంస్యంపై గురి



- పారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌కు షూటింగ్ ద్వారానే మరో పతకం వచ్చే అవకాశం ఉంది. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో మనూ భాకర్ – సరబ్‌జోత్ సింగ్‌లతో కూడిన భారత జోడి క్వాలిఫయింగ్‌లో సత్తా చాటి కాంస్య పతక పోరుకు అర్హత సాధించింది. నేడు కాంస్యం కోసం జరిగే 'ప్లే ఆఫ్' మ్యాచ్‌లో కొరియాతో భారత్ తలపడుతుంది. సోమవారం ఇతర భారత షూటర్లకు వైఫల్యం ఎదురైంది. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్‌లో అర్జున్ బబూతా 4వ స్థానంలో నిలిచి త్రుటిలో పతకం చేజార్చుకోగా... 10 మీటర్ల ఎయిర్‌పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో రిథమ్ – అర్జున్ సింగ్ ద్వయం 10వ స్థానం, 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మహిళల విభాగంలో రమిత జిందాల్ 7వ స్థానంతో ముగించారు. - 15లో

బ్యాడ్మింటన్ డబుల్స్‌లో క్వార్టర్ ఫైనల్‌కు సాత్విక్- చిరాగ్ జోడీ

15లో

హాకీలో అర్జెంటీనాతో జరిగిన మ్యాచ్‌ను 1-1తో 'డ్రా'గా ముగించిన భారత్



ఢిల్లీలోని ఓల్డ్ రాజేంద్రనగర్‌లో ఆక్రమణలను కూల్చివేస్తున్న దృశ్యం


విద్యార్థుల జలసమాధిపై ఉన్నతస్థాయి కమిటీ

- ఆదేశించిన కేంద్ర హోంశాఖ
- 'కోచింగ్' ఉదంతంలో మరో ఐదుగురి అరెస్ట్.. పలు కోచింగ్ సెంటర్ల బేస్‌మెంట్లకు సీలు

- వివరాలు 6లో

రష్యా యుద్ధక్షేత్రంలో మరో భారతీయుడు మృతి

- వివరాలు 6లో



పద్దుల పుస్తకాల పంపిణీపై స్వల్ప వివాదం

సాక్షి, హైదరాబాద్: శాసనసభలో డిమాండ్ల పుస్తకాల పంపిణీపై సోమవారం కొద్దిసేపు అధికార విపక్ష సభ్యుల మధ్య స్వల్ప వివాదం చోటు చేసుకుంది. పద్దులకు సంబంధించిన పుస్తకాలు రాత్రి ఇవ్వాలని, అప్పుడే తాము సన్నద్ధమవ్వడానికి వీలుంటుందని బీఆర్ఎస్ సభ్యుడు జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. దీనికి మంత్రి డి.శ్రీధర్‌బాబు బదులిస్తూ, పుస్తకాలు రాత్రి 9 గంటలకే అందజేశామన్నారు. రాత్రి 9 గంటలకు కొన్నే వచ్చాయని విపక్ష సభ్యుడు వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ హయాంలో ప్రతీసారి రాత్రి 10 గంటల తర్వాత ఇచ్చారని శ్రీధర్ బాబు విమర్శించారు. ఇక నుంచి సకాలంలో అందించే ప్రయత్నం చేద్దామని చెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

బోర్లకు మీటర్లు పెట్టాలని కేంద్రం అనలేదు: రమణారెడ్డి




సాక్షి, హైదరాబాద్: వ్యవసాయ బావులకు మీటర్లు పెట్టాలని కేంద్రం ఎన్నడూ చెప్పలేదని బీజేపీ సభ్యుడు కేవీ రమణారెడ్డి స్పష్టం చేశారు. విద్యుత్ నష్టాలను తగ్గించుకుని విద్యుత్ సంస్థలను గాడిలో పెట్టడానికే వ్యవసాయేతర కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు పెట్టుకోవాలని కోరిందన్నారు. బడ్జెట్ పద్దులపై చర్చ సందర్భంగా సోమవారం ఆయన సభలో మాట్లాడారు. స్మార్ట్ మీటర్లు పెట్టుకుంటే ప్రజలు తమకు అవసరమైన విద్యుత్‌ను నియంత్రణతో వాడుకోవడానికి వీలుంటుందని చెప్పారు. విద్యుత్ సంస్థల్లో అన్‌మ్యాన్డ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని రమణారెడ్డి కోరారు. ఇళ్లపై నుంచి వెళ్తున్న విద్యుత్ తీగలను తొలగించాలన్నారు.

దొంగతనాలు చేసినోడివి.. సంచులు మోసి జైలుకెళ్లినోడివి..!

అసెంబ్లీలో సీఎం రేవంత్, మంత్రి కోమటిరెడ్డిలకు.. మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డికి మధ్య మాటల యుద్ధం

- జగదీశ్‌రెడ్డిపై రైస్‌మిల్లు, పెట్రోల్ బంక్ దొంగతనాల ఆరోపణలు చేసిన రేవంత్, కోమటిరెడ్డి
- ప్రతిగా రేవంత్‌కు చర్లపల్లి జైలు గుర్తొస్తున్నట్టుందంటూ జగదీశ్‌రెడ్డి విమర్శలు
- రాజీనామాల కోసం సవాళ్లు, ప్రతిసవాళ్లు.. పరస్పర విమర్శలతో వేడెక్కిన సభ
- విద్యుత్ అంశంపై చర్చ సందర్భంగా దుమారం





సాక్షి, హైదరాబాద్: శాసనసభలో సీఎం రేవంత్, మంత్రి కోమటిరెడ్డిలకు.. మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డికి మధ్య మాటల యుద్ధం జరిగింది. పరస్పర విమర్శలు, ఆరోపణలతో సభ వేడెక్కింది. కిరాయి హత్యలు, దొంగతనాలు, జైలుకు వెళ్లడాల నుంచి రాజీనామాల సవాళ్ల దాకా వెళ్లింది. సోమవారం సభలో విద్యుత్ పద్దుపై చర్చ సందర్భంగా బీఆర్ఎస్ సభ్యుడు జగదీశ్‌రెడ్డి ఆవేశంగా మాట్లాడారు. మధ్యలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకుని జగదీశ్‌రెడ్డిని ఉద్దేశిస్తూ..''ఆయనలో ఉక్రోషం చూస్తుంటే.. చర్లపల్లి జైలులో ఉన్నట్టుగా ఉంది''అని వ్యాఖ్యానించారు. దీనికి జగదీశ్‌రెడ్డి కౌంటర్ ఇస్తూ.. ''చర్లపల్లి జైలు జీవితం ఆయనకు (రేవంత్‌కు) అనుభవం. కాబట్టే మళ్లీ మళ్లీ గుర్తు చేసుకుంటున్నారు. మళ్లీ తాను అక్కడికే వెళతానని భావిస్తున్నారేమో! నాకైతే ఉద్యమకాలంలో చంచల్‌గూడకు వెళ్లిన జైలు జీవితం గుర్తుకొస్తోంది. సీఎంకు మాత్రం చర్లపల్లి జైలులో గడిపినదే గుర్తుకొస్తోంది''అని కామెంట్ చేశారు.

మిల్లులో దొంగతనం చేస్తే ఏం చేశారో తెలుసు!

జగదీశ్‌రెడ్డి వ్యాఖ్యలపై సీఎం రేవంత్ తీవ్రంగా స్పందించారు. ''సూర్యాపేట బియ్యం మిల్లులో దొంగతనం చేస్తే మిల్లర్లు ఎవరిని పట్టుకుని చెట్టుకు కట్టేశారో.. నిక్కరేసుకున్న పిల్లాడ్ని అడిగినా చెప్తాడు..''అని వ్యాఖ్యానించారు. మంత్రి వెంకట్‌రెడ్డి మరిన్ని వివరాలు చెప్తారన్నారు. వెంటనే మంత్రి వెంకట్‌రెడ్డి లేచి జగదీశ్‌రెడ్డిని ఉద్దేశిస్తూ.. ''ఈయన గ్రామానికి చెందిన సమితి మాజీ అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి హత్య కేసులో ఏ-2 నిందితుడు. భిక్షం అనే వ్యక్తి హత్య కేసులో ఈయన, వాళ్ల నాన్న ఏ-6, ఏ-7 నిందితులు. రామిరెడ్డి హత్య కేసులో ఏ-3 నిందితుడు. ఆ సమయంలో నల్గొండ జిల్లా నుంచి బహిష్కరించారు కూడా. ఇక మాజీ ఎమ్మెల్యే దోసపాటి గోపాల్ పెట్రోల్ బంక్‌లో జరిగిన దొంగతనం కేసులోనూ ఉన్నారు. మద్య నిషేధం సమయంలో కర్ణాటక నుంచి దొంగతనంగా మద్యం తెప్పించినందుకు మిర్యాలగూడ పోలీసుస్టేషన్‌లో ఇప్పటికీ కేసు ఉంది. దొంగతనాలు, కిరాయి హత్యలు తప్ప ఉద్యమాలు చేశాడా?''అంటూ ఆరోపణలు గుప్పించారు.

నిరూపించు.. లేకుంటే ముక్కు నేలకు రాయి!

కోమటిరెడ్డి వ్యాఖ్యలతో విపక్ష బీఆర్ఎస్ సభ్యులు ఆగ్రహంగా సీట్ల నుంచి లేచి నిరసన వ్యక్తం చేశారు. ఈ దశలో జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. ''ఆయన (కోమటిరెడ్డి) మాటలను రికార్డుల నుంచి తొలగించాలి. లేదా ఆరోపణలకు ఆధారాలు చూపించాలి. అలా చూపిస్తే.. ఇదే సభలో ముక్కు నేలకు రాస్తా. రాజీనామా చేసి, రాజకీయాల నుంచి తప్పుకుంటా. రుజువు చేయకపోతే కోమటిరెడ్డితోపాటు సీఎం కూడా ముక్కునేలకు రాసి రాజీనామా చేయాలి''అని సవాల్ విసిరారు. దీనితోపాటు ''చెత్తగాళ్ల మాటలు.. చెత్త మాటలు.. వాటిని రికార్డుల నుంచి తొలగించండి. నాపై వారు చేసిన ఆరోపణలపై సభా కమిటీ వేయండి..''అని స్పీకర్‌ను కోరారు. తనపై రాజకీయ కక్షతో పెట్టిన ఆ హత్యకేసులను కోర్టు ఎప్పుడో కొట్టివేసిందని వివరించారు.

కోర్టు చుట్టూ తిరిగినది నిరూపిస్తా..

వెంటనే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి జోక్యం చేసుకుని.. ''జగదీశ్‌రెడ్డి హత్య కేసులో కోర్టు చుట్టూ 16 ఏళ్లు తిరిగారని నిరూపిస్తా. నేను అన్నది నిరూపించకపోతే ఇదే సభలో మంత్రి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా. నల్గొండ ఎస్పీ, కోర్టు నుంచి రికార్డులు తెప్పించండి''అని పేర్కొన్నారు. ఈ సమయంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ జోక్యం చేసుకుని.. రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తే ట్రెజరీ బెంచ్ నుంచి అలాంటి వ్యాఖ్యలు వస్తాయని, సబ్జెక్టుపై మాట్లాడాలని జగదీశ్‌రెడ్డికి సూచించారు. జగదీశ్‌రెడ్డి బదులిస్తూ.. ''స్పీకర్ ఇలా వ్యాఖ్యానించడం సరికాదు. నేనెక్కడా విషయాన్ని పక్కదారి పట్టించలేదు. సీఎం, కోమటిరెడ్డిలే సంబంధం లేని అంశాలను ప్రస్తావించారు''అని పేర్కొన్నారు. దీనిపై సభావ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు అభ్యంతరం చెప్పారు. సభ్యులను అవమానించేలా మాట్లాడిన జగదీశ్‌రెడ్డి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సంచులు మోసి జైలుకెళ్లింది మీరేనంటూ..

కోమటిరెడ్డి వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని జగదీశ్‌రెడ్డి పదేపదే కోరడంతో స్పీకర్ స్పందించారు. రికార్డులను పరిశీలించి నిర్ణయం తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో సీఎం రేవంత్‌ను ఉద్దేశించి జగదీశ్‌రెడ్డి విమర్శలు చేశారు. ''మా నేత కేసీఆర్ సత్యహరిశ్చంద్రుడే. మీలాగా సంచులు మోసే చంద్రుడు కాదు. సంచులు మోసి జైలుకు పోయింది మీరే''అని వ్యాఖ్యానించారు. దీనిపై అధికారపక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం లేవనెత్తారు. ఈ దశలో కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. తర్వాత జగదీశ్‌రెడ్డి తన ప్రసంగాన్ని కొనసాగించారు.

జగదీశ్‌రెడ్డి వ్యాఖ్యలు రికార్డుల నుంచి తొలగింపు

శాసనసభలో సీఎం, ఇతరులను ఉద్దేశించి బీఆర్ఎస్ సభ్యుడు జగదీశ్‌రెడ్డి చేసిన పలు వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తున్నట్టు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రకటించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. తర్వాత తాను మాట్లాడుతానంటూ బీఆర్ఎస్ సభ్యుడు హరీశ్‌రావు అనుమతి కోరగా.. స్పీకర్ తిరస్కరించారు. దీనితో బీఆర్ఎస్ సభ్యులు నిరసన తెలిపారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి తదితరులు స్పీకర్ వెల్‌లోకి వెళ్లి నినాదాలు చేయగా.. స్పీకర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సభా మర్యాదలు కాపాడాలని కోరారు. దీంతో బీఆర్ఎస్ సభ్యులు తమ కుర్చీల వద్దకు వెళ్లారు.

'విద్యుత్' ఒప్పందాల కథ వెలికితీస్తాం

- శాసనసభలో చర్చను ప్రారంభించిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: గత బీఆర్ఎస్ ప్రభుత్వ బాధ్యతారహిత నిర్ణయాల వల్ల విద్యుత్‌శాఖ రూ.వేల కోట్లు నష్టపోయిందని శాసనసభలో కాంగ్రెస్ సభ్యుడు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ధ్వజమెత్తారు. అసెంబ్లీలో సోమవారం ఆయన 'విద్యుత్' అంశంపై చర్చను ప్రారంభించారు. ఉచిత విద్యుత్ తీసుకొచ్చిన ఘనత వైఎస్ రాజశేఖర్‌రెడ్డిదేనని..గత కాంగ్రెస్ ప్రభుత్వాలు ముందుచూపుతో ప్రణాళికలు రూపొందించబట్టే విద్యుదుత్పత్తి పెరిగిందన్నారు. గత పదేళ్లు ఇష్టానుసారం విద్యుత్ నిర్ణయాలు తీసుకున్న వ్యక్తి సభలో లేకపోవడం దురదృష్టకరమని మాజీ సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి విమర్శించారు. కేసీఆర్ సభకు రాకూడదనుకుంటే ప్రతిపక్ష నేత హోదా వదులుకోవాలన్నారు. విద్యుత్ రంగంలో జరిగిన దోపిడీపై విచారణ జరుగుతుందని, ఒప్పందాల కథ వెలికితీస్తామని చెప్పారు.

ఈ విద్యుత్ ఒప్పందాలు ఎందుకు?

''భద్రాద్రి ప్లాంట్ నిర్మాణం ప్రారంభించే నాటికే సూపర్ క్రిటికల్ టెక్నాలజీ అందుబాటులో ఉంది. దాన్ని కాదని ఎప్పుడో 15 ఏళ్ల క్రితం ఇండియాబుల్ వాళ్ల ప్లాంట్ కోసం తయారు చేసిన టర్బైన్ బాయిలర్ వాడటం వల్ల భద్రాద్రి ప్లాంట్ పనిచేయని దుస్థితి ఏర్పడింది. ఎప్పుడూ ఏదో ఒక యూనిట్ ఆగిపోతోంది. అది పదేళ్ల కిందటి పాత ప్లాంటులా ఉందని చీఫ్ ఇంజనీర్ నివేదిక కూడా ఇచ్చారు. గత ప్రభుత్వ నిర్ణయాల వల్ల ఈ ప్లాంట్ వ్యయం రూ.7,200 కోట్ల నుంచి రూ.10 వేలకోట్లకు పెరిగింది..''అని రాజగోపాల్‌రెడ్డి ఆరోపించారు. బీహెచ్ఈఎల్‌కు నామినేటెడ్ పద్ధతిలో కాంట్రాక్టు ఇవ్వడం, ఆ తర్వాత సివిల్ పనులు బీఆర్ఎస్ నేతల బినామీలకు ఇవ్వడం నిజం కాదా అని ప్రశ్నించారు. ఈ మొత్తం వ్యవహారంపై దర్యాప్తు చేస్తుంటే అడ్డుకోవడానికి బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. పదేళ్ల రాష్ట్రంలో కుటుంబ పాలన నడిచిందని, ఐఏఎస్ అధికారులతో కాళ్లు మొక్కించుకున్న చరిత్ర వారిదని రాజగోపాల్‌రెడ్డి మండిపడ్డారు.

గ్రేటెస్ట్ హైదరాబాద్ చేద్దాం

- మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధికి రూ.లక్షన్నర కోట్లు అని చెప్పిందెవరు?
- జీహెచ్ఎంసీ అన్ని రకాల అభివృద్ధిని ఉద్దేశించి సీఎం మాట్లాడారు
- శాసనసభలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



సాక్షి, హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటుందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఇందులో భాగంగానే రాష్ట్ర బడ్జెట్‌లో రూ.10వేల కోట్లు కేటాయించినట్టు వివరించారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా సోమవారం పద్దులపై జరిగిన చర్చలో మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడారు. 'హైదరాబాద్‌ను గ్రేటెస్ట్ హైదరాబాద్ చేద్దాం. అందుకు పార్టీలకతీతకంగా సభ్యులు సలహాలు, సూచనలు ఇవ్వాలి. మూసీరివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్‌కు రూ.1.5లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నట్టు ప్రతిపక్ష నేతలు మాట్లాడుతున్నారు. హైదరాబాద్ సమగ్రాభివృద్ధిని ఉద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించి ఉండొచ్చు. కానీ బీఆర్ఎస్ నేతలు ఊహాజనిత వ్యాఖ్యలతో సభలో మాట్లాడుతున్నారు.'అని సభ్యులనుద్దేశించి శ్రీధర్‌బాబు అన్నారు.

అంతకు ముందు కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద మాట్లాడుతూ వ్యూహాత్మక రహదారి అభివృద్ధి ప్రణాళికలో భాగంగా 36 ప్రాజెక్టులు పూర్తి చేయగా..మరో 3 పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వ్యూహాత్మక నాలా అభివృద్ధికి గత ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించిందని చెప్పారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం ఈ ప్రాజెక్టులకు నిధులు ఆశించినంతగా ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. మెట్రోరైల్ విస్తరణలో భాగంగా గత ప్రభుత్వం తలపెట్టిన రాయదుర్గం–శంషాబాద్ కారిడార్‌ను ప్రస్తుతం రద్దు చేయడంతో ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ప్రజలు, రవాణా కార్యకలాపాల దృష్ట్యా ఈ ప్రాజెక్టు అవసరమని, దీనిపై ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు.

డ్రగ్స్, గంజాయి బంద్ చేయాలంటే ఒక్కరోజు చాలు: అక్బరుద్దీన్

- ఏ మూల నుంచి ఏమొస్తుందో పోలీసులకు అంతా తెలుసు

సాక్షి, హైదరాబాద్: డ్రగ్స్, గంజాయిని నిర్మూలించాలంటే ఒక్కరోజు చాలని ఎంఐఎం పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ అన్నారు. అసెంబ్లీలో సోమవారం జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. 'హైదరాబాద్‌కు డ్రగ్స్, గంజాయి ఎక్కడ్నుంచి వస్తుందో పోలీసులకు అంతా తెలుసు. నిర్మూలించాలనే ఉద్దేశం ఉంటే పోలీసులకు ఒక్కరోజు చాలు. నేరాలు చేసేవారిని, అత్యాచారాలు చేసే వారిని పట్టుకోకుండా..సామాన్యుల ఇళ్లలోకి చొరబడి విచారించడం, వారిని కొట్టడం లాంటి ఘటనలు పాతబస్తీలో ఎక్కువయ్యాయి. విధులు ముగించుకొని ఆలస్యంగా ఇంటికి వచ్చేవారిని, అత్యవసర పరిస్థితిలో బయటకు పోయేవారిని విచారణ పేరిట ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ప్రతీ పోలీస్‌స్టేషన్‌కు మామూళ్లు అందుతున్నాయి. నిలోఫర్ కేఫ్ అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా తెరిచే ఉంటుంది. కమిషనర్‌కు చాయ్, బిస్కట్ అక్కడ్నుంచి తీసుకెళతారు కాబోలు అందుకే దాన్ని మూసివేయరు. మిగతా పేదలు, సామాన్యుల దుకాణాలను మాత్రం లాఠీలు చూపించి మూసేస్తారు. బీసీ సంక్షేమశాఖ పరిధిలోని కార్పొరేషన్లు, ఫెడరేషన్లకు ఏడేళ్లలో భారీగా నిధులు కేటాయించినట్టు చూపించిన గత ప్రభుత్వం..ఖర్చు మాత్రం అత్యంత తక్కువగా చేసింది. గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో విద్యాశాఖను నిర్వీర్యం చేసింది. ఫలితంగా 16 లక్షల మంది పిల్లలు వివిధ కేటగిరీల్లో డ్రాపౌట్లు అయ్యారు. ఇలాంటి తప్పిదాల వల్లే ఆ పార్టీ ఇప్పుడు ప్రతిపక్ష స్థానంలో కూర్చొంది. ప్రస్తుత ప్రభుత్వం కూడా బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలి. బీసీలకు నిధులు ఇవ్వకుంటే..వారికోసం ఎంఐఎం కొట్లాడుతుంది. బీసీలు, దళితులు, మైనార్టీల హక్కుల సాధనలో ఎంఐఎం ముందుంటుంది. అన్ని వర్గాలకు సరైన కేటాయింపులు జరిపిన ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి. ఆయన హయాంలో నేను ఎన్నిసార్లు నిధులు డిమాండ్ చేసినా.. అవసరానికి తగినట్టు మంజూరు చేశారు'అని అక్బరుద్దీన్ వ్యాఖ్యానించారు.

కేసీఆర్‌కు క్లీన్‌చిట్ రాలేదు

- శాసనసభలో విద్యుత్ పద్దుపై చర్చలో సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: 'విద్యుత్' విషయంలో మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు క్లీన్‌చిట్ ఏమీ రాలేదని.. విద్యుత్ కమిషన్ చైర్మన్‌ను మార్చాలని మాత్రమే సుప్రీం కోర్టు చెప్పిందని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. కమిషన్‌ను రద్దు చేయాలన్న కేసీఆర్ విజ్ఞప్తిని సుప్రీంకోర్టు, హైకోర్టు తిరస్కరించాయని గుర్తుచేశారు. కానీ బీఆర్ఎస్ సభ్యుడు జగదీశ్‌రెడ్డి కోర్టు నిర్ణయాన్ని వక్రీకరిస్తూ మాట్లాడారని, అలా చేస్తే ప్రాసిక్యూట్ చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. శాసనసభలో విద్యుత్ పద్దుపై సోమ వారం జరిగిన చర్చలో రేవంత్ మాట్లాడారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తప్పుపట్టడంతోపాటు గత బీఆర్ఎస్ సర్కారు నిర్ణయాలపై తీవ్రంగా మండిపడ్డారు. సీఎం రేవంత్ చెప్పిన అంశాలు ఆయన మాటల్లోనే..

''బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విద్యుత్ ఒప్పందాలు, ప్రాజెక్టుల్లో అవినీతి జరిగింది. విద్యుత్ కొనుగోళ్లపై బీఆర్ఎస్ కోరితేనే విచారణకు ఆదేశించాం. కేసీఆర్ సత్యహరిశ్చంద్రుడికి వారసుడన్నట్టు జగదీశ్‌రెడ్డి మాట్లాడుతున్నారు. కానీ విచారణ కమిషన్‌తో వారి అవినీతి ఎక్కడ బయటపడుతుందోనని అడ్డుకునే ప్రయత్నం చేశారు. వారు కోర్టుకు వెళ్లారు. కానీ విచారణ ఆపాలని కోర్టు చెప్పలేదు. సుప్రీంకోర్టు సలహా మేరకు కమిషన్ చైర్మన్‌ను మారుస్తున్నాం. కొత్త వ్యక్తిని త్వరలో నియమిస్తాం.

గతంలోని కాంగ్రెస్ సర్కారు నిర్ణయాలతోనే..

విద్యుత్ ఉత్పత్తి తమ హయాంలోనే పెరిగిందని బీఆర్ఎస్ గొప్పలు చెప్పుకోవడం విడ్డూరం. గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో తీసుకున్న నిర్ణయాల వల్లే హైదరాబాద్ నగరానికి ఆదాయం పెరిగింది. విభజన తర్వాత విద్యుత్ కేటాయింపుల్లో తెలంగాణకు అన్యాయం జరగకుండా కాంగ్రెస్ వ్యవహరించింది. అప్పటి కేంద్ర మంత్రి జైపాల్‌రెడ్డి దీనికోసం కృషి చేశారు. అసెంబ్లీ ఈ వాస్తవాలు చెప్పేందుకు తాను ప్రయత్నిస్తే.. కేసీఆర్ సర్కార్ అవకాశం ఇవ్వలేదు. మార్షల్స్‌ను పెట్టి గెంటేయించారు.

పేరుకే బీహెచ్ఈఎల్.. కాంట్రాక్టులు బినామీలకా?

బీహెచ్ఈఎల్‌కు కాంట్రాక్టులు ఇస్తే తప్పేంటని, అవినీతికి ఆస్కారం ఎక్కడిదని జగదీశ్‌రెడ్డి చేస్తున్న వాదన అర్థరహితం. బీహెచ్ఈఎల్‌కు కేవలం ఎలక్ట్రో, మెకానికల్ పనులు చేసే సామర్థ్యమే ఉంటుంది. సివిల్ పనులు చేసే శక్తి లేదు. అందుకే బీహెచ్ఈఎల్‌కు విద్యుత్ ప్లాంట్ కాంట్రాక్టు ఇచ్చి ఆ సంస్థ నుంచి సివిల్ కాంట్రాక్టులను బీఆర్ఎస్ పార్టీ వాళ్లకు, బినామీలకు, పార్టీ మారిన అప్పటి ఎమ్మెల్యేలకు ఇప్పించారు. ఇందులో వేల కోట్ల దోపిడీ జరిగింది. నిజానికి జార్ఖండ్‌లో 2,400 మెగావాట్ల సూపర్ క్రిటికల్ పవర్ ప్లాంట్ కోసం టెండర్లు పిలిస్తే.. బీహెచ్ఈఎల్, ఎల్అండ్‌టీ, కొరియన్ సంస్థలు ముందుకొచ్చాయి. బీహెచ్ఈఎల్ 18% తక్కువకు టెండర్ వేసింది. అలా తెలంగాణలో టెండర్లు పిలిస్తే.. ఇక్కడా బీహెచ్ఈఎల్ 18 శాతం తగ్గించేది. కానీ అలా చేయకుండా వేలకోట్ల నష్టానికి కారణమయ్యారు.

వేల కోట్లు చేతులు మారాకే..

నిజానికి ఇండియాబుల్స్ సంస్థ గతంలోనే సబ్ క్రిటికల్ థర్మల్ ప్లాంట్ ఏర్పాటు కోసం బీహెచ్ఈఎల్‌కు ఆర్డర్ ఇచ్చింది. ఆ యూనిట్లు సిద్ధమవుతున్న తరుణంలోనే.. కేంద్రం సూపర్ క్రిటికల్ పరిజ్ఞానంతో ప్లాంట్లు కట్టాలని చట్టం చేసింది. దీంతో ఆ సబ్ క్రిటికల్ యూనిట్లు తమకు వద్దని ఇండియాబుల్స్ సంస్థ చెప్పగా.. అప్పటికే తయారీ పూర్తయిందని బీహెచ్ఈఎల్ స్పష్టం చేసింది. ఇక్కడే వేల కోట్లు చేతులు మారాయి. గత ప్రభుత్వం కాలం చెల్లిన ఆ సబ్ క్రిటికల్ యూనిట్లతో తెలంగాణలోని భద్రాద్రి ప్లాంట్ పెట్టి.. ఇండియాబుల్స్ సంస్థను గట్టెక్కించింది. పైగా విద్యుత్ కోతలు నివారించడానికే ఇలా చేశామంటూ బీఆర్ఎస్ నేతలు తప్పుడు మాటలు చెప్తున్నారు.

అడ్డగోలుగా వ్యయం పెంచి..

రామగుండంలో ఎన్టీపీసీ 2016లో 1,600మెగావాట్ల విద్యుత్ కేంద్రం నిర్మాణాన్ని ప్రారంభించి 2024 ఫిబ్రవరిలో పూర్తి చేసింది. ఆ ప్లాంట్ వ్యయం ఒక్కో మెగావాట్‌కు రూ.7.38 కోట్లు అయితే.. భద్రాద్రి వ్యయం రూ.9.73కోట్లకు, యాదాద్రి వ్యయం రూ.8.64కోట్లకు పెరిగింది. యాదాద్రి పూర్తయ్యేసరికి రూ.10కోట్లకు పెరుగుతుంది. యాదాద్రిలో ఒక్కో మెగావాట్‌కు రూ.2.5 కోట్లు చొప్పున మొత్తం రూ.10వేల కోట్లు మింగింది ఎవరో? భద్రాద్రిలో మింగింది ఎవరో తేల్చడానికే విచారణ కమిషన్ ఏర్పాటు చేశాం.

నష్టం వద్దనే ఎన్టీపీసీ ఒప్పందానికి దూరం

ఎన్టీపీసీతో ఒప్పందం చేసుకుంటే మరో ఐదేళ్లలో ఆ ప్లాంట్ పూర్తవుతుంది. రూ.8–9కి యూనిట్ చొప్పున విద్యుత్ లభిస్తుందని లెక్కలు వేశాం. ప్రస్తుతం మార్కెట్లో రూ.5 నుంచి రూ 5.30కే యూనిట్ విద్యుత్ లభిస్తోంది. అందుకే ఎన్టీపీసీతో ఒప్పందం చేసుకోలేదు.

పాపం తగిలి మీ ఇళ్లలోని వారూ జైలుకెళ్తున్నారు

ఓ టీవీ చానల్‌కు సీఈఓగా ఉన్న మహిళా జర్నలిస్టుపై ఎస్సీ, ఎస్టీ కేసుపెట్టి అరెస్టు చేసి టీవీ చానల్‌ను గుంజుకున్నారు. నేను నా న్యాయవాదిని పెట్టి ఆమెకు బెయిల్ ఇప్పించా. ఆడపిల్లను జైలుకు పంపిన పాపం ఊరికే పోదు. మంది పిల్లలను జైలుకు పంపిస్తే.. మీ ఇళ్లలో కూడా జైలుకుపోతున్నారు. నిబంధనలు ఉల్లంఘించి ఫామ్‌హౌస్ కట్టారని బయటపెట్టినందుకు నన్ను 16 రోజులు చర్లపల్లి జైలులో పెట్టారు''అని సీఎం రేవంత్ మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతలు కోరుకుంటే ఆగస్టు 1, 2 తేదీల్లోనూ అసెంబ్లీ నిర్వహించి.. గత పదేళ్ల పాలనపై రాత్రింబవళ్లు చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు.

ఆ తప్పులకు మీరే బాధ్యులు..

''నాడు చంద్రబాబుతో అంటకాగి 610 జీవోనే వద్దని, మానవ వనరులు ఎక్కడున్నా వాడుకోవాలని చెప్పింది మీ నాయకుడు కేసీఆర్ కాదా? మీరు (హరీశ్‌రావు) కనీసం వార్డు మెంబర్ కూడా కాకపోయినా మంత్రిగా అవకాశం ఇచ్చింది వైఎస్ ప్రభుత్వం. పోతిరెడ్డిపాడు పొక్క పెద్దగా చేసినప్పుడు కడప జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉన్నది నాయిని నరసింహారెడ్డే కదా. చంద్రబాబు, వైఎస్సార్ పంచన చేరి ఊడిగం చేశారు. ఆ తప్పిదాలకు మీరే బాధ్యులు''అని బీఆర్ఎస్ నేతలపై రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. ఎవరో త్యాగాలు, ఆత్మబలిదానాలు చేస్తే వారి శవాల మీద అధికారంలోకి వచ్చారని విమర్శించారు.

సర్కారీ కరెంట్ బిల్లుల బకాయిలు రూ. 28 వేల కోట్లు



- వాటి వసూళ్ల బాధ్యతను అదానీకి అప్పగించాలి
- పాతబస్తీ వెంట పడటం సరికాదు
- అసెంబ్లీలో ఎంఐఎం పక్షనేత అక్బరుద్దీన్

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ శాఖల నుంచి రూ.28వేల కోట్ల విద్యుత్ బిల్లుల మొండి బకాయిలు వసూలు కావడం లేదని, వాటి వసూలు బాధ్యతను అదానీ సంస్థకు అప్పగించాలని ఎంఐఎంపక్ష నేత అక్బరుద్దీన్ డిమాండ్ చేశారు. పాతబస్తీలో 100% విద్యుత్ బిల్లులు వసూలు అవుతున్నాయని, తప్పుడు ప్రచారంతో దాని వెంటపడ్డారని ప్రభుత్వాన్ని తప్పుబట్టారు. బడ్జెట్ పద్దులపై చర్చ సందర్భంగా సోమవారం ఆయన శాసనసభలో మాట్లాడుతూ...మొత్తం రాష్ట్రంలో 20% విద్యుత్ నష్టాలున్నాయని, ఒక్క పాతబస్తీలోనే లేవన్నారు. అక్కడకాలం చెల్లిన సరఫరా వ్యవస్థ ఉండటంతోనే నష్టాలు ఎక్కువగా ఉన్నాయని గతంలో అధికారులు తనతో చెప్పారన్నారు. టీజీఎస్పీడీసీఎల్ మాజీ సీఎండీ పాతబస్తీలో తన ఇంటి వరకు కవర్డ్ కండక్టర్లతో నిరంతర సరఫరా కోసం ప్రత్యేక లైన్ వేసుకున్నారని, పాతబస్తీలో మాత్రం పనులు చేయలేదని వివరించారు. సీఎం రేవంత్ ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ ఏరియా అభివృద్ధి సంస్థకు రూ.120 కోట్లను కేటాయించారని, మాజీ సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహించే గజ్వేల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీకి ఎలాంటి కేటాయింపులు చేయలేదని తప్పుబట్టారు.

కరెంట్ నష్టాలపై శ్వేతపత్రం విడుదల చేయాలి

ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ వ్యాఖ్యలపై మండిపడ్డ కేంద్రమంత్రి బండి సంజయ్



సాక్షి, హైదరాబాద్: రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి దమ్ముంటే కరెంట్ నష్టాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని కేంద్రమంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. పాతబస్తీలో కరెంట్ నష్టాలు రావడం లేదని ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ మాట్లాడితే అందుకు కాంగ్రెస్ ప్రభుత్వం వత్తాసు పలకడం సిగ్గుచేటని మండిపడ్డారు. 'రాత్రి 10 దాటితే పాతబస్తీలో తానే ఉంటా...పోలీసులు ఎలా వస్తారో చూస్తా' నంటూ అక్బరుద్దీన్ చేసిన వ్యాఖ్యల పట్ల బండి సంజయ్ సోమవారం ఓ ప్రకటనలో తీవ్రంగా మండిపడ్డారు. పాతబస్తీ ఏమైనా ఒవైసీ జాగీరా? లేక అదేమైనా పాకిస్తాన్‌లో ఉందని భావిస్తున్నారా? ఇంకా నిజాం రజాకార్ల పాలనే కొనసాగుతుందని అనుకుంటున్నారో సమాధానం చెప్పాలని బండి డిమాండ్ చేశారు. అసెంబ్లీలో అక్బరుద్దీన్ చేసిన వ్యాఖ్యలు ఆయన అహంకారానికి నిదర్శనమన్నారు. ఆకతాయిలు బైక్‌ల మీద తిరుగుతూ రోడ్లమీద న్యూసెన్స్ క్రియేట్ చేస్తుంటే వారిని ఆపడం పోలీసుల విధి అని..వారి డ్యూటీని వారు చేసుకోవద్దని చెప్పడానికి అక్బరుద్దీన్ ఎవరని ప్రశ్నించారు.

'విద్యుత్'ను బలోపేతం చేసిందే మేము

- రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం పెంచాం: జగదీశ్‌రెడ్డి
- రైతులకు, ఇతర అన్నివర్గాలకూ 24 గంటల విద్యుత్ ఇచ్చాం
- విద్యుత్ కొరతను తీర్చేందుకే కొనుగోళ్లు చేశాం
- వ్యవస్థల బలోపేతం కోసమే అప్పులు అయ్యాయి
- ప్రభుత్వాల మధ్య ఒప్పందం జరిగితే మతలబు ఏముంటుంది?
- పక్క రాష్ట్రంలో మీ బాస్ చేస్తే తప్పు కాదా?
- కాంగ్రెస్ సర్కారు ప్రజలను తప్పుదారి పట్టిస్తోందని మండిపాటు

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రంలో విద్యుత్ రంగం బలోపేతమైందని.. కేసీఆర్ ముందు చూపు కారణంగానే అన్ని రంగాలకు నాణ్యమైన 24 గంటల విద్యుత్ అందుతోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సభ్యుడు జి.జగదీశ్‌రెడ్డి శాసనసభలో స్పష్టం చేశారు. తెలంగాణ ఏర్పాటైన సమయంలో తీవ్రంగా ఉన్న విద్యుత్ కొరతను తీర్చేందుకే కొనుగోళ్లు చేశామని.. కొత్త ప్లాంట్ల ఏర్పాటును చేపట్టామని వివరించారు. కానీ కాంగ్రెస్ సర్కారు ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని మండిపడ్డారు. సోమవారం జగదీశ్‌రెడ్డి శాసనసభలో 'విద్యుత్'పద్దుపై బీఆర్ఎస్ తరఫున మాట్లాడారు. ప్రసంగం వివరాలు ఆయన మాటల్లోనే..

''సీలేరు ప్రాజెక్టును కొట్టేయడానికే ఖమ్మం జిల్లాలోని ఏడు మండలాలను చంద్రబాబు కుట్రపూరితంగా తీసుకున్నాడు. మనకు ఇవ్వాల్సిన విద్యుత్ వాటా ఇవ్వకపోగా.. మేం కొనుగోలు చేద్దామనుకున్నా ఇవ్వకుండా ప్రైవేటు ప్లాంట్ల వాళ్లను బెదిరించాడు. ఆ పరిస్థితుల్లో విద్యుత్ డిమాండ్‌ను తట్టుకోవడానికి చాలా కష్టపడ్డాం. బీహెచ్ఈఎల్‌తో ఒప్పందం చేసుకుంటే.. ఏదో జరిగిందని ప్రచారం చేయడం ఏంటి? ప్రభుత్వ రంగ సంస్థకు నామినేషన్ పద్ధతిలో కాంట్రాక్టు ఇవ్వొచ్చు. అదే సమయంలో ఏపీలో నాటి చంద్రబాబు ప్రభుత్వం విజయవాడలో 800 మెగావాట్ల ప్లాంట్ నిర్మాణాన్ని బీహెచ్ఈఎల్‌కు నామినేషన్ పైనే ఇచ్చింది. ఛత్తీస్‌గఢ్ విద్యుత్ కొనుగోలు కోసం మేం ఇచ్చింది యూనిట్‌కు రూ.3.90 మాత్రమే. ఇప్పుడు ఎన్టీపీసీ నుంచి రూ.5.70 చెల్లించి కొనుగోలు చేస్తున్నట్టు తెలిసింది. కాంగ్రెస్ సర్కారు కూడా నామినేషన్‌పై బీహెచ్ఈఎల్‌కు కాంట్రాక్టులు ఇస్తే మేం మద్దతిస్తాం. ప్రభుత్వాల మధ్య జరిగిన ఒప్పందాల్లో ఏదో వెదుకుతామని చూడటం. పక్క రాష్ట్రంలో తమ బాస్ చేస్తే మాత్రం కరెక్ట్ అనడం ఏమిటి?

మా హయాంలోనే విద్యుత్ వ్యవస్థ బలోపేతం

మేం విద్యుత్ ఉత్పాదన సామర్థ్యం పెంచాం. 400 కేవీ, 220కేవీ, 132 కేవీ, 33 కేవీ సబ్‌స్టేషన్లు పెరిగాయి. విద్యుత్ ట్రాన్స్‌మిషన్, పంపిణీ లైన్లు పెరిగాయి. సౌర విద్యుత్ పెరిగింది. డిస్కమ్‌ల ఆర్థిక పరిస్థితిని పరిపుష్టం చేయడానికి ఉదయ్ పథకంలో చేరాలని కేంద్రం కోరితేనే చేరాం. బిల్లులు వసూలుకాని ప్రాంతాల్లోని సమీప విద్యుత్ కార్యాలయాల్లో స్మార్ట్ మీటర్లు పెట్టాం. ఉదయ్ పథకం కింద రూ.9 వేల కోట్ల భారాన్ని రాష్ట్ర ప్రభుత్వంపై వేసుకున్నాం. తల తెగిపడినా రైతులకు మీటర్లు పెట్టనివ్వలేదు.

అప్పుల వాదన అర్థరహితం..

మా హయాంలో అప్పులు అయ్యాయనే వాదన అర్థరహితం. మేం అధికారంలోకి వచ్చేప్పటికే విద్యుత్ రంగంపై రూ.24 వేల కోట్ల అప్పులున్నాయి. అయినా రైతులు, అన్నివర్గాల ప్రయోజనం కోసమే విద్యుత్ రంగాన్ని అప్పులు చేసి అయినా బలోపేతం చేశాం. గత 60 ఏళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వాలు చేయని అభివృద్ధి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగింది.

అదానీకి ఇవ్వాలనేదే మీ ఆలోచన

విద్యుత్ పనులు బీహెచ్ఈఎల్‌కు వద్దని, అదానీకే ఇవ్వాలనేది కాంగ్రెస్ ప్రభుత్వ ఆలోచన. ఓల్డ్‌సిటీలో విద్యుత్ సరఫరా బాధ్యతను అదానీకి అప్పగించే అంశంపై ఎంఐఎం సభ్యులు ప్రశ్నించినప్పుడు.. కాంగ్రెస్ సర్కారు తేలుకుట్టిన దొంగల్లా గమ్మున ఉండిపోయారు. సబ్ కాంట్రాక్టులు ఎవరికి ఇప్పించుకోవాలో మీకు తెలిసిన విద్య. మా చుట్టాలెవరూ కాంట్రాక్టు పనులు చేయలేదు. మంత్రివర్గంలో, వారి చుట్టాల్లో ఎందరో కాంట్రాక్టర్‌లు ఉన్నారు.

తప్పుదారి పట్టించే ప్రయత్నాలు..

సబ్ క్రిటికల్, సూపర్ క్రిటికల్ అంటూ ప్రభుత్వం తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తోంది. కేంద్రం తెచ్చిన మెమో ప్రకారం.. సోలార్ విద్యుదుత్పత్తి జరిగేప్పుడు సూపర్ క్రిటికల్ ప్లాంట్లు సైతం ఉత్పత్తిని 50 శాతానికి తగ్గించుకోవాల్సి ఉంటుంది. దానితో సూపర్ క్రిటికల్ కూడా సబ్ క్రిటికల్ అయిపోతుంది. ఎన్జీటీ కేసులు, కరోనాతోనే యాదాద్రి, భద్రాద్రి ప్లాంట్ల నిర్మాణం ఆలస్యమైంది. వెనుకబడ్డ నల్లగొండ జిల్లాను అభివృద్ధిలోకి తీసుకెళ్లాలనే యాదాద్రి ప్లాంట్ చేపట్టాం. కానీ కొందరు నల్లగొండ జిల్లా నేతలు జిల్లాలో ప్లాంట్ వద్దని మాట్లాడారు. వారి సంగతిని ప్రజలే చూసుకుంటారు. విద్యుత్ సరఫరా సమస్యలపై హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేస్తే కేసులు పెట్టి జైలుకు పంపుతున్నారు. వారి ఇళ్లకు లైన్‌మెన్లు పోయి సోషల్ మీడియాలో పోస్టులు తీసేయాలని బెదిరిస్తున్నారు. ఈ విషయంపై సోషల్ మీడియాలో పోస్టుపెట్టిన మహిళా జర్నలిస్టు రేవతిపై కేసు పెట్టారు..''అని జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు.

ముందే మాట్లాడుకుని జస్టిస్ నరసింహారెడ్డితో కమిషన్!

జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి భూకబ్జాదారుడంటూ గతంలో పీసీసీ అధ్యక్షుడిగా ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వీహెచ్ ఆందోళన చేశారని.. అలాంటి వ్యక్తిని విచారణ కమిషన్ చైర్మన్‌గా ఎలా నియమించారని జగదీశ్‌రెడ్డి తప్పుబట్టారు. దీనిపై మంత్రి శ్రీధర్‌బాబు జోక్యం చేసుకుని.. కమిషన్ చైర్మన్ వ్యక్తిగత విషయాలను, న్యాయస్థానం పరిధిలో ఉన్న అంశాలను సభలో మాట్లాడరాదంటూ అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో న్యాయస్థానం పరిధిలో ఉన్నప్పుడు సీఎం ఈ అంశంపై ఎలా మాట్లాడారని జగదీశ్‌రెడ్డి నిలదీశారు. ప్రభుత్వం వేసింది న్యాయ విచారణ కాదని వ్యాఖ్యానించారు. ''విద్యుత్ ఒప్పందాలపై విచారణ మొత్తం పూర్తయిందని.. జరిగిన నష్టాన్ని అంచనా వేయడమే మిగిలిందని జస్టిస్ నరసింహారెడ్డి విలేకరుల సమావేశంలో అన్నారు. అంటే రాష్ట్ర ప్రభుత్వం, జస్టిస్ నరసింహారెడ్డి మాట్లాడుకునే కమిషన్ వేసినట్టు మాకు అర్థమైంది. ఈ అంశంలో కేసీఆర్ వాదన కరెక్ట్ అని సుప్రీంకోర్టు కూడా పేర్కొంది. ఇప్పుడు సుప్రీంకోర్టును కూడా మీరు తప్పుదోవపట్టిస్తున్నారా?''అని జగదీశ్‌రెడ్డి ప్రశ్నించారు.

వార్షిక బడ్జెట్ పద్దులపై సుదీర్ఘ చర్చ

- అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా కొనసాగిన అసెంబ్లీ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ శాసనసభ మూడో విడత సమావేశాల్లో ఐదోరోజు 2024–25 వార్షిక బడ్జెట్ పద్దులపై సోమవారం సుదీర్ఘ చర్చ జరిగింది. సమయపాలన పాటించి డిమాండ్లకు పరిమితమై మాట్లాడాల్సిందిగా స్పీకర్ సభ ప్రారంభమైన వెంటనే కోరారు. డిమాండ్లపై చర్చకు సంబంధించి ఒక్కో సభ్యుడికి 15 నిమిషాలపాటు సమయం కేటాయిస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. మధ్యాహ్నం మూడు గంటల వరకు చర్చ కొనసాగుతుందని ప్రకటించారు. ప్రశ్నోత్తరాలు లేకుండానే సోమవారం ఉదయం 10 గంటలకు సభ ప్రారంభమైన వెంటనే నేరుగా పద్దులపై చర్చ ప్రారంభమైంది. అనంతరం వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించి 19 పద్దులను సంబంధిత శాఖల మంత్రులు ప్రతిపాదించారు. అయితే సభ్యులు తమకు కేటాయించిన సమయం కంటే ఎక్కువ సేపు ప్రసంగించడం, ఒకేరోజు 19 పద్దులను చర్చించి ఆమోదించాల్సి ఉండటంతో సోమవారం అర్ధరాత్రి దాటినా చర్చ కొనసాగింది.

సింగరేణిపై కూడా విచారణ జరపాలి: కూనంనేని



సాక్షి, హైదరాబాద్: గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన విద్యుత్ నిర్ణయాలతో పాటు సింగరేణి సంస్థలో జరిగిన అవినీతిపై కూడా విచారణ జరిపే బాధ్యతలను విచారణ కమిషన్‌కు అప్పగించాలని సీపీఐ పక్షనేత కూనంనేని సాంబశివరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బడ్జెట్ పద్దులపై చర్చ సందర్భంగా సోమవారం ఆయన శాసనసభలో మాట్లాడారు. సింగరేణి సంస్థలో రూ.12 వేల కోట్ల అవినీతి జరిగిందని, ఒకే అధికారి 9 ఏళ్ల పాటు సీఎండీగా కొనసాగి అక్రమాలకు పాల్పడ్డాడని ఆరోపించారు. విద్యుత్ సంస్థల్లో ఆర్టిజన్లను రెగ్యులర్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని సూచించారు.

కేబినెట్‌లో స్థానమివ్వండి

- సీఎంకు కాంగ్రెస్ మాదిగ ఎమ్మెల్యేల వినతి
- అధిష్టానాన్ని కలవాలని రేవంత్ సూచన

సాక్షి, హైదరాబాద్: త్వరలో జరగనున్న మంత్రివర్గ విస్తరణలో తమ సామాజిక వర్గానికి అవకాశం కల్పించాలని కాంగ్రెస్ పార్టీకి చెందిన మాదిగ ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు అసెంబ్లీలోని సీఎం కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఇటీవల జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో తమ సామాజికవర్గానికి టికెట్ కేటాయించలేదని, కేబినెట్‌లో కూడా తమకు తగిన ప్రాతినిధ్యం లేదనే అభిప్రాయం మాదిగల్లో ఉందని వెల్లడించారు. తమకు కేబినెట్‌లో స్థానం కల్పించడం ద్వారా మాదిగ సామాజికవర్గానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉందన్న అభిప్రాయం కలిగించాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత్.. మాదిగలకు కేబినెట్‌లో స్థానం గురించి పార్టీ అధిష్టానాన్ని కూడా కలవాలని సూచించారు.

అప్పులు పెంచే బడ్జెట్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర బడ్జెట్‌ను పదేళ్లుగా ప్రవేశపెట్టినపుడు 'పేపర్‌పులి' మాదిరిగా.. ఆర్థిక సంవత్సరం చివర్లో లెక్కతీస్తే 'పిల్లిలాగా మ్యావ్ మంటోంది' అని బీజేపీ అధికార ప్రతినిధి రాణీ రుద్రమ ఎద్దేవా చేశారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. 2024–25 సంవత్సరానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అప్పులు పెంచేదిగా ఉందన్నారు. ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో పొందుపరిచిన లెక్కల ప్రకారం మరో రూ.లక్ష కోట్ల అప్పు చేయబోతోందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం మర్చంట్ బ్యాంకర్స్ ద్వారా అనేక అవకతవకలకు పాల్పడి వేల కోట్ల రుణాలు పొందే ప్రయత్నం చేస్తున్నట్టు ఇటీవల కేంద్ర మంత్రి బండి సంజయ్ విలేకరులతో వెల్లడించారని చెప్పారు.

2న ప్రమోషన్లు పొందిన టీచర్లతో సీఎం భేటీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఇటీవల పదోన్నతి పొందిన 30 వేల మంది ఉపాధ్యాయులతో సీఎం రేవంత్‌రెడ్డి ఆగస్టు 2న సమావేశం కానున్నారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో మధ్యాహ్నం 3 గంటలకు ఈ సమావేశం ఏర్పాటు చేసినట్టు ప్రభుత్వవర్గాలు తెలిపాయి. సమావేశ ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సంబంధిత ఉన్నతాధికారులతో సోమవారం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. డీజీపీ జితేందర్, షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీధర్, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, రోడ్లు, భవనాల శాఖ కార్యదర్శి హరిచందన, హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, జీహెచ్ ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ హనుమంతరావు తదితర అధికారులు టెలి కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనంత పెద్ద సంఖ్యలో రాష్ట్రంలోని ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించినట్లు తెలిపారు. టీచర్లతో సీఎం నేరుగా మాట్లాడతారన్నారు. కాగా, ఆగస్టు 2న పదోన్నతులు పొందిన టీచర్లతో ముఖ్యమంత్రి జరిపే సమావేశాన్ని జయప్రదం చేయాలని ఉపాధ్యాయ సంఘం పీఆర్టీయూటీఎస్ పిలుపునిచ్చింది. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్ ఈమేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

సీఎం అబద్ధాలకు అంతేలేదు

మాజీమంత్రి హరీశ్‌రావు ధ్వజం

- రేవంత్ అబద్ధాలతో శాసనసభను తప్పుదోవ పట్టిస్తున్నారు
- దీనిపై ఇప్పటికే వాయిదా తీర్మానం ఇచ్చాం
- సభా హక్కుల ఉల్లంఘన నోటీసు కూడా ఇస్తాం



సాక్షి, హైదరాబాద్: శాసనసభలో పాలక పక్షం ఆత్మరక్షణలో పడినప్పుడల్లా సీఎం రేవంత్‌రెడ్డి సభా నాయకుడిగా ఉన్న అవకాశాన్ని ఉపయోగించుకుని అబద్ధాలతో చర్చలను పక్కదారి పట్టిస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ఆదర్శంగా ఉండాల్సిన సభా నాయకుడు ప్రతి అసెంబ్లీ సమావేశాల్లోనూ అబద్ధాలు మాట్లాడుతున్నారని, వరుస అబద్ధాలతో సభ ఔన్నత్యాన్ని తగ్గిస్తున్నారని విమర్శించారు. సీఎం సభను తప్పుదోవ పట్టిస్తున్న తీరుపై ఇప్పటికే వాయిదా తీర్మానం ఇచ్చామని, సభా హక్కుల ఉల్లంఘన నోటీసు కూడా ఇస్తామని తెలిపారు. సోమవారం అసెంబ్లీ ఆవరణలో ఆయన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో కలిసి మీడియా ప్రతినిధులతో పిచ్చాపాటిగా మాట్లాడారు.

అన్నీ అబద్ధాలే

'ప్రస్తుత అసెంబ్లీ తొలి సమావేశంలో మేడిగడ్డ నుంచి మిడ్‌మానేరుకు నేరుగా నీటిని లిఫ్ట్ చేయడం సాధ్యం కాదని రిటైర్డు ఇంజనీర్లు చెప్పిన అంశంపై రేవంత్ సభను తప్పుదోవ పట్టించారు. ప్రస్తుత సమావేశాల్లో వ్యవసాయ మోటార్లకు విద్యుత్ మీటర్లు అంశంలో తమకు అనుకూలంగా ఉన్న వాక్యాన్ని మాత్రమే చదివి అందులోని కొన్ని పదాలను ఉద్దేశపూర్వకంగా విస్మరించారు. పోతిరెడ్డిపాడు ప్రాజెక్టుకు సంబంధించి కూడా బీఆర్ఎస్ మంత్రులపై రేవంత్‌రెడ్డి అసత్యాలు చెప్తున్నారు. పులిచింతల ప్రాజెక్టు విషయంలో నాటి కాంగ్రెస్ మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పెదవులు మూసుకున్నారు. పోతిరెడ్డిపాడు, పులిచింతల ప్రాజెక్టులపై కాంగ్రెస్ వైఖరికి వ్యతిరేకంగా 2005లో ఆరుగురు బీఆర్ఎస్ మంత్రులు రాజీనామా చేశారు. ఎల్ఆర్ఎస్ కింద ఎలాంటి రుసుము లేకుండా క్రమబద్ధీకరణ చేయాలని కోర్టుకు వెళ్లిన కోమటిరెడ్డి.. ఇప్పుడు డబ్బులు వసూలు చేయాలనే ప్రభుత్వ ప్రతిపాదనపై ద్వంద్వ విధానంతో వ్యవహరిస్తున్నారు..'అని హరీశ్‌రావు విమర్శించారు.

18 రాష్ట్రాల్లో కాంగ్రెస్‌కు గుండు సున్నా

'బీఆర్ఎస్ పని అయిపోయిందని అధికార పక్షం అంటోంది. కానీ దేశంలోని కేంద్ర పాలిత ప్రాంతాలు సహా 18 రాష్ట్రాల్లో కాంగ్రెస్‌కు ఒక్క ఎంపీ సీటూ దక్కలేదు. 1984 తర్వాత కాంగ్రెస్ పార్టీ ఏనాడూ సొంత బలంతో కేంద్రంలో అధికారంలోకి రాలేదు. 28 పార్టీలతో ఏర్పడిన ఇండియా కూటమిలో కాంగ్రెస్‌కు వచ్చింది 22 శాతం ఓట్లు, 99 సీట్లు మాత్రమే. తెలంగాణలో రెండు పర్యాయాలు కాంగ్రెస్‌ను ఓడించింది బీఆర్ఎస్ పార్టీయే..'అని మాజీమంత్రి గుర్తు చేశారు.

ఉద్యమ సమయంలో పెదవులు మూసుకున్న రేవంత్

'తెలంగాణ ఉద్యమ సమయంలో పదవుల కోసం రేవంత్‌రెడ్డి పెదవులు మూసుకున్నారు. ఉద్యమంలో భాగంగా మేం ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేస్తే.. రేవంత్ కనీసం రాజీనామా పత్రం జిరాక్స్ కాగితం కూడా ఇవ్వలేదు. ఉద్యమకారుల బలిదానానికి ఇలాంటి నేతలే కారణం. ఉద్యమకారులపైకి రైఫిల్‌తో వెళ్లిన రేవంత్.. ఇప్పుడు తనకు తాను తెలంగాణ చాంపియన్‌గా చెప్పుకుంటున్నారు. కేసీఆర్ తెచ్చిన తెలంగాణ వల్లే రేవంత్ సీఎం అయ్యారు. దివంగత మాజీ కేంద్ర మంత్రి జైపాల్‌రెడ్డి తనకు తాను జాతీయవాదిగా చెప్పుకున్నారు. రేవంత్‌ను ఆయన పురుగులా చూసేవారు. తాను జీవించి ఉన్న కాలంలో ఎన్నడూ రేవంత్‌ను కనీసం దగ్గరకు కూడా రానివ్వలేదు..'అని హరీశ్ అన్నారు.

కేసీఆర్ హయాంలోని కంటెంట్ తొలగింపు

జోక్యం చేసుకోవాలని సీఎస్‌ను కోరిన కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వ వెబ్‌సైట్‌లు, సోషల్ మీడియా నుంచి మాజీ సీఎం కేసీఆర్ హయాంలోని ముఖ్యమైన కంటెంట్ తొలగిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తక్షణమే జోక్యం చేసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి విజ్ఞప్తి చేశారు. ఈ కంటెంట్ ప్రజల ఆస్తి అని, తెలంగాణ చరిత్రలో అంతర్భాగమని ఆయన స్పష్టం చేశారు. ఈ డిజిటల్ ఆస్తులను రక్షించడానికి, భవిష్యత్ తరాల కోసం భద్రపరచడానికి చర్యలు అవసరమని పేర్కొన్నారు. సీఎస్ చర్యలు తీసుకోకుంటే న్యాయపరంగా వెళ్లాల్సి వస్తుందని కేటీఆర్ హెచ్చరించారు.

కేటీఆర్‌ను కలిసిన సింగరేణి కార్మికులు

సింగరేణి వే బ్రిడ్జిల వద్ద బొగ్గు లారీ లోడింగ్, అన్ లోడింగ్ కార్మికులను కాంట్రాక్టు కార్మికులుగా గుర్తించాలని 'సింగరేణి వేబ్రిడ్జి కోల్ లారీ లోడింగ్, అన్‌లోడింగ్ లెవలింగ్ వర్కర్స్ యూనియన్' విజ్ఞప్తి చేసింది. యూనియన్ నాయకులు సోమవారం అసెంబ్లీ ఆవరణలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీ రామారావును కలిశారు. సింగరేణిలో 47 వేబ్రిడ్జిల వద్ద 1,755 మంది కార్మికులు పనిచేస్తు న్నారని, వీరిలో భూ నిర్వాసితులు ఎక్కువమంది ఉన్నారని, తమకు పీస్ రేట్ ప్రకారం కూలీ చెల్లిస్తున్నారని వివరించారు. మరోవైపు ఐదేళ్లకోమారు మెడికల్ ఫిట్‌నెస్ సొంత ఖర్చులతో చేసుకోవాలని అధికారులు చెబుతున్నారని పేర్కొన్నారు. తమను కాంట్రాక్టు కార్మికులుగా గుర్తించి వేతనాలు ఇవ్వాలని కేటీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. మరోవైపు కేటీఆర్‌తో కాంగ్రెస్ నేతలు సందడి చేశారు. సోమవారం సాయంత్రం అసెంబ్లీ విరామ సమయంలో బీఆర్ఎస్ ఎల్పీ కార్యాలయానికి కేటీఆర్ వెళ్తుండగా అక్కడే ఉన్న వేములవాడ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు, నేతలు ఆయనతో సెల్ఫీలు దిగారు.

వరంగల్ కార్పొరేషన్ అవినీతిపై విచారణ జరిపించాలి

అసెంబ్లీలో వరంగల్ వెస్ట్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: వరంగల్ కార్పొరేషన్‌లో జరిగిన అక్రమాలు, అవినీతిపై విచారణ చేపట్టాలని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పాలనలో వరంగల్ కార్పొరేషన్ పరిధిలో అంతులేని అవినీతి జరిగిందని ఆయన ఆరోపించారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా పురపాలన, పట్టణాభివృద్ధి పద్దులపై సోమవారం జరిగిన చర్చలో రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ... చివరకు పార్కు జాగాను కబ్జా చేసి పార్టీ కార్యాలయాన్ని కట్టారని ప్రభుత్వం భూ కేటాయింపు జరపకుండానే ఈ తంతును బీఆర్ఎస్ పార్టీ నేతలు పూర్తి చేశారని వివరించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని కూడా పార్టీ కార్యాలయానికి వెనుకభాగంలో నిర్మించారని, పార్టీ నేతల లొల్లి అంతా ఎమ్మెల్యే ఇంట్లోకి వినిపిస్తుందని చెప్పారు. అక్రమంగా నిర్మించిన పార్టీ కార్యాలయానికి పైసా పన్ను కూడా కట్టలేదని, బీఆర్ఎస్ అనే ఓనర్ పేరిట కరెంటు బిల్లు వస్తుందని తెలిపారు. సమాచార హక్కు చట్టం కింద పూర్తి వివరాలను సేకరించానని సభ సాక్షిగా వాటిని సభ్యుల ముందు ఉంచుతున్నానని పేర్కొన్నారు. ఈ అంశంపై స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి అని ప్రభుత్వాన్ని కోరారు.

సోం డిస్టిలరీ నుంచి కాంగ్రెస్‌కు రూ.1.8 కోట్ల ఫండ్



- చలో మొబిలిటీ, సోం డిస్టిలరీలపై హౌస్ కమిటీతో విచారణ చేయాలి
- అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి డిమాండ్

సాక్షి, హైదరాబాద్: సోం డిస్టిలరీకి..కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని ఆ పార్టీ నేతలు చెబుతున్నారని, కానీ ఆ సంస్థ నుంచి కాంగ్రెస్‌కు రూ.1.80 కోట్ల ఫండ్ అందినట్టు కౌశిక్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం బడ్జెట్‌పై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా అసెంబ్లీలో కొంత ఘర్షణ వాతావరణం నెలకొంది. మధ్యలో కాంగ్రెస్ సభ్యులు అభ్యంతరం తెలిపారు. ఈ సందర్భంగా కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ, ఇక తెలంగాణలో తమ బ్రాండ్ల సరఫరాకు అనుమతి వచ్చినట్టు సోం బ్రేవరేజెస్ ప్రకటించిందని, కానీ ప్రభుత్వం మాత్రం తాము అనుమతి ఇవ్వలేదని చెప్పడం ఏంటని ప్రశ్నించారు. అయితే దీనిని క్యాన్సిల్ చేసినట్లు మంత్రి తెలిపారని, కానీ ఆ అనుమతి రద్దు చేయలేదని సెబీ నుంచి సమాధానం వచ్చినట్టు తెలిపారు. మధ్యప్రదేశ్‌లోని మాజీ ముఖ్యమంత్రి నుంచి ఈ ముఖ్యమంత్రికి డైరెక్షన్ రావడంతో సంబంధిత మంత్రికి తెలియకుండా ఇదంతా జరిగినట్టు తెలిపారు.

ఆఫ్‌లైన్‌లో సంస్థకు ఆర్టీసీ టెండర్

ఆటోమేటిక్ ఫెయిర్ కలెక్షన్‌ను ఆన్‌లైన్ టెండర్ వేయకుండా ఆఫ్‌లైన్ టెండర్ ద్వారా చలో మొబిలిటీ సంస్థకు అప్పగించారని కౌశిక్‌రెడ్డి తెలిపారు. టెండర్ పిలిచి రద్దు చేసినట్టు ప్రకటించిన ఆర్టీసీ.. ఆ తర్వాత మళ్లీ ఎలా ఆ సంస్థకు కట్టబెట్టిందని ప్రశ్నించారు. ఇక ఫెయిర్ కలెక్షన్‌పై తమ బృందం బిహార్, అస్సాం, ఇండోర్, జబల్‌పూర్‌కు స్టడీ టూర్‌కు వెళ్లినట్టు తెలిపిందన్నారు. అయితే టూర్ ఆదేశాలకు, టెండర్ ఇవ్వడానికి మధ్య మూడు రోజులే గ్యాప్ ఉందని, ఈ మూడు రోజుల్లోనే నాలుగు రాష్ట్రాలు ఎలా తిరిగి వస్తారని ప్రశ్నించారు. ఆర్టీసీకి సంబంధించి చలో మొబిలిటీ సంస్థపై, ఎక్సైజ్ శాఖకు సంబంధించి సోం డిస్టిలరీ వ్యవహారంపై హౌస్ కమిటీ వేయాలని, వీటిపై విజిలెన్స్, సీబీఐ విచారణ జరిపించాలన్నారు.

- ఆటో డ్రైవర్లకు నెలకు రూ. 10 వేల పరిహారం ఇవ్వాలని కౌశిక్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లను కౌశిక్‌రెడ్డి రెచ్చగొడుతున్నారని మంత్రి సీతక్క మండిపడ్డారు. మహిళలకు ఫ్రీ బస్సు ఇవ్వాలా వద్దా బీఆర్ఎస్ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ మంత్రి సీతక్కకు నాలెడ్జ్ లేదని ఆరోపించారు. దీనిపై మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తంచేస్తూ, తనకు దురహంకార నాలెడ్జ్ లేదని, ఓట్ల కోసం చస్తా అన్న నాలెడ్జ్ లేదన్నారు.

బీఆర్ఎస్, సీపీఐ వాయిదా తీర్మానాల తిరస్కరణ

సాక్షి, హైదరాబాద్: శాసనసభ ఐదో రోజు సమావేశాల్లో బీఆర్ఎస్, సీపీఐ సభ్యులు ఇచ్చిన వాయిదా తీర్మానాలను స్పీకర్ తిరస్కరించారు. 'జెన్‌కోసంస్థలో నిర్మాణ కార్మికులుగా ఉన్న 22వేలకు పైగా ఆర్టిజన్స్‌తో వెట్టిచాకిరీ, ఉద్యోగ భద్రత లేకపోవడం, సరైన వేతనాలు ఇవ్వకపోవడం, అక్రమ బదిలీలు' తదితర అంశాలపై సీపీఐ సభ్యుడు కూనంనేని సాంబశివ రావు వాయిదా తీర్మానం ఇచ్చారు. 'విద్యుత్ మీటర్ల విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై బురదజల్లే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి సభను తప్పుదోవ పట్టించిన అంశం'పై బీఆర్ఎస్ సభ్యులు హరీశ్‌రావు, గంగుల కమలాకర్, సబితా ఇంద్రారెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, విజయుడు వాయిదా తీర్మానాన్ని ప్రతిపాదించారు. కాగా, రెండు తీర్మానాలను తిరస్కరిస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు.

నేడు రెండో విడత రుణమాఫీ

▶ మొదటి పేజీ తరువాయి

రుణాలున్న అనేకమంది అర్హులకు రుణమాఫీ కాలేదనే విమర్శలు వచ్చాయి. దీంతో రెండో విడత రుణమాఫీలో అలాంటి పొరపాట్లు తలెత్తకుండా చర్యలు తీసుకున్నామని అధికారులు చెబుతున్నారు.

వచ్చే నెలలో రూ.2 లక్షల వరకు మాఫీ: మంత్రి తుమ్మల


మంగళవారం లక్షా యాభై వేల రూపాయల వరకు ఉన్న రుణాలను మాఫీ చేయనున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం ఉన్న అన్ని రైతువేదికల్లో ప్రత్యక్ష ప్రసారం చేసేందుకు ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముందు నిర్వహించే రైతునేస్తం కార్యక్రమంలో రూ.లక్ష వరకు జరిగిన రుణ మాఫీకి సంబంధించి సందేహాలు ఉన్న రైతులు.. అక్కడ ఉన్న అధికారులు, బ్యాంకర్లను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని సూచించారు. అనంతరం రూ.లక్షన్నర వరకు జరిగే రుణమాఫీ కార్యక్రమాన్ని వీక్షించాల్సిందిగా రైతులకు విజ్ఞప్తి చేశారు. వచ్చే నెలలో రూ.2 లక్షల వరకు మాఫీ చేస్తామని ప్రకటించారు.

ఇదీ గత ప్రభుత్వ నిర్వాకం

తమ ప్రభుత్వానికి ఒక స్పష్టమైన విధానం లేదని విమర్శించిన పెద్దలకు, గత ప్రభుత్వం అనుసరించిన అసమంజస విధానాలను గుర్తు చేయదల్చుకున్నానని మంత్రి తెలిపారు. 'ప్రతి సంవత్సరం ఒక కొత్త విధానంతో రైతాంగాన్ని ఆందోళనలోకి నెట్టడమే వారి విధానంగా ఉండేది. ఒక ఏడాది పత్తి వద్దు అన్నారు. రైతులు వారి మాటలు నమ్మి కంది పంట వేస్తే కందులు కొనే నాథుడే లేరు. మరో ఏడాది పంట కాలనీలు అని ఊక దంపుడు ఉపన్యాసాలు ఇచ్చారు. తరువాత దాని ఊసే లేదు. వరి వేస్తే ఉరి అన్నారు.. ఆ మాట నమ్మి మొక్కజొన్న వేస్తే కొనుగోలు సమయానికి మొహం చాటేశారు. సన్నాల సాగు అని సన్నాయి నొక్కులు నొక్కి తీరా మార్కెటింగ్‌కు వచ్చేసరికి బోనస్ కాదు కదా మద్దతు ధర కూడా దక్కలే. ఇక రుణమాఫీ 2014 కానీ, 2018 కానీ.. అసలు రుణమాఫీ పథకాలు కావని, వడ్డీ మాఫీ పథకాలుగా ప్రతి రైతు చెబుతాడు..'అని మంత్రి దుయ్యబట్టారు.

శాంతిభద్రతలు లోపిస్తే ఏపీకి పెట్టుబడులెలా వస్తాయి?

- తక్షణమే శాంతిభద్రతలు పునరుద్ధరించండి
- లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి డిమాండ్



సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో శాంతి భద్రతలు లోపించాయని, ఇలాగైతే రాష్ట్రానికి పెట్టుబడులు ఎలా వస్తాయని వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీలో హింసాకాండకు ముగింపు పలికి, శాంతిభద్రతలను పునరుద్ధరించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం లోక్‌సభలో బడ్జెట్‌పై జరిగిన చర్చలో పాల్గొన్న మిథున్‌రెడ్డి రాష్ట్రంలో శాంతిభద్రతలు దిగజారిపోయిన వైనాన్ని వివరించారు. ఏపీలో దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోయాయని చెప్పారు. తనపైనే హత్యాయత్నం చేసి, తిరిగి తనపైనే కేసు పెట్టడం ఇందుకు ఉదాహరణ అని తెలిపారు. జాతీయ ప్రాజెక్టు అయిన పోలవరం నిర్మాణ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వానికి ఎందుకు అప్పగించారని, ఎన్డీయే ప్రభుత్వం చేసిన అతి పెద్ద తప్పు ఇదేనని అన్నారు. దీనివల్ల పోలవరం నిర్మాణమే గందరగోళమైందని చెప్పారు. ప్రాజెక్టు వ్యయం భారీగా పెరిగిందని, దానిని కేంద్రమే భరించాలని, ఏపీ ప్రజలపై వేస్తే వైఎస్సార్‌సీపీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. ఏపీకి తక్షణమే ప్రత్యేక హోదా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ఏపీ ప్రజలు ప్యాకేజీని అంగీకరించబోరని మిథున్‌రెడ్డి స్పష్టం చేశారు. విశాఖపట్నం మెట్రో, కడప ఉక్కు పరిశ్రమ పూర్తి చేయాలని కోరారు. అమరావతి అభివృద్ధికి ప్రకటించిన రూ.15 వేల కోట్లు గ్రాంటా రుణమా అని నిలదీశారు. రుణమే అయితే దానిని ఎవరు భరిస్తారని ప్రశ్నించారు. గ్రాంటు రూపంలో రాష్ట్రానికి ఏమిచ్చినా అభినందిస్తామని, రుణాన్ని స్వాగతించబోమని చెప్పారు.

ఆరోగ్యశ్రీకి పొగ

ఏపీ రాష్ట్ర ప్రభుత్వం వద్ద డబ్బుల్లేవ్.. కేంద్ర పథకంతో సరిపెట్టుకోవాలన్న కేంద్ర మంత్రి పెమ్మసాని

ఆరోగ్యశ్రీ ఆస్పత్రులకు బిల్లులు రావట్లేదు.. రోగులకు చికిత్సలు అందని పరిస్థితి నెలకొందని వ్యాఖ్య

- రూ.25 లక్షల వరకూ వైద్యానికి భరోసానిచ్చిన సంజీవనికి పొగబెట్టేలా సర్కారు అడుగులు
- రూ.5 లక్షలకే పరిమితమైన కేంద్ర పథకం దయకు వదిలేసి ఆరోగ్యశ్రీ బాధ్యత నుంచి తప్పించుకునే ఎత్తుగడ
- ఇప్పటికే ట్రస్టు నుంచి కాకుండా బీమా పేరుతో అమలు అంటూ మెలిక
- తొలి నుంచి ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేసేలా చంద్రబాబు చర్యలు
- 2014–19 మధ్య ప్రొసీజర్లు పెంచకుండా పేదల ఆరోగ్యంతో ఆటలు
- కొన ఊపిరితో ఉన్న ఆరోగ్యశ్రీకి ప్రాణం పోసిన వైఎస్ జగన్
- ప్రొసీజర్లు మూడు రెట్లు.. ఉచిత చికిత్స పరిమితి ఐదు రెట్లు పెంపు
- నాడు టీడీపీ సర్కారు పెట్టిన దాదాపు రూ.700 కోట్ల బకాయిలూ చెల్లింపు
- గత ఐదేళ్లు ప్రజారోగ్యానికి అత్యంత ప్రాధాన్యమిస్తూ పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం

వివరాలకు, వార్తలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని బద్నాం చేసే ప్రయత్నం

కాంగ్రెస్ ఎమ్మెల్యేల మండిపాటు



మాట్లాడుతున్న కుంభం అనిల్. చిత్రంలో నాగరాజు

సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని బద్నాం చేయడానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు, కేటీఆర్ ప్రయత్నాలు చేస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు విజయ రమణారావు, మధుసూదన్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణ రావు, నాగరాజు, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ పుట్టిందే అబద్ధాల పునాదులపైన అని, హరీశ్‌రావు పది అబద్ధాలు మాట్లాడితే ఒక నిజం చెబుతాడని ఆరోపించారు. అసెంబ్లీలో మాట్లాడలేక హరీశ్‌రావు మీడియాతో చిట్‌చాట్ చేస్తున్నాడని ఎద్దేవా చేశారు. ప్రజలిచ్చిన ప్రతిపక్ష హోదాను బీఆర్ఎస్ నిలబెట్టుకోవాలని హితవు పలికారు. మేడిగడ్డ కుంగిపోతే ప్రతిపక్షాలు, మీడియా వెళ్లకుండా పోలీస్ బందోబస్తు పెట్టింది కేసీఆర్ ప్రభుత్వం కాదా? అని నిలదీశారు. పదేళ్ల కేసీఆర్ ప్రభుత్వ మోసాలను రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో బయటకు తీస్తున్నారన్నారు. మాజీ కేంద్రమంత్రి జైపాల్‌రెడ్డి గురించి మాట్లాడే స్థాయి హరీశ్‌రావుకు లేదని, తెలంగాణ ఏర్పాటులో ముఖ్య పాత్ర పోషించింది జైపాల్‌రెడ్డి అని వారు గుర్తు చేశారు. తెలంగాణ పోలీసులపై అక్బరుద్దీన్ చేసిన వ్యాఖ్యలు సరైనవి కావని, పదేళ్లుగా కేసీఆర్ ప్రభుత్వం పోలీస్ వ్యవస్థను నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. గత ప్రభుత్వం ఫ్రెండ్లీ పోలీస్ పేరుతో వ్యవస్థను పాడు చేసిందన్నారు. కొంతమంది పోలీసులను అడ్డం పెట్టుకుని కేసీఆర్ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్ చేసిందని, పోలీసుల మనోధైర్యాన్ని దెబ్బతీసేలా మాట్లాడవద్దని సూచించారు.

పట్టణ పాలకమండళ్లను కేంద్రీకృతం చేయడం తగదు: కేపీ వివేకానంద



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్, రంగారెడ్డి పరిధిలో ఉన్న జీహెచ్ఎంసీతోపాటు, ఇతర కార్పొరేషన్లు, మునిసిపాలిటీలు, గ్రామ పంచాయతీలను విలీనం చేసే ప్రక్రియలో భాగంగానే ముఖ్యమంత్రి హైడ్రా ప్రాజెక్టుకు రూపకల్పన చేసినట్టు తెలుస్తుందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద అన్నారు. అసెంబ్లీలో బడ్జెట్ పద్దులపై మాట్లాడిన ఆయన హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలోని పట్టణ, గ్రామీణ పాలక మండళ్లను కలిపి మూడు కార్పొరేషన్‌లుగా చేయాలని భావిస్తున్నట్టు తెలిసిందన్నారు.

కాలుష్య కాసారంగా హైదరాబాద్ : మల్‌రెడ్డి రంగారెడ్డి

హైదరాబాద్‌నగరంతోపాటు శివారు ప్రాంతాలన్నీ కాలుష్య కాసారాలుగా మారాయని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. బీఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్‌ను అధ్వానంగా మార్చారన్నారు. భూములను తెగనమ్మి, ఇతర అవసరాలకు ఆ డబ్బును వాడుకున్నారని చెప్పారు. మూసీ, హుస్సేన్‌సాగర్ విషతుల్యంగా మారాయని విమర్శించారు. ఈ పరిస్థితుల్లో హెచ్ఎండీఏ ద్వారా హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని పట్టణాల అభివృద్ధికి ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని చెప్పారు. హైదరాబాద్ నగరంలోని రేస్‌కోర్సును ఎయిర్‌పోర్టు సమీపంలోకి తరలించాలని కోరారు.

మునిసిపాలిటీలను పట్టించుకోండి: ధన్‌పాల్ సూర్యనారాయణగుప్త

పురపాలకశాఖకు కేటాయించిన నిధుల్లో రూ.10వేల కోట్లు హైదరాబాద్ అభివృద్ధికే కేటాయించారని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్త అన్నారు. ఇతర మునిసిపాలిటీల అభివృద్ధిని పట్టించుకోలేదని చెప్పారు. పట్టణాలకు సంబంధించి ఏ పథకం కూడా బడ్జెట్‌లో లేదన్నారు. కుక్కలు, కోతుల సమస్య తీవ్రంగా ఉందని, సమస్య పరిష్కారానికి కృషి చేయాలని, చిన్న మునిసిపాలిటీలను కూడా ప్రభుత్వం పట్టించుకోవాలని కోరారు.

సీఎం ప్రత్యేక అభివృద్ధి నిధికి రూ.1,886 కోట్లు

- ఒక్కో ఎమ్మెల్యేకు ఏడాదికి రూ.5 కోట్ల సీడీపీ నిధులు.. కలెక్టర్లకు రూ.కోటి

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి ప్రత్యేక అభివృద్ధి నిధి కింద ఈ బడ్జెట్‌లో రూ.1,886 కోట్లు కేటాయించారు. సంక్షేమ, అభివృద్ధి కార్యకలాపాల నిమిత్తం ప్రత్యేక అభివృద్ధినిధి పేరుతో ఈ మేరకు బడ్జెట్‌లో కేటాయిస్తున్నట్టు ఆర్థికశాఖ డిమాండ్ నోట్‌లో ప్రభుత్వం వెల్లడించింది. ఈ డిమాండ్ నోట్‌ను అసెంబ్లీ ముందు చర్చకు పెట్టింది. ఈ నోట్ ప్రకారం ముఖ్యమంత్రి జిల్లాల పర్యటనకు వెళ్లినప్పుడు ప్రజలు, ప్రజాప్రతినిధుల నుంచి వచ్చే వినతుల మేరకు అత్యవసర పరిస్థితుల్లోనూ అవసరమయ్యే పనులు చేపట్టేందుకు వీలుగా రూ.1,886.75 కోట్లు ప్రతిపాదించారు. ఇక, ఎమ్మెల్యేలకు నియోజకవర్గ అభివృద్ధి పనుల కింద ఏడాదికి రూ.5 కోట్లు కేటాయించారు. ఇందుకోసం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.603.76 కోట్లు కేటాయించారు.

జిల్లాల కలెక్టర్లు తమ విచక్షణ మేరకు అభివృద్ధి పనుల నిమిత్తం వినియోగించేందుకుగాను ప్రతి జిల్లాకు రూ.కోటి చొప్పున రూ.33 కోట్లు కేటాయించారు. కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కాడా) కోసం రూ.120 కోట్లు ప్రతిపాదించారు. రాష్ట్రంలో అమలవుతున్న అభివృద్ధి కార్యకలాపాలను ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తూ అభివృద్ధి ఫలాలు ప్రజలకు అందేవిధంగా సూచనలు చేసేందుకుగాను రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ కోసం రూ.100 కోట్లు కేటాయించారు.

డీఎంఈ ఉద్యోగ విరమణ వయసు 65కు పెంపు

సంబంధిత ఫైలుపై గవర్నర్ సంతకం

సాక్షి, హైదరాబాద్: వైద్య విద్య సంచాలకుల పరిధిలో అడ్మినిస్ట్రేటివ్ పోస్టుల వయోపరిమితి పెంపు బిల్లుకు మోక్షం లభించింది. సంబంధిత ఫైలుపై గవర్నర్ రాధాకృష్ణన్ సోమవారం సంతకం చేసినట్లు వైద్య, ఆరోగ్యశాఖ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం అడిషనల్ డీఎంఈల పదవీ విరమణ వయసు 61గా ఉంది. తాజా నిర్ణయంతో డీఎంఈ సహా అడిషనల్ డీఎంఈల ఉద్యోగ విరమణ వయసు 65కు పెరగనుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ ఉద్యోగ విరమణ వయసును 61 నుంచి 65కు పెంచాలని నిర్ణయం తీసుకుంది. ఆ బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపి, అనంతరం గవర్నర్ ఆమోదం కోసం పంపగా నాటి గవర్నర్ తమిళిసై దాన్ని తిరస్కరించారు. రెండోసారి అదే పరిస్థితి నెలకొంది. దాంతో ఆ బిల్లు అలాగే ఉండిపోయింది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, బోధనాస్పత్రులు, డీఎంఈ కార్యాలయంలో మొత్తం 69 రెగ్యులర్ పోస్టులున్నాయి. వాటిలో 17 మందే రెగ్యులర్ అడిషనల్ డీఎంఈలున్నారు. మిగిలిన చోట్ల ఇన్‌చార్జులున్నారు. తాజాగా బిల్లుకు ఆమోదం లభించడంతో వారంలోపే రెగ్యులర్ డీఎంఈ నియామక ప్రక్రియను చేపట్టే అవకాశం ఉందని వైద్య, ఆరోగ్యశాఖ వర్గాలు తెలిపాయి.



మంటలు, వరదల కన్నా వేగంగా మృత్యువు మన మీదకు వస్తుంది. దాని నుంచి తప్పించుకోలేం.
– యోషిదా కెంకో

సాక్షి
మంగళవారం, 30 జూలై 2024

అపనమ్మకంతో అభివృద్ధి ఎలా?

వికసిత భారత్ లక్ష్యమనీ, అందుకు వికసిత రాష్ట్రాలు కీలకమనీ కేంద్రం మాట. అందుకు అవరోధంగా రాజకీయంగా వివక్ష కొనసాగుతోందని రాష్ట్రాల ఆరోపణ. అందుకే, రాష్ట్రాల అభివృద్ధి, నిధుల కేటాయింపునకు కీలకమైన నీతి ఆయోగ్ సమావేశంలో బహిష్కరణల పర్వం కొనసాగడం ఆశ్చర్యం అనిపించదు. ప్రధాని మోదీ అధ్యక్షతన శనివారం సాగిన నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ 9వ భేటీకి ఒకటీ రెండు కాదు... ఏకంగా పది ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల ప్రతినిధులు గైర్హాజరయ్యారు. గత వారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 2024–25 కేంద్ర బడ్జెట్‌లో తమ రాష్ట్రాల్లో ప్రాజెక్ట్‌లకు తగినన్ని నిధులు కేటాయించలేదంటూ తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, జార్ఖండ్ రాష్ట్రాల సీఎంలు భేటీని బహిష్కరిస్తే, పశ్చిమ బెంగాల్ పక్షాన హాజరైన ఏకైక ప్రతిపక్ష పాలిత సీఎం మమతా బెనర్జీ సైతం మాట్లాడనివ్వకుండా మైకు ఆపేశారంటూ సమావేశం నుంచి వాకౌట్ చేశారు. అనుకున్నట్టే ఆ భేటీ కేంద్రం, రాష్ట్రాల మధ్య మాటల యుద్ధానికి దారి తీసింది. నీతి ఆయోగ్ ప్రాథమిక లక్ష్యాలు, పనితీరు పైన చర్చకు పురిగొల్పింది. కేంద్ర, రాష్ట్రాలు పరస్పర నిందారోపణలు మాని, నిజమైన సమాఖ్య స్ఫూర్తిని పాటించాల్సిన అవసరాన్ని గుర్తుచేసింది.

ఈ నీతి ఆయోగ్ వ్యవస్థ ఎన్డీఏ తెచ్చిపెట్టినదే. తొలిసారి అధికారంలోకి వచ్చినప్పుడు 2014లో కేంద్ర ప్రణాళికా సంఘం స్థానంలో దీన్ని ప్రవేశపెట్టారు. అలా 2015 జనవరి నుంచి ఇది అమలులోకి వచ్చింది. ప్రణాళికా సంఘమైతే పైన కేంద్రం నుంచి రాష్ట్రాలకు ఏకపక్షంగా విధాన నిర్ణయాలు బట్వాడా చేస్తుందనీ, దానికి బదులు కింది అందరినీ కలుపుకొనిపోతూ, రాష్ట్రాల ఆలోచనలకు పెద్దపీట వేసేందుకు ఉపకరిస్తుందనే ఉద్దేశంతో నీతి ఆయోగ్‌ను పెట్టారంటారు. కానీ, ఆచరణలో అందుకు విరుద్ధంగా జరుగుతోందన్నది ప్రధాన విమర్శ. వరుసగా మూడోసారి ఎన్డీఏ సర్కారు ఏర్పడిన తర్వాత ఈ జూలై 16న నీతి ఆయోగ్ మేధావి బృందాన్ని ప్రభుత్వం పునర్వ్యవస్థీకరించింది. ప్రధానమంత్రి మోదీ ఛైర్‌పర్సన్‌గా ఉండే ఈ బృందంలో నలుగురు పూర్తికాలిక సభ్యులతో పాటు, ఎన్డీఏలో భాగస్వాములైన బీజేపీ, దాని మిత్రపక్షాలకు చెందిన 15 మంది కేంద్ర మంత్రుల్ని ఎక్స్–అఫిషియో సభ్యులుగా చేర్చింది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోమ్ మంత్రి అమిత్‌షా తదితరులు అందులో సభ్యులే.

ఒకప్పటి ప్రణాళికా సంఘంలోనూ లోపాలున్నా... గ్రాంట్ల విషయంలో గతంలో రాష్ట్రాలతో సంప్రతింపులకు వీలుండేది. కానీ, ఇప్పుడు గ్రాంట్లపై ఆర్థికశాఖదే సర్వంసహాధికారం. ప్రణాళికా సంఘం ఉసురు తీసి వచ్చిన నీతి ఆయోగ్ కేవలం సలహా సంఘమైపోయింది. ఎంతసేపటికీ రాష్ట్రాల స్థానాన్ని మదింపు చేయడానికి కీలకమైన సూచికల సృష్టి మీదే దృష్టి పెడుతోంది. రాష్ట్రాలకూ, ఇతర సంస్థలకూ వనరుల పంపిణీ, కేటాయింపులు జరిపే అధికారం లేని వట్టి ఉత్సవ విగ్రహమైంది. వెరసి, కేంద్ర సర్కార్ జేబుసంస్థగా, పాలకుల అభీష్టానికి తలాడించే సవాలక్ష ఏజెన్సీల్లో ఒకటిగా దాన్ని మార్చేశారు. చివరకు 'సహకార సమాఖ్య' విధానానికి బాటలు వేస్తుందంటూ తెచ్చిన వ్యవస్థ అనూహ్యంగా 'పోటాపోటీ సమాఖ్య' పద్ధతికి దారి తీసింది. చివరకు మేధావి బృందపు పాత్ర ఏమిటన్న దానిపైనా ప్రశ్నలు తలెత్తాయి. వాటికీ సరైన జవాబు లేదు. అపనమ్మకం పెరిగితే వ్యవస్థలో చిక్కులు తప్పవని నీతి ఆయోగ్ భేటీ మరోసారి తేటతెల్లం చేసింది.

అభివృద్ధికి సంబంధించిన వైఖరుల్లో పరస్పరం తేడాలున్నా, ప్రధానంగా భౌతిక ప్రాథమిక వసతుల నిర్మాణంపైనే అధికంగా ఖర్చు చేయాలన్న కేంద్ర ప్రభుత్వ భావనకు సరిపోలేలా రాష్ట్రాలు కృషి చేయాలంటూ నీతి ఆయోగ్ తాజా భేటీలో 20 రాష్ట్రాలు, 6 కేంద్ర పాలిత ప్రాంతాల ప్రతినిధుల్ని ఉద్దేశించి ప్రధాని నొక్కిచెప్పారు. ఆర్థిక కార్యకలాపాలు చురుకుగా సాగాలంటే ప్రాథమిక వసతుల నిర్మాణం ప్రాధమ్యాంశమని కేంద్రం ఆలోచన. అందుకే, జాతీయ అభివృద్ధి లక్ష్యాల సాధనకు కేంద్రంతో రాష్ట్రాలు చేతులు కలిపి అటు వసతులకూ, ఇటు సంక్షేమానికీ వనరులు అందుకోవాలని ప్రధాని అంటున్నారు. అయితే, రాష్ట్రాల స్థానిక అవసరాలు, ప్రాధాన్యాలు ఎక్కడికక్కడ వేర్వేరు కాబట్టి, చెప్పినంత సులభం కాదది! పైగా, రాష్ట్రాలన్నిటికీ పెద్దపీటనే మాటకు భిన్నంగా ఆచరణలో పాలకపక్షం తమ ప్రభుత్వాలు ఉన్నచోటనే ప్రేమ చూపిస్తోందనే విమర్శ ఉండనే ఉంది.

కేంద్ర బడ్జెట్‌ను సైతం అదే సరళిలో రాజకీయమయం చేశారని ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలు ఆరోపిస్తున్నాయి. తమిళనాట చెన్నై మెట్రో రైల్, కేరళలో విళింజమ్ పోర్ట్ సహా పలు కీలక ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులకు నిధులివ్వలేదని ఎత్తిచూపుతున్నాయి. ఈ అనుమానాలు, ఆరోపణలకు సంతృప్తికరమైన సమాధానాలు కేంద్రం వద్ద లేవు. అదే సమయంలో తాగునీరు, విద్యుచ్ఛక్తి, ఆరోగ్యం, పాఠశాల విద్య తదితర అంశాలే అజెండాగా సాగిన ఓ భేటీని బహిష్కరించడం వల్ల రాష్ట్రాలకూ, ప్రజానీకానికే నష్టం. ఆ సంగతి రాష్ట్రాలు గుర్తించాలి. బహిష్కరణను తప్పుబడుతున్న కేంద్ర పెద్దలు కూడా పరిస్థితి ఇంత దాకా ఎందుకు వచ్చిందో ఆత్మపరిశీలన చేసుకోవాలి. నీతి ఆయోగ్‌ను రద్దు చేసి, మునుపటి ప్రణాళికా సంఘమే మళ్ళీ తేవాలనే వాదన వినిపిస్తున్న వేళ వ్యవస్థాగతంగానూ, పని తీరులోనూ పాతుకున్న లోపాలను తక్షణం సవరించాలి. నిధులను సక్రమంగా, సమానంగా పంచడంలో కేంద్ర ఆర్థిక మంత్రి, బడ్జెట్లు విఫలమవుతున్న తీరును మాటలతో కొట్టిపారేస్తే సరిపోదు. పెద్దన్నగా అన్ని రాష్ట్రాలనూ కలుపుకొనిపోతేనే వికసిత భారత లక్ష్యం సిద్ధిస్తుంది. పన్నుల రూపంలో భారీగా కేంద్రానికి చేయందిస్తున్న ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలూ ఇదే భారతావనిలో భాగమని గుర్తిస్తేనే అది కుదురుతుంది. అందుకు రాజకీయాలను మించిన విశాల దృష్టి అవసరం.

రాజీ మార్గంలో జెలెన్‌స్కీ

విశ్లేషణ



టంకశాల అశోక్

షరతులన్నింటికీ రష్యా అంగీకరిస్తే తప్ప చర్చల ప్రసక్తి లేదని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వాదిస్తూ వచ్చారు. స్విట్జర్లాండ్ శాంతి సమావేశాలకు రష్యాను ఆహ్వానించలేదు. అలాంటిది రష్యాతో చర్చలు అవసరం కావచ్చునని అన్నారు. అంతేనా? నవంబరులో నిర్వహించనున్న శాంతి శిఖరాగ్ర సమావేశానికి ప్రతినిధులను పంపవలసిందిగా రష్యాను కోరారు. ఆ రాయబారం కోసమే తన విదేశాంగ మంత్రిని చైనా పంపారు. ఇంతకూ జెలెన్‌స్కీ ఎందుకు చర్చలంటున్నారు? యుద్ధంలో రష్యాది పైచేయి అవుతోంది. ఉక్రెయిన్ ఆర్థిక పరిస్థితి క్షీణిస్తోంది. పాశ్చాత్య దేశాలు పైకి ఏమన్నా, అంతర్గతంగా విముఖత పెరుగుతోంది. ఈ తరహా సహాయాలకు వ్యతిరేకి అయిన ట్రంప్ అధికారానికి రావచ్చుననే అంచనాలు మరో కారణం.

ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమీర్ జెలెన్‌స్కీ రష్యాతో రాజీ మార్గం వైపు మళ్లుతున్నారనే మాట ఆశ్చర్యంగా తోస్తుంది. రెండున్నరేళ్ల రాజీలేని యుద్ధం చేసిన ఆయన నిజంగానే ఆ ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నెల 20న తమ దేశ ప్రజలను ఉద్దేశించి, రష్యాతో చర్చలు అవసరమని సూచించటం. తాను వచ్చే నవంబరులో నిర్వహించనున్న శాంతి శిఖరాగ్ర సమావేశానికి ప్రతినిధులను పంపవలసిందిగా రష్యాను కోరటం. ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి దిమిత్రో కులేబా ఈ నెల 24 నుంచి నాలుగు రోజుల పర్యటన కోసం చైనా వెళ్లి, వారి విదేశాంగ మంత్రి వాంగ్ యీతో సమావేశమై, చర్చల కోసం రష్యాను ఒప్పించవలసిందిగా కోరటం.

తమ షరతులన్నింటికి రష్యా అంగీకరిస్తే తప్ప చర్చల ప్రసక్తి లేదని జెలెన్‌స్కీ వాదిస్తూ వచ్చారు. షరతులు తాము విధిస్తాముగానీ, రష్యా ఎటువంటి షరతులు పెట్టరాదన్నారు. యుద్ధం మొదలైన కొత్తలో ఒకసారి జరిగిన చర్చలు రెండు వైపుల నుంచి ఇటువంటి వైఖరులు వల్లనే విఫలమయ్యాయి. ఆ తర్వాత రష్యాపై దౌత్యపరమైన ఒత్తిళ్ల కోసం ఉక్రెయిన్ అనేక ప్రయత్నాయి చేసింది. అమెరికా, యూరోపియన్ యూనియన్ల ద్వారా అనేక ఆర్థిక ఆంక్షలు విధింపజేశారు. యుద్ధానికి అమెరికా కూటమి ఆయుధ సరఫరాలు, ఆర్థిక సహాయాలు సరేసరి. జూన్ 15–16 తేదీలలో వాషింగ్టన్‌లో జరిగిన నాటో కూటమి 75 సంవత్సరాల ఉత్సవాలలో ఉక్రెయిన్‌కు తిరుగు లేని మద్దతు ప్రకటించింది. జెలెన్‌స్కీని అతిథిగా ఆహ్వానించి ప్రసంగింపజేసింది. ఆ తర్వాత జూలై 9న స్విట్జర్లాండ్‌లో జెలెన్‌స్కీ సుమారు 90 దేశాలతో శాంతి సమావేశాలు నిర్వహించి అక్కడ కూడా రాజీ లేకుండా మాట్లాడారు.

అటువంటిది కేవలం 10 రోజులు గడిచేసరికి, రష్యాతో చర్చలు అవసరం కావచ్చునని అన్నారు. మరొక విశేషం ఏమంటే, తను స్వయంగా నిర్వహించిన స్విట్జర్లాండ్ శాంతి సమావేశాలకు రష్యాను అసలు ఆహ్వానించలేదు. ఆ విషయమై ప్రశ్నించిన వారిని అందువల్ల ఉపయోగమేమిటని ఎదురు ప్రశ్నించారు. సరిగా ఆ రోజులలో రష్యా పర్యటనకు వెళ్లి భారత ప్రధాని మోదీని, ఒక రక్త పిపాసిని ఆలింగనం చేసుకున్నారంటూ తీవ్రంగా ఆక్షేపించారు. మోదీని ఢిల్లీలోని అమెరికా రాయబారి ఎరిక్ గార్సెట్టీ కూడా విమర్శించారు. తీరా జరిగిందేమిటి? రష్యాను ఆహ్వానించకపోవటం వల్ల ప్రయోజనం ఉండదంటూ చైనా కూడా పాల్గొనలేదు. పాల్గొన్న దేశాలలో ముఖ్యమైనవి అనేకం ఉమ్మడి ప్రకటనపై సంతకాలు చేయలేదు. ఆ విధంగా ఆ సమావేశం ఒక నిష్ఫలయత్నంగా మిగిలింది.

ఇంత జరిగినాక ఇంతలోనే జెలెన్‌స్కీ రష్యాతో చర్చలని అంటూ, రష్యాను ఈసారి చర్చలకు రావలసిందిగా మౌఖికంగా ఆహ్వానిస్తున్నారు. ఆ పని రానున్న రోజులలో లిఖిత పూర్వకంగా చేయగలరని భావించవచ్చు. అయితే, అందుకు మొదటి అడుగు నవంబర్ విస్తృత సమావేశాలలో రష్యా పాల్గొనటం అయితే, అంతా సజావుగా సాగిన పక్షంలో ఇరువురి మధ్య ముఖాముఖి చర్చలు రెండవ అడుగు అవుతాయి. ఈ రెండింటికి సన్నాహక ప్రయత్నాల సమయంలో ఇరువురూ ఏవైనా షరతులు ముందస్తుగానే పెడతారా? షరతులు ఉంటే ఏమిటవి? అనేవన్నీ చిక్కుముడులు. ఈ రాజీ ప్రయత్నాల పట్ల అమెరికా కూటమి వైఖరి ఏమి కావచ్చుననేది అంతకన్న కీలకమైన ప్రశ్న. ఎందుకంటే, రష్యాను ఏ విధంగానైనా లొంగతీయాలన్నది ఉక్రెయిన్ యుద్ధంలోని అమెరికా పరమోద్దేశం. అందుకే నాటోను రష్యా సరిహద్దులకు విస్తరిస్తున్నందున, రాజీ మార్గాన్ని వారు సమ్మతిస్తారా అనే విషయమై చాలామందికి సందేహాలుంటాయి.



ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమీర్ జెలెన్‌స్కీ

ఇదిట్లుండగా, రష్యాతో చర్చలు అవసరమంటూ జెలెన్‌స్కీ చేసిన ప్రసంగానికి గానీ, ఆయన విదేశాంగమంత్రి కులేబా చైనా వెళ్లి వాంగ్ యీతో ప్రతిపాదించినదానికి గానీ, ఈ వ్యాసం రాసే సమయానికి రష్యా నుంచి ఇంకా ఎటువంటి స్పందనా లేదు. చైనా నుంచి కూడా! వారినుంచి రాగల రోజులలో కనిపించే స్పందనలను బట్టి, మును ముందు ఏమి జరగవచ్చుననే దానిపై కొంత సూచన లభిస్తుంది. చైనా వెళ్లిన కులేబా ఇంతకూ అన్నదేమిటి? వాంగ్‌తో సమావేశం తర్వాత మాట్లాడుతూ, "నిజాయితీగా, సమస్య పరిష్కారానికి దోహదంగా వ్యవహరించే ఉద్దేశం రష్యాకు ఉన్నట్లయితే చర్చలకు తాము సిద్ధమ"న్నారు. రష్యా నుంచి అటువంటి సంసిద్ధత ఇంతవరకు కన్పించలేదని కూడా అన్నారు. ఉక్రెయిన్ యుద్ధం మొదలైన తర్వాత, సమస్య పరిష్కారానికి ప్రయత్నించవలసిందిగా జెలెన్‌స్కీ ఒకటి రెండుసార్లు చైనాను బహిరంగంగా కోరారు. కానీ ఆయన విదేశాంగ మంత్రి స్వయంగా వెళ్లటం ఇది మొదటిసారి. చైనా స్వయంగా చొరవ తీసుకుని 12 సూత్రాల పథకం ఒకటి నిరుడు ప్రతిపాదించింది. అది ఉభయులు ఎట్లా యుద్ధ విరమణ చేసి చర్చలు ఆరంభించాలనే దానిపైనే తప్ప, అసలు సమస్య పరిష్కారం గురించి కాదు. తమ భూభాగాల నుంచి రష్యా ఉపసంహరించుకోవాలనే మాట అందులో లేదంటూ ఉక్రెయిన్ అందుకు తిరస్కరించింది. పరిష్కార చర్చలు ఉభయుల మధ్య జరగాలి తప్ప బయటి జోక్యం ఉండరాదన్నది చైనా వైఖరి. చర్చలకు తామెప్పుడూ కాదనలేదని, కాని కొన్ని షరతులు తప్పవన్నది రష్యా వాదన.

నిజానికి రష్యా, ఉక్రెయిన్ రెండు వైపుల నుంచి మొదటి నుంచి కొన్ని గట్టి షరతులే ఉన్నాయి. అమెరికా, నాటోలు తమను చుట్టుముట్టేందుకు నాటోను విస్తరిస్తూ, ఉక్రెయిన్‌ను రెచ్చగొడుతున్నాయనీ, అ దేశాన్ని నాటోలో చేర్చుకొనజూస్తున్నాయనీ, కనుక తమ ఆత్మరక్షణ కోసం ఉక్రెయిన్‌ను నాటోకు బయట ఉంచాలన్నది రష్యా మొదటి షరతు. తమ నౌకలు చలికాలంలో ప్రయాణించేందుకు వీలయ్యే ఏకైక సముద్ర మార్గం బ్లాక్ సీ అయినందున ఆ మార్గం భద్రంగా ఉండేందుకు అక్కడి క్రిమియా ద్వీపం తమ అధీనంలో ఉండాలనేది రెండవ షరతు. ఉక్రెయిన్ తూర్పున రష్యా సరిహద్దులో గల డొనెట్స్క్, లూహాన్స్క్, ఖేర్సాన్, జపోరిజిజియా ప్రాంతాలలో రష్యన్ భాషా సంస్కృతుల వారు పెద్ద మెజారిటీ అయినందున తీవ్ర వివక్షలను ఎదుర్కొంటున్నారని, కనుక ఇప్పటికే పాక్షికంగా తమ ఆక్రమణలో గల ఈ ప్రాంతాలను పూర్తిగా తమకు బదిలీ చేయాలన్నది మూడవ షరతు. ఉక్రెయిన్ వీటన్నింటిని తిరస్కరించటమేగాక, తమ ఆక్రమిత ప్రాంతాలన్నీ తమ స్వాధీనం చేయాలనీ, తాము నాటోలో కూడా చేరగలమనీ షరతులు పెడుతున్నది. రెండు వైపుల నుంచి ఇవన్నీ చాలా చిక్కు షరతులే.

ఇంతకూ జెలెన్‌స్కీ ఇప్పుడు అకస్మాత్తుగా చర్చలు, రాజీలంటూ మాట్లాడటం ఎందువల్ల? క్లుప్తంగా చెప్పాలంటే, యుద్ధంలో రష్యాది పైచేయి అవుతున్నది. పాశ్చాత్య దేశాలు ఎన్ని ఆయుధాలు, ఎంత ఆధునికమైనవి సరఫరా చేసినా చాలటం లేదు. అందులోనూ ఒక పరిమితిని మించితే అది నేరుగా రష్యాతో యుద్ధంగా మారవచ్చునని అమెరికా సందేహిస్తున్నది. ఉక్రెయిన్ ఆర్థిక పరిస్థితులు బాగా క్షీణించటమే గాక, సైనికులు పెద్దఎత్తున చనిపోతూ కొత్త రిక్రూట్‌మెంట్లు తగ్గుతున్నాయి. ఉక్రెయిన్‌కు అంతులేని సహాయాలు, అయినా ఉపయోగం లేకపోవడంతో అమెరికా సహా పాశ్చాత్య దేశాలు పైకి ఏమన్నా, అంతర్గతంగా విముఖత పెరుగుతున్నది. ఈ తరహా యుద్ధాలకు, సహాయాలకు బహిరంగ వ్యతిరేకి అయిన ట్రంప్ ఈసారి అధికారానికి రావచ్చుననే అంచనాలు కొత్త భయాలను కలిగిస్తున్నాయి. ప్రపంచ దేశాలలో మద్దతు తగ్గుతున్నది. స్వయంగా జెలెన్‌స్కీ పట్ల అక్కడి సైన్యంలో, ప్రజలలో నిరసనలు పెరుగుతున్నాయి. ఈ పరిణామాలన్నింటి ఒత్తిడి వల్లనే, ఇక చర్చలు మినహా మార్గం లేదని ఆయన భావిస్తుంటే ఆశ్చర్యమక్కరలేదు.

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

పోషణ ముఖ్యం



క్రీడల గురించిన చాలా చర్చలు జరుగుతుంటాయి. కానీ దేశంలోని 50 శాతం పిల్లలకు సరైన పోషణ అందకపోవడానికీ, ప్రపంచ స్థాయి అథ్లెట్లను మనం తయారు చేయలేకపోవడానికీ మధ్య ఉన్న సంబంధాన్ని ఎవరూ గుర్తించడం లేదు. అందరికీ సరైన పోషణ అందించని క్రీడా విధానం ఉండకూడదు. అది పరిష్కరించడమే దేనికైనా ప్రారంభం అవుతుంది.

– సరయు పానీ, కాలమిస్ట్

పేదరికమే రోగం



జనాల మానసిక ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే అత్యంత హానికారక అంశాల్లో పేదరికం కూడా ఒకటని, చెప్పాలంటే అదే ముఖ్యమైనదని, సైకియాట్రీలో పనిచేసినకొద్దీ నాకు మళ్లీ మళ్లీ అర్థమవుతూ వస్తోంది.

– అహ్మద్ హాంకిర్, ప్రొఫెసర్

ఎదగడం ముందు...



భౌగోళిక రాజకీయాలు ఎప్పుడూ చెడ్డ వార్తల గురించే కాదు. రెండు ఆసియా పెద్ద శక్తులైన చైనా, ఇండియాకు ఇప్పుడు ఆర్థిక వృద్ధి అవసరం. సైనిక ఘర్షణ అనేది వాటికి ఇప్పుడు ప్రయోజనకారి కాదు.

– వెలీనా చకరోవా, జియో పొలిటికల్ స్ట్రాటెజిస్ట్

పెద్ద తలలు ఉండబట్టే...



జమ్మూ ప్రాంతంలోని ఇటీవలి దాడుల వెనుక పాకిస్తాన్ అత్యున్నత సైనిక కమాండర్లు ఉన్నట్టు తెలుస్తోంది. అందుకే, అంత నిర్దుష్టంగా దాడులు జరగడంలో ఆశ్చర్యం లేదు. ఇది యుద్ధ చర్య. ఇండియా తగినట్టుగా స్పందించాలి.

– శేష్ పాల్ వైద్, జమ్మూ – కశ్మీర్ మాజీ డీజీపీ

జనం మాట్లాడకుండా...



ఇజ్రాయెల్‌ను ఆక్రమిస్తామని (తుర్కియే అధ్యక్షుడు) ఎర్డోగాన్ బెదిరిస్తున్నారు. దేశంలోని 75 శాతం ద్రవ్యోల్బణం, చితికిపోయిన ఆర్థిక వ్యవస్థ, టూరిజం కుప్పకూలడం లాంటి అంశాల నుంచి జనాల్ని దారి మళ్లించడానికి ఆయన ఏదో ఒకటి చేయాలి! అనాదిగా నియంతల పాత కుయుక్తి ఇది.

– ఇంతియాజ్ మహమూద్, థింకర్

ఇన్ బాక్స్

కావడి యాత్రపై ఎందుకీ రభస?

ప్రతి ఏటా శ్రావణ మాసంలో హిందువులు పవిత్రంగా భావించే గంగా జలాన్ని హరిద్వార్ నుండి కావడిలో కాలినడకన తెచ్చి తమ గ్రామాలలోని శివాలయాల్లో అభిషేకం చేయడం పరిపాటి. ఇందుకోసం భక్తులు ఢిల్లీ హరిద్వార్ జాతీయ రాదారిపై లక్షల సంఖ్యలో కాలి నడకన ప్రయాణిస్తారు. శతాబ్దాలుగా ఈ కావడి (కావడ్) యాత్ర జరుగుతోంది. పంజాబ్, రాజస్థాన్, హరియాణా, ఢిల్లీ, యూపీ, మధ్యప్రదేశ్, జార్ఖండ్, ఒడిశా రాష్ట్రాల వారు ఈ యాత్రలో పాల్గొంటూ ఉంటారు. హరిద్వార్ నుండే కాకుండా గంగోత్రి, బిహార్‌లోని హజారీబాగ్ దగ్గర్లోని గంగానది నుండి కూడా కావడి పాత్రల్లో జలాన్ని సేకరించి తీసుకువెళుతూ ఉంటారు. ఈ యాత్ర సందర్భంగా భక్తులు ప్రయాణించే ఢిల్లీ–హరిద్వార్ జాతీయ రహదారి పొడవునా ఉన్న దాబాలు, హోటళ్లు; పండ్లు, కూరగాయల బండ్ల పైనా, రేషన్ షాపుల పైనా యజమానులు, పనిచేసే వర్కర్ల పేర్లు రాసి ప్రదర్శించాలని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఒక ఉత్తర్వు జారీ చేశారు. దీన్ని చూసి మరో బీజేపీ పాలిత రాష్ట్రం ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి ఇదే తరహా ఉత్తర్వు ఇచ్చారు. ఈ ఉత్తర్వుల జారీలో ఒక వర్గాన్ని దెబ్బతీయడం మరో వర్గానికి మేలు చేయడం ద్వారా ఎన్నికల్లో లబ్ధి పొందడమే లక్ష్యమని అర్థమవుతోంది.

ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో యూపీ, ఉత్తరాఖండ్ బీజేపీ ప్రభుత్వాలకు ఎదురుగాలి వీచింది. ఈ యాత్రా మార్గంలో ఉన్న సహారన్‌పూర్ డివిజన్‌లో బీజేపీ ప్రభ తుడిచిపెట్టుకు పోయింది. అంతేకాకుండా శామలి, ముజఫర్‌నగర్ నియోజకవర్గాల్లో 'ఇండియా' బ్లాక్ విజయం సాధించింది. మీరట్‌లో బీజేపీ మెజారిటీ బాగా తగ్గింది. కాంగ్రెస్ గెలుచుకున్న ముజఫర్‌నగర్ సీట్ హరిద్వార్ దగ్గరలో ఉండటం, ఇటీవల ఉత్తరాఖండ్‌లో జరిగిన ఉపఎన్నికల్లో హరిద్వార్‌ను ఆనుకొని ఉన్న మంగ్లర్, బద్రీనాథ్ అసెంబ్లీ సీట్లలో కాంగ్రెస్ గెలవటం; త్వరలో యూపీలో 10 సీట్లలో ఉప ఎన్నికలు జరగనుండడంతో... మెజారిటీ వర్గ ఓట్లను దక్కించుకోవడానికి బీజేపీ వేసిన ఎత్తుగడగా రాజకీయ పరిశీలకులు ఈ ఉత్తర్వుల జారీని భావిస్తున్నారు. మూడేళ్ల క్రితం బీజేపీకి చెందినవారు ముజఫర్ నగర్ ఏరియాలో ఉన్న ముస్లిం హోటళ్ల యజమానుల పేర్లు హోటళ్లపై రాయాలని ఆందోళన చేశారు. ఆ హోటళ్లలో శాకాహారులు భోజనం చేస్తే కరప్టు అవుతారనేది వారి వాదం. 2023లో పోలీసులు ముస్లిం దాబాలను అనధికారికంగా మూసివేయించారు. అయితే యూపీ, ఉత్తరాఖండ్ ప్రభుత్వాల ఉత్తర్వులను సుప్రీంకోర్టు కొట్టి వేసింది. దాబాలు, హోటల్స్ కేవలం శాకాహారమా, మాంసాహారమా అని తెలుపుతూ బోర్డులు పెడితే చాలని ఉత్తర్వులిచ్చింది.

– డా॥ కె. సుధాకర్ రెడ్డి, విశ్రాంత లెక్చరర్ । 89850 37713

బహుముఖీన వైదుష్యానికి ప్రతీక

సందర్భం



పూషా దర్భా


రాంషా! ఈ పేరు చెప్పగానే గుర్తుకొచ్చేది 'అభిసారిక' పత్రిక. దాని ప్రచురణకర్తగా, సంపాదకునిగా, పాఠకుల సెక్సు సమస్యలకు, సందేహాలకు ఆత్మీయ పరిష్కారాలు, సలహాలు సూచించే ఒక పెద్ద దిక్కు జ్ఞప్తికొస్తుంది. అంతే కాదు ఆయన ఒక కమ్యూనిస్ట్, అభ్యుదయ కవి, నాటకకర్త, సాహితీ విమర్శకుడు; కథా, నవలా రచయిత, ముద్రాపకుడు! ఇవన్నీ కలగలసిన విశేష వ్యక్తిత్వమే రాంషా!

'రాంషా' అసలు పేరు దర్భా వేంకటరామశాస్త్రి. తూర్పు గోదావరి జిల్లా సామర్లకోట సమీపంలోని వేట్లపాలెంలో 1924 జూలై 30న జన్మించారు. కాకినాడ పిఠాపురం రాజావారి కాలేజీలో ఎఫ్.ఎ. (నేటి ఇంటర్మీడియెట్) చదివే రోజుల్లోనే తొలిరచన 'శిలా ప్రతిమ' నాటికతో పేరు తెచ్చుకుని, 1948లో చోడవరం అఖిలాంధ్ర కవి పండిత పరిషత్తు నుంచి తొలి సన్మానం పొందారు. వేంకట రామశాస్త్రికి 'రాంషా' అనే లేఖినీ నామం ప్రదానం చేసింది ఆ కళాశాల అధ్యాపకులైన సాహితీ మూర్తి 'కళాప్రపూర్ణ' నిడదవోలు వెంకటరావు!

తుర్గినేవ్ రాసిన చిన్నకథను ఆధారం చేసుకుని అల్లిన నవల – 'కామేశ్వరి కథ' 1948లో ప్రచురింపబడి ఎన్నో ప్రశంసల నందుకున్నది. లక్ష కాపీల వరకు ముద్రితమయింది. చరిత్రహీనుల, బాధోపహతుల జీవితాల్ని చిత్రించిన రాంషా కథలెన్నో వివిధ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. 'గాంధీజీ పెట్టిన భిక్ష', 'ఎర్ర జెండా', 'మత్తానయ్య మరణం', 'ఆడవాళ్ళ సంత', 'కిర్రు చెప్పులు', 'కారుణ్యం' వంటి కథలు రాంషా మార్కు కథాకథన శిల్పానికి, వస్తు వైవిధ్యానికి, శైలీ విన్యాసానికి నిదర్శనాలుగా నిలుస్తాయి. 'లక్షింపతిగారమ్మాయిలు' అనే నాటకం కన్యాశుల్కం తరువాత చెప్పుకోదగ్గ నాటకంగా నాటి సమీక్షకులు పేర్కొన్నారు. కథా రచనా లక్షణాన్ని నిర్దేశిస్తూ, 'కళలు–కథలు' అనే విమర్శ వ్యాసాలు; అలాగే, నవల, నాటకం, కావ్యం, విమర్శ వంటి సాహిత్య ప్రక్రియల మీద కూడా ప్రామాణిక వ్యాసాలు రచించారు. 'కుళ్ళుసరుకు' అనే ప్రబోధాత్మక సాంఘిక నాటకంలో ఒక ముఖ్య భూమికలో నటించి, నటుడిగా మరొక కోణాన్ని కూడా ఆవిష్కరించుకున్నారు.

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట పరిస్థితులకు రాంషా కలం ఝళిపించారు. సోమసుందర్, శశాంక వంటి కవి మిత్రులతో చేయిచేయి కలిపి, కమ్యూనిస్ట్ కార్యకర్తగా శంఖం పూరించారు (1944 –1955). ప్రజా చైతన్యం ప్రజ్వలింపజేయడానికి 'కళాకేళి – ధర్మసంగ్రామకేళి' నినాదంతో 'కళాకేళి ప్రచురణలు' నెలకొల్పారు. సామ్యవాద ఉద్యమ ప్రతిధ్వనులైన ఆరుద్ర 'త్వమేవాహం', సోమసుందర్ 'వజ్రాయుధం' వంటి అగ్రశ్రేణి అభ్యుదయ కావ్యాలకి రాంషా సముచిత ప్రకాశి కలు రాసి ప్రచురించి, వాటికి అద్వితీయ ప్రాచుర్యం కల్పించారు. మరెన్నో గ్రంథాలను ప్రచురించారు.





రాంషా (1924 - 1990) శత జయంతి

ఉద్యమ కాలంలో ప్రభుత్వం 'వజ్రాయుధం' కావ్యాన్ని నిషేధించి, పుస్తకాల్ని జప్తుచేసి, ప్రచురణకర్త రాంషా మీద, ముద్రాపకుల మీద కేసులు పెట్టింది. తీవ్ర నిర్బంధ విధానంలో అభ్యుదయవాదులైన సాహిత్యకారులు, కళాకారులు చెల్లాచెదరయ్యారు. ఆ పరిస్థితుల్లో రాంషా కూడా నిలదొక్కుకోడానికి అనేక కష్టనష్టాల నెదుర్కొన్నారు. అలాంటి సమయంలో ఆప్తమిత్రుడు ధనికొండ హనుమంతరావు కొంతకాలం నడిపి ఆపివేసిన తన 'అభిసారిక' పత్రికను రాంషాకి అందించారు. ఆవిధంగా అభిసారిక పత్రికను స్వీకరించి మరో కొత్త జీవిత అధ్యాయానికి తెర తీశారు రాంషా (1960).

రాంషా నేతృత్వంలో 'అభిసారిక' లైంగిక విజ్ఞాన మాస పత్రిక అచిరకాలంలోనే అసంఖ్యాక పాఠకుల మన్న నలు పొంది, బహుళ ప్రచారంలోకి వచ్చింది. మూఢ విశ్వాసాలు, ఛాందస భావాలతో, అజ్ఞానంలో, అంధకారంలో అల్లాడుతున్న అనేకమంది తెలుగు పాఠకులకు అది వేగుచుక్కగా రూపొందింది. అభిసారిక పత్రిక ద్వారా శాస్త్రీయంగా 'సెక్సు విజ్ఞానాన్ని' పాఠకుల కందజేస్తూ, ఆత్మవిశ్వాసం కోల్పోయి, అనేక మానసిక రుగ్మతలకు లోనై, అశాంతితో, అపోహలతో, సమస్యలతో, సంతాపాలతో సతమతమవుతున్న అసంఖ్యాక వ్యక్తులకు ఆశనీ, ఆత్మస్థైర్యాన్నీ కల్పించి, ఓదార్పునీ, నైతిక బలాన్నీ, నవజీవనాన్నీ ప్రోదిచేసి, వారిని తీర్చిదిద్దే మహోద్యమంలో రాంషా విజయం సాధించారు.

ఆ కృషిలో భాగంగా 1960 నుంచి 1990 వరకు 30 ఏళ్ల కాలంలో ఎన్నో ఉత్తమ సెక్సు విజ్ఞాన గ్రంథాలు రచించారు. అభిసారికలో 'అడగండి చెపుతాను' శీర్షిక ద్వారా వేనవేలమంది వ్యక్తిగత సమస్యలకు పరిష్కారాలు సూచించారు. 'మీట్ ది ఎడిటర్' కార్యక్రమం ద్వారా ఆంధ్ర – ఆంధ్రేతర ప్రాంతాలు పర్యటిస్తూ సలహాలు – పరిష్కారాలు అందజేశారు.

'వాత్స్యాయన కామసూత్రాలు', 'కొక్కోకమ్', 'సెక్సు సైకాలజీ' వంటి 40కి పైగా కామ పురుషార్థ గ్రంథాలు రాశారు. అలాగే మిగతా పురుషార్థాలైన ధర్మార్థమోక్షాల అమృత సారాన్ని కూడా గౌతమ, వశిష్ఠ ధర్మసూత్రాలూ 'జ్ఞాన వాశిష్ఠం', 'న్యాయ దర్శనం', 'సాంఖ్యమ్', 'వైశేషికమ్', 'యోగశాస్త్రం', 'మోక్షశాస్త్రం', 'కౌటిలీయ అర్థశాస్త్రం' వంటి గ్రంథాల రూపంలో తెలుగు వారికి సులభ గ్రాహ్యంగా అందజేశారు. 1990 ఫిబ్రవరి 8న రాజమండ్రిలో ఒక రోడ్డు ప్రమాదంలో అనూహ్యంగా మృతి చెందారు రాంషా. అది అఖిల 'అభిసారిక' పాఠకులకు, సాహితీ మిత్రులకు తీరని లోటు మిగిల్చింది.

వ్యాసకర్త మానసిక సెక్స్ సమస్యల నిపుణులు, 'అభిసారిక' పూర్వ సంపాదకులు

(నేడు కాకినాడలో రాంషా శతజయంతి సభ, 5 రచనా సంపుటాల ఆవిష్కరణ)

మూడు తలల పాము

'గురువర్యా! మీరు అవధిలేని ఆనందం నాలోనే ఉందంటారు. అది నా స్వభావమూ, సొత్తూ అంటారు. కానీ నేను మాత్రం దాన్ని అనుభవించలేక పోతున్నాను. ఏం చేయాలి?'

'శిష్యా! ముందు, అలా అనుభవించలేక పోవడానికి కారణమేమిటో తెలుసుకోవాలి. నిత్య, శుద్ధ, బుద్ధ, చైతన్య స్వరూపుడివైన నీకు, ఈ దేహం ఇంద్రియ–మనో–బుద్ధులతో సంబంధం ఏర్పడి, ఆ శరీరాదులే నేను అనే తాదాత్మ్యతా, భ్రమా ఏర్పడ్డాయి. ఇలా నిన్ను 'నేను–నాది' అన్న పరిమితులలో బంధిస్తున్నది 'అహంకారం' అనే అజ్ఞానం. అది ఆనందమయమైన నీ స్వస్వరూపాన్ని కప్పేస్తున్నది.'

జ్యోతిర్మయం

'మరేం చేయాలి?'

'నీ దగ్గర పెద్ద పెట్టెలో నీ సొంత ధనరాశులు బోలెడున్నాయి. ఒక రోజు తెల్లారి చూసేసరికి, ఒక కాల సర్పం ఆ పెట్టెను చుట్టుకొని విషం చిమ్ముతూ, బుసలు కొడుతున్నది. అప్పుడు నువ్వేం చేయాలి? నిరుపేదనయి పోయానని బిచ్చమెత్తుకుంటూ ఊరంతా తిరుగుతావా? లేక, ఏదో ఒక విధంగా ఆ సర్పాన్ని చంపి నీ సొమ్ము స్వాధీనం చేసుకోవాలా?'

'ఏదో ఒక ఉపాయంతో సర్పాన్ని చంపడమే తెలివి.'

'అదీ విషయం! అహంకారం అనే మూడు తలల పాము, బ్రహ్మానందమనే నీ సొత్తును చుట్టుకొని కూర్చొని ఉంది. దాన్ని వేదాంత జ్ఞానం అనే ఖడ్గంతో నరికివేసి, నీ సొత్తు నువ్వు అనుభవించడం వివేకం!'

'కానీ ఆ సర్పాన్ని నరకగల సామర్థ్యం నాకెలా వస్తుంది?'

'చాలాసార్లు చెప్పాను. అది అభ్యాసం ద్వారా, వైరాగ్యం ద్వారా అబ్బుతుంది. ఇంద్రియాలకు నువ్వు లొంగకుండా, వాటిని నువ్వే అదుపు చేసుకొని, ఇంద్రియ సుఖాలవల్ల లాభం స్వల్పం, క్షణికం; నష్టమే అపారం' అని గ్రహించి, వాటిపట్ల అనాసక్తి పెంచుకోవడం వైరాగ్యం. ఈ నశ్వరమైన దేహాది జడ విషయాలు నీవు కాదనీ, నీవు చైతన్య స్వరూపుడివనీ, శాశ్వతుడివనీ, పరిమితులు లేని సర్వవ్యాపివనే సత్యాన్ని మననం చేస్తూ, ఆ సత్యం మీదే ఏకాగ్రత నిలిపే ప్రయత్నం అభ్యాసం.'

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, **తిథి:** బ.దశమి రా.6.53 వరకు, తదుపరి ఏకాదశి, **నక్షత్రం:** కృత్తిక ప.1.25 వరకు, తదుపరి రోహిణి, **వర్జ్యం:** తె.4.53 నుండి 6.25 వరకు (తెల్లవారితే బుధవారం), **దుర్ముహూర్తం:** ఉ.8.14 నుండి 9.06 వరకు, తదుపరి రా.10.59 నుండి 11.43 వరకు, **అమృతఘడియలు:** ఉ.11.08 నుండి 12.40 వరకు; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 5.41, **సూర్యాస్తమయం:** 6.31.

క్లుప్తంగా...

నేటి పీజీ ప్రవేశ పరీక్షల ఫలితాలు వాయిదా

ఉస్మానియా యూనివర్సిటీ(హైదరాబాద్): టీఎస్ సీపీజీ ఈటీ–2024 పీజీ ప్రవేశ పరీక్షల ఫలితాలు వాయిదా పడ్డాయి. జవాబు పత్రాల మూల్యాంకనంలో ఒక పీజీ కోర్సు మూల్యాంకనం నిలిచిపోవడంతో ఫలితాలు వాయిదా వేస్తున్నట్లు టీఎస్ సీపీజీఈటీ–2024 కన్వీనర్ ప్రొఫెసర్ పాండురంగారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. వాస్తవానికి ఈ పరీక్ష ఫలితాలు నేడు (మంగళవారం) విడుదల కావాల్సి ఉన్నాయి. ఇదిలా ఉండగా ఒక్క కోర్సు ఫలితాలను త్వరగా మూల్యాంకనం చేసి ఫలితాలను విడుదల చేయాలని విద్యార్థులు డిమాండ్ చేశారు.

జీఎస్ఐ నూతన డీజీగా అసిత్ సాహా బాధ్యతలు



సాక్షి, హైదరాబాద్: జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) కొత్త డైరెక్టర్ జనరల్ (డీజీ)గా అసిత్ సాహా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ జీఎస్ఐని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఆత్మ నిర్భర్ భారత్‌లో భాగంగా కీలకమైన ఖనిజాల అన్వేషణకు, అభివృద్ధికి సంబంధించిన కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు ప్రయత్నిస్తానని, జీఎస్ఐలో అందరూ కలిసి పనిచేయాలని సూచించారు.

తొలిసారి బొగ్గు క్రషింగ్ పనులు చేసిన ఆర్టిజన్లు

● సంస్థకు రూ.8లక్షల ఆదా



ఆర్టిజన్ కార్మికులతో సీఈ ప్రభాకర్‌రావు తదితరులు

పాల్వంచ: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ కేటీపీఎస్ కర్మాగారంలో తొలిసారి బొగ్గు క్రషింగ్ పనులను ఆర్టిజన్ కార్మికులు చేశారు. గతంలో బొగ్గును క్రషింగ్ (పెద్ద పెళ్లలను సైజులు చేయడం) పనులను ఏజెన్సీలకు ఇచ్చి చేయించేవారు. బయటి నుంచి వచ్చిన వారు పనులు చేస్తుండగా చూసి ఆర్టిజన్ కార్మికులు నేర్చుకున్నారు. 1,000 మెగావాట్ల సామర్థ్యం గల 5,6 దశల కర్మాగారాల్లోని కోల్ ప్లాంట్‌లో మొదటిసారి కార్మికులే ఈ పనులు చేపట్టి జెన్‌కో సంస్థకు రూ.8లక్షలు ఆదా చేశారు. కాంట్రాక్ట్ కార్మికులు ఆర్టిజన్లుగా మారి ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం కర్మాగారంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా సీఈ ఎం.ప్రభాకర్‌రావు కోల్ ప్లాంట్‌ను సందర్శించి కార్మికులను అభినందించారు. పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని ఆర్టిజన్లు కోరగా యాజమాన్యం దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఈ పి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల అసెంబ్లీ ముట్టడికి పిలుపు

సాక్షి, హైదరాబాద్: విద్యాశాఖలోని సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం అసెంబ్లీని ముట్టడించనున్నట్లు సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం తెలిపింది. ఎన్నికల సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి రెగ్యులర్ చేస్తానని హామీ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కోరింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లో సచివాలయానికి పిలిచి రెగ్యులర్ చేస్తానని, ఆ లోపు బేసిక్ పే అమలు చేస్తామని మాట ఇచ్చారని గుర్తుచేసింది.

అప్పుల బాధతో కౌలురైతు ఆత్మహత్య

● గతంలో రెండుసార్లు ఆత్మహత్యాయత్నం
● రాజన్నసిరిసిల్ల జిల్లాలో ఘటన



సత్తయ్య

కోనరావుపేట (వేములవాడ): అప్పుల బాధలు తాళలేక ఓ కౌలురైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాజన్నసిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం నిజామాబాద్‌లో సోమవారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన తాళ్లపెల్లి సత్తయ్య (40)కు సొంతభూమి లేకపోవడంతో భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. వ్యవసాయంలో నష్టం రావడంతో అప్పులపాలయ్యాడు. అప్పులు తీర్చే మార్గం కనిపించక గతంలో రెండుసార్లు ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. ఆయా సమయాల్లో చికిత్స కోసం చేసిన అప్పులతో పాటు పంటల సాగుకు చేసిన అప్పులు రూ.10లక్షలకు చేరాయి. భార్య సరిత ఇద్దరు కూతుళ్లు రిషిత, హర్షితలను చదివించుకుంటూ రెండు నెలలుగా హైదరాబాద్‌లోనే ఉంటుంది. ఆదివారం సాయంత్రం పొలం వద్ద గడ్డిమందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించగా గమనించిన స్థానికులు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. కోనరావుపేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, సత్తయ్యకు కుమారులు లేకపోవడంతో పెద్దకూతురు రిషిత తండ్రికి అంత్యక్రియలు నిర్వహించింది.

అంటగట్టారు!

దిగుబడి లేని రంగాపూర్ బత్తాయి రకం

నల్లగొండ జిల్లాలో రూ.60 కోట్ల నష్టం

తిరుపతి ఉద్యాన వర్సిటీ నుంచే తెచ్చామంటున్న బత్తాయి రైతులు

రైతుల ఫిర్యాదు... నివేదికలతో అధికారుల సరి



ఈ ఫొటోలో ఉన్న రైతు పేరు గుర్రం శ్రీనివాస్‌రెడ్డి. ఈయనది నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలంలోని తిప్పలమ్మగూడెం. 2019లో తిరుపతి ఉద్యాన యూనివర్సిటీ నుంచి 700 రంగాపూర్ వెరైటీ బత్తాయి మొక్కలను తీసుకొచ్చి ఐదు ఎకరాల్లో నాటాడు. మొక్కలకు రూ.49వేలు, గుంతలు తీసి నాటినందుకు రూ.50వేలు ఖర్చు చేశాడు. మొక్కలు నాటినప్పటి నుంచి ఎకరానికి ఏడాదికి రూ.80వేల చొప్పున నిర్వహణ ఖర్చులయ్యాయి. అన్ని యాజమాన్య పద్ధతులు పాటించడంతోపాటు ఉద్యానవన అధికారుల సలహాలు, సూచనలు తీసుకున్నాడు. దిగుబడి ఎకరానికి 8 నుంచి 10 టన్నుల వరకు దిగుబడి రావాల్సి ఉంది. కానీ రెండు నుంచి రెండున్నర టన్నుల వరకు దిగుబడి వస్తోంది. గతనెల 27న తిరుపతి వర్సిటీ నుంచి వచ్చిన ఈ బత్తాయి తోటను పరిశీలించారు. అనంతరం శాంపిల్స్ సేకరించారు. కానీ ఇప్పటి వరకు ఆ రైతు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు.



ఇతడు నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం జొన్నలగడ్డగూడెం గ్రామానికి చెందిన రైతు చిర్ర భూపాల్‌రెడ్డి. రంగాపూర్ బత్తాయి వెరైటీ అధిక దిగుబడులు, చీడపీడలనుంచి తట్టుకుంటుందని ఎనిమిది ఎకరాల్లో సాగుచేశాడు. ఆరున్నర సంవత్సరాలు గడిచినా నేటికి దిగుబడి రావడం లేదు. దీంతో మూడు ఎకరాల తోటను తొలగించాడు. ఇప్పటి వరకు రూ.30లక్షల వరకు పెట్టుబడి పెట్టాడు. కాయలు కాస్తున్నా, సైజురాక పసుపురంగులోకి మారి రాలిపోతున్నాయి.

నల్లగొండ రూరల్/గుర్రంపోడు/ తిప్పర్తి/నిడమనూరు: రంగాపూర్ వెరైటీ బత్తాయి మొక్కలతో రైతులు నిండా మునిగారు. పూత, కాత బాగానే ఉన్నా, కాయ సైజు పెరగలేదు. పైగా నిమ్మకాయల సైజులో ఉండగానే పసుపు రంగులోకి మారి రాలిపోయాయి. తిరుపతిలోని ఉద్యాన యూనివర్సిటీ నుంచి బత్తాయిలో రంగాపూర్ రకం మొక్కలు తీసుకొచ్చి సాగు చేసిన సుమారు 200 మంది రైతులు రూ.60 కోట్ల మేర నష్టపోయారు. దీంతో కొందరు రైతులు ఓ సంఘంగా ఏర్పడి ఉద్యాన కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. విచారణ చేసిన అధికారులు నివేదికను ఆశాఖకు పంపించారు.

శాస్త్రవేత్తల ప్రచారంతో..

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 2014 కంటే ముందు సాగుచేసిన జంబేరి మొక్కలు అతివృష్టి, అనావృష్టి, వాతావరణ పరిస్థితుల కారణంగా క్షీణిన్నాయి. అప్పట్లో జిల్లాలో పర్యటించిన ఉద్యాన శాస్త్రవేత్తలు పరిశోధనా కేంద్రాల్లో లభించే రంగాపూర్ వేరు మూలంపై అంటుగట్టిన సాత్‌గుడి రకం బత్తాయి మొక్కలు నాటుకోవాలని ప్రచారం చేశారు. దీంతో ఉమ్మడి రాష్ట్రంలో తిరుపతి, మహానంది, పెట్లూరు, రైల్వే కోడూరు, మల్లేపల్లి పరిశోధన కేంద్రాల్లోని అంటు మొక్కలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది.



రాలిన బత్తాయి కాయలు

2014 నుంచి..

తిరుపతిలోని ఉద్యాన యూనివర్సిటీ నుంచి నల్లగొండ జిల్లాకు చెందిన రైతులు రంగాపూర్ వెరైటీ బత్తాయి మొక్కలు తీసుకురావడం 2014లో మొదలైంది. సాధారణంగా ఐదునుంచి ఆరు సంవత్సరాలలోపు కాతకు వచ్చి దిగుబడి ఇస్తాయి. కానీ రంగాపూర్ వెరైటీ బత్తాయి మాత్రం కాపు వచ్చినా, కాయలు, రంగుమారి, రాలిపోవడంతో దిగుబడిపై ప్రభావం చూపింది. తాము నష్టపోవడానికి మొక్కల నాణ్యత లోపాలే కారణమని గుర్రంపోడు, నల్లగొండ, తిప్పర్తి, నిడమనూరు, కనగల్ మండలాల్లో సుమారు 400 ఎకరాల్లో ఈ రకం సాగు చేసిన సుమారు 70 మంది రైతులు నిర్ధారణకు వచ్చి ఈనెల 11న రాష్ట్ర ఉద్యాన కమిషనర్‌కు ఫిర్యాదు కూడా చేశారు. నాసిరకం మొక్కల విషయమై నాగాపూర్ శాస్త్రవేత్తలతో శాస్త్రీయ పరిశోధన చేయించాలని ఫిర్యాదు చేశారు. ఇదే విషయమై నల్లగొండ కలెక్టర్ ఉద్యాన అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ70 మంది రైతులు రూ.21కోట్ల మేర నష్టపోయారు. దీనిపై విచారణ చేసిన అధికారులు ఉద్యానశాఖకు నివేదిక సమర్పించారు. చాలామంది రైతులు ఇప్పటికే తోటలు తొలగించగా, బిల్లులు లేని కారణంగా ఫిర్యాదు చేయని వారి సంఖ్య ఎక్కువగానే ఉంది. ఎకరానికి రూ.6లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.



నిడమనూరు మండలం మారుపాకలో బత్తాయి తోట

మంచి సైజుకు రాకముందే రాలుతున్నాయి



తిరుపతి పరిశోధన కేంద్రం నుంచి 450 మొక్కలు తెచ్చి 2016లో నాలుగున్నర ఎకరాల్లో నాటాను. ఎనిమిదేళ్లయినా సరైన పూత, కాత రావడం లేదు. 45 నుంచి 50టన్నుల దిగుబడి రావాల్సి ఉండగా 20 టన్నులే వస్తోంది. కాయ సైజు లేకపోగా పక్వానికి రాకముందే రాలిపోతున్నాయి.
– కేసాని అనంతరెడ్డి, పిట్టలగూడెం రైతు

దిగుబడి బాగా వస్తుందని చెప్పి



దిగుబడి బాగా వస్తుందని చెప్పి మొక్కలు అంటగట్టారు. నాకున్న మూడున్నర ఎకరాల్లో 380 మొక్కల వరకు నాటాను. మొక్కకు రూ.75 నుంచి రూ.100 వరకు వ్యయం చేసి ఏపీ నుంచి మొక్కలు తెచ్చాను. ఇప్పుడు నాలుగో కాత తెంపాల్సి ఉంది. మొక్కలకు కాయలు అంతంత మాత్రంగానే ఉండడం, కాయ బలంగా రాకపోవడం వల్ల దిగుబడి తగ్గి అనుకున్న విధంగా పెట్టుబడులు రాలేదు.
– చిత్రం ప్రసాద్, మారుపాక రైతు

'ఎలక్ట్రిసిటీ రూల్స్' అమలులో ఇబ్బందులున్నాయి

● అభిప్రాయపడిన ఈఆర్సీల ఫోరం



సమావేశ అనంతరం గ్రూప్ ఫొటో దిగిన వివిధ రాష్ట్రాల ఈఆర్సీల చైర్మన్లు

సాక్షి, హైదరాబాద్: బొగ్గు, ఇతర వ్యయాల పెరుగుదలకు అనుగుణంగా విద్యుత్ చార్జీలను పెంచాలని ఆదేశిస్తూ కేంద్రం జారీ చేసిన ఎలక్ట్రిసిటీ రూల్స్–2022 అమలులో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఫోరం ఫర్ రెగ్యులేటర్స్ తేల్చి చెప్పింది. ఆడిట్ చేసిన డిస్కంల లెక్కలు సెప్టెంబర్‌లో అందుబాటులోకి వస్తాయని, జూన్ 30లోపే ఆ లెక్కలు లభిస్తేనే ఎలక్ట్రిసిటీ రూల్స్‌ను అమలు చేయడానికి ఆస్కారముంటుందని అభిప్రాయపడింది. దేశవ్యాప్తంగా ఉన్న విద్యుత్ నియంత్రణ మండలి(ఈఆర్సీ)ల ఫోరం సమావేశం సోమవారం నగరశివారులోని ఓ రిసార్టులో జరిగింది. తెలంగాణ ఈఆర్సీ చైర్మన్ టి.శ్రీరంగారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఈఆర్సీలు ఎదుర్కొంటున్న సవాళ్లపై విస్తృతంగా చర్చించారు. విద్యుత్ నష్టాలు అధికంగా ఉండే డివిజన్లతోపాటు వ్యాపార, వాణిజ్య వినియోగదారులకు 2023 నాటికి స్మార్ట్‌మీటర్లు బిగించాలని ఆదేశిస్తూ కేంద్రం జారీ చేసిన మార్గదర్శకాల్లో పరస్పర వైరుధ్యాలున్నాయని చర్చించారు. వివిధ అంశాలపై ఈ సమావేశంలో చర్చించి చేసిన తీర్మానాలను త్వరలో ఫోరం విడుదల చేయనుంది.

కిడ్నీ మార్పిడి చేయించడం లేదని..

భార్యను చంపి భర్త ఆత్మహత్య



లక్ష్మి



రాజేశం

సిరిసిల్లక్రైం: డయాలసిస్‌తో బాధపడుతున్న ఓ భర్త తన భార్యను క్షణికావేశంలో హత్యచేసి..ఆపై తను ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్నసిరిసిల్ల జిల్లాకేంద్రంలోని శాంతినగర్‌కు చెందిన దూస రాజేశం(62) రెండు కిడ్నీలు కొద్దినెలల క్రితం పాడయ్యాయి. దీంతో డయాలసిస్ చేయించుకుంటున్నాడు. తనకు కిడ్నీ మార్పిడి చేయించాలని కొన్నాళ్లుగా కుటుంబ సభ్యులతో గొడవ పడుతున్నాడు. కిడ్నీ దొరకగానే శస్త్రచికిత్స చేయిద్దామని, అప్పటి వరకు ఆగాలని కుటుంబసభ్యులు సముదాయించారు. ఈ క్రమంలోనే డయాలసిస్‌తో కాలం వెళ్లదీయలేనని మనస్తాపానికి గురైన రాజేశం ఆదివారం రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో తన భార్య లక్ష్మి(50)ని బలమైన ఆయుధంతో తలపై కొట్టి హత్య చేశాడు. అనంతరం ఇంట్లోని పైకప్పుకు తాడుతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాజేశం పవర్‌లూమ్స్ నడిపించేవాడని కుటుంబసభ్యులు తెలిపారు.

ఇంట్లో ఎవరూ లేకపోవడంతో..

రాజేశంకు ఇద్దరు కుమారులు. చిన్నకొడుకు విద్యాభ్యాసం కోసం హైదరాబాద్‌లో ఉండగా, పెద్ద కుమారుడు ఆదివారం తన అత్తగారింట్లో జరిగిన శుభకార్యానికి వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేరని గమనించిన రాజేశం తన భార్యను హత్య చేసి తను ఆత్మహత్యకు పాల్పడినట్టు కుమారుడు వేణు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

లంబాడీ గిరిజనులకు మంత్రి పదవి ఇవ్వాలి

● లంబాడీ సంఘాల జేఏసీ డిమాండ్

సాక్షి, న్యూఢిల్లీ: లంబాడీ గిరిజనులకు గిరిజన మంత్రి పదవి ఇవ్వాలని లంబాడీ సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. ఈమేరకు ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయం వద్ద సోమవారం ప్లకార్డులతో ఆందోళన నిర్వహించారు. తండాలు అభివృద్ధి చెందాలంటే గిరిజనులకే గిరిజన మంత్రి పదవి ఇవ్వాలని జేఏసీ ప్రెసిడెంట్ అశోక్ రాథోడ్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కేబినెట్‌లో లంబాడీ సామాజిక వర్గానికి చోటు లేకపోవడం దారుణమని విమర్శించారు. ఇప్పటికే పలుమార్లు రాష్ట్రంలోని కాంగ్రెస్ పెద్దల దృష్టికి ఈ విషయాన్ని తీసికెళ్లినా.. ఏ ఒక్కరూ స్పందించడం లేదన్నారు. కాంగ్రెస్‌లో ఏది జరగాలన్నా, ఏం చేయాలన్నా ఏఐసీసీ అనుమతి తప్పనిసరని తాము భావించామని అశోక్ చెప్పారు. అందుకే ఏఐసీసీ వద్ద రెండ్రోజులుగా నిరసన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. ఏఐసీసీ పెద్దలు దీనిపై దృష్టిసారించి సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలివ్వాలని కోరారు.

హైవే ఎక్కితే టోల్!

▶ మొదటి పేజీ తరువాయి

వచ్చే అవకాశం ఉంది. ఆ తర్వాత దశల వారీగా పూర్తిస్థాయిలో దీన్ని అమలు చేయనున్నారు.

సెన్సర్లు, ఫాస్టాగ్‌లకు చెల్లు

ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఫాస్టాగ్‌తో అనుసంధానమై టోల్ వసూలు చేస్తున్నారు. గతంలో మాన్యువల్‌గా వసూలు చేసేందుకు ఏర్పాటు చేసుకున్న టోల్ ప్లాజాలనే వినియోగించుకుంటున్నారు. అక్కడి సిబ్బందికి నిర్ధారిత రుసుము చెల్లించి రశీదు పొందే పద్ధతి తొలగించి, సెన్సార్లు ఫాస్టాగ్ స్టిక్కర్‌ను రీడ్ చేయటం ద్వారా ఖాతా నుంచి డబ్బులు తీసుకునే విధానాన్ని అమలు చేస్తున్నారు. ఈ ఫాస్టాగ్ ఖాతాను వాడకాన్ని బట్టి ఎప్పటికప్పుడు టాప్ అప్ చేసుకోవల్సి ఉంటుంది. కాగా దీనికి పూర్తి భిన్నంగా కొత్త విధానాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టంతో అనుసంధానమయ్యే కొత్త టోల్ వ్యవస్థను తీసుకొస్తోంది. టోల్ బూత్ అవసరం లేకుండా ఇది పనిచేస్తుంది. వాహనాలు టోల్ రోడ్ల మీద తిరిగిన దూరాన్ని ఉపగ్రహ సాయంతో గుర్తించి, ఆ మేరకు టోల్‌ను లెక్కిస్తుంది. ఆ వ్యవస్థతో అనుసంధానించిన ఖాతా నుంచి అంతమేర టోల్ రుసుము డిడక్ట్ అవుతుంది.

వాహనాల బారులు ఉండవు

గతంలో మాన్యువల్‌గా టోల్ వసూలు చేసినప్పుడు రద్దీ అధికంగా ఉండే సమయంలో టోల్ ప్లాజాల వద్ద వాహనాలు కిలోమీటర్ల మేర బారులు తీరాల్సి వచ్చేది. దీన్ని నివారించేందుకు కేంద్రం ఫాస్టాగ్ విధానాన్ని తెచ్చింది. వాహనం టోల్ బూత్‌లోకి ప్రవేశిస్తుండగానే సెన్సార్లు ఫాస్టాగ్‌ను రీడ్ చేసి టోల్‌ను డిడక్ట్ చేస్తాయి. ఈ పద్ధతిలో వాహనాల బారులు ఉండవని భావించారు. కానీ సెన్సార్లు సరిగా పనిచేయకపోవడం, ఇతరత్రా కారణాలతో రద్దీ సమయాల్లో ఇప్పటికీ టోల్ ప్లాజాల వద్ద వాహనాలు బారులు తీరుతూనే ఉన్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకునే గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టంను కేంద్రం తెరపైకి తెస్తోంది. ఈ పద్ధతిలో వాహనం ప్రయాణిస్తున్న సమయంలోనే క్షణాల్లో టోల్ లెక్కించడం, డబ్బులు డిడక్ట్ కావడం జరుగుతుంది. దీంతో పాటు అసలు టోల్‌బూత్‌లే ఉండకపోవడంతో ఎక్కడా వాహనాలు వేచి చూడాల్సిన పరిస్థితి రాదు.

ప్రభుత్వానికి 3 రెట్లు పెరగనున్న ఆదాయం

ప్రస్తుతం దేశవ్యాప్తంగా జాతీయ రహదారులపై రూ.40 వేల కోట్ల మేర టోల్ వసూలవుతోంది. ఈ ఆదాయం పెరగనుంది. ఇప్పటివరకు టోల్ గేట్లు వచ్చేలోపే దారి మళ్లి వెళ్లే వాహనాల వల్ల ఆదాయం రావటం లేదు. కొత్త విధానంతో టోల్ రోడ్డుపై వాహనాలు స్వల్ప నిడివిలో ప్రయాణించినా టోల్ వసూలు చేసే అవకాశం ఉండటంతో టోల్ ఆదాయం కనీసం మూడు రెట్లు పెరుగుతుందని అంచనా. పైగా టోల్ బూత్‌ల నిర్వహణ భారం ఉండదు.

ఇలా పనిచేస్తుంది..


టోల్ రోడ్లను శాటిలైట్లు గుర్తించేందుకు వీలుగా ఆయా మార్గాల్లో ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తారు. ఆ రోడ్లపై ప్రత్యేక కెమెరాలు కూడా ఉంటాయి. ఇవి ఉపగ్రహంతో అనుసంధానమై పనిచేస్తాయి. ఇక వాహనాల్లో ఆన్‌బోర్డ్ యూనిట్‌లను ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. ఇవి జీపీఎస్‌తో అనుసంధానమై పనిచేస్తాయి. ఇవన్నీ పరస్పరం సమన్వయం చేసుకుంటూ, వాహనం టోల్ రోడ్డు మీద ఎంత దూరం ప్రయాణించిందో కచ్చితంగా నిర్ధారిస్తాయి. వాహనదారు నిర్ధారించిన బ్యాంకు ఖాతాతో టోల్ వసూలు వ్యవస్థ అనుసంధానమై ఉంటుంది. ఏ ప్రాంతంలో టోల్ రోడ్డుపైకి వాహనం చేరింది, ఏ ప్రాంతంలో అది హైవే దిగిందీ అన్న విషయాన్ని క్షణాల్లో నమోదు చేసి టోల్‌ను నిర్ధారించి, సంబంధిత ఖాతా నుంచి వసూలు చేసుకుంటుంది. ఈ వ్యవస్థకు సంబంధించి ఇటీవలే కేంద్ర ప్రభుత్వం అంతర్జాతీయ స్థాయిలో ఆసక్తి వ్యక్తీకరణ నోటిఫికేషన్ జారీ చేసింది. మైసూరు–బెంగళూరు ఎక్స్‌ప్రెస్ వే, హరియాణాలోని పానిపట్–హిస్సార్ జాతీయ రహదారులపై ప్రయోగాత్మకంగా దీన్ని పరిశీలిస్తోంది. మరో ఏడాదికాలంలో దేశవ్యాప్తంగా దీన్ని ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. కానీ దీనికి మరింత సమయం పట్టే అవకాశం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు.

14 నుంచి వైద్య కోర్సులకు కౌన్సెలింగ్

సాక్షి, హైదరాబాద్: వచ్చే నెల 14 నుంచి మెడికల్ అండర్ గ్రాడ్యుయేట్ (యూజీ) కోర్సుల కౌన్సెలింగ్ ప్రక్రియను ప్రారంభిస్తామని మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ (ఎంసీసీ) సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఇప్పటికే సవరించిన నీట్ ర్యాంకులను విడుదల చేశారు. ఒకటి రెండు రోజుల్లో రాష్ట్రస్థాయి ర్యాంకుల వివరాలను కూడా విడుదల చేయనున్నారు. తొలుత ఆలిండియా కోటా సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ వైద్య కళాశాలలు, విద్యాసంస్థల్లోని 15 శాతం సీట్లకు కౌన్సెలింగ్ ఉంటుంది. ఆలిండియా కోటా కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైన వారం తర్వాత.. ఎంబీబీఎస్ ప్రవేశాలకు కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం కౌన్సెలింగ్ నిర్వహించనుంది.

సహకరించినందుకు కృతజ్ఞతలు

● రాజ్‌భవన్‌లో సీపీ రాధాకృష్ణన్‌ను కలిసిన సీఎం



ఇన్‌చార్జ్ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌కు పుష్పగుచ్ఛం అందచేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఇన్‌చార్జ్ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం ఉదయం రాజ్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఇన్‌చార్జ్ గవర్నర్‌గా ప్రభుత్వానికి ఇంత కాలం సహకరించినందుకుగాను సీపీ రాధాకృష్ణన్‌కు సీఎం రేవంత్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ నూతన గవర్నర్‌గా జిష్ణుదేవ్ వర్మను, సీపీ రాధాకృష్ణన్‌ను మహారాష్ట్ర గవర్నర్‌గా కేంద్రం నియమించిన విషయం తెలిసిందే. మరోవైపు పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొంటున్న తెలంగాణ అథ్లెట్లకు సీఎం రేవంత్ రెడ్డి సోమవారం ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. తొలిదశ క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న నిఖత్ జరీన్ (బాక్సింగ్), ఆకుల శ్రీజ (టేబుల్ టెన్నిస్), పి.వి.సింధు (బ్యాడ్మింటన్)లతో మాట్లాడిన సీఎం రేవంత్ వారిని అభినందించారు. తన ఈవెంట్ కోసం సిద్ధమవుతున్న ఇషా సింగ్ (షూటింగ్)తో మాట్లాడి శుభాకాంక్షలు తెలిపారు.

వికారాబాద్–కృష్ణా రైల్వే లైన్‌పై సీఎం ఆరా

వికారాబాద్, పరిగి, కొడంగల్, నారాయణపేట, మక్తల్ మీదుగా కృష్ణా వరకు వికారాబాద్–కృష్ణా రైల్వే లైన్ ఏర్పాటుపై సీఎం రేవంత్‌రెడ్డి ఆరా తీశారు. ఈ లైన్ నిర్మాణ పనుల గురించి చర్చించేందుకు సోమవారం అసెంబ్లీలోని తన కార్యాలయంలో రైల్వే అధికారులతో భేటీ అయ్యారు. సమావేశంలో ఎమ్మెల్యేలు టి.రామ్మోహన్‌రెడ్డి (వికారాబాద్), వాకిటి శ్రీహరి (మక్తల్), పర్ణికారెడ్డి (నారాయణపేట)లు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైల్వే చీఫ్ ఇంజనీర్ సుబ్రహ్మణ్యన్ రూట్ మ్యాప్‌ను వివరించారు. రూ.3500 కోట్లతో 145 కిలోమీటర్ల లైన్ ఏర్పాటుపై సీఎం రేవంత్‌రెడ్డి పలు సూచనలు చేశారు.

రాజ్‌భవన్‌లో బోనాలు



బోనమెత్తిన మహిళలకు స్వాగతం పలుకుతున్న ఇన్‌చార్జ్ గవర్నర్ రాధాకృష్ణన్

సాక్షి, హైదరాబాద్: రాజ్‌భవన్ ఆలయంలో సోమవారం బోనాల వేడుకల్లో ఇన్‌చార్జ్ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ పాల్గొన్నారు. రాష్ట్ర శ్రేయస్సు, అభివృద్ధి, ప్రజా శ్రేయస్సు కోసం ఆయన మహంకాళీ అమ్మవారిని ప్రార్థించారు. గవర్నర్ ముఖ్యకార్యదర్శి బి.వెంకటేశం, ఇతర అధికారులు, రాజ్‌భవన్ పరివార్ సభ్యులతో గవర్నర్ బోనాలు వేడుక జరుపుకున్నారు. సీపీ రాధాకృష్ణన్ రాష్ట్ర గవర్నర్‌గా సోమవారం చివరిరోజు బాధ్యతలు నిర్వర్తించి తిరిగివెళ్లిపోయారు. ఈ సందర్భంగా రాజ్‌భవన్‌లో అధికారులు, ఉద్యోగులు వీడ్కోలు సమావేశం నిర్వహించి ఆయనను ఘనంగా సన్మానించారు.

డెంగీతో ఇద్దరు.. విషజ్వరంతో ఒకరు మృతి



సాయిసాత్విక్



నిఖిల్



జీవన్

కాల్వ శ్రీరాంపూర్ (పెద్దపల్లి)/చిన్నశంకరంపేట (మెదక్)/చెన్నారావుపేట: రాష్ట్రంలో 24 గంటల వ్యవధిలో డెంగీ వ్యాధి బారినపడి ఇద్దరు బాలురు మృతిచెందగా విషజ్వరం బారినపడి ఓ బాలుడు మృతిచెందాడు. మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం సూరారం గ్రామానికి చెందిన కుమ్మరి వెంకటేశం (టైలర్) కుమారుడు నిఖిల్ (17) హైదరాబాద్‌లోని ఓ కాలేజీలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నాడు. ఐదు రోజుల కిందట జ్వరంతో బాధపడుతూ స్వగ్రామానికి వెళ్లగా కుటుంబ సభ్యులు స్థానిక వైద్యుడి వద్దకు తీసుకెళ్లారు. రక్త పరీక్షల్లో డెంగీ పాజిటివ్‌గా తేలడంతో మెరుగైన వైద్యం కోసం ఆదివారం ఉదయం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మరణించాడు. మరోవైపు వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం బోడ మాణిక్యం తండాకు చెందిన జీవన్ (13) మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. నర్సంపేటలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లినా తగ్గకపోగా ఆదివారం పరిస్థితి విషమించింది. వెంటనే హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్య పరీక్షలు చేసిన డాక్టర్లు డెంగీగా నిర్ధారించారు. అయితే చికిత్స పొందుతూ జీవన్ సోమవారం మృతిచెందాడు. పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలం జాఫర్‌ఖాన్‌పేట గ్రామానికి చెందిన శనిగరపు సాయిసాత్విక్ (13) రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతుండటంతో కుటుంబ సభ్యులు ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆదివారం రాత్రి తొలుత పెద్దపల్లికి, అక్కడి నుంచి కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

బొగ్గు బ్లాక్‌ల ప్రైవేటీకరణ దేశానికి నష్టం: తమ్మినేని

● సింగరేణి పరిరక్షణ బస్సు యాత్ర ప్రారంభం



మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

బెల్లంపల్లి: బొగ్గు బ్లాక్‌ల ప్రైవేటీకరణ దేశానికి, ప్రత్యేకించి ప్రజలకు తీరని నష్టమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. సింగరేణి పరిరక్షణ కోసం సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు యాత్రను సోమవారం మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి కాంటా చౌరస్తాలో ఎర్రజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. దేశంలో ఉన్న బొగ్గు సంపద ను అదానీ, అంబానీ వంటి పెట్టుబడిదారులకు అప్పగించడానికి ప్రధాని నరేంద్ర మోదీ గత కొంతకాలంగా ప్రయత్నాలు చేస్తున్నారని తమ్మినేని ఆరోపించారు. అందులో భాగంగానే బొగ్గుబ్లాక్‌ల వేలం పాటలకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టగా.. కాంగ్రెస్ ప్రభుత్వం జత కట్టిందని ధ్వజమెత్తారు. సింగరేణిలో 900 కోట్ల టన్నుల తరగని బొగ్గు నిక్షేపాలు ఉన్నట్లు సర్వే చేసి తేల్చారని, ఆ నిక్షేపాలపై కన్నేసిన పెట్టుబడిదారులు ఎలాగైనా కాజేయడానికి ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొస్తున్నారని మండిపడ్డారు. సింగరేణిని కాపాడుకోవాలనే ఉద్దేశం సీఎం రేవంత్‌రెడ్డికి ఉంటే అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి జంతర్ మంతర్ వద్ద ధర్నా చేయాలని సవాల్ విసిరారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య, చుక్కా రాములు, భూపాల్, సాయిబాబు, పైళ్ల ఆశయ్య, నాగరాజ్‌గోపాల్, సంకె రవి, జి.ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ చక్రవ్యూహంలో దేశం



అంబానీ, అదానీలకే దోచిపెడుతోంది • లోక్‌సభలో రాహుల్ నిప్పులు

చక్రవ్యూహం వెనుక ఆరుగురు • ఛేదించి తీరతామని వ్యాఖ్య

న్యూఢిల్లీ: మోదీ సర్కారుపై విపక్ష నేత రాహుల్‌గాంధీ సోమవారం ముప్పేట దాడి చేశారు. ''దేశమంతటా తీవ్ర భయోత్పాత వాతావరణాన్ని నెలకొల్పారు. దేశంపై ప్రధాని మోదీ పెను సమస్యల చక్రవ్యూహం పన్నారు. అది దేశమంతటినీ సర్వనాశనం చేస్తోంది'' అంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. కేంద్ర బడ్జెట్‌పై లోక్‌సభలో చర్చలో మాట్లాడిన రాహుల్ మోదీపైనా, ఎన్డీఏ ప్రభుత్వ పాలనపైనా సునిశిత విమర్శలు చేశారు. ఘాటైన పదజాలంతో కూడిన పదునైన వ్యాఖ్యలు చేశారు. అధికార పక్ష సభ్యులు తీవ్రంగా ప్రతిఘటించినా, నిబంధనలు అనుమతించబోవంటూ స్పీకర్ ఓం బిర్లా పదేపదే వారిస్తున్నా వెనక్కు తగ్గలేదు. బడ్జెట్ కేవలం బడా వ్యాపారవేత్తలకు ప్రయోజనాలకు, సర్కారు రాజకీయ గుత్తాధిపత్యానికి కొమ్ము కాసేలా ఉదంటూ విమర్శించారు. ''ఈ మోదీ మార్కు సమస్యల చక్రవ్యూహాన్ని విపక్ష ఇండియా కూటమి ఛేదిస్తుంది. కనీస మద్దతు ధరకు చట్టబద్ధతకు, దేశవ్యాప్తంగా కులగణనకు సభ ఆమోదం లభించేలా చేసి తీరుతుంది'' అని ప్రకటించారు.

అభిమన్యుడిలా దేశం...

నేటి హరియాణాలోని కురుక్షేత్రలో వేల ఏళ్ల కింద జరిగిన యుద్ధంలో ఆరుగురు ఒక్కటై చక్రవ్యూహం పన్ని బాలుడైన అభిమన్యుణ్ని పొట్టన పెట్టుకున్నారంటూ మహాభారత గాథను రాహుల్ ఉటంకించారు. ''హింస, భయోద్వేగాలతో కూడిన చక్రవ్యూహమది. దాన్ని పద్మవ్యూహమని కూడా అంటారు'' అంటూ బీజేపీ ఎన్నికల గుర్తు కమలాన్ని పరోక్షంగా గుర్తు చేశారు. ''నేడు 21వ శతాబ్దంలో మన దేశంపై మోదీ ఓ నయా చక్రవ్యూహాన్ని పన్నారు. అభిమన్యునికి పట్టిన గతినే దేశానికి పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారు. దేశ యువతను, రైతులను, మహిళలను, చిన్న, మధ్యతరహా వ్యాపారులను సర్వనాశనం చేసేందుకు రాత్రింబవళ్లు ప్రయత్నిస్తున్నారు. ఆరుగురు వ్యక్తులు కేంద్ర స్థానంలో ఉండి చక్యవ్యూహాన్ని నియంత్రిస్తున్నారు. వాళ్లు మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, పారిశ్రామికవేత్తలు అంబానీ-అదానీ, జాతీయ భద్రతా సలహాదారు అజిత్‌దోవల్, ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్' అని చెప్పుకొచ్చారు. చివరి నలుగురూ సభలో లేనందున వారి పేర్ల ప్రస్తావనను అనుమతించబోనని స్పీకర్ స్పష్టం చేశారు. దాంతో అనంతరం ఆరుగురి పేర్లనూ రాహుల్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. రాహుల్ ప్రసంగం పొడవునా అధికార ఎన్డీఏ కూటమి సభ్యులంతా పెద్దపెట్టున నిరసనలకు దిగారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు జోక్యం చేసుకోబోయారు. కానీ రాహుల్ అందుకు అవకాశమివ్వలేదు. సభలో లేనివారి పేర్లు ప్రస్తావించొద్దని స్పీకర్ స్పష్టం చేయడంతో అంబానీ, అదానీలను తన ప్రసంగం పొడవునా ఏ1, ఏ2గా సంబోధించారు. ''ఏ1, ఏ2లను కాపాడేందుకు రిజిజు కూడా ప్రయత్నిస్తున్నారు. మీరిలా చేస్తే మాకే లాభం. వారిద్దరినీ ఇంకెంతగా కాపాడే ప్రయత్నం చేస్తారో చేయండి'' అంటూ ఎద్దేవా చేశారు.

చక్రవ్యూహం... మూడు శక్తులు

మోదీ చక్రవ్యూహం వెనక మూడు శక్తులున్నాయని రాహుల్ అన్నారు. ''మొదటిది గుత్తాధిపత్య ధోరణి. దేశ సంపదనంతా ఏ1, ఏ2 (అంబానీ, అదానీ) ఇద్దరికే మాత్రమే దోచిపెట్టే ప్రయత్నం. రెండోది సీబీఐ, ఈడీ, ఐటీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలు. వీటి సాయంతో విపక్షాలను అణగదొక్కే కుట్రలు. మూడోది అన్నింటినీ గుప్పెట్లో పెట్టుకుని ఆడిస్తున్న రాజకీయ, అధికారస్వామ్యం. మోదీ చక్రవ్యూహానికి గుండెకాయ వంటి ఈ శక్తులు దేశాన్ని నాశనం చేస్తున్నాయి'' అంటూ దుయ్యబట్టారు.

మధ్యతరగతికి వెన్నుపోటు

కేంద్ర బడ్జెట్‌లో మధ్యతరగతిని దారుణంగా వెన్నుపోటు పొడిచారని రాహుల్ ఆరోపించారు. ''మోదీకి కాస్తో కూస్తో మద్దతుగా నిలిచిన వర్గం మధ్యతరగతి. కొవిడ్ సమయంలో ఆయన మొబైల్ టార్చిలు వేయమంటే వేసింది. పళ్లాలు మోగించండంటే మోగించింది. అలాంటి వర్గంపై బడ్జెట్లో పెను భారం వేశారు. తద్వారా వారి వెన్నులోనూ, ఛాతీలోనూ కత్తులు దింపారు మోదీ'' అన్నారు. ''ఇదీ మా మంచికే. మధ్యతరగతి ఇక ఇండియా కూటమి వైపు మొగ్గుతుంది'' అని జోస్యం చెప్పారు. ''మోదీ చక్రవ్యూహపు దుష్ప్రభావాన్ని కేంద్ర బడ్జెట్ బలహీనపరుస్తుందని, యువత, రైతులు, కార్మికులు, చిరు వ్యాపారులను ఆదుకుంటుందని ఆశించా. కానీ వ్యాపార, రాజకీయ గుత్తాధిపత్యాలను కాపాడటమే ఏకైక లక్ష్యంగా బడ్జెట్ రూపొందింది. దేశంలోని టాప్ 500 కంపెనీల్లో యువతకు ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పిస్తారట! బడ్జెట్లో విత్త మంత్రి పేర్కొన్న ఈ పథకం హాస్యాస్పదంగా ఉంది. ఎందుకంటే 99 శాతం మంది యువతకు అది అందని ద్రాక్షే. నిరుద్యోగ చక్రవ్యూహం, పేపర్ లీకేజీ చక్రవ్యూహం, అగ్నివీర్ చక్రవ్యూహం... ఇలా విద్యార్థులు, యువత, సైన్యంతో పాటు ఏ రంగాన్నీ వదలకుండా సమస్యల సుడిగుండంలో ముంచెత్తారు'' అంటూ మండిపడ్డారు. ''మీరు సృష్టించిన అన్ని చక్రవ్యూహాలనూ మేం ఛేదించేస్తాం. దేశవ్యాప్త కులగణనే అందుకు సరైన అస్త్రం'' అన్నారు. ''దేశ యువత, వెనకబడ్డ వర్గాలు అభిమన్యులని ఈ చక్రవ్యూహ సృష్టికర్తలు అపోహ పడుతున్నారు. కానీ నిజానికి వాళ్లంతా ఆ వ్యూహాన్ని ఛేదించే అర్జునులు'' అని హెచ్చరించారు. అగ్నివీర్ వంటి సున్నితమైన పథకంపై విమర్శలు సరికావంటూ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అభ్యంతరం వెలిబుచ్చారు.

మాది శివుని ఊరేగింపు

ఇండియా కూటమిని శివుని పెళ్లి ఊరేగింపుతో రాహుల్ పోల్చారు. ''అందులో ఎవరైనా పాల్గొనవచ్చు. మోదీ చక్రవ్యూహం కేవలం ఆరుగురికే పరిమితం. ఆ చక్రవ్యూహానికి, శివుని ఊరేగింపుకు పోరాటమిది'' అన్నారు.

'హల్వా' ఫొటోపై విసుర్లు



ప్రసంగం సందర్భంగా లోక్‌సభలో రాహుల్ ప్రదర్శించిన బడ్జెట్ హల్వా ఫొటో కలకలానికి దారి తీసింది. బడ్జెట్ ముద్రణకు ముందు దాని తయారీ ప్రక్రియలో పాల్గొన్న ఆర్థిక శాఖ ఉన్నతాధికారులతో కలిసి కేంద్ర ఆర్థిక మంత్రి హల్వా తయారు చేయడం రివాజు. అలా ఈసారి నిర్మలా సీతారామన్ బృందం బడ్జెట్ హల్వా తయారు చేస్తున్న ఫొటోను చూపిస్తూ, ''ఇందులో కన్పిస్తున్న 20 మంది అధికారుల్లో దళితులు, ఆదివాసీలు ఒక్కరు కూడా లేరు. మైనారిటీ, ఓబీసీ వర్గాల నుంచి ఒక్కొక్కరు మాత్రమే ఉన్నారు'' అంటూ రాహుల్ ఆక్షేపించారు. రాహుల్ ఆ ఫొటోను ప్రదర్శిస్తున్న సమయంలో నిర్మల రెండు చేతుల్లో ముఖం దాచుకుంటూ కన్పించారు.



కేజ్రీవాల్ బెయిల్‌పై తీర్పు రిజర్వు

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో సీఎం కేజ్రీవాల్ పెట్టుకున్న బెయిల్ పిటిషన్‌పై తీర్పును హైకోర్టు రిజర్వులో ఉంచింది. సోమవారం కేజ్రీవాల్, సీబీఐ తరఫు లాయర్లు తమ వాదనలు వినిపించారు. 'ఎక్సైజ్ కుంభకోణం ప్రధాన సూత్రధారి కేజ్రీవాల్. ఆయన్ను విడుదల చేస్తే సాక్ష్యాలను ప్రభావితం చేస్తారు. ఆయన అరెస్టయితేనే ఈ కేసు విచారణ ముగింపునకు వస్తుంది. నెలలోగా చార్జిషీటు వేస్తాం' అని సీబీఐ లాయర్ డీపీ సింగ్ తెలిపారు. కేజ్రీవాల్‌ను జైలు నుంచి బయటకు రాకుండా చేసేందుకే సీబీఐ అధికారులు అరెస్ట్ చేశారని ఆయన తరఫు సీనియర్ లాయర్ అభిషేక్ మను సింఘ్వి వాదించారు. ఊహాకల్పనలతోనే కేజ్రీవాల్‌కు అరెస్ట్ చేశారే తప్ప, ఆయనకు వ్యతిరేకంగా ప్రత్యక్షంగా ఎటువంటి ఆధారాలు లేవన్నారు. వాదనలు విన్న అనంతరం జస్టిస్ నీనా బన్సల్ కృష్ణ తీర్పును రిజర్వులో ఉంచుతూ ఆదేశాలిచ్చారు.

ఆఖరి చార్జిషీటు

అంతకుముందు, సీబీఐ అధికారులు మద్యం కుంభకోణం కేసులో ఆఖరి చార్జిషీటును రౌజ్ అవెన్యూ కోర్టులో దాఖలు చేశారు. ఇందులో సీఎం కేజ్రీవాల్, ఆప్ ఎమ్మెల్యే దుర్గేశ్ పాఠక్‌తోపాటు అరబిందో ఫార్మా డైరెక్టర్ పి.శరత్ చంద్రారెడ్డి, బడ్డీ రిటైల్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ అమిత్ అరోరా, హవాలా ఆపరేటర్ వినోద్ చౌహాన్, వ్యాపారవేత్త ఆశిష్ మాథుర్ పేర్లున్నాయి.

గొలుసుతో చెట్టుకు కట్టేసి




మహిళను రక్షిస్తున్న పోలీసు అధికారి. (ఇన్‌సెట్లో) ఆస్పత్రిలో బాధితురాలు

- మహారాష్ట్ర అడవుల్లో 40 రోజులు నిరాహారంగా
- రక్షించిన మహారాష్ట్ర పోలీసులు
- 40 రోజులుగా ఆహారం లేక చిక్కిశల్యమైన శరీరం
- తమిళనాడులో ఉంటున్న యూఎస్ మహిళగా గుర్తింపు
- ఆస్పత్రికి తరలింపు

ముంబై: మహారాష్ట్రలోని సింధుదుర్గ్ అడవుల్లో ఇనుప గొలుసుతో చెట్టుకు కట్టేసి ఉన్న ఓ మహిళ కనిపించింది. రోజులుగా ఆహారం లేక ఆమె శరీరం చిక్కి శల్యమైపోయింది. పశువుల కాపరి నుంచి సమాచారం అందుకున్న పోలీసులు ఆమెను ఆస్పత్రికి తరలించారు. మహిళ దగ్గర దొరికిన యూఎస్ పాస్‌పోర్ట్, ఆధార్, ఇతర డాక్యుమెంట్ల ఆధారంగా లలిత కాయి కుమార్ ఎస్‌గా గుర్తించారు. వివరాల్లోకి వెళ్తే.. సింధుదుర్గ్‌లో సోనుర్లి గ్రామానికి చెందిన ఓ పశువుల కాపరి శనివారం సమీపంలోని అడవులకు వెళ్లాడు. అక్కడ అతనికి మనిషి మూలుగు వినిపించింది. దగ్గరకు వెళ్లి చూడగా ఓ మహిళ కాలికి ఇనుప గొలుసులతో చెట్టుకు కట్టేసి ఉంది. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఆమెను సావంత్‌వాడీ ఆరోగ్యకేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం గోవా మెడికల్ కాలేజీకి తరలించారు. మహిళ దగ్గర యూఎస్ పాస్‌పోర్ట్, తమిళనాడు అడ్రస్‌తో ఆధార్ ఉందని, పదేళ్లుగా ఆమె తమిళనాడులో ఉంటోందని పోలీసులు తెలిపారు. కొన్ని రోజులుగా ఆహారం లేకపోవడంతో ఆమె మాట్లాడలేని స్థితిలో ఉందన్నారు. మానసిక సమస్యలతో బాధపడుతున్న మహిళను.. ఇంట్లో గొడవల కారణంగా భర్తే.. 40 రోజుల కిందట అడవిలో వదిలేసి వెళ్లినట్లుగా ఆస్పత్రిలో ఆమె రాసిన వివరాల ఆధారంగా తెలుస్తోందని పోలీసులు వెల్లడించారు. ఆమె వీసా గడువు కూడా ముగిసిందని, విదేశీయుల స్థానిక నమోదు కేంద్రంతో సంప్రదింపులు జరుపుతున్నామని చెప్పారు. మరోవైపు ఆమె భర్త, బంధువుల గురించి విచారించేందుకు కొన్ని బృందాలు తమిళనాడు, గోవా, ఇతర ప్రాంతాలకు వెళ్లాయన్నారు.

రష్యా యుద్ధక్షేత్రంలో మరో భారతీయుడు మృతి

చండీగఢ్: ఉక్రెయిన్-రష్యా యుద్ధంలో మరో భారతీయుడు బలయ్యారు. రవాణా విధులకని తీసుకున్న రష్యా యుద్ధంలోకి పంపి తన సోదరుడిని పొట్టనబెట్టుకుందని హరియాణాకు చెందిన అజయ్ మౌన్ అనే వ్యక్తి సోమవారం ప్రకటించారు. బాధితుడు రవి మౌన్ జనవరి 13న రష్యా వెళ్లారు. కంద కాలు తవ్వడంలో శిక్షణ ఇప్పించి నేరుగా యుద్ధక్షేత్రంలోకి పంపారని అజయ్ ఆరోపించారు. రవిని రష్యాకు పంపేందుకు ఎకరం భూమి అమ్మడంతోపాటు రూ.11.50 లక్షలు ఖర్చుపెట్టామని వాపోయారు. రవి మరణవార్తను మాస్కోలోని భారతీయ ఎంబసీ ధ్రువీకరించింది. యుద్ధంలో ఉన్న భారతీయులను వెనక్కి పంపేస్తామంటూ ప్రధాని మోదీ పర్యటన వేళ రష్యా ప్రకటించిన కొద్దిరోజులకే ఈ విషాదం వెలుగుచూడటం గమనార్హం. యుద్ధంలో పనిచేయడం రవికి సుతరామూ ఇష్టంలేదని, ఫోన్‌లో ముభావంగా మాట్లాడేవారని మార్చి 12వ తేదీ దాకా అతనితో టచ్‌లోనే ఉన్నామని సోదరుడు అజయ్ చెప్పారు. మృతదేహం గుర్తింపు కోసం డీఎన్‌ఏ నమూనాలను పంపాలని డిమాండ్ చేస్తున్నారని, అంత సొమ్ము తమ వద్ద లేదని, మృతదేహం రప్పించేందుకు భారత సర్కార్ సాయం చేయాలని ఆయన వేడుకున్నారు.



రవి మౌన్

విద్యార్థుల జలసమాధిపై ఉన్నతస్థాయి కమిటీ

ఆదేశించిన కేంద్ర హోంశాఖ

న్యూఢిల్లీ: ఢిల్లీలో కోచింగ్ సెంటర్‌లో విద్యార్థుల జలసమాధి ఘటనపై కేంద్ర ప్రభుత్వం అత్యున్నతస్థాయి దర్యాప్తునకు ఆదేశించింది. అదనపు కార్యదర్శి ఆధ్వర్యంలో దర్యాప్తు కమిటీని ఏర్పాటుచేస్తున్నట్లు కేంద్ర హోం శాఖ సోమవారం ప్రకటించింది. ఘటనకు కారణాలను తెల్సుకోవడంతోపాటు బాధ్యులెవరో తేల్చనుంది. ఘటనలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన చర్యలతోపాటు అవసరమైతే విధానపర నిర్ణయాల్లో చేపట్టాల్సిన మార్పులను కమిటీ సిఫార్సుచేయనుంది. గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ అదనపు కార్యదర్శి అధ్యక్షతన ఏర్పాటైన ఈ కమిటీలో ఢిల్లీ ప్రభుత్వ(హోంశాఖ) ముఖ్య కార్యదర్శి, ఢిల్లీ పోలీస్, ఫైర్ స్పెషల్ కమిషనర్ సభ్యులుగా ఉంటారు. హోం శాఖ సంయుక్త కార్యదర్శి ఈ కమిటీకి కన్వీనర్‌గా ఉంటారు. 30 రోజుల్లోపు ఈ కమిటీ తన నివేదికను సమర్పించనుందని హోం శాఖ అధికార ప్రతినిధి సోమవారం చెప్పారు

మరో ఐదుగురి అరెస్ట్

ఈ ఘటనలో బేస్‌మెంట్ యజమానుల పాటు మొత్తం ఐదుగురిని సోమవారం పోలీసులు అ రెస్ట్‌చేశారు. డ్రైనేజీలపై అక్రమ కట్టడాలను అధికారులు బుల్డోజర్లతో కూల్చేయడం మొదలెట్టారు.



20 బేస్‌మెంట్లకు సీలు

కోచింగ్ కేంద్రాలకు నిలయమైన పాత రాజేందర్ నగర్ ప్రాంతంలో సోమవారం అధికారులు అక్రమ కట్టడాలపై చర్యలకు ఉపక్రమించారు. అక్రమంగా నడుస్తున్న పలు కోచింగ్ సెంటర్లకు సంబంధించిన 20 బేస్‌మెంట్లకు సీల్‌వేశారు. అధిక కోచింగ్ సెంటర్లు ఉండే మరో ప్రాంతం ముఖర్జీ నగర్‌లోనూ ఆకస్మిక పర్యటనలు చేయించండి. అభ్యర్థులను శాంతింపజేయడానికి లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా సోమవారం అక్కడి చేరుకుని వారితో మాట్లాడారు. మృతుల కుటుంబాలకు తలో రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.

వెనిజులాలో... మళ్లీ పాత కథే!





అధ్యక్షుడు మదురో గెలిచినట్టు ఈసీ ప్రకటన	మేమే గెలిచాం, ఫలితాల్ని మార్చేశారు: విపక్షాల ఆరోపణ	బూత్‌లవారీగా ఫలితాల వెల్లడికి డిమాండ్, ఈసీ ససేమిరా

కారకాస్: వెనిజులా అధ్యక్ష ఎన్నికల్లో అంతా ఊహించిందే జరిగింది. అధ్యక్షుడు నికొలస్ మదురో వరుసగా మూడోసారి విజయం సాధించినట్టు ఆ దేశ ఎన్నికల సంఘం (సీఎన్‌ఈ) ప్రకటించింది. ఆదివారం జరిగిన దేశవ్యాప్త పోలింగ్ అనంతరం రాత్రి ఓట్ల లెక్కింపు చేపట్టారు. 80 శాతం ఓట్లను లెక్కించే సరికి మదురోకు విజయానికి అవసరమైన 51 శాతం ఓట్లు లభించినట్టు సీఎన్‌ఈ చీఫ్ ఎల్విస్ అమోరోసో అర్ధరాత్రి అనంతరం ప్రకటన విడుదల చేశారు. విపక్షాల ఉమ్మడి అభ్యర్థి ఎడ్మండో గొంజాలెజ్‌కు 44 శాతం ఓట్లొచ్చినట్టు వెల్లడించారు. దీనిపై విపక్షాలన్నీ తీవ్రంగా మండిపడ్డాయి. ఓట్ల లెక్కింపును ప్రహసనప్రాయంగా మార్చేసి ప్రజాస్వామ్యాన్ని మరోసారి మంటగలిపారని విపక్ష నేత మరియా కొరీనా మచాడో దుమ్మెత్తిపోశారు. ''మదురోను ఓడించేందుకు జనమంతా వెల్లువలా కదిలొచ్చి గొంజాలెజ్‌కు ఓటేశారు. ఆయన కనీసం మూడింట రెండొంతుల ఓట్లతో ఘనవిజయం సాధించారు. మా బూత్‌లవారీ విశ్లేషణలో కూడా అదే తేలింది. ఓటింగ్ సరళిని చూసిన మీదట ఓటమి ఖాయమని మదురోకు అర్థమైపోయింది. ఫలితాలను తారుమారు చేసేందుకు పథకం ప్రకారం విపక్ష కూటమి పర్యవేక్షకులను పోలింగ్ బూత్‌ల నుంచి తరిమేశారు. అనంతరం మదురో చేతిలో కీలుబొమ్మ అయిన సీఎన్‌ఈ చీఫ్ ఫలితాలను ఆయనకు అనుకూలంగా వక్రీకరించారు'' అంటూ ఆమె తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తక్షణం దేశవ్యాప్తంగా మొత్తం 30 వేల పోలింగ్ బూత్‌లవారీగా పోలైన ఓట్ల వివరాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. సీఎన్‌ఈ మాత్రం అందుకు సుముఖంగా లేదు. దీనికి తోడు పోలింగ్ ముగిశాక ఫలితాల వెల్లడిని నిర్ధారిత సమయం కంటే ఏకంగా ఆరు గంటలపాటు ఆలస్యం చేశారు. ఫలితాలను మదురోకు అనుకూలంగా మార్చేందుకే ఇలా చేశారని విపక్ష కూటమి దుయ్యబట్టింది. ఫలితాలను చట్టపరంగా సవాలు చేస్తామని ప్రకటించింది. మదురో మాత్రం విదేశీ శక్తులతో కలిసి కొందరు కుట్ర పన్ని ఈవీఎంలను హాక్ చేసేందుకు ప్రయత్నించారంటూ విపక్షాలపై ప్రత్యారోపణలకు దిగారు. శాంతి భద్రతలకు భంగం కలిగించజూస్తే ఏం చేయాలో పోలీసులు, సైన్యం చూసుకుంటాయని హెచ్చరించారు. వెనిజులాలో పాతికేళ్లుగా యునైటెడ్ సోషలిస్ట్ పార్టీ పాలనకు తెరదించేందుకు విపక్షాలన్నీ మచాడో సారథ్యంలో ఒక్కతాటిపైకి వచ్చి పోటీ చేశాయి.

ఫలితాలపై దేశాల పెదవి విరుపు

వెనిజులా ఎన్నికల ఫలితాలు అస్సలు నమ్మశక్యంగా లేవని అమెరికా, చిలీ, ఉరుగ్వేతో పాటు చాలా దేశాలు పేర్కొన్నాయి. అవి ప్రజల మనోగతాన్ని, ఓటింగ్ సరళిని ప్రతిఫలించడం లేదని స్పష్టం చేశాయి. చిలీ అధ్యక్షుడు గేబ్రియెల్ బోరిక్, అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్‌తో పాటు బ్రిటన్ కూడా ఈ మేరకు ప్రకటన చేసింది.

వారం రోజుల స్పెషల్ లోక్ అదాలత్

వజ్రోత్సవాల సందర్భంగా సుప్రీంకోర్టు నిర్ణయం

సామరస్యంగా పరిష్కరిస్తే ఎనలేని తృప్తి: సీజేఐ



న్యూఢిల్లీ: వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించడానికి, తద్వారా పెండింగ్ భారాన్ని తగ్గించుకునేందుకు సుప్రీంకోర్టు సోమవారం ప్రత్యేక లోక్ అదాలత్‌ను ప్రారంభించింది. ఇందులో భాగంగా సుప్రీంకోర్టులోని మొదటి ఏడు ధర్మాసనాలు మధ్యాహ్నం 2 గంటలకు కేసులను విచారిస్తాయి. సుప్రీంకోర్టు వజ్రోత్సవాల సంబరాల సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ వెల్లడించారు. ప్రత్యేక లోక్ అదాలత్ వారం పాటు కొనసాగుతుందని తెలిపారు. సుప్రీంకోర్టులో కేసులు పెండింగ్‌లో ఉన్న కక్షిదారులు, లాయర్లు దీన్ని వినియోగించుకోవాలని కోరారు. వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవడంలో కక్షిదారులకు సాయపడితే కలిగే తృప్తి వెల కట్టలేనిదని ఆయన అభిప్రాయపడ్డారు. సమస్యల పరిష్కారంలో లోక్ అదాలత్‌ల ప్రాధాన్యతకు సంబంధించి స్వీయానుభవాన్ని ఉదాహరించారు. ''నా ముందుకు ఒక విడాకుల కేసు వచ్చింది. భార్య నుంచి విడాకులు కోరుతూ భర్త కింది కోర్టుకు వెళ్లాడు. అతడి నుంచి పరిహారం, పాప సంరక్షణ హక్కులు కోరుతూ భార్య కూడా కోర్టుకెక్కింది. వారితో సామరస్యపూర్వకంగా మాట్లాడిన మీదట మనసు మార్చుకున్నారు. కలిసుండేందుకు ఒప్పుకున్నారు. వైవాహిక జీవితాన్ని ఆనందంగా కొనసాగిస్తామని చెబుతూ కేసులు వెనక్కు తీసుకున్నారు'' అని వివరించారు. ఇలా లోక్ అదాలత్‌లు ఏర్పాటు చేయడం సుప్రీంకోర్టు చరిత్రలో ఇదే తొలిసారి! పైగా సోమవారం జరిగిన విచారణల కవరేజీ కోసం మీడియాను కోర్టు రూముల లోపలికి అనుమతించడం విశేషం.

538 నియోజకవర్గాల ఓట్లలో తేడా: ఏడీఆర్



న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో ఏకంగా 538 నియోజకవర్గాల్లో పోలైన ఓట్లు, లెక్కించిన ఓట్ల మధ్య వ్యత్యాసం ఉందని అసోసియేషన్ ఫర్ డెమొక్రాటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) సోమవారం తెలిపింది. 362 నియోజకవర్గాల్లో పోలైన ఓట్ల కంటే.. లెక్కించిన ఓట్లు తక్కువగా ఉన్నాయని వెల్లడించింది. ఈ 362 నియోజకవర్గాల్లో పోలైన ఓట్ల కంటే.. లెక్కించిన ఓట్లు 5,54,596 తక్కువగా ఉన్నాయని వివరించింది. అలాగే 176 నియోజకవర్గాల్లో పోలైన ఓట్ల కంటే.. లెక్కించిన ఓట్లు 35,093 అదనంగా ఉన్నాయని తెలిపింది. దీనిపై ఎన్నికల కమిషన్ ఇంకా స్పందించలేదు.


సుప్రీంలో నితీశ్ సర్కార్‌కు చుక్కెదురు

బిహార్‌లో రిజర్వేషన్ల పెంపుపై హైకోర్టు స్టేను ఎత్తేయలేమన్న సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ: సర్వోన్నత న్యాయస్థానంలో బిహార్ ప్రభుత్వానికి చుక్కెదురైంది. దళితులు, గిరిజనులు, వెనకబడిన వర్గాలకు రిజర్వేషన్లు 65 శాతానికి పెంచుతూ నితీశ్ ప్రభుత్వం తెచ్చిన రిజర్వేషన్ల సవరణ చట్టం అమలును నిలుపుదల చేస్తూ పట్నా హైకోర్టు ఇచ్చిన స్టేను తొలగించబోమని సుప్రీంకోర్టు సోమవారం స్పష్టంచేసింది. తీర్పును వ్యతిరేకిస్తూ తాజాగా దాఖలైన 10 పిటిషన్లను సెప్టెంబర్‌లో విచారిస్తామని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ ధర్మాసనం పేర్కొంది.

మేధా పాట్కర్ శిక్ష నిలిపివేత



న్యూఢిల్లీ: 'నర్మదా బచావో ఆందోళన్'సారథి, పర్యావరణ ఉద్యమకారిణి మేధా పాట్కర్‌కు ఊరట లభించింది. ప్రస్తుత ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా గతంలో 'కౌన్సిల్ ఫర్ సివిల్ లిబర్టీస్'అనే ఎన్జీవోను నడిపే సమయంలో 23 ఏళ్ల క్రితం వేసిన పరువునష్టం కేసులో ఢిల్లీ కోర్టు ఆమెకు విధించిన ఐదు నెలల జైలు శిక్షను కొట్టివేసింది. మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ రాఘవ్ శర్మ ఈ మేరకు సోమవారం తీర్పు వెలువరిస్తూ వీకే సక్సేనాకు నోటీసు జారీ చేశారు. ఈ నోటీసుపై కేసు తదుపరి విచారణ జరిగే సెప్టెంబర్ 4వ తేదీలోగా సమాధానమిస్తామని ఆయన తరఫు లాయర్‌గజేందర్ కుమార్ చెప్పారు.

హేమంత్ బెయిల్ రద్దుకు సుప్రీం నో



న్యూఢిల్లీ: జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌కు ఊరట లభించింది. ఆయన బెయిల్ రద్దు చేయాలంటూ ఈడీ వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం కొట్టివేసింది. సోరెన్‌కు బెయిల్ మంజూరు చేస్తూ జార్ఖండ్ హైకోర్టు జూన్ 28న వెలువరించిన తీర్పు 'చాలా సహేతుక'మని పేర్కొంది. ఇంప్లీడ్ ఆర్డర్‌లో తాము జోక్యం చేసుకోబోమని, లేదంటే ఈడీ కష్టాల్లో పడే అవకాశం ఉందని వ్యాఖ్యానించింది.

ఏఎన్‌సీ నుంచి జుమా బహిష్కరణ



జొహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికా మాజీ అధ్యక్షుడు జాకబ్ జుమా అధికార ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్(ఏఎన్‌సీ) నుంచి బహిష్కరణకు గురయ్యారు. సొంతంగా ఎంకే అనే పార్టీ ఏర్పాటు చేసుకుని ఇటీవలి ఎన్నికల్లో ఆయన పోటీకి దిగారు. ఈ ఎన్నికల్లో ఏఎన్‌సీ ఓట్లను భారీగా చీల్చిన ఎంకే పార్టీ ఏకంగా 15 శాతం ఓట్లతో దేశంలోనే మూడో అతి పెద్ద పార్టీగా అవతరించడం తెల్సిందే. 1994 తర్వాత మొట్టమొదటి ఏఎన్‌సీ సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేయలేని పరిస్థితుల్లో డెమొక్రటిక్ అలయెన్స్ వంటి పార్టీలతో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

ఫ్రాన్స్‌లో కమ్యూనికేషన్ లైన్ల ధ్వంసం



పారిస్: పారిస్‌లో ఒలింపిక్స్ ప్రారంభం రోజున శుక్రవారం రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగించిన గుర్తు తెలియని దుండగులు..ఈసారి టెలీకమ్యూనికేషన్ వ్యవస్థలను లక్ష్యంగా చేసుకున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న నగరాల్లో ఒలింపిక్స్ ఈవెంట్లు జరుగుతుండగా పలు ప్రాంతాల్లో ఎలక్ట్రిక్ కేబినెట్లలోని కేబుల్‌ను, సెల్‌ఫోన్, ల్యాండ్ లైన్లను దుండగులు ధ్వంసం చేసినట్లు ఫ్రాన్సు ప్రభుత్వం తెలిపింది. నష్టం తీవ్రత, ఒలింపిక్ కార్యక్రమాలపై ఏమేరకు ప్రభావం పడిందనే విషయాలను ప్రభుత్వం వెల్లడించలేదు. ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం వరకు స్థానికంగా టెలీకమ్యూనికేషన్ సేవలకు అంతరాయం కలిగినట్లు మాత్రమే సంబంధిత మంత్రిత్వ శాఖ వివరించింది. పారిస్ ఒలింపిక్స్ నిర్వాహకులు ఈ పరిణామంపై ఎటువంటి ప్రకటనా చేయలేదు.

కత్తిపోట్లకు ఇద్దరు చిన్నారులు బలి

ఆరుగురి పరిస్థితి విషమం.. బ్రిటన్లో ఘోరం



లండన్: బ్రిటన్‌లోని సౌత్‌పోర్ట్‌లో సోమవారం కత్తిపోట్ల ఘటన తీవ్ర కలకలం రేపింది. ఇద్దరు చిన్నారులు చనిపోగా 9 మంది గాయపడ్డారు. వారిలో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉంది. డ్యాన్స్ క్లాసులకు హాజరయ్యేందుకు వచ్చిన 6-11 ఏళ్ల చిన్నారులతో పాటు 13 మందిపై గుర్తు తెలియని వ్యక్తి కత్తితో దాడి చేశాడు. పోలీసులు ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతడి వద్ద కత్తిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఘటనపై ప్రధాని కెయిర్ స్టార్మర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

అసోం పీఎస్‌సీ మాజీ చైర్మన్‌కు 14 ఏళ్ల జైలు



గువాహటి: రాష్ట్రంలో వ్యవసాయ అభివృద్ధి అధికారుల(ఏడీవో) పోస్టుల భర్తీలో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలున్న అసోం పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ చైర్మన్ రాకేశ్ పాల్‌కు ప్రత్యేక కోర్టు 14 ఏళ్ల జైలు శిక్ష విధించింది. కమిషన్ మాజీ సభ్యులిద్దరికి పదేళ్ల చొప్పున, మరో 29 మందికి నాలుగేళ్ల చొప్పున కఠిన కారాగార జైలు శిక్షలు విధిస్తూ ప్రత్యేక కోర్టు జడ్జి దీపాంకర్ ఠాకూరియా సోమవారం తీర్పు వెలువరించారు. డబ్బులిచ్చిన వారికే వ్యవసాయ అధికారుల ఎంపిక పరీక్షలో ఎక్కువ మార్కులు వేశారంటూ కేసు నమోదైంది.

జూరాల ప్రాజెక్టు వద్ద 43 గేట్ల ద్వారా దిగువకు పారుతున్న వరద నీరు



సాగర్ వైపు కృష్ణమ్మ...

- శ్రీశైలం ప్రాజెక్టులోకి 4.52 లక్షల క్యూసెక్కుల నీటి ప్రవాహం
- 879.3 అడుగుల్లో 184.70 టీఎంసీలకు చేరిన నిల్వ
- ప్రాజెక్టు మూడు గేట్లు ఎత్తి 76,056 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల
- కుడి, ఎడమ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ 61,810 క్యూసెక్కుల నీరు కూడా దిగువకే..
- దీంతో నాగార్జునసాగర్ ప్రాజెక్టులోకి గంటగంటకూ పెరుగుతోన్న వరద
- 512.6 అడుగులవద్ద 136.13 టీఎంసీల నిల్వ

సాక్షి, హైదరాబాద్/దోమలపెంట: నాగార్జునసాగర్ వైపు కృష్ణమ్మ బిరబిరా కదలిపోతోంది. శ్రీశైలం ప్రాజెక్టులోకి సోమవారం రాత్రి 7 గంటలకు 4,52,583 క్యూసెక్కుల నీరు చేరుతుండటంతో నీటినిల్వ 879.3 అడుగుల్లో 184.70 టీఎంసీలకు చేరుకుంది. ఎగువ నుంచి భారీ వరద వస్తుండటం.. నీటిమట్టం గరిష్టస్థాయికి చేరింది, దీంతో సాయంత్రం 4.30 గంటలకు శ్రీశైలం ప్రాజెక్టు మూడు గేట్లు 10 అడుగుల మేర పైకి ఎత్తగా, 76,056 క్యూసెక్కుల వరద కిందకు వెళ్లిపోతోంది. కుడి, ఎడమ గట్టు కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ మరో 61,810 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలేస్తున్నారు. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా 23 వేల క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా 1,600 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. శ్రీశైలం స్పిల్‌వే గేట్లు, విద్యుదుత్పత్తి చేస్తూ దిగువకు విడుదల చేస్తున్న ప్రవాహం నాగార్జునసాగర్ వైపు పరుగులు తీస్తోంది. నాగార్జునసాగర్‌లోకి సోమవారం సాయంత్రం 6 గంటలకు 54,772 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటినిల్వ 512.6 అడుగుల్లో 136.13 టీఎంసీలకు చేరుకుంది. సాగర్ గరిష్ట నీటిమట్టం 590 అడుగులు.. పూర్తి నిల్వసామర్థ్యం 312.05 టీఎంసీలు. సాగర్ నిండాలంటే ఇంకా 176 టీఎంసీలు అవసరం. ఎగువ నుంచి వరద ప్రవాహం ఇదే రీతిలో కొనసాగితే మరో ఆరేడు రోజుల్లో నాగార్జునసాగర్ నిండే అవకాశముంది. మహారాష్ట్ర, కర్ణాటకలలో పశ్చిమ కనుమల్లో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు కృష్ణా, దాని ఉపనదుల్లో వరద ప్రవాహం స్థిరంగా కొనసాగుతోంది. కృష్ణా ప్రధానపాయ నుంచి ఆల్మట్టి డ్యామ్‌లోకి 3 లక్షల క్యూసెక్కుల నీరు చేరుతుండగా అంతే స్థాయిలో దిగువకు వదిలేస్తున్నారు. నారాయణపూర్ డ్యామ్‌లోకి 2.90 లక్షల క్యూసెక్కుల నీరు చేరుతుండగా 2.70 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జూరాల ప్రాజెక్టులోకి 3.15 లక్షల క్యూసెక్కుల నీరు చేరుతుండగా 3.11 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఇక కృష్ణా ప్రధాన ఉపనది తుంగభద్రలో వరద ఉధృతి కొనసాగుతోంది. తుంగభద్ర డ్యామ్‌లోకి 1.31 లక్షల క్యూసెక్కుల నీరు చేరుతుండగా.. 1.06 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలేస్తున్నారు. తుంగభద్ర డ్యామ్ నుంచి దిగువకు విడుదల చేస్తున్న ప్రవాహంతో మంత్రాలయం వద్ద తుంగభద్ర నది ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. నీటిమట్టం 311 మీటర్లు(సముద్రమట్టానికి)గా కొనసాగుతుండటంతో మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగిస్తున్నారు. సుంకేశుల బ్యారేజ్‌లోకి 1.51 లక్షల క్యూసెక్కుల నీరు చేరుతుండగా.. కేసీ కెనాల్‌కు 1,504 క్యూసెక్కుల నీటిని వదులుతూ మిగులుగా ఉన్న 1.48 లక్షల క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. ఇటు సుంకేశుల నుంచి.. అటు జూరాల నుంచి వరద వస్తుండటంతో శ్రీశైలంలోకి చేరుతున్న ప్రవాహం గంట గంటకూ పెరుగుతోంది.

సాగర్‌లో విద్యుదుత్పాదన ప్రారంభం

నాగార్జునసాగర్ : శ్రీశైలం ప్రాజెక్టు నుంచి నీటిరాక మొదలు కావడంతో నాగార్జునసాగర్‌లోని ప్రధాన విద్యుదుత్పాదన కేంద్రంలో విద్యుదుత్పాదనను సోమవారం రాత్రి ప్రారంభించారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు దిగువన ఉన్న టెయిల్‌పాండ్ నీటిసామర్థ్యం 7 టీఎంసీలుకాగా.. ఒక టీఎంసీ నీటితో తెలంగాణ ప్రభుత్వం నిత్యం విద్యుదుత్పత్తి చేస్తున్నది. గత మే నెలలో ఆంధ్రా అధికారులు రాత్రికిరాత్రే టెయిల్‌పాండ్‌లో గల 7టీఎంసీలలో 4 టీఎంసీల నీటిని దిగువకు విడుదల చేశారు. దీంతో విద్యుదుత్పాదన నిలిచిపోయింది. మరోవైపు నాగార్జునసాగర్ జలాశయం అడుగంటడంతో దిగువన టెయిల్‌పాండ్‌కు నీటిని విడుదల చేసే పరిస్థితిలేక విద్యుదుత్పాదన చేయలేదు. సాగర్‌లో విద్యుదుత్పాదన ద్వారా 24 వేల క్యూసెక్కుల నీటిని టెయిల్‌పాండ్‌కు విడుదల చేస్తున్నారు.

సోమవారం సాయంత్రం 6 గంటలకు కృష్ణా ప్రధాన పాయలో ప్రాజెక్టుల్లోకి వరద ప్రవాహాలు ఇలా..

ప్రాజెక్టు పేరు	గరిష్ట మట్టం (అడుగుల్లో)	గరిష్ట నిల్వ (టీఎంసీల్లో)	ప్రస్తుత మట్టం (అడుగుల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)
ఆల్మట్టి	1,705	129.72	1691.27	71.01	3,00,000	3,00,000
నారాయణపూర్	1,615	37.64	1607.41	27.83	2,90,000	2,70,980
ఉజ్జయిని	1,630	117.64	1619.88	85.12	15,380	315
జూరాల	1,045	9.66	1042.13	7.91	3,15,000	3,11,575
తుంగభద్ర	1,633	105.79	1630.83	97.22	1,31,179	1,06,118
శ్రీశైలం	885	215.81	879.30	184.70	4,52,583	1,62,466
నాగార్జునసాగర్	590	312.05	512.6	136.13	54,772	6,744
పులిచింతల	175	45.77	103.48	1.09	386	50

భద్రాచలం వద్ద నిలకడగా ప్రవహిస్తున్న గోదావరి నది




శాంతిస్తున్న గోదావరి

- ప్రాణహిత, ఇంద్రావతి, శబరిలలో వరద తగ్గుముఖం
- దీంతో భద్రాచలం వద్ద 42.90 అడుగులకు తగ్గిన నీటిమట్టం..మొదటి ప్రమాద హెచ్చరిక ఉపసంహరణ

సాక్షి, హైదరాబాద్/భద్రాచలం: ప్రాణహిత, ఇంద్రావతి, శబరి తదితర ఉపనదులు, వాగులు, వంకల్లో వరద ప్రవాహం తగ్గుముఖం పట్టింది. దీంతో సోమవారం గోదావరినదిలో వరద ప్రవాహం క్రమేపీ తగ్గుతోంది. ఉగ్రరూపం దాల్చిన గోదావరి శాంతిస్తుండటంతో తీర, లోతట్టు ప్రాంతాల ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ(లక్ష్మీ) బ్యారేజీకి చేరుతున్న ప్రవాహం 5.12 లక్షల క్యూసెక్కులకు తగ్గింది. వచ్చిన వరదను వచ్చినట్టుగా మేడిగడ్డ బ్యారేజ్ నుంచి దిగువకు వదిలేస్తున్నారు. దానికి ఇంద్రావతి ప్రవాహం తోడవుతుండటంతో తుపాకులగూడెం(సమ్మక్క) బ్యారేజ్‌లోకి చేరుతున్న 8.56 లక్షల క్యూసెక్కుల ప్రవాహాన్ని దిగువకు విడుదల చేస్తున్నారు. దుమ్ముగూడెం (సీతమ్మసాగర్) బ్యారేజ్‌లోకి 9.52 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా అంతేస్థాయిలో దిగువకు వదిలేస్తున్నారు. ఎగువ నుంచి వస్తున్న వరద ఉధృతి తగ్గుతుండటంతో భద్రాచలం వద్ద సోమవారంరాత్రి 9 గంటలకు నీటిమట్టం 42.90 అడుగులకు చేరుకుంది. దీంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. భద్రాచలం నుంచి అన్ని వైపులకు రాకపోకలు పునఃప్రారంభమయ్యాయి. కాగా ముంపు కాలనీ వాసులను సోమవారం సైతం పునరావాస శిబిరాల్లోనే కొనసాగించారు. పోలవరం ప్రాజెక్టులోకి వస్తున్న ప్రవాహం 11.78 లక్షల క్యూసెక్కులకు తగ్గడంతో స్పిల్ ఎగువన నీటిమట్టం 33.46 మీటర్లకు తగ్గింది. ప్రాజెక్టు 48 గేట్లు ఎత్తి వచ్చిన వరదను దిగువకు వదిలేస్తున్నారు. ధవళేశ్వరం బ్యారేజ్‌లోకి 14,50,084 క్యూసెక్కులు చేరుతుండగా.. 14,42,384 క్యూసెక్కులను సముద్రంలోకి వదిలేస్తున్నారు.

ప్రధాని ఫోన్ చేసి త్రిపుర వెలుపల పనిచేయాలన్నారు



రేవంత్ ఫోన్ చేసి.. తెలంగాణకు స్వాగతం అని అన్నారు..

- తెలంగాణ గవర్నర్‌గా తన నియామకంపై జిష్ణు దేవ్ వర్మ
- మోదీ, సీఎం రేవంత్ ఫోన్ చేసే దాకా తనకు ఆ విషయం తెలియదని వ్యాఖ్య
- సీఎం రేవంత్‌తో సమన్వయం చేసుకొని పనిచేస్తానని ప్రకటన

అగర్తల: తెలంగాణ నూతన గవర్నర్‌గా తనను నియమించినట్లు ప్రధాని మోదీ, సీఎం రేవంత్‌రెడ్డి ఫోన్ చేసి చెప్పే దాకా తెలియదని బీజేపీ నేత, త్రిపుర మాజీ ఉప ముఖ్యమంత్రి జిష్ణుదేవ్ వర్మ తెలిపారు. 'ప్రధాని మోదీ శనివారం రాత్రి నాకు ఫోన్ చేశారు. త్రిపుర వెలుపల పనిచేయాల్సి ఉంటుందన్నారు. నాకు ఎలాంటి బాధ్యతలు అప్పగించినా నిర్వర్తించేందుకు సిద్ధంగా ఉన్నానని ప్రధానికి చెప్పా. ఆ కాసేపటికే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫోన్ చేసి తెలంగాణకు స్వాగతం అన్నారు. దీంతో నేను తెలంగాణ నూతన గవర్నర్‌గా ఆ రాష్ట్రానికి వెళ్లనున్నట్లు అప్పుడు అర్థమైంది'అని జిష్ణు దేవ్ వర్మ త్రిపురలో విలేకరులకు తెలిపారు. త్రిపుర నుంచి గవర్నర్‌గా నియమితులైన తొలి వ్యక్తి తానేనని చెప్పారు. తమ రాష్ట్రంపై ప్రధాని మోదీకి ఉన్న ఆపేక్షకు తన నియామకమే నిదర్శనమని పేర్కొన్నారు. 'గతంలో డిప్యూటీ సీఎంగా రాజకీయ పదవీ బాధ్యతలు నిర్వర్తించా. ఇప్పుడు నాకు అప్పగించిన రాజ్యాంగ బాధ్యతలను నెరవేరుస్తా. ముఖ్యమంత్రితో సమన్వయం చేసుకొని పనిచేస్తా. బుధవారం తెలంగాణకు చేరుకొని అదే రోజు గవర్నర్‌గా ప్రమాణస్వీకారం చేస్తా'అని జిష్ణు దేవ్ వర్మ వివరించారు. 2018 నుంచి 2023 దాకా త్రిపుర డిప్యూటీ సీఎంగా పనిచేసిన జిష్ణు దేవ్ వర్మ.. గతేడాది జరిగిన ఆ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో సెపాహిజాలా జిల్లాలోని చారిలామ్ నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆయన త్రిపుర మాజీ రాజవంశీకుల కుటుంబానికి చెందిన వారు.



సోమవారం శ్రీశైలంలో శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన న్యాయమూర్తి జస్టిస్ ఈవీ వేణుగోపాల్, కుటుంబసభ్యులు

జీఎస్టీ స్కామ్ సీఐడీకి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖలో వెలుగులోకి వచ్చిన రూ.1,000 కోట్ల జీఎస్టీ స్కామ్ కేసును సీఐడీకి బదలాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటి వరకు హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ పోలీసులు ఈ కేసును దర్యాప్తు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్, ఐజీఎస్టీ, సెస్ తదితరాలకు సంబంధించి చోటు చేసుకున్న ఈ గోల్‌మాల్‌లో ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్‌తో పాటు వాణిజ్య పన్నుల శాఖ అధికారులు నిందితులుగా ఉన్న విషయమూ విదితమే. వాణిజ్య పన్నుల శాఖ కోసం రూపొందించిన సాఫ్ట్‌వేర్‌ను ఐఐటీ–హైదరాబాద్ నిర్వహిస్తోంది. ఈ సంస్థ స్ప్యూటీ మాడ్యూల్‌లో పని చేస్తూ వాణిజ్య పన్నుల శాఖకు ఆయా సంస్థలు దాఖలు చేసే రిటర్న్స్‌ను పరిశీలించి లోటుపాట్లను గుర్తిస్తుంది. ఇందులో మార్పు చేయడం ద్వారా దాదాపు 75 సంస్థలకు అక్రమ లబ్ధి కూరేలా చేశారు. ఈ వ్యవహారం మొత్తం మాజీ చీఫ్ సెక్రటరీ సోమేశ్‌కుమార్ కనుసన్నల్లోనే జరిగినట్లు ఇప్పటికే గుర్తించారు. అయితే ఈ 75 సంస్థలు ఎవరివి? వాటికి, సోమేశ్‌కుమార్‌కు ఉన్న సంబంధం ఏమిటి? అనేది ప్రస్తుతం కీలకంగా మారిందని అంటున్నారు. ఈ స్కామ్ ద్వారా లబ్ధి పొందిన వాటిలో తెలంగాణ రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ కూడా ఉండటంపై సీసీఎస్ పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టారు.

రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం



- కుంభకోణంలో మొత్తం 75 సంస్థలు అక్రమ లబ్ధి పొందినట్లు గుర్తింపు.. ఇందులో రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ ఉండటంపై అనుమానాలు
- నిందితులుగా మాజీ సీఎస్ సోమేశ్ కుమార్, ఇతర అధికారులు
- త్వరలో వీరికి నోటీసులు!

వాణిజ్య అవసరాల నిమిత్తం సేవలు అందించే ప్రతి వ్యక్తి, సంస్థ జీఎస్టీ పరిధిలోకి వస్తారు. వీరు విధిగా ఆ విభాగంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలోనే వాణిజ్య సేవలు అందించే సంస్థలు తమ బిల్లులో వినియోగించిన, ఖరీదు చేసిన వస్తువు విలువకు అదనంగా ట్యాక్స్‌ను చేర్చి ఆ మొత్తాన్ని వినియోగదారుడి నుంచి వసూలు చేస్తాయి. ఏటా రిటర్న్స్ దాఖలు సమయంలో ఆయా సంస్థలు ఈ ట్యాక్స్‌ను సంబంధిత విభాగానికి చెల్లించాలి. ఈ పన్నుతో పాటు సెస్సు కూడా ఉంటుంది. మద్యం దుకాణాలకు మద్యం సరఫరా చేయడం ద్వారా బేవరేజెస్ కార్పొరేషన్ వాణిజ్య సర్వీసు చేస్తున్నట్లు లెక్క. దీంతో ఈ విభాగం సైతం కచ్చితంగా జీఎస్టీ చెల్లించాల్సిందే. అయితే గోల్‌మాల్‌కు పాల్పడినట్లు వెలుగులోకి రావడంతో ఈ వ్యవహారం వెనుక మరో స్కామ్ ఉందా? అనే కోణంలో పోలీసులు ఆరా తీయనున్నారు. వాణిజ్య పన్నుల శాఖ సాఫ్ట్‌వేర్‌ను పర్యవేక్షించడానికి ప్రత్యేక స్ప్యూటీ మాడ్యూల్‌ను రూపొందించిన ఐఐటీ–హైదరాబాద్..దీని నిర్వహణ కోసం ప్రత్యేకంగా ఎలాంటి సిబ్బందిని నియమించుకోలేదు. పిలాంటో టెక్నాలజీస్ సిబ్బందినే దీనికోసం వినియోగిస్తున్నారు. సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీ–హైదరాబాద్ ప్రాంగణం చిరునామాతో పని చేస్తున్న ఐఐటీ–హైదరాబాద్ పిలాంటో టెక్నాలజీస్ సంస్థ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ చేస్తుంటుంది. దీన్ని 2010 జనవరిలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శోభన్‌బాబు ఏర్పాటు చేశారని సీసీఎస్ పోలీసులు ఇప్పటికే గుర్తించారు.

మరో స్కామ్ ఉందా?

బిగ్ లీప్ నిర్వాకంతోనే వెలుగులోకి స్కామ్

దేశ వ్యాప్తంగా ఐదు మెట్రో నగరాల్లో కార్యకలాపాలు సాగిస్తున్న బిగ్ లీప్ టెక్నాలజీస్ అండ్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ హైదరాబాద్‌కు సంబంధించి సికింద్రాబాద్ కేంద్రంగా పని చేస్తోంది. ఇది ప్రస్తుతం మానవవనరుల సరఫరా రంగంలో ఉందని తేలింది. ఇది ఎగ్గొట్టిన రూ.25.51 కోట్ల వ్యవహారంతోనే ఈ స్కామ్ మొత్తం వెలుగులోకి వచ్చింది. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌తో పాటు ఐజీఎస్టీ, సెస్‌లను చెల్లించని కొన్ని సంస్థలు అక్రమ లబ్ధి పొందాయి. ఆయా సంస్థలకు లబ్ధి చేకూర్చడం కోసం వాణిజ్య పన్నుల శాఖ అధికారులు ఎస్‌వీ కాశీ విశ్వేశ్వరరావు, ఎ.శివరామ ప్రసాద్ వాటి పరిధులను మార్చి చూపించినట్లు గుర్తించారు. తమ పరిధిలోకి రానప్పటికీ... బోగస్ చిరునామాలతో తమ పరిధుల్లో రిజిస్ట్రేషన్లు చేయించారని తేల్చారు. ఈ కేసుకు సంబంధించి త్వరలో సోమేశ్‌కుమార్ సహా మరికొందరికి నోటీసులు జారీ చేయాలని నిర్ణయించారు.



తెలంగాణ ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రతిపాదన రాలేదు

- 'గ్రీన్‌ఇండియా'పై కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ అడిగిన ప్రశ్నకు కేంద్రం సమాధానం

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో నేషనల్‌మిషన్ ఫర్ ఏ గ్రీన్ ఇండియా పథకం అమలుకు సంబంధించి ఆ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎలాంటి ప్రతిపాదన రాలేదని కేంద్ర పర్యావరణశాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్‌సింగ్ తెలిపారు. 2015–16లో ప్రారంభమైన గ్రీన్ ఇండియా పథకం ద్వారా దేశంలో అటవీవిస్తీర్ణాన్ని రక్షించడం, పునరుద్ధరించడం, మెరుగుపరచడంతోపాటు అటవీయేతర ప్రాంతాల్లో పర్యావరణ పునరుద్ధరణ కార్యకలాపాలను చేపట్టామని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి లోక్‌సభలో బదులిచ్చారు. కాగా ఇప్పటివరకు ఈ పథకం ఏపీ సహా 17 రాష్ట్రాల్లో అమలు జరిగిందన్నారు.

వరంగల్, కరీంనగర్‌లలో రూ.2,125 కోట్లతో 88 ప్రాజెక్టులు పూర్తి

- రాజ్యసభలో కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ

సాక్షి, న్యూఢిల్లీ: స్మార్ట్ సిటీస్ మిషన్‌లో భాగంగా గ్రేటర్ వరంగల్, కరీంనగర్ నగరాల్లో ఇప్పటివరకు రూ.2,125 కోట్లతో 88 ప్రాజెక్టులు పూర్తయ్యాయని రాష్ట్ర ప్రభుత్వం సమాచారం అందించిందని కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాలశాఖ సహాయ మంత్రి తోఖాన్ సాహు తెలిపారు. స్మార్ట్ సిటీస్ మిషన్ ప్రకారం రాష్ట్రం మొత్తం 145 ప్రాజెక్టులకు రూ.2,725 కోట్లు తీసుకుందని కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కుమార్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి రాజ్యసభలో లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. తెలంగాణలోని రెండు నగరాలకు రూ.1,000 కోట్లు కేంద్రప్రభుత్వం నిధులు కేటాయించగా, సమాన మొత్తంలో రాష్ట్రం తమ వాటా అందించాలన్నారు. అయితే ఈ ఏడాది జూలై 12వ తేదీ నాటికి కేంద్ర, రాష్ట్ర వాటాలతో కలిపి స్మార్ట్ సిటీస్ మిషన్ కింద వరంగల్, కరీంనగర్ నగరాలు రూ.1,350 కోట్ల మొత్తాన్ని పొందాయని కేంద్రమంత్రి పేర్కొన్నారు. ఈ పథకం అమలును 2025 మార్చి 31 వరకు పొడిగించామన్నారు.

పంటకు మద్దతు ధరపై మొసలికన్నీరొద్దు

- సభలో రాహుల్ వ్యాఖ్యలపై కిషన్‌రెడ్డి ఖండన



సాక్షి, న్యూఢిల్లీ: పంటకు మద్దతు ధరపై మొసలికన్నీరు పెట్టొద్దని కాంగ్రెస్, రాహుల్ గాంధీలకు కేంద్ర బొగ్గు, గనుల శాఖమంత్రి జి.కిషన్‌రెడ్డి హితవు పలికారు. కనీస మద్దతు ధరపై పార్లమెంటులో రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను సోమవారం ఆయన ఒక ప్రకటనలో ఖండించారు. పార్లమెంటు సాక్షిగా 2013లో మీ సర్కారు ఏం చెప్పిందో మరిచారా? స్వామినాథన్ కమిటీ సిఫారసులు అమలు చేయలేమని సభలో చెప్పింది నిజం కాదా? పెట్టుబడిపై 50 శాతం కనీస మద్దతు ధర ఇస్తే.. మార్కెట్‌లో ఒడిదుడుకులు తప్పవని చెప్పారా.. లేదా? తెలంగాణలో కౌలు రైతులకు రూ.15 వేల ఆర్థిక సహాయం, వరికి రూ.500 బోనస్ ఏమయ్యాయి? అంటూ కిషన్‌రెడ్డి నిలదీశారు. పార్లమెంటు వేదికగా రైతు రాజకీయాలు చేయాలనే ప్రయత్నం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సింగరేణి ద్వారా 1832 మెగావాట్ల పునరుత్పాదక శక్తి

సింగరేణి ద్వారా పునరుత్పాదక శక్తి సామర్థ్యాన్ని 2030 నాటికి 1,832 మెగావాట్లకు పెంచనున్నట్లు కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ఈ ఏడాది మార్చి 31వ తేదీ నాటికి సింగరేణి పునరుత్పాదక శక్తి సామర్థ్యం 224 మెగావాట్లు ఉందని బీజేపీ ఎంపీ కె.లక్ష్మణ్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి రాజ్యసభలో సమాధానం ఇచ్చారు.

శ్రావణపల్లి బొగ్గు గనిని వేలం వేస్తాం

శ్రావణపల్లి బొగ్గు గనిని సింగరేణికి కేటాయించాలని.. అదే సమయంలో వేలం జాబితా నుంచి ఈ బొగ్గు గనిని తొలగించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కోరిందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. అయితే కేంద్ర బొగ్గుశాఖ నిబంధనల ప్రకారం బొగ్గు గనులను కచ్చితంగా వేలం వేస్తామని, ఈ వేలంలో సింగరేణి సంస్థను సైతం వేలంలో పాల్గొనాలని కోరామని కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి రాజ్యసభలో లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

తెలంగాణలో పీఎంకేవీవైలో శిక్షణపొందిన 1.12 లక్షల మందికి ఉపాధి

ప్రధాన్‌మంత్రి కౌశల్ వికాస్ యోజన పథకంలో భాగంగా తెలంగాణలో ఇప్పటి వరకు 4,44,530 మంది అభ్యర్థులకు శిక్షణ కల్పించామని.. అందులో 1,12,967 మందికి ఉపాధి లభించిందని కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి జయంత్‌చౌదరి తెలిపారు. బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

సివిల్స్ విద్యార్థుల విషాదంపై విచారణ జరపాలి

- రాజ్యసభలో బీఆర్‌ఎస్ ఎంపీ రవిచంద్ర



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీలో భారీ వరదలో చిక్కుకుని ముగ్గురు సివిల్స్ కోచింగ్ విద్యార్థుల మరణం లాంటి విషాద సంఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా జాగ్రత్తలు పాటించాలని.. ఈ ఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కోరారు. తెలంగాణలోని మంచిర్యాలకు చెందిన తాన్యా సోని, నవీన్ దల్విన్ (కేరళ), శ్రేయా యాదవ్ (ఉత్తరప్రదేశ్)లు సివిల్స్ కోసం ఢిల్లీలో శిక్షణ తీసుకుంటూ జలసమాధి కావడంపై ఆయన సంతాపం తెలిపారు. ఇలాంటి ప్రమాదాలు, తప్పిదాలు పునరావృతం కానివ్వకుండా అన్ని చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు.

తెలుగు రాష్ట్రాల్లో తక్కువ అడవులు

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో మొత్తం అటవీ విస్తీర్ణం 7.13 కోట్ల హెక్టార్లుగా ఉందని, 32.87 కోట్ల హెక్టార్ల భౌగోళిక విస్తీర్ణంలో ఇది 21.71 శాతమని కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ తెలిపారు. తెలంగాణలోని 1.12 కోట్ల హెక్టార్ల భౌగోళిక విస్తీర్ణంలో 21.21 లక్షల హెక్టార్ల (18.93 శాతం) మేర అడవులు ఉన్నాయని చెప్పారు. అదే ఏపీ 1.62 కోట్ల హెక్టార్ల భౌగోళిక విస్తీర్ణానికి గాను 29.78 లక్షల హెక్టార్లలో (18.28 శాతం) అటవీ ప్రాంతం ఉందని వివరించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ జాతీయ సగటు కన్నా సుమారు 3 శాతం మేర తక్కువ అటవీ విస్తీర్ణం ఉన్నట్లు తెలిపారు. సోమవారం లోక్‌సభలో మహారాష్ట్రకు చెందిన సభ్యుడొకరు అడిగిన ప్రశ్నలకు ఆయన జవాబిచ్చారు. అడవుల అభివృద్ధికి నేషనల్ అథారిటీ కింద ప్రస్తుత ఏడాదిలో తెలంగాణకు రూ.404.85 కోట్లు, ఏపీకి రూ.248.37 కోట్ల నిధులకు ఆమోదం తెలిపామని కేంద్రమంత్రి వెల్లడించారు. వన్యప్రాణుల ఆవాసాల అభివృద్ధి పథకం కింద 2020–21లో తెలంగాణకు రూ.36.59 కోట్లు విడుదల చేశామన్నారు. అలాగే నగర్ వన్ యోజన (ఎన్‌వీవై) కింద గడిచిన ఐదేళ్లలో తెలంగాణకు రూ.585.62 కోట్లు విడుదల చేసినట్లు చెప్పారు.

దామోదరం మినహా దళిత, గిరిజన, ఓబీసీలెవరూ సీఎం కాలేదు

బీజేపీ ఒక ఓబీసీని ప్రధాన మంత్రిని చేసింది

పార్లమెంటు తొలి ప్రసంగంలో కాంగ్రెస్‌పై బీజేపీ ఎంపీ ఈటల ధ్వజం



సాక్షి, న్యూఢిల్లీ: స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి తెలంగాణలో దామోదరం సంజీవయ్య మినహా దళిత, గిరిజన, ఓబీసీ సామాజిక వర్గాలకు చెందిన ఏ ఒక్కరూ ముఖ్యమంత్రి కాలేదని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన 77 ఏళ్లలో 50 ఏళ్లకుపైగా దేశాన్ని పాలించిన కాంగ్రెస్.. సామాజిక న్యాయం గురించి, దళితులు, రైతులు, నిరుద్యోగుల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ఎంపీగా ఎన్నికైన తర్వాత సోమవారం లోక్‌సభలో జమ్మూకశ్మీర్ బడ్జెట్ కేటాయింపులపై చర్చలో ఈటల రాజేందర్ తొలిసారి ప్రసంగించారు. బీజేపీ ఒక ఓబీసీని దేశ ప్రధాన మంత్రిని చేసిందని అన్నారు. అలాగే నాటి ప్రధాని వాయిపేయి అబ్దుల్ కలాంను, 2014లో మోదీ హయాంలో ఒక దళిత, ఆదివాసీ బిడ్డలను రాష్ట్రపతులుగా చేశారని గుర్తుచేశారు. గత ఎన్డీఏ ప్రభుత్వ మంత్రివర్గంలో 12 మంది దళితులు, 8 మంది ఎస్టీలు, 27 మంది ఓబీసీలు మంత్రులుగా ఉన్నారని ఈటల గుర్తుచేశారు. ఎస్సీలు, ఎస్టీలు, ఓబీసీల గురించి ఆలోచించే ఏకైక పార్టీ బీజేపీయేనన్నారు.

సాక్షి హైదరాబాద్

మంగళవారం । 30 । జూలై । 2024



డ్రగ్స్ కేరాఫ్ గసగసాలు!

దేశంలో మాదకద్రవ్యమైన గంజాయి సాగు పైనే కాదు..మసాలా దినుసు గసగసాల సాగు పైనా నిషేధం ఉందని తెలుసా..? దీనికి కారణం ఏమిటంటే..డ్రగ్స్ తయారీకి ఇవే మూలం కావడమే. -10లో



పనులకు.. కదలిక!

జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సంబంధించి ఇప్పటి వరకు సందిగ్ధంగా ఉన్న అధికారుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. హైసిటీ నిధులు ఊతమిస్తున్నాయి. -12లో

గరిష్ఠం/కనిష్ఠం
31.0/24.0

వాతావరణం

నగర పరిధిలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలిక పాటి వర్షం లేదా చినుకులు పడే అవకాశం ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో ఉపరితల గాలులు గంటకు 20 నుంచి 30 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశాలు ఉన్నాయి.



ఊరేగింపుగా వస్తున్న ఘటాలు

ఘటం.. ఘనం





ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాల సందర్భంగా పాతబస్తీలో సోమవారం నిర్వహించిన శ్రీ మాతేశ్వరీ ఘటాల ఊరేగింపు అంగరంగ వైభవంగా కొనసాగింది. మధ్యాహ్నం నుంచే చార్మినార్‌కు జనం పోటెత్తారు. వేలాది మంది తరలివచ్చి అమ్మవారి ఘటాలకు ఘనస్వాగతం పలికారు. పాతబస్తీలోని అన్ని ప్రధాన దేవాలయాలకు చెందిన అమ్మవారి ఘటాలు ఈ ఊరేగింపులో పాల్గొని భక్తులకు దర్శనమిచ్చాయి. భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య ఆధ్వర్యంలో చార్మినార్ వద్ద అమ్మవారి ఘటాలకు పలువురు అధికార, అనధికార ప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. నగర సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి అక్కన్న మాదన్న దేవాలయంలో ఘటానికి పూజలు నిర్వహించిన అనంతరం అంబారి ఊరేగింపు సాయంత్రం 4 గంటలకు బయలుదేరింది. అందంగా అలంకరించిన శకటాలు, కళాబృందాలు, పోతురాజుల విన్యాసాలు, యువతీ యువకుల నృత్యాలతో సాగిన ఊరేగింపులో అన్ని దేవాలయాల నుంచి వచ్చిన ఘటాలు కలిసి రాత్రి 8 గంటలకు చార్మినార్‌కు చేరుకున్నాయి. ఉప్పుగూడ మహంకాళి దేవాలయంలో ప్రారంభమైన మాతేశ్వరీ ఘటాల ఊరేగింపు ఛత్రినాక ద్వారా లాల్‌దర్వాజా సింహవాహిని ఘటాలలో కలిసింది. అలాగే అక్కన్న మాదన్న దేవాలయం, మురాద్ మహల్, గౌలిపురా, సుల్తాన్‌షాహి, హరిబౌలి ఘటాలు లాల్‌దర్వాజా మోడ్‌కు చేరుకున్నాయి. ఈ ఊరేగింపు శాలిబండ, హిమ్మత్‌పురా చౌరస్తా, మక్కా మసీదు, చార్మినార్, గుల్జార్ హౌజ్‌ల మీదుగా నయాపూల్‌లోని ఢిల్లీ దర్వార్ మైసమ్మ దేవాలయం వరకు కొనసాగింది. మీరాలంమండి నుంచి ప్రారంభమైన శ్రీ మహంకాళి అమ్మవారి ఘటం కోట్ల అలీజా, సర్దార్‌మహల్ ద్వారా చార్మినార్ చేరుకొని ప్రధాన ఊరేగింపులో కలిసింది.

– చార్మినార్




అందరినీ చల్లగా చూస్తా

'ప్రజలందర్నీ చల్లగా చూస్తా. భక్తులు ఐదు వారాల పాటు నాకు మొక్కులు చెల్లించుకోవాలి..' అంటూ లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారి ఆలయం వద్ద 'రంగం'లో అనురాధ చెప్పారు. ఆలయ విస్తరణను తానే చూసుకుంటానన్నారు.



సీపీ శ్రీనివాస్‌రెడ్డికి ఆశీర్వాదం..



సింహవాహనంపై ఘటం..





కళా బృందాల కోలాహలం





అంబారీపై అమ్మవారి ఘటం...

హలో సిటీ.. చలో ఢిల్లీ

నగరం నుంచి అత్యధిక సంఖ్యలో రాకపోకలు ఢిల్లీకే..

- ఆ తర్వాత స్థానంలో ముంబై, బెంగళూరు
- వేగంగా పెరుగుతున్న ఎయిర్‌పోర్ట్ ప్యాసింజర్ల సంఖ్య
- ప్యాసింజర్ల సంఖ్యలో దేశంలోనే 4వ స్థానంలో శంషాబాద్ ఎయిర్‌పోర్ట్

సాక్షి, సిటీబ్యూరో: శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ నుంచి రాకపోకలు సాగించే ప్రయాణికుల సంఖ్య శరవేగంగా పెరుగుతోంది. ప్రస్తుతం ప్రయాణికుల సంఖ్యా పరంగా దేశంలోనే 4వ స్థానంలో ఉన్న ఈ ఎయిర్‌పోర్ట్ త్వరలోనే తన స్థానాన్ని మరింత మెరుగుపరచుకోనుంది. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ) విడుదల చేసిన తాజా గణాంకాలు ఈ విషయాన్ని స్పష్టం చేశాయి. ఈ ఏడాది తొలి అర్ధభాగం వరకూ చూస్తే నగరం నుంచి ఢిల్లీకి అత్యధికంగా 14.6 శాతం మంది, ముంబైకి 10.8 శాతం మంది, బెంగళూరుకు 10 శాతం మంది రాకపోకలు సాగించినట్టు వెల్లడించింది.

ఢిల్లీకే ఎక్కువ...

నగరం నుంచి ఇతర నగరాలకు రాకపోకలు సాగించిన ప్రయాణికుల సంఖ్య లక్షల్లో ఉండగా అందులో తొలి స్థానం ఢిల్లీకి దక్కింది. ఈ ఏడాది తొలి అర్ధభాగంలో ఢిల్లీకి 16,14,660 మంది, ముంబైకి 11,97,952 మంది, బెంగళూరుకు 11,11,649 మంది రాకపోకలు సాగించారు.

మనకు నాలుగో స్థానం...

మొత్తంగా చూస్తే హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ 1,10,61,929 మంది ప్రయాణికులతో దేశంలోనే అత్యధిక సంఖ్యలో రాకపోకలు సాగించిన ఎయిర్‌పోర్ట్స్‌లో ఢిల్లీ, ముంబై, బెంగళూరు తర్వాత 4వ స్థానం దక్కించుకుంది. అయితే 10.9 శాతం పెరుగుదలతో శరవేగంగా బిజీగా మారుతున్న ఎయిర్‌పోర్ట్స్‌లో నగరం ఒకటిగా నిలుస్తోంది.

ట్రాఫిక్ హీట్ పుట్టించిన మే...

ఈ ఏడాది తొలి అర్ధభాగం అత్యధిక ట్రాఫిక్‌ను హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ చవిచూసింది. అందులోనూ గత మే నెలలో ప్రయాణికుల రద్దీ అత్యధికంగా కనిపించింది. సంఖ్యాపరంగా చూస్తే జనవరి నెలలో 1.802 మిలియన్, ఫిబ్రవరిలో 1.730 మిలియన్, మార్చిలో 1.861 మిలియన్, ఏప్రిల్‌లో 1.858 మిలియన్, మేలో 1.971 మిలియన్, జూన్‌లో 1.841 మిలియన్ల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించారు.



ప్రిపరేషన్.. పరేషాన్!

హైదరాబాద్ స్టడీ హాల్స్‌లో భద్రత కరువు

అశోక్‌నగర్‌లో పుట్టగొడుగుల్లా స్టడీ హాల్స్, లైబ్రరీలు

- అరకొర వసతుల మధ్యే చదువు కొనసాగిస్తున్న అభ్యర్థులు
- ఆకతాయిల వికృత చేష్టలతో యువతులకు ఇబ్బందులు
- ప్రమాదం జరిగినప్పుడే అధికారుల హడావుడి
- ఢిల్లీ ఘటన నేపథ్యంలో ఇక్కడా చర్చలు



సాక్షి, సిటీబ్యూరో: ఒకప్పుడు సివిల్ సర్వీసెస్ పరీక్షలకు ప్రిపేర్ కావాలంటే ఢిల్లీ వెళ్లేవారు. కానీ కొన్నేళ్లుగా హైదరాబాద్.. ముఖ్యంగా అశోక్‌నగర్ పరిసర ప్రాంతాలు సివిల్స్ ప్రిపరేషన్‌కు అడ్డాగా మారింది. సివిల్ సర్వీసెస్‌తో పాటు గ్రూప్–1, 2, 3 వంటి పోటీ పరీక్షలకు సన్నద్ధం అయ్యేందుకు వేలాది మంది ఇక్కడికి వస్తున్నారు. కానీ దినదిన గండంగా అభ్యర్థులు గడుపుతున్నారు. ఎప్పుడు, ఎక్కడి నుంచి ఎలాంటి ప్రమాదం వస్తుందో తెలియని పరిస్థితి. ఒకవైపు యమ పాశాల్లా స్టడీ హాల్స్ చుట్టూ విద్యుత్ వైర్లు.. అగ్గిపెట్టెల్లాంటి గదులు.. ఆకతాయిల వేధింపులు.. పుస్తకాలతో పాటు ఇన్ని ఇబ్బందులను ఎదుర్కొంటే కానీ ఉద్యోగం వచ్చే పరిస్థితి లేదు. ఇటీవల ఢిల్లీలోని ఓ సివిల్స్ కోచింగ్ సెంటర్ స్టడీ హాల్ నీటమునిగి విద్యార్థులు మృతిచెందిన ఘటన నేపథ్యంలో ఇక్కడి స్టడీ హాళ్ల పరిస్థితులపై చర్చ జరుగుతోంది.

అగ్గిపెట్టెల్లాంటి గదుల్లో..

స్టడీ హాల్స్‌లో చదువుకుంటే ఏకాగ్రత ఉండదేమోనన్న బెంగతో లైబ్రరీ, స్టడీ సెంటర్లలో చాలా మంది చేరుతుంటారు. ఇదే అదునుగా వారి ఆశలను క్యాష్ చేసుకునేందుకు వీధివీధినా మూడు, నాలుగు స్టడీ హాల్స్ వెలిశాయి. అగ్గిపెట్టెల మాదిరిగా ఉన్న గదుల్లో ఇరుకుగా, గాలి వెలుతురు లేకుండా ఒక్కరిద్దరు కూర్చునే స్థలంలో ముగ్గురు, నలుగురిని కూర్చోబెడుతున్నారు. ఎండాకాలం వస్తే అభ్యర్థుల బాధలు వర్ణనాతీతం. ఏసీ స్టడీ హాల్స్ పేరిట అదనపు చార్జీలు వేస్తూ అభ్యర్థుల నుంచి ముక్కు పిండి వసూలు చేస్తుంటారు.

ఫైర్ సేఫ్టీ పాటించేదెవరు?

చాలా స్టడీహాల్స్ లోపలికి ఇరుకైన మెట్ల ద్వారా వెళ్లాల్సి వస్తుంది. అలాంటి స్టడీ హాల్స్‌లో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదాలు సంభవిస్తే జరిగే నష్టం ఊహలకు కూడా అందదు. ప్రమాదం జరిగితే తప్పించుకునే పరిస్థితులే కానరావట్లేదు. అలాంటి ప్రాంతాల్లో అధికారులు ఎలా అనుమతులిస్తున్నారో ఎవరికీ అర్థం కాని విషయం.

విద్యుత్ వైర్లకు దగ్గరగా..

చాలా స్టడీ హాల్స్ లేదా లైబ్రరీలను నివాస సముదాయాల్లోనే ఏర్పాటు చేశారు. ఎక్కువగా రెండో అంతస్తులో వీటిని నడుపుతున్నారు. సాధారణంగా నివాస సముదాయాల్లో ఇలాంటి వ్యాపార కార్యకలాపాలు నడపడం చట్ట విరుద్ధం. కొన్నింటికి ఎలాంటి బోర్డులు పెట్టకుండా, జీఎస్టీ చెల్లించకుండా గుట్టుగా నడిపించేస్తున్నారు. ఈ భవనాలకు దగ్గరి నుంచే ప్రమాదకరంగా హై వోల్టేజీ ఉన్న ఎక్స్‌టెన్షన్ వైర్లు వెళ్తున్నాయి. ప్రమాదవశాత్తు ఎవరికైనా ఆ వైర్లు తగిలితే ఎవరు బాధ్యత వహించాలన్నది పెద్ద ప్రశ్న. ఇక, కొన్ని ప్రాంతాల్లో స్టడీ సెంటర్లను వైన్ షాపుల పక్కనే ఏర్పాటు చేశారు. అదీ మెయిన్ రోడ్డుపైనే ఇలా ఏర్పాటు చేస్తే పట్టించుకున్న వారే లేరు.

వీధి లైట్లు లేక ఇబ్బందులు..

అభ్యర్థులు పొద్దుపోయే వరకు స్టడీ హాల్స్, లైబ్రరీల్లో చదువుకుని హాస్టల్ లేదా వారి గదులకు వెళ్తుంటారు. వెళ్లే దారిలో చాలా ప్రాంతాల్లో వీధి దీపాలు లేక యువతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆకతాయిలు రోడ్లపై అడ్డాలు వేసుకుని, వచ్చి పోయే అమ్మాయిలపై కామెంట్స్ చేస్తూ వెకిలి చేష్టలు చేస్తున్నారు. బైక్‌లపై వారి ముందు స్టంట్లు చేస్తున్నారు.

అమ్మాయిల భద్రత గాలికి..

హాస్టళ్లలో అమ్మాయిల భద్రత గాలికొదిలేశారు. ఇటీవల ఓ అమ్మాయిల హాస్టల్‌లోకి దర్జాగా ఓ దుండగుడు ప్రవేశించి, అక్కడి వారిని భయభ్రాంతులకు గురిచేశాడు. అయితే ఈ విషయం బయటకు తెలిస్తే తమ చదువులకు ఇబ్బంది అవుతుందని అభ్యర్థులు, హాస్టల్‌కు చెడ్డ పేరు వస్తుందని యాజమాన్యం మిన్నకుండి పోయింది. ఇక, కొత్తగా నిర్మించిన నాయిని నర్సింహారెడ్డి ఫ్లైఓవర్ పై నుంచి పక్కనే ఉన్న భవనాల్లోకి మద్యం తాగి బాటిళ్లను విసిరేసే వారని మరికొందరు వాపోయారు. అసలు ఇలాంటి పరిస్థితుల్లో చదివేకంటే ఇంటికి వెళ్లిపోవడమే ఉత్తమమని, చాలామంది అమ్మాయిలు సొంతూళ్లకు వెళ్లిపోయారు.

జోరుగా గంజాయి అమ్మకాలు

అశోక్ నగర్, గాంధీనగర్, హిమాయత్‌నగర్, చిక్కడపల్లిలో పోలీస్ పెట్రోలింగ్ నిర్వహిస్తుంటారు. అయితే చదువుకునే వారిని ఇబ్బంది పెట్టకూడదనే ఉద్దేశంతో పోలీసులు పెద్దగా పట్టించుకోకపోవడం ఆకతాయిలకు అవకాశంగా మారింది. ఆంధ్ర కేఫ్ రోడ్డు, ప్యారడైజ్ పరిసర ప్రాంతాల్లో చాలా డ్రగ్స్, గంజాయి అమ్మకాలు సాగుతున్నాయని విద్యార్థులు చెబుతున్నారు. ఇక, షీ టీమ్స్‌కు సమాచారం ఇచ్చేందుకు స్టడీహాళ్ల మధ్య ఎస్‌వోఎస్ బూత్ పోల్స్‌ను అమర్చాలని కోరుతున్నారు. దీంతో వెంటనే ఫిర్యాదు చేసి, సహాయం పొందేందుకు వీలుంటుందని చెబుతున్నారు.

టౌన్‌ప్లానింగ్ విభాగం పూర్తిగా విఫలం..

నగరాల్లో తక్కువ విస్తీర్ణంలో నాలుగైదు అంతస్తుల్లో భవనాలు నిర్మిస్తున్నారు. సెల్లార్‌ను పార్కింగ్‌కు బదులు వ్యాపార కార్యకలాపాలకు వాడుకుంటున్నారు. ఇలాంటి భవనాలు అశోక్‌నగర్‌లో కోకొల్లలు. అయినా టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. లంచాలకు అలవాటు పడి చూసీచూడనట్టు వదిలేస్తున్నారు. అగ్ని ప్రమాదాలు వంటివి జరిగినప్పుడే హడావుడి చేయడం తప్పితే ఎలాంటి చర్యలు తీసుకోవట్లేదు.

మెహిదీపట్నం నుంచి కందవాడకు సిటీబస్సులు



సాక్షి, సిటీబ్యూరో: మెహిదీపట్నం నుంచి కందవాడకు బస్సులు నడుపనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈ మేరకు మెహిదీపట్నం–కందవాడ (592) రూట్‌లో మూడు ట్రిప్పులు ప్రతిరోజు రాకపోకలు సాగించనున్నాయి. ఈ బస్సులు నానల్‌నగర్, లంగర్‌హౌస్, టీకే బ్రిడ్జి, బండ్లగూడ, ఆరెమైసమ్మ, తెలంగాణ పోలీస్ అకాడమీ జంక్షన్, గోల్డెన్‌ఫామ్స్, మల్కాపురం, పుల్లుట్ల, కేసారం, చేవెళ్ల మీదుగా కందవాడకు రాకపోకలు సాగిస్తాయి. మెహిదీపట్నం నుంచి ఉదయం 8 గంటలకు, మధ్యాహ్నం 1.30, సాయంత్రం 3.55 గంటలకు బయలుదేరుతాయి. అలాగే కందవాడ నుంచి ఉదయం 9.25 గంటలకు, మధ్యాహ్నం 2.45, సాయంత్రం 5.10 గంటలకు తిరిగి మెహిదీపట్నంకు బయలుదేరుతాయి.

గ్రామీణ స్టార్టప్‌లకు ప్రభుత్వ ప్రోత్సాహం

మంత్రి శ్రీధర్‌బాబు



లక్డీకాపూల్: పర్యావరణ వ్యవస్థను మరింత బలోపేతం చేసే గ్రామీణ స్టార్టప్‌లకు ప్రభుత్వం ప్రోత్సాహం ఉంటుందని రాష్ట్ర పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు తెలిపారు. సోమవారం బంజారాహిల్స్‌లోని తాజ్ కృష్ణా హోటల్‌లో శేషాద్రి వంగల గ్రూప్, అవుట్‌లుక్ మీడియా ఆధ్వర్యంలో స్పాట్‌లైట్ ఇండోగ్లోబల్ బిజినెస్ అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ..స్టార్టప్ సంస్థలను అన్ని విధాల ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ..అంకుర్ బస్ యాత్ర వంటి వినూత్నమైన మార్గాలతో పర్యావరణ వ్యవస్థను నిర్మించే గ్రామీణ స్టార్టప్‌లను ప్రధానంగా ప్రోత్సహించే ఏఐ శ్రేష్ఠత, స్కిల్లింగ్‌పై రాష్ట్ర లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్ర అభివృద్ధి కోసం కృషి చేస్తామని మంత్రికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్టార్టప్ ఫౌండేషన్ ఇంటర్నేషనల్ ప్రతినిధి జేఏ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

మన స్టార్టప్స్‌ను పరిశీలించిన కెన్యా, టాంజానియా ప్రతినిధులు

సాక్షి, సిటీబ్యూరో: విజయవంతమైన మన స్టార్టప్ విధానాన్ని పరిశీలించేందుకు కెన్యా, టాంజానియా దేశాలకు చెందిన ఆరుగురు ప్రతినిధుల బృందం సోమవారం నగరానికి వచ్చింది. జపాన్ ఇంటర్నేషనల్ కో ఆపరేషన్ ఆర్థిక సహకారంతో నిర్వహిస్తున్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్ (ఐఐటీహెచ్) క్యాంపస్ డవలప్‌మెంట్ ప్రాజెక్ట్‌తో పాటు తెలంగాణ స్టార్టప్ అండ్ ఇన్నోవేషన్ ఎకో సిస్టమ్ స్ట్రెంగ్తనింగ్ ప్రాజెక్ట్‌లను సందర్శించింది. ఈ సందర్భంగా ఐఐటీహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఎస్.మూర్తి, డీన్స్‌తో పాటు పలు సంస్థల నిర్వాహకులు, ప్రతినిధులతో ఈ బృందం భేటీ అయ్యింది. టీ హబ్, టీ వర్క్స్, వుయ్ హబ్‌లను కూడా సందర్శించి అక్కడ అందించే సేవలను పరిశీలించింది. విదేశీ ప్రతినిధుల బృందంలో కెన్యా నేషనల్ ఇన్నోవేషన్ ఏజెన్సీ, టాంజానియా సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖలకు చెందిన వారు ఉన్నారు.



ఎట్టకేలకు కదలిక!

గ్రేటర్ సీఆర్ఓ పరిధిలో పట్టణ సర్కిళ్లు?

- 14 అర్బన్ సర్కిళ్లతో ప్రతిపాదనలు
- ఒకే గొడుగు కింద ప్రజా పంపిణీ వ్యవస్థ



సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ పరిధిలోని పౌరసరఫరాల పట్టణ సర్కిళ్లను హైదరాబాద్ చీఫ్ రేషనింగ్ అధికారి పరిధిలోకి తీసుకొనివచ్చే ప్రతిపాదనలకు కదలిక వచ్చినట్లు తెలుస్తోంది. ఇప్పటికే హైదరాబాద్ మహానగరంలో శివారు ప్రాంతాలను సైతం విలీనం చేసే ప్రయత్నం సాగుతుండటంతో ప్రజాపంపిణీ వ్యవస్థను సైతం అదే తరహాలో ఒకే గొడుగు కింద తీసుకొచ్చే ప్రయత్నాలు ప్రారంభమైనట్లు తెలుస్తోంది. తాజాగా జీహెచ్ఎంసీ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాలోని అర్బన్ 14 సర్కిళ్లతో ప్రతిపాదనలు సిద్ధమైనట్లు సమాచారం. సరిగా పన్నెండేళ్ల క్రితం ప్రజాపంపిణీ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు కేవలం 12 అర్బన్ సర్కిళ్లను సీఆర్వో పరిధిలోకి తీసుకొచ్చే ప్రతిపాదనలు రూపొందించారు. వీటిని హైదరాబాద్ సీఆర్వో ఆఫీస్ నుంచి పౌరసరఫరాల శాఖ కమిషనరేట్‌కు పంపించారు. అక్కడి నుంచి ప్రభుత్వానికి కూడా ప్రతిపాదనలు సమర్పించారు. కాగా.. సంబంధిత ఉన్నత అధికారి బదిలీ కావడంతో ప్రతిపాదనల వ్యవహారం అటకెక్కింది.

సరికొత్త ప్రతిపాదనలతో..

జీహెచ్ఎంసీ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి ,మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల పరిధిలో 14 అర్బన్ సర్కిళ్లు ఉన్నాయి. హైదరాబాద్ చీఫ్ రేషనింగ్ వ్యవస్థ మాత్రం తొమ్మిది అర్బన్ సర్కిళ్లతో పని చేస్తుండగా, మరో ఐదు సర్కిళ్లు నగర శివారు ప్రాంతంలో విస్తరించి ఉన్నాయి. ఇవి పూర్తిగా రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల పౌరసరఫరాల అధికారుల పర్యవేక్షణలో పని చేస్తున్నాయి. హైదరాబాద్ సీఆర్వో పరిధిలోకి మిగతా ఐదు అర్బన్ సర్కిళ్లను కూడా తీసుకొస్తే బాగుంటుందని పౌరసరఫరాల శాఖ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తం మీద జీహెచ్ఎంసీ పరిధిలో అర్బన్ సర్కిళ్లలో కలిపి సుమారు 12.55 లక్షల రేషన్ కార్డులు ఉండగా, అందులో 43.97 లక్షల యూనిట్లు ఉన్నాయి.

జీహెచ్ఎంసీ పరిధిలోని అర్బన్ సర్కిళ్లలో ఇలా

అర్బన్ సర్కిల్	కార్డులు	యూనిట్లు
మలక్‌పేట	68,877	2,62,926
యాకత్‌పురా	90,853	3,57,665
చార్మినార్	94,477	3,72,455
నాంపల్లి	39,058	1,36,281
మెహిదీపట్నం	81,403	3,21,219
అంబర్‌పేట	58,776	1,97,565
ఖైరతాబాద్	83,033	2,93,015
బేగంపేట	69,234	2,36,516
సికింద్రాబాద్	53,810	1,85,78
సరూర్‌నగర్	2,08,263	6,83,682
బాలానగర్	2,04,433	6,89,907
ఉప్పల్	1,81,026	5,86,231
పటాన్‌చెరు	9,427	31,611
రామచంద్రాపురం	12,880	43,328



- ఈ మాదకద్రవ్యాలు వచ్చేది ఆ మసాలా నుంచే..
- మూడు రాష్ట్రాల్లోనే గసగసాల పంట పండించేందుకు అనుమతి
- డ్రగ్స్ ప్రాసెస్ జరిగేది పొరుగుదేశాల్లో అని ఆధారాలు
- వరుస ఉదంతాలతో రాజధానిలో నిఘా ముమ్మరం

డ్రగ్స్ కేరాఫ్ గసగసాలు!

వరుసగా పట్టుబడుతున్న హెరాయిన్, పాపీ స్ట్రా



గసగసాల కాయపై ఇలా గాట్లు పెట్టగా కారే పాలే.. నల్లమందుకు మూలం

సాక్షి, సిటీబ్యూరో:

20.07.2024
అఫ్ఘనిస్థాన్ నుంచి రాజస్తాన్ మీదుగా నగరానికి చేరుకున్న కేజీ హెరాయిన్‌ను పట్టుకున్న సైబరాబాద్ ఎస్‌ఓటీ పోలీసులు నలుగురు అంతరాష్ట్ర నిందితులను అరెస్టు చేశారు.

22.07.2024
మధ్యప్రదేశ్ నుంచి వచ్చిన పాపీ స్ట్రాను నగరంలో విక్రయించేందుకు ప్రయత్నించిన ఇద్దరు రాజస్తానీయులను పట్టుకున్న రాచకొండ ఎస్‌ఓటీ అధికారులు..40 కేజీల డ్రగ్ స్వాధీనం చేసుకున్నారు.

27.07.2024
నగరంలో ఉంటూ వ్యాపారంలో నష్టపోయిన మధ్యప్రదేశ్ వాసి రాజస్తాన్ నుంచి హెరాయిన్ తెచ్చి విక్రయిస్తున్నాడు. ఇతడితో పాటు సహకరిస్తున్న కుమారుడినీ పట్టుకున్న రాచకొండ ఎస్‌ఓటీ పోలీసులు 100 గ్రాముల హెరాయిన్ సీజ్ చేశారు.

దేశంలో మాదకద్రవ్యమైన గంజాయి సాగుపైనే కాదు, మసాలా దినుసు గసగసాల సాగుపైనా నిషేధం ఉందని తెలుసా? దీనికి కారణం ఏమిటంటే.. నల్లమందుగా పిలిచే ఓపియం తయారీకి మూలం గసగసాలు కావడమే. హెరాయిన్, మార్ఫిన్‌లను ప్రాసెస్ చేసేందుకు అవసరమైన నల్లమందు, పాపీస్ట్రాల్ని ఆ చెట్టు నుంచి సంగ్రహిస్తారు. ప్రస్తుతం మూడు రాష్ట్రాల్లో మాత్రమే అనుమతి పొందిన తరవాతే నిర్దేశిత పరిమాణంలో గసగసాలు పండించే అవకాశం ఉంది. ఇక్కడి రైతుల్లో కొందరిని ప్రలోభాలకు గురి చేస్తున్న స్మగ్లర్లు ఆ మసాలాను డ్రగ్స్ తయారీకి వాడుకుంటున్నారని పోలీసులు చెబుతున్నారు. వరుసగా పట్టుబడుతున్న మాదకద్రవ్యాల నేపథ్యంలో రాజధానిలోని పోలీసులు అప్రమత్తమై నిఘా ముమ్మరం చేశారు.

కేవలం ఆ మూడు రాష్ట్రాల్లోనే అనుమతి...

మాదకద్రవ్యాల తయారీకి ఉపకరిస్తాయనే కారణంతో దేశంలో గసగసాల సాగుపై నిషేధం విధించారు. మసాలా దినుసుగా వినియోగించడంతో పాటు వైద్య అవసరాలకు సంబంధించిన ఉత్పత్తుల కోసం దీని అవసరం ఉంది. ఈ నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్తాన్‌లలో ఉన్న కొందరు రైతులకు మాత్రమే సాగు చేసేందుకు అనుమతి ఇస్తుంటుంది. ప్రస్తుతం ఈ రైతుల సంఖ్య 25 వేలకు లోపే ఉంది. ఒక్కో రైతు సాలీనా 54 కిలోలు మాత్రమే పండించడానికి అనుమతిస్తారు. పోలీసులతో పాటు ఇతర ఏజెన్సీలు ఈ సాగుపై అనునిత్యం నిఘా వేచి ఉంచుతాయి. ఇలా అనుమతి పొందిన రైతుల్లో కొందరిని డ్రగ్ పెడ్లర్స్ ప్రలోభాలకు గురి చేస్తున్నారు. అనుమతించిన మొత్తం కంటే అధిక మొత్తంలో పండించేలా ప్రేరేపిస్తున్నారు. ప్రధానంగా మారుమూల ప్రాంతాల్లో పొలాలు ఉన్న వారితోనే ఇలా చేయిస్తున్నారు.

కాయకు గాట్లు పెట్టి..జిగురు తీసి..

గసగసాల చెట్టు కాయ ముదిరే వరకు వేచి చూసే పెడ్లర్స్, ఆ తర్వాత అనువైన పొలాన్ని ఎంచుకుంటారు. రైతులతో పాటు ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న కూలీలతో ఆ కాయలపై బ్లేడుతో గాట్లు పెట్టిస్తారు. అప్పుడు దాని నుంచి కారే జిగురు లాంటి ద్రవం కాస్త ఎండి, నల్లగా మారే వరకు అలానే ఉంచేస్తారు. ఆపై దాన్ని సేకరించే రైతుల నుంచి పెడ్లర్స్ ఖరీదు చేస్తారు. దీన్ని అక్కడి గ్రామాలకు చెందిన వారితోనే వారి ఇళ్లల్లోని పొయ్యిపై కాస్తారు. అప్పుడు చిక్కగా, నల్లని పేస్టులా ఉండే నల్ల మందు తయారవుతుంది. దీన్ని ప్యాక్ చేసి దేశంలోని వివిధ ప్రాంతాలకు అక్రమ రవాణా చేస్తున్న పెడ్లర్స్ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ నల్లమందును ప్రయోగశాలల్లో ప్రాసెసింగ్ చేసేప్పుడు, హెరాయిన్ ఆ తర్వాత మార్ఫిన్ వస్తాయి. సర్జరీల సమయంలో మత్తు కోసం ఇచ్చే మందుల్లో మార్ఫిన్ వాడతారు. ఈ రెండూ కూడా పక్కదారి పట్టి మాదకద్రవ్యాల మార్కెట్‌లో చెలామణి అవుతున్నాయి.



నల్లగా మారిన పాలను సంగ్రహిస్తారిలా...

'చెత్త' నుంచి పాపీ స్ట్రా సంగ్రహణ...

వైద్య అవసరాలకు వినియోగించే నల్లమందు, మార్ఫిన్‌లను ప్రత్యేక జాగ్రత్తల మధ్య ల్యాబ్స్‌లో తయారు చేస్తారు. నల్లమందుకు నీరు, కాల్షియం హైడ్రాక్సైడ్, అమ్మోనియం క్లోరైడ్ కలిపి రసాయన క్రియ జరిగేట్టు చేస్తారు. ఇలా హెరాయిన్, మార్ఫిన్ తయారు చేస్తారు. వీటిని కేవలం వైద్య అవసరాల కోసమే వాడతారు. ఆయా కంపెనీల ప్రతినిధులకు జిగురు విక్రయించిన తర్వాత, అక్రమంగానూ జిరుగు సేకరించిన తర్వాత మిగిలే కాయల్ని పక్కన పెడతారు. వాటిపై ఉండే కొద్దిపాటి జిరుగును పొట్టుతో సహా తీసి ఎండ బెడతారు. ఎండిన పొట్టును పాపీ స్ట్రా పేరుతో డ్రగ్స్ పెడ్లర్స్ విక్రయిస్తారు. పెడ్లర్స్ విక్రయించే హెరాయిన్, మార్ఫిన్‌లు దేశంలో తయారు కావట్లేదని అధికారులు చెప్తున్నారు. ఈ ప్రాసెసింగ్ మొత్తం పాకిస్థాన్, అఫ్ఘనిస్థాన్‌ల్లో జరుగుతున్నట్లు గుర్తించారు. అక్కడే గసగసాలు సాగు చేసి, ప్రాసెసింగ్ పూర్తయిన తర్వాత హెరాయిన్, మార్ఫిన్‌లు దేశంలోనే కాకుండా ప్రపంచంలోని అనేక చోట్లకు స్మగ్లింగ్ అవుతోందని పోలీసులు తెలిపారు.

డ్రోన్ల ద్వారా జారవిడుస్తున్నారు..

ఈ హెరాయిన్, మార్ఫిన్ డ్రగ్స్‌ను డ్రోన్ డ్రాప్ విధానం ద్వారా భారత్–పాక్ సరిహద్దుల్లోని అనేక గ్రామాల్లోకి వస్తోంది. అక్కడ ఉండే దళారులు ఈ పార్శిల్స్‌ను పెడ్లర్స్‌కు అందిస్తున్నారు. ఈ దళారులు ఏ రోజు డ్రగ్‌ను ఏ ప్రాంతంలో జారవిడవాలన్నది గుర్తిస్తారు. భద్రతా బలగాల మోహరింపు, కదలికల ఆధారంగా ఆయా ప్రాంతాలను గుర్తించి..వాటి లోకేషన్‌ను వాట్సాప్ ద్వారా పెడ్లర్స్‌కు పంపిస్తారు. వీరి ద్వారా ఈ లోకేషన్స్ సరిహద్దు ఆవల ఉన్న సరఫరాదారులకు చేరతాయి. వీటి ఆధారంగా నిర్ణీత సమయంలో, నిర్దేశిత ప్రాంతంలోకి డ్రోన్ల ద్వారా హెరాయిన్‌ను జారవిడుస్తున్నారు. ఇది దళారుల ద్వారా పెడ్లర్స్ వరకు వచ్చి దేశ వ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు సరఫరా అవుతోంది. ఈ దందాలో పాకిస్థాన్, అఫ్ఘనిస్థాన్ కోణాలు ఉన్న నేపథ్యంలో ఉగ్ర నిధుల అంశాన్ని కొట్టి పారేయలేమని పోలీసులు చెప్తున్నారు.

ఇటీవల సైబరాబాద్ పోలీసులకు చిక్కిన హెరాయిన్



'దార్ గ్యాంగ్' కదలికలున్నాయి.. జాగ్రత్త!

ఘట్‌కేసర్: దార్ గ్యాంగ్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని క్రైం ఎస్సై అశోక్ అన్నారు. ఘట్‌కేసర్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ నగరంలో దార్ గ్యాంగ్ కదలికలు కనిపించాయని పేర్కొన్నారు. రాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులపై అనుమానం వస్తే వెంటనే 'డయల్ 100'కు ఫోన్‌కాల్ చేయాలని సూచించారు. స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు.

దైవదర్శనానికి వెళ్లి వస్తూ...

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి.. నలుగురికి గాయాలు



చెట్టును ఢీ కొట్టిన కారు

శామీర్‌పేట్: కుటుంబసభ్యులతో కలిసి దైవదర్శనం చేసుకొని తిరుగు పయనమయ్యారు. మరో గంటలో ఇంటికి చేరుకోనున్నారు. అంతలోనే రోడ్డు ప్రమాదానికి గురై ఇంటి యజమాని మృతి చెందాడు. జినోమ్ వ్యాలీ పోలీసులు, బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం... ఆర్‌సీ పురం ప్రాంతానికి చెందిన రాజేశ్వరరావు(64) తన కుటుంబసభ్యులతో కలిసి కారులో కొమురవెల్లి ఆలయానికి వెళ్లారు. సోమవారం ఉదయం కరీంనగర్–హైదరాబాద్ రాజీవ్ రహదారి గుండా తిరిగి వస్తుండగా తుర్కపల్లి చెక్‌పోస్టు సమీపంలో కారు అదుపు తప్పింది. రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రాజేశ్వరరావు మృతి చెందగా భార్య విజయలక్ష్మి, కొడుకు ప్రవీణ్, కూతురు ప్రవళిక, అల్లుడు ప్రవీణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అతివేగమే ప్రమాదానికి కారణమని సీఐ యాదయ్య తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

భవనం పైనుంచి దూకి నవవధువు ఆత్మహత్య



దివ్య (ఫైల్)

ఉప్పల్: పెళ్లయిన మూడునెలలకే ఓ నవవధువు ఆత్మహత్య చేసుకుంది. ఉప్పల్ పోలీసులు తెలిపిన వివరాలు... రామంతాపూర్ రామిరెడ్డినగర్ ప్రాంతానికి చెందిన పాక నవీన్‌కు, అంబర్‌పేట ప్రేమ్‌నగర్ ప్రాంతానికి చెందిన దివ్య(29)తో మూడు నెలల క్రితం వివాహమైంది. పెళ్లయిన నాటి నుంచి ముభావంగా ఉండే దివ్య ఈ నెల 27న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సోమవారం మధ్యాహ్నం ఆమె రామిరెడ్డినగర్‌లో తిరిగుతూ చివరకు ఓ మూడంతస్తుల భవనం ఎక్కింది. అక్కడ నుంచి కిందికి దూకి చనిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. కేసు దర్యాప్తులో ఉంది.

ఆస్పత్రికి తీసుకెళ్తూ.. అమ్మను రోడ్డుపైనే వదిలేశాడు

- ఆకలితో అలమటించి కన్నుమూత
- ఓ కొడుకు అమానుషం



ఆస్పత్రిలో మృతి చెందిన శ్యామల (ఫైల్)

కంటోన్మెంట్: అనారోగ్యానికి గురైన అమ్మను ఓ కొడుకు ఆస్పత్రికి తీసుకెళ్తూ మార్గమధ్యంలో నడిరోడ్డుపైనే వదిలేసి వెళ్లిపోయాడు. కొడుకు కోసం రెండురోజులు ఎదురుచూసింది. ఆకలితో అలమటించింది. చివరికి ఆ తల్లి గుండె పగిలి కన్నుమూసింది. ఈ హృదయ విదారక ఘటన బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ రెడ్డి వెల్లడించిన వివరాలు... ఈ నెల 5న మేడ్చల్ నివాసి అయిన అరవింద్ అనారోగ్యంతో ఉన్న తల్లి శ్యామల(60)ను తీసుకొని ఆసుపత్రికని బయలుదేరాడు. బోయిన్‌పల్లి చెక్‌పోస్టు సమీపంలోని ఎంఎంఆర్ గార్డెన్ వద్ద ఆమెను ఫుట్‌పాత్‌పైనే వదిలి ఎటో వెళ్లిపోయాడు. రెండు రోజులైనా తిరిగి రాలేదు. ఆకలితో అలమటించిన తల్లి అనారోగ్యంతో స్పృహ తప్పి పడిపోయింది. స్థానికుల సమాచారం మేరకు బోయిన్‌పల్లి పోలీసులు వచ్చి 108 అంబులెన్స్ సహాయంతో శ్యామలను చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. మూడురోజుల క్రితం కోలుకున్న శ్యామల నుంచి పోలీసులు వివరాలు సేకరించారు. కుమారుడిని చూడాలని శ్యామల కోరడంతో పోలీసులు గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో సోమవారం చికిత్స పొందుతూ శ్యామల మృతి చెందింది. ఆమె కొడుకు అరవింద్ కోసం మేడ్చల్‌లో ఆరా తీసిన ఆచూకీ దొరకలేదు. దీంతో కేసు నమోదు చేసుకున్న బోయిన్‌పల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచామని, ఎవరైనా తెలిసినవారు ఉంటే బోయిన్‌పల్లి పోలీసులను సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ చెప్పారు.

నేపాలీ యువకుడి మృతదేహానికి అంత్యక్రియలు

అనాథలా పోకూడదని ఒక్కటైన సంఘసభ్యులు



బంజారాహిల్స్: నేపాలీ సంఘంసభ్యులు తలాకొంత డబ్బు పోగు చేసుకుని ఆ దేశ యువకుడి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. వివరాల్లోకి వెళితే... నేపాల్‌కు చెందిన సంతోష్(35) ఐదేళ్ల క్రితం వలస వచ్చి శంషాబాద్‌లో సెక్యూరిటీగార్డ్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 20న పెద్ద షాపూర్ వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని జీహెచ్‌ఎంసీకి అప్పగించి, అక్కడే అంత్యక్రియలు నిర్వహించాలని పేదరికంలో మగ్గుతున్న తల్లిదండ్రులు, భార్యాపిల్లలు స్థానిక నేపాలీ సంఘసభ్యులకు సూచించారు. తమ దేశస్థుడు అనాథగా పోకూడదని తెలంగాణ నేపాలీ సంఘం ఉపాధ్యక్షుడు రవి తాపా సహచరులను సంప్రదించి డబ్బు పోగుచేశారు. అంతా కలిసి సోమవారం మధ్యాహ్నం పంజగుట్ట హిందూ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సంఘంలో సుమారు 150 మంది ఉండగా అందరూ ఈ అంత్యక్రియలకు హాజరై సంతోష్‌కు తుదివీడ్కోలు పలికారు. అంతేకాకుండా ఆ కుటుంబాన్ని ఆదుకోవడానికి తలాకొంత డబ్బు జమ చేసి భార్యకు, తల్లిదండ్రులకు పంపించారు.

బ్రాహ్మణుల సంక్షేమానికి...

రూ.50 కోట్లు కేటాయించడం హర్షణీయం



మాట్లాడుతున్న మునిపల్లె శ్రీనివాస్ తదితరులు

నాగోలు: బ్రాహ్మణుల సంక్షేమ కోసం ప్రభుత్వ బడ్జెట్లో రూ.50 కోట్లు కేటాయించడం హర్షణీయమని తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య (టీబీఎస్ఎస్ఎస్) గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మునిపల్లె శ్రీనివాస్ అన్నారు. సోమవారం కొత్తపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టిసారించినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. రూ.50 కోట్లు కేటాయిండం ద్వారా బ్రాహ్మణుల ఆర్థిక అభివృద్ధికి చేయూతనందించిన వారు అవుతారని అన్నారు. బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ద్వారా విదేశీ విద్య చదువుకుంటున్న విద్యార్థుల పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి అదనంగా కనీసం రూ.200 కోట్లు కేటాయించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి భాస్కర మూర్తి, ప్రాంతీయ కార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు, బానగిరి నాగరాజు, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రెస్క్యూలో చిక్కిన బంగ్లాదేశ్ బాలలు

అధికారుల చొరవతో తిరిగి స్వదేశానికి...

సైదాబాద్: పోలీస్ రెస్క్యూలో చిక్కిన బాలలు జువైనల్ శాఖ అధికారుల చొరవతో ఆరు నెలల తరువాత తిరిగి స్వదేశానికి పయనమవుతున్నారు. జువైనల్ వెల్ఫేర్ అండ్ కరక్షనల్ సర్వీసెస్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మీర్జా అలీబేగ్ తెలిపిన వివరాల ప్రకారం... ఈ ఏడాది జనవరి 27న ఖమ్మంలో పోలీసులు ఐదుగురు బంగ్లాదేశ్ బాలలను గుర్తించారు. ఇక్కడ పనిచేయడం కోసం వచ్చామని ఆ బాలలు పోలీసులకు తెలిపారు. దీంతో వారిని చేరదీసి మొదట ఖమ్మంలోని అమ్మ స్వచ్ఛ సేవా సంస్థలో ఆశ్రయం కల్పించారు. ఆ తర్వాత ఫిబ్రవరి 27న జిల్లా సంక్షేమ, శిశు సంక్షేమ శాఖ అధికారులు వారిని సైదాబాద్‌లోని ప్రభుత్వ బాలుర గృహానికి తరలించారు. జువెనల్ శాఖ కార్యదర్శి కరుణ వాకాటి, డీజేడబ్ల్యూసీఎస్ కాంతి హెస్లీ చొరవ చూపి బంగ్లాదేశ్ ఎంబసీలోని డిప్యూటీ హైకమిషనర్‌తో సంప్రదింపులు జరిపారు. లాంఛనాలు పూర్తి చేసిన అధికారులు వారిని మంగళవారం ఉదయం తిరిగి బంగ్లాదేశ్‌కు పంపే ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ బాలుర గృహంలో ఉన్న 5 నెలల సమయంలో వారికి అధికారులు ప్రాథమిక విద్య అందించారు. వారికి ఆసక్తి ఉన్న ఫుట్‌బాల్ క్రీడలో తర్ఫీదు ఇచ్చారు.

వృద్ధుడి ఆత్మహత్య

ఘట్‌కేసర్: కుటుంబ కలహాలతో ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు... జనగాం జిల్లా లింగాల ఘనపూర్ వనపర్తి గ్రామానికి చెందిన కాలి ఐలయ్య(65) దశాబ్దకాలంగా జవహర్‌నగర్ బాలాజీనగర్‌లో ఉంటూ దినసరి కూలీగా జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ కలహాల కారణంగా సోమవారం సాయంత్రం పట్టణంలోని మాధవరెడ్డి వంతెన వద్ద గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి చనిపోయాడు. సమాచారం తెలుసుకున్న రైల్వే పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. పంచనామా అనంతరం శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని మహిళ మృతి



హఫీజ్‌పేట్: రైలు ఢీకొని ఓ గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. హఫీజ్‌పేట్ జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ భాగ్యరాజ్ తెలిపిన ప్రకారం వివరాలు... సోమవారం సాయంత్రం 4.45 గంటలకు చందానగర్– హఫీజ్‌పేట్ రైల్వే స్టేషన్ మధ్యలో ఓ గుర్తు తెలియని మహిళ(35) రైలు పట్టాలు దాటుతుండగా గుర్తుతెలియని రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే ఆమె మృతి చెందింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

అమ్మవారి ఘటాల ఊరేగింపును ప్రారంభించిన సీపీ



జెండా ఊపి ఊరేగింపు ప్రారంభిస్తున్న నగర పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

యాకుత్‌పురా: చరిత్రాత్మక శ్రీ అక్కన్న మాదన్న ఆలయం నుంచి అమ్మవారి ప్రధాన ఘటాల ఊరేగింపు ప్రారంభించడం అదృష్టంగా ఉందని నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బోనాల ఉత్సవాల సందర్భంగా సోమవారం భాగ్యనగర్ మహంకాళీ బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన అమ్మవారి ఘటాల ఊరేగింపు కార్యక్రమానికి నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. హరిబౌలి శ్రీ అక్కన్న మాదన్న మహంకాళీ ఆలయానికి చేరుకున్న కమిషనర్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ఏనుగు అంబారీపై ప్రధాన ఊరేగింపును జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీకైన హైదరాబాద్‌లో బోనాల ఉత్సవాలకు చాలా ప్రాముఖ్యత ఉందన్నారు. ఉత్సవాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని విభాగాల సమన్వయంతో ఏర్పాట్లు చేశామన్నారు. శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా షీ టీమ్స్, ప్రత్యేక బలగాలతో పటిష్ట బందోబస్తు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో నగర్ అదనపు కమిషనర్(శాంతిభద్రతలు) విక్రంమాన్‌సింగ్, దక్షిణ మండల డీసీపీ స్నేహ మెహ్రా, అదనపు డీసీపీ జహంగీర్, ఆలయ కమిటీ అధ్యక్షుడు జగన్మోహన్, కార్యదర్శి దత్తాత్రేయ, ఇతర సభ్యులు ఉన్నారు.

ఘనంగా బోనాల వేడుకలు



బోనాల వేడుకల్లో శ్రీనిధి స్కూల్ చిన్నారులు

వెంగళరావునగర్: వెంగళరావునగర్ డివిజన్ పరిధి మధురానగర్ కాలనీలోని శ్రీనిధి స్వీట్ ఏంజిల్స్ పాఠశాలలో సోమవారం బోనాల వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సంప్రదాయ దుస్తులతో విద్యార్థులు అలరించారు. విద్యార్థులు బోనం ఎత్తుకుని అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. తెలంగాణా సంస్కృతి ప్రతిబింబించేలా అనేక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ కొల్లి లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ తెలంగాణాలోని అన్ని పండుగల్లో బోనాలు పర్వదిన వేడుకలు అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంటాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ కె.గీత, వైస్ ప్రిన్సిపాల్స్ విమల, రాజేశ్వరి, ఇన్‌చార్జి రావత్, టీచర్లు కుముదవల్లి, సీమ, శ్రీలక్ష్మి, భవానీ, పూర్ణిమ, మృదుల విద్యార్థినీ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలిండియా కౌన్సిల్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ సెక్రటరీగా సింహం



ధాత్రిక సింహం

బంజారాహిల్స్: ఆలిండియా కౌన్సిల్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ సెక్రటరీగా బంజారాహిల్స్ రోడ్డునెంబర్-2లోని ఇందిరానగర్‌కు చెందిన ధాత్రిక సింహం నియమితులయ్యారు. మైనార్టీ వెల్ఫేర్, ఉమెన్ వెల్ఫేర్, సీనియర్ సిటిజన్స్, మానవ అక్రమ రవాణా, మానవ హక్కులను కాపాడడం, గృహహింస, పిల్లలను వేధించడం, విద్యా సంస్థల్లో అవినీతి, అక్రమాలు వెలికితీయడం, సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లడమే లక్ష్యంగా ఈ సంస్థ పనిచేస్తోంది. సంస్థ లక్ష్యాలు, ఉద్దేశాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా సింహం తెలిపారు. తనకు ఈ పదవి ఇచ్చినందుకు నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పదవితో తన బాధ్యత మరింత పెరిగిందని పేర్కొన్నారు.

బడ్జెట్‌లో బీసీలకు తీరని అన్యాయం

లిబర్టీ: కేంద్ర బడ్జెట్‌లో బీసీలకు తీరని అనాయం జరిగిందని బీసీ దళ్ జాతీయ అధ్యక్షులు దుండ్రు కుమారస్వామి ఆరోపించారు. దళ్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2024-25 వార్షిక బడ్జెట్‌లో బీసీలకు మొండి చేయి చూపించారని ఆరోపించారు. బీసీలకు కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా ఎన్డీఏ ప్రభుత్వం అన్యాయం చేస్తుంటే బీసీ మంత్రులు బీసీ పార్లమెంటు సభ్యులు, బీసీ రాజ్యసభ సభ్యులు ఏం చేస్తున్నారని నిలదీశారు. ప్రభుత్వం వెంటనే కేబినేట్ సమావేశమై బడ్జెట్‌ను పూర్తిస్థాయిలో సవరించి బీసీల ప్రగతి కోసం రెండు లక్షల కోట్లు కేటాయించకపోతే జాతీయ స్థాయిలో బీసీల సమర పోరాటానికి శ్రీకారం చూడతారని, ఆ పోరాటానికి కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం బాధ్యత వహించాలని హెచ్చరించారు.

ఆగస్టు 8,9 తేదీల్లో చలో ఢిల్లీ

పంజగుట్ట: ప్రధాని నరేంద్రమోదీ ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి మాదిగలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, మాదిగ సంఘాల జేఏసీ వ్యవస్థాపకులు డాక్టర్ పిడమర్తి రవి డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించాలని మాదిగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఆగస్టు 8, 9వ తేదీల్లో చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ మాదిగలను ఓటు బ్యాంకుగా వాడుకునేందుకు కుట్ర చేసిందని అందుకు పావులా మందకృష్ణను వాడుకుందన్నారు. మందకృష్ణ మాదిగ ఇప్పటికైనా మౌనం వీడి బిజేపీ చేసిన మోసాన్ని ప్రశ్నించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాదిగ రాజకీయ పోరాట వేదిక అధ్యక్షులు చంద్రశేఖర్, వివిధ మాదిగ సంఘాల ప్రతినిధులు బాబురావు, రమేష్, బొంకూరి సురేందర్, సన్నీ, గద్ద యాదయ్య, మొగులయ్య, బోరెల్లి సురేష్, నక్క మహేష్, విజయ లక్ష్మి, ప్రశాంత్, నరేష్, గణేష్, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

బోనాల వేడుకల్లో అజారుద్దీన్ కుమారుడు



పూజలు నిర్వహిస్తున్న మహమ్మద్ అసద్

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ హేమావతినగర్‌లోని పోచమ్మ దేవాలయంలో సోమవారం బోనాల వేడుకలకు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మాజీ ఎంపీ అజారుద్దీన్ కుమారుడు, కాంగ్రెస్ యువనేత మహమ్మద్ అసద్ హాజరై పూజల్లో పాల్గొన్నారు. నేతలు రవిగౌడ్, రమేష్‌నాయక్ పాల్గొన్నారు.

ఖైరతాబాద్ ఫ్లైఓవర్‌ను పరిశీలించిన అధికారులు



ఫ్లై ఓవర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ఖైరతాబాద్: ఖైరతాబాద్ ఫ్లై ఓవర్‌పై వరుసగా జరుగుతున్న ప్రమాదాలను అరికట్టేందుకు ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్ఎంసి డిప్యూటీ ఇంజినీర్, ట్రాఫిక్ ఇంజినీర్ సెల్ విభాగం అధికారులు సోమవారం ఫ్లై ఓవర్‌ను పరిశీలించారు. ఫ్లై ఓవర్‌పై జరుగుతున్న ప్రమాదాల నివారణకు ఏం చేయాలనే అంశాలపై పలు సూచనలు చేశారు. ఫ్లై ఓవర్‌పై స్పీడ్ లిమిట్‌ను సూచిస్తూ సైన్ బోర్డులు ఏర్పాటు, రెండు వైపులా 5 ఇంచ్‌ల మేర స్పీడ్‌ను కంట్రోల్ చేసే రబ్బర్ స్ట్రిప్స్ ఏర్పాటు, ట్రాఫిక్ సైన్ బోర్డులు, చెట్ల కొమ్మల తొలగింపు చేయడంతో పాటు స్పీడ్ లిమిట్, ఓవర్ టేకింగ్ కంట్రోల్, ఫ్లై ఓవర్ మొదట్లో ప్రమాద హెచ్చరిక బోర్డులు వంటివి ఏర్పాటు చేయడం వల్ల ప్రమాదాలను అరికట్టవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసి డిప్యూటీ ఇంజినీర్ కృష్ణ చైతన్య, ట్రాఫిక్ ఇంజినీరింగ్ సెల్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, సైఫాబాద్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ బాలబాలికలకు ప్రత్యేక శిక్షణ

- ఎన్‌బీటీనగర్ ప్రభుత్వ పాఠశాలలో దివ్యాంగులకు తర్ఫీదు
- అవసరమైన వారికి ఫిజియోథెరపీ
- పాఠశాలకు రాలేని వారికి ప్రతి శనివారం ఇంటి వద్దే బోధన



దివ్యాంగులకు తర్ఫీదునిస్తున్న భవిత కేంద్రం ఉపాధ్యాయురాలు..

బాలలకు బాసటగా..

భవిత కేంద్రాలు..!

బంజారాహిల్స్: మానసిక, శారీరక వైకల్యంతో బాధపడే బాలలకు భవిత కేంద్రాలు బాసటగా నిలుస్తున్నాయి. వివిధ పద్ధతుల్లో ప్రత్యేక శిక్షణ పొందిన ఉపాధ్యాయులు విద్యనందిస్తూ సాధారణ విద్యార్థులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారు. బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని ఎన్‌బీటీనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో, ఖైరతాబాద్-2 మండల పరిధిలో అమీర్‌పేట డీకే రోడ్డు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో, ఖైరతాబాద్-1 మండల పరిధిలోని ఎస్ఎస్‌పీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లోని భవిత కేంద్రాల్లో దివ్యాంగులైన పిల్లలకు ఉచితంగా విద్యతో పాటు మానసికోల్లాసాన్ని కలిగించే ఆటపాటలు, ఫిజియోథెరపీ ప్రత్యేక పద్ధతుల్లో శిక్షణ అందిస్తున్నారు. 21 రకాల వైకల్యాలు కలిగిన బాల బాలికలను గుర్తించి తగిన శిక్షణ అందిస్తున్నారు. ప్రత్యేక సదుపాయాలు అందిస్తూ ఈ విభిన్న ప్రతిభావంతుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తున్నారు. షేక్‌పేట, ఖైరతాబాద్ మండలాల పరిధిలో ఒక్కొక్కటి చొప్పున, ఖైరతాబాద్ జోన్ పరిధిలో రెండు భవిత కేంద్రాలు కొనసాగుతున్నాయి. వందల్లో విద్యార్థులు ఇక్కడ అభ్యసిస్తున్నారు. పాఠశాలకు రాలేని స్థితిలో ఉన్న విద్యార్థులకు ప్రతి శనివారం ఇంటి వద్దకే వెళ్లి బోధన అందిస్తున్నారు.

అభ్యాసనా సామర్థ్యాలు పెంచడమే లక్ష్యం..



భవిత కేంద్రాల్లో ఐదేళ్ల నుంచి 15 ఏళ్ల వయస్సున్న వారికి ప్రవేశాలు కల్పిస్తున్నారు. ప్రతి యేటా ఐఈఆర్‌పీలు జిల్లా వ్యాప్తంగా సర్వే నిర్వహిస్తూ వైకల్యంతో బాధపడే వారిని గుర్తిస్తున్నారు. సమీపంలో ఉండే భవిత కేంద్రాలకు వారిని రప్పించడంతో పాటు సమీపంలో ఉండే ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు నమోదు చేయిస్తున్నారు. వైకల్యంతో బాధపడే వారికి ప్రారంభంలో తర్ఫీదునిస్తున్నారు. సొంతంగా పనులు చేసే స్థాయికి వీరిని తీర్చిదిద్దుతున్నారు. ఫిజియోథెరపీ, యోగా, వ్యాయామ సాధన చేయిస్తున్నారు. అభ్యాసన సామర్థ్యాలు పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ప్రాథమిక స్థాయిలో విద్యాబుద్ధులు నేరిస్తూ పరిస్థితి మెరుగైన తరువాత పాఠశాలకు తరలిస్తున్నారు. అలాగే వైద్య శిబిరాలు నిర్వహిస్తూ కావలసిన వైద్యం, ఉపకరణాలు అందేలా చొరవ చూపిస్తున్నారు.

మొన్నటి దాకా చెత్తాచెదారం..

ఇప్పుడేమో ఆకర్షణీయ ఉద్యానవనం..!

- ఎకరం విస్తీర్ణంలో రూ.కోటి వ్యయంతో పార్కు నిర్మాణం
- ఇప్పటికే పూర్తయిన 60 శాతం పనులు
- మరికొద్ది రోజుల్లోనే అందుబాటులోకి 'రెయిన్‌బో' పార్కు



రెయిన్‌బో పార్కు నమూనా



చురుగ్గా జరుగుతున్న పార్కు పనులు

బంజారాహిల్స్: నిన్నమొన్నటి వరకు హైటెన్షన్ వైర్ల కింద స్థలాలు ఖాళీగా ఉండి చెత్తా చెదారం, మురుగు, పిచ్చి మొక్కలకు నిలయంగా కనిపించాయి. ముఖ్యంగా జూబ్లీహిల్స్ కాలనీలో హైటెన్షన్ వైర్లు భారీ స్తంభాలతో ఏర్పడి జాగా పూర్తిగా ఖాళీగా ఉంది. వీటిని అందంగా తీర్చిదిద్దాలని జీహెచ్ఎంసీ నిర్ణయించి ఆసక్తి గల వారి నుంచి సీఎస్ఆర్ ప్రాజెక్టు కింద ముస్తాబు చేసేందుకు అనుమతులు ఇచ్చింది. ఇందులో భాగంగా జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-45 ప్రధాన రహదారిలో బ్రాడ్ వే పబ్ ముందు సుమారు ఎకరం విస్తీర్ణంలో హైటెన్షన్ వైర్లు, స్తంభాలు ఉన్న ప్రాంతాన్ని 'రెయిన్‌బో' పార్కుగా తీర్చిదిద్దేందుకు సైబర్ సిటీ బిల్డర్స్ సీఎస్ఆర్ ప్రాజెక్టు కింద ముందుకొచ్చింది. గత మూడు నెలల నుంచి పూర్తిగా మట్టి కొట్టుకుపోయిన ఈ ప్రాంతంలో మరమ్మతులు చురుగ్గా జరుగుతున్నాయి. రూ.కోటి వ్యయంతో ఎకరం విస్తీర్ణంలో రంగురంగుల పూల మొక్కలు, వాటర్ ఫౌంటెన్‌లు, కొలనులు, బండలనే బంగారు వర్ణంలో తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపుదిద్దుకున్నాయి. సప్త వర్ణాలతో కూడిన ఆర్చీని ఆకర్షణీయంగా నిర్మించేందుకు పనులు చకచకా జరుగుతున్నాయి. పైనుంచి హైటెన్షన్ వైర్లు, కింది నుంచి వరద నీటి కాలువ ఉండగా, ఈ మొత్తం స్థలాన్ని పచ్చదనంతో రంగురంగుల పూలమొక్కలతో తీర్చిదిద్దే క్రమంలో ఇప్పటికే 60 శాతం పనులు పూర్తయ్యాయి. ఈ పార్కు పనులు పూర్తయితే జూబ్లీహిల్స్‌లోనే అత్యంత మనోహరమైన ఉద్యానవనం అందుబాటులోకి రావడమే కాకుండా మొన్నటిదాకా పిచ్చిమొక్కలతో స్థానికులకు ప్రత్యక్ష నరకాన్ని చూపించిన ఈ ప్రాంతం ఆహ్లాదాన్ని పంచనుంది. పబ్‌లు, వస్త్రాల షోరూంలు, ఆభరణాల దుకాణాలు ఉన్న ఈ రోడ్డులో ఈ పార్కు ఐకాన్‌గా నిలవనుంది. సైబర్ సిటీ బిల్డర్స్ ఈ ప్రాజెక్టును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని డబ్బుకు వెనుకాడకుండా పెద్ద మొత్తంలో వెచ్చిస్తూ ఖరీదైన, ఆకట్టుకునే మొక్కలను నాటేందుకు సిద్ధమవుతున్నారు.

'ఎఫ్ఎన్‌సీసీ'కి సహకరిస్తా



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ

కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ

ఫిలింనగర్: ఫిలింనగర్ కల్చరల్ సెంటర్ (ఎఫ్ఎన్‌సీసీ)కి తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. ఆయన నర్సాపురం ఎంపీగా గెలిచి ఉక్కు, భారీ పరిశ్రమల శాఖామంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత తొలిసారిగా ఫిలింనగర్ కల్చరల్ సెంటర్‌ను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలోని నెంబర్‌వన్ స్థానంలో ఉన్న ఎఫ్ఎన్‌సీసీ ఎన్నో రకాల స్పోర్ట్స్ టోర్నమెంట్లతో పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని దానికి తన సహకారం కూడా ఉంటుందని అన్నారు. అనంతరం ఎఫ్ఎన్‌సీసీ సెక్రటరీ ముళ్లపుడి మోహన్, సంయుక్త కార్యదర్శి వివిఎస్.పెద్దిరాజు, కోశాధికారి రాజశేఖర్‌రెడ్డి, బాలరాజు, ఏడిదరాజు, సామ ఇంద్రపాల్‌రెడ్డిలు శ్రీనివాసవర్మను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నటుడు మాగంటి మురళీ మోహన్, రచయిత పరుచూరి గోపాలకృష్ణ, చాంబర్ సెక్రటరీ దామమోదర్ ప్రసాద్, నిర్మాతల మండలి సెక్రటరీ ప్రసన్న కుమార్ పాల్గొన్నారు.

సాహిత్యంలో 'సినారె'ది ప్రత్యేక ముద్ర

లిబర్టీ: తెలుగు సాహిత్యంలో సి.నారాయణ రెడ్డి తనదైన ముద్ర వేసుకున్నారని లోక్‌దళ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షులు, జాతీయ కార్యదర్శి పి.వి.రాజేశ్వరరావు అన్నారు. సి.నారాయణరెడ్డి సాహిత్యం హిందీ, ఇంగ్లిష్ ఇతర భాషల్లో కూడా అనువాదమై జాతీయ స్థాయిలో రచయితగా, కవిగా పేరు పొందారన్నారు. డాక్టర్ సి.నారాయణరెడ్డి జయంతిని పురస్కరించుకొని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పద్మభూషణ్ జ్ఞానపీఠ అవార్డు అందుకొని తెలుగు సాహిత్యానికి ప్రపంచ చిత్రపటంలో నిలిపారని ఆయన పేర్కొన్నారు. ఇటు రచనలు చేస్తూ అటూ కవిత్వం రాస్తూ అనేక చిత్రాల్లో పాటలు రాసి తెలుగు వెండితెరకు తెలుగు వెలుగులు నింపారని, తెలుగు ప్రజల హృదయాల్లో నిలిచిపోయారని కొనియాడారు. ఈ సమావేశంలో సంకీర్త, పి.వి.శ్రీనివాస్‌రావు, రేవంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆకస్మిక తనిఖీ

పంజగుట్ట: పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌ను పశ్చిమ మండల డీసీపీ విజయ్ కుమార్ సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. సుమారు రెండు గంటలకు పైగా స్టేషన్‌లో ఉన్న ఆయన కేసుల దర్యాప్తు తీరు, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. పంజగుట్ట ఏసీపీ మోహన్ కుమార్, ఇనిస్పెక్టర్ శోభన్‌లు ఆయనకు కేసుల వివరాలు వెల్లడించారు. విధినిర్వహణలో ఎవ్వరూ అలసత్వం వహించకూడదని సూచించారు.

మంత్రి వర్గంలో అవకాశం కల్పించాలి

హిమాయత్‌నగర్: రాష్ట్ర మంత్రివర్గంలో గొల్ల కురుమలకు అవకాశం కల్పించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం అధ్యక్షులు శ్రీహరి యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక తమను విస్మరించిందన్నారు. తమకు నామినేటెడ్ పదవుల్లో తీవ్ర అన్యాయం చేశారని ఆరోపించారు. రూ.10 వేల కోట్లతో యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు.

భక్తులను కాపాడే బాధ్యత నాదే

ఖైరతాబాద్ రంగం కార్యక్రమంలో రేణుకా మాత



రంగంలో భవిష్యవాణి చెప్తున్న రేణుకా మాత....

ఖైరతాబాద్: ఖైరతాబాద్ డివిజన్‌లోని మహంకాళి అమ్మవారి దేవాలయంలో సోమవారం రంగం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లాల్ బజార్‌కు చెందిన రేణుకా మాత భవిష్యవాణి చెప్పారు. ఈ సారి పూజలు చాలా ఘనంగా జరిగాయని, అయిదు వారాలపాటు 11 మంది ముత్తైదువలు తనకు సాక పెట్టాలని, ఈసారి కుంభ వర్షాలు పడతాయని, అంతటా తన భక్తులను కాపాడే బాధ్యత తనదే అని భవిష్యవాణి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ భవాని కృష్ణ యాదవ్, అధ్యక్షుడు శ్రీశైలం యాదవ్, ప్రధాన కార్యదర్శి మధుకర్ యాదవ్, కోశాధికారి బాలయ్య యాదవ్, ఆర్గనైజర్ సెక్రటరీలు రాము యాదవ్, లక్ష్మణ్‌యాదవ్, అనిల్, చౌదరి యాదయ్య, రాజ్ కిరణ్, సుజిత్, మహేష్ యాదవ్‌లతో పాటు కార్పొరేటర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రికి నివాళి



ముఖేష్‌గౌడ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న వెన్న సదానందు తదితరులు

లిబర్టీ: మాజీ మంత్రి, పేదల పెన్నిధి ఎం.ముఖేష్‌గౌడ్‌కు సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి వెన్న సదానందు అంజలి ఘటించారు. ముఖేష్‌గౌడ్ 5వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ముఖేష్‌గౌడ్ కిందిస్థాయి నుంచి అంచెలంచెలుగా కాంగ్రెస్ పార్టీలో ఎదిగారని ఆయన గుర్తు చేశారు. శాసన సభ్యులుగా, మంత్రిగా ఆయన ప్రజలకు సేవలు అందించారని నగర అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం సేవలు అందించారని ఆయన పేర్కొన్నారు.

గంగాధరరెడ్డికి డాక్టరేట్

శ్రీనగర్‌కాలనీ: నగరానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త దొంటిరెడ్డి గంగాధరరెడ్డి(గ్యాంజెస్ రెడ్డి)కి షికాగో ఓపెన్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ లభించింది. న్యూఢిల్లీలోని ఇంటర్నేషనల్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సామాజిక, పర్యావరణ, వ్యాపార రంగాల్లో విశిష్ట కృషికి గౌరవ డాక్టరేట్‌ను యూనివర్సిటీ ప్రతినిధుల నుంచి అందుకున్నారు. పర్యావరణ పరిరక్షణకు బ్లూడ్రాప్ ఎన్విరో సంస్థను స్థాపించి నీటి కాలుష్య నివారణ చర్యలకు శ్రీకారం చుట్టారు. అంతేకాకుండా రామచంద్రమిషన్‌లో సైతం విశేష సేవలను దొంటిరెడ్డి గంగాధరరెడ్డి నిర్వహించారు. ఈ అవార్డు నాలో మరింత బాధ్యతను పెంచిందని, సామాజికసేవలు, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడతానని గంగాధరరెడ్డి పేర్కొన్నారు.



గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న దొంటిరెడ్డి గంగాధరరెడ్డి

జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు కృష్ణతేజ ఎంపిక



కృష్ణతేజ

వెంగళరావునగర్: జాతీయస్థాయిలో జరగనున్న బాస్కెట్‌బాల్ పోటీలకు యూసుఫ్‌గూడలోని మహాత్మాగాంధీ మెమోరియల్ (ఎంజీఎం) స్కూల్ విద్యార్థి పి.కృష్ణతేజ ఎంపికయ్యాడు. ఇటీవల నగరంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పి.కృష్ణతేజ తన ప్రతిభను చాటుకున్నాడు. స్టూడెంట్స్ ఒలింపిక్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధికారులు ఈ విద్యార్థిని త్వరలో హరియాణాలో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. దీనిని పురస్కరించుకుని సోమవారం స్కూల్ ప్రాంగణంలో జరిగిన ప్రత్యేక వేడుకల్లో యాజమాన్యం కృష్ణతేజను అభినందించింది. ఈ సందర్భంగా ఎంజీఎం స్కూల్ చైర్మన్ ఎంఎం నాయుడు మాట్లాడుతూ తమ పాఠశాలలో 8వ క్లాస్ చదువుతున్న పోతురాజు కృష్ణతేజ జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక కావడం తమకెంతో గర్వకారణంగా ఉందని పేర్కొన్నారు. జాతీయస్థాయి పోటీల్లో కూడా కృష్ణతేజ తన ప్రతిభను చాటాలని ఆకాంక్షించారు.

క్రైం కార్నర్..

వ్యక్తిపై దాడి

వెంగళరావునగర్: టీ తాగడానికి వచ్చిన వ్యక్తిపై అకారణంగా దాడి చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. రహమత్‌నగర్ కమాన్‌గల్లీకి చెందిన మహ్మద్ ఇస్సాక్ ఆదివారం టీ తాగడానికి షాపులోకి వెళ్ళాడు. తిరిగి వచ్చే సమయానికి దీపక్ అనే వ్యక్తి అడ్డుగా నిలబడ్డాడు. పక్కకు జరగమన్నందుకు దీపక్ ఆగ్రహించి ఇస్సాక్‌పై దాడి చేశాడు. స్థానికులు అడ్డుకోగా దుర్భాషలాడుతూ చంపుతానని బెదిరించాడు. అతనిపై చర్యలు తీసుకోవాలంటూ ఇస్సాక్ మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ల్యాప్‌టాప్ కొనడానికి వచ్చి చోరీ

వెంగళరావునగర్: ల్యాప్‌టాప్ కొనటానికి వచ్చానని చెప్పి చోరీకి పాల్పడిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. ఈనెల 28న ఎస్ఆర్‌నగర్‌లోని ఎల్రక్టానిక్స్ షాపులోకి యువతి వచ్చి షాపు యజమాని రాజీవ్‌గౌడ్‌తో తాను ల్యాప్‌టాప్ కొనడానికి వచ్చినట్టుగా చెప్పింది. కొద్దిసేపు పరిశీలించి తన ఫ్రెండ్ వచ్చాక తీసుకుంటానని, అప్పటి వరకు షాపులో ఉంటానంది. రాజీవ్‌గౌడ్ మరో కస్టమర్‌తో మాట్లాడటానికి పక్కకు వెళ్ళి తిరిగి వచ్చాడు. అయితే మహిళతో పాటు ల్యాప్‌టాప్ అదృశ్యమైంది. దీంతో రాజీవ్‌గౌడ్ మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సిగరెట్ పీకలు వేయవద్దన్నందుకు... కానిస్టేబుల్‌పై దాడి

వెంగళరావునగర్: సిగరెట్ పీకలు వేయవద్దన్నందుకు ముగ్గురు యువకులు కానిస్టేబుల్‌పై దాడి చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... స్థానిక సిద్ధార్థనగర్‌కాలనీలోని ప్రశాంక్ అపార్ట్‌మెంట్స్‌లో సమ్మయ్య కుటుంబ సభ్యులు నివసిస్తుంటారు. గత రెండు నెలల నుంచి పక్క అపార్ట్‌మెంట్స్‌లో ఉంటున్న ముగ్గురు యువకులు ప్రతిరోజు సిగరెట్లు తాగి పక్కనే ఉంటున్న సమ్మయ్య ఇంటి ముందు వేస్తున్నారు. అనేకసార్లు చెప్పినా వారు వినలేదు. ఆదివారం మధ్యాహ్నం సమ్మయ్య సతీమణి, వాచ్‌మెన్ దస్తయ్యలు యువకులతో సిగరెట్ పీకలు వేయవద్దని చెప్పారు. దీంతో ఆగ్రహించిన నరేష్ చౌదరి, మనోహర్‌రెడ్డి, మోహిత్ నాగేంద్రలు ఆమెను దుర్భాషలాడారు. ఈ విషయాన్ని ఆమె తన కుమారుడు కానిస్టేబుల్ అయిన సాగర్‌కు తెలియజేసింది. విధులు ముగించుకుని ఇంటికి వచ్చిన సాగర్ తన తల్లిని ఎందుకు దూషించారని, సిగరెట్ పీకలు వేయవద్దు అని సదరు యువకులను నిలదీయగా అప్పటికే మద్యం సేవించి ఉన్న వారు సాగర్‌పై దాడి చేసి గాయపరిచారు. దీంతో బాధితులు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో కేసును దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రేత అరెస్టు

- 2.105 కిలోల డ్రై గంజాయి స్వాధీనం

బంజారాహిల్స్: హైదరాబాద్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ టీం, జూబ్లీహిల్స్ ఎక్సైజ్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో యూసుఫ్‌గూడ చెక్‌పోస్టు నుంచి ఓ యువకుడు పెద్ద మొత్తంలో డ్రై గంజాయిని తరలిస్తుండగా పట్టుకున్నారు. ఒడిశాకు చెందిన యశ్ అగర్వాల్ గత కొంతకాలంగా ఒడిస్సా నుంచే గంజాయి తీసుకువచ్చి హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో తెలిసిన కస్టమర్లకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. ఈ నేపథ్యంలోనే పక్కా సమాచారం అందుకున్న ఎక్సైజ్ పోలీసులు ఆదివారం రాత్రి యూసుఫ్‌గూడ చెక్‌పోస్టులో మాటువేశారు. ద్విచక్ర వాహనంపై వస్తున్న యశ్ అగర్వాల్‌ను ఆపి సోదాలు నిర్వహించగా 2.105 కిలోల డ్రై గంజాయి బ్యాగ్‌లు పట్టుబడ్డాయి. నిందితుడిని అరెస్టు చేసి బైక్‌తో పాటు గంజాయిని సీజ్ చేశారు.

నగరంలో నేడు



- మాదాపూర్ హైటెక్‌సిటీలోని ఇనార్బిట్ మాల్‌లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఆర్ట్ ల్యాబ్, విజువల్ స్టోరీ టెల్లర్‌పై క్యాంప్ జరుగుతుంది.
- తెలంగాణ చాంబర్ ఆఫ్ ఈవెంట్స్ ఇండస్ట్రీ(టీసీఈఐ) మధ్యాహ్నం 3.30గంటలకు జూబ్లీహిల్స్ రోడ్ నెం.25లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి హెచ్‌ఆర్‌డీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ తెలంగాణలో ఇన్వెస్టర్స్ వేడుక నిర్వహిస్తుంది.



- పాతబస్తీలోని సాలార్‌జంగ్ మ్యూజియం సందర్శన ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుంది.
- సీల్‌వెల్ కార్పొరేషన్, శృతిలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో.. రవీంద్ర భారతీలో సీల్‌వెల్ సినీ సుస్వరాలు–61 కార్యక్రమం ఉంటుంది.



అర్చక సమాఖ్య రాష్ట్రస్థాయి సమావేశం రేపు

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ రాష్ట్ర సర్వీస్ ఇనాందారులు, వంశ పారంపర్య అర్చకుల సమాఖ్య రాష్ట్రస్థాయి సమావేశం బుధవారం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ అర్చక సమాఖ్య రాష్ట్ర నాయకుడు కొడకండ్ల రామగిరి శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతి పత్రం అందించేందుకు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. రాష్ట్రంలోని వివిధ దేవాలయాల్లో పనిచేస్తున్న వంశపారంపర్య అర్చకులు, సర్వీస్ ఇనాందార్ అర్చకులు అందరూ హాజరు కావాలని కోరారు. కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఇనాందారుల అర్చక సమాఖ్య గౌరవాధ్యక్షులు రంగరాజన్ (చిలుకూరు బాలాజీ దేవాలయం), ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అర్చక సమాఖ్య అధ్యక్షులు అగ్నిహోత్రం ఆత్రేయ బాబు, ఖమ్మం జిల్లా అర్చక సంఘం అధ్యక్షులు శ్రీదాములూరి వీరభద్రశర్మ, తెలంగాణ రాష్ట్ర ధూపదీప నైవేద్య సంఘ అధ్యక్షులు వాసుదేవ శర్మ, వరంగల్ శ్రీభద్రకాళీ దేవాలయ ప్రధాన అర్చకులు శేషు, ఇనాందారుల అర్చక సమాఖ్య న్యాయ సలహాదారులు పవన్ కుమార్ పూజారి తదితరులు హాజరవుతారని తెలిపారు.

మాజీ మంత్రి ముఖేష్‌గౌడ్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి కేటీఆర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యేలు పద్మారావు గౌడ్, మాగంటి గోపీనాథ్

అబిడ్స్: మాజీ మంత్రి ముఖేష్‌గౌడ్ 5వ వర్ధంతి నాంపల్లి ఎగ్జిబిషన్ గౌండ్స్‌లో సోమవారం నిర్వహించిన సంస్మరణ సభకు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి, మాజీ మంత్రి కేటీఆర్, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేష్, మాగంటి గోపీనాథ్, పద్మారావుగౌడ్, రాజాసింగ్, ఎమ్మెల్సీ ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, విష్ణువర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు ఫిరోజ్‌ఖాన్, ఎమ్మార్పీఎస్ గ్రేటర్ నాయకులు రవి మాదిగతో పాటు పలువురు ప్రముఖులు హాజరై ముఖేష్ గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వర్సిటీలకు వీసీలను నియమించండి

మంత్రి దామోదర రాజనర్సింహకు విద్యార్థి నేతల వినతి



మంత్రికి అభినందనలు తెలుపుతున్న విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని ప్రభుత్వ యూనివర్సిటీలకు వీసీలను నియమించాలని మంత్రి దామోదర రాజనర్సింహకు ఓయూ విద్యార్థి నేతలు వినతి పత్రం సమర్పించారు. మంత్రి నివాసంలో ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి ఆధ్వర్యంలో దామోదర రాజనర్సింహను సోమవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపి వర్సిటీల సమస్యలను వివరించినట్లు చెప్పారు. వర్సిటీల్లో ఖాళీగా టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని, పైరవీలకు తావులేకుండా అన్ని అర్హతలు గల ప్రొఫెసర్లను వీసీలుగా నియమించాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థి నేతలు పులిగంటి వేణుగోపాల్, సురేష్, శివశంకర్, రాజు, రవి, శ్రీనివాస్, కుమార్, చందు, బాలు, వేణు, సూరి, అజయ్, ప్రశాంత్, మహేష్, సంతోష్, ప్రవీణ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పనులకు.. కదలిక!

- రెండో దశ పనులకు త్వరలో శ్రీకారం
- ఫ్లై ఓవర్లు, టన్నెల్ రోడ్లు, నాలాల పనులకు..
- హైసిటీ నిధులతో అధికారుల్లో కొత్త ఆశలు



సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో చేపట్టనున్న వివిధ పనులకు సంబంధించి ఇప్పటి వరకు అగమ్యగోచరంగా ఉన్న అధికారుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. ఎస్‌ఆర్‌డీపీ(వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి పథకం), ఎస్‌ఎన్‌డీపీ(వ్యూహాత్మక నాలా అభివృద్ధి పథకం), ఇతరత్రా పథకాల కింద గడిచిన ఏడెనిమిదేళ్లలో ఎన్నో పనులు చేశారు. వాటి మొదటి దశలోని పనులు దాదాపు పూర్తికాగా, రెండోదశ పనులను సైతం ప్రతిపాదించిన అధికారులు, ఇప్పటి వరకు నిధుల లేమితో వాటి విషయంలో అడుగు ముందుకు వేయలేకపోయారు. ఆ పనులు చేపట్టేందుకు జీహెచ్‌ఎంసీ ఖజానాలో నిధులు లేకపోవడం, ఇప్పటికే భారీగా అప్పులు చేసినందున ఇక కొత్త అప్పులు పుట్టే పరిస్థితి లేకపోవడంతో సందిగ్ధంలో పడ్డారు.

'హైసిటీ' నిధులతో..

ఈ నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో చేపట్టే పనులన్నింటినీ 'హైసిటీ (హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్)' కింద చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించడంతో పాటు 'హైసిటీ'కి రాష్ట్ర బడ్జెట్‌లో రూ.3,065 కోట్లు కేటాయించడంతో ఇక పనులు చేయవచ్చనే ధీమా వచ్చింది. దాంతో ఎస్‌ఆర్‌డీపీ, ఎస్‌ఎన్‌డీపీ కార్యక్రమాల కింద రెండో దశ ప్రతిపాదనలు కార్యరూపం దాల్చే మార్గం ఏర్పడిందని చెబుతున్నారు.

ఎస్‌ఆర్‌డీపీ–2 పనులు..

ఎస్‌ఆర్‌డీపీ తొలిదశ కింద రూ.6 వేల కోట్లకు పైగా నిధులతో పనులు చేపట్టి ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, ఆర్‌ఓబీలు, ఆర్‌యూబీలు వంటివి దాదాపు 35 పనులు పూర్తిచేశారు. రెండో దశ కింద దాదాపు రూ.3,600 కోట్లతో మరో 35 పనులకు పైగా ప్రతిపాదనలు రూపొందించారు. హైసిటీ కిందే రోడ్ టన్నెల్ మార్గాలు సైతం నిర్మించనున్నారు.

- రెండోదశ పనుల ప్రతిపాదనల మేరకు, జీహెచ్‌ఎంసీ జోన్ల వారీగా అంచనా వ్యయం..

జోన్	అంచనా (రూ.కోట్లు)
శేరిలింగంపల్లి	634
కూకట్‌పల్లి	236
ఖైరతాబాద్	250
సికింద్రాబాద్	512
ఎల్‌బీనగర్	756
చార్మినార్	1,217

వరద ముంపు తొలగేందుకు..

వరద ముంపు సమస్యలు తొలగేందుకు ఎస్‌ఎన్‌డీపీ–2 కింద చేపట్టబోయే పనుల్లో నాచారం పెద్ద చెరువు– ఉప్పల్ నల్ల చెరువు వరకు, తిరుమల హాస్పిటల్– సాగర్ రింగ్‌రోడ్, రామంతాపూర్ చెరువు– ఉస్మానియా యూనివర్సిటీ, డబీర్‌పురా దర్వాజ– ఫర్హత్‌నగర్ నాలా, లక్డీకాపూల్ – నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్, బండ్లగూడ చెరువు– తిమ్మక్క చెరువు వరకు ఆధునిక వరద కాల్వల నిర్మాణంతో పాటు ఆయా ప్రాంతాల్లో ఆర్‌సీసీ బాక్స్ డ్రెయిన్లు, ఓపెన్ డ్రెయిన్లు, టన్నెల్ నిర్మాణం వంటివి ఉన్నాయి.

- (పాతబస్తీ పరిధిలోని చార్మినార్ జోన్‌కు మిగతా జోన్ల కంటే ఎక్కువ నిధులతో ప్రతిపాదనలు ఉండటం కింది పట్టికలో గమనించవచ్చు.)

ఎస్‌ఎన్‌డీపీ–2 పనులు

ఎస్‌ఎన్‌డీపీ తొలిదశ కింద దాదాపు రూ.985 కోట్లతో పనులు చేపట్టగా అవి దాదాపు పూర్తయ్యాయి. రెండోదశ కింద దాదాపు రూ.460 కోట్లతో 35 పనులు చేసేందుకు సిద్ధమయ్యారు.

ఎస్ఎన్‌డీపీ రెండో దశ పనులు.. అంచనా వ్యయం వివరాలిలా..

జోన్	అంచనా (రూ. కోట్లు)
ఎల్‌బీనగర్	131.61
చార్మినార్	165.95
ఖైరతాబాద్	73.91
శేరిలింగంపల్లి	102.89
కూకట్‌పల్లి	103.31
సికింద్రాబాద్	18.61

పర్యావరణ పరిరక్షణే నిజమైన దైవభక్తి

– ప్రపంచ పర్యావరణ సంస్థ సదస్సులో వక్తలు



ప్రపంచ పర్యావరణ సంస్థ సదస్సుకు హాజరైన వక్తలు

సనత్‌నగర్: ప్రతిఒక్కరి జీవితం ప్రకృతితో మమేకమై ఉంటుందని, అలాంటి అందమైన ప్రకృతిని ఆస్వాదించాలే గానీ వినాశనం కోరుకోకూడదని అమెరికా కేంద్రంగా సేవలు అందిస్తోన్న ప్రపంచ పర్యావరణ సంస్థ గ్లోబల్ చైర్మన్ డాక్టర్ హరి ఇప్పనపల్లి అన్నారు. ప్రముఖ సంఘ సేవకులు, పర్యావరణ ప్రేమికులు, ఐఆర్‌ఎస్ అధికారి, తెలుగు రాష్ట్రాల ఇన్‌కమ్ ట్యాక్స్ కమిషనర్ లావుడియా జీవన్‌లాల్ జన్మదినం సందర్భంగా అంతర్జాతీయ పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో బేగంపేటలోని దేవనార్ ఫౌండేషన్‌లో సోమవారం జాతీయ స్థాయి సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన హరి ఇప్పనపల్లి మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులను ప్రపంచ పర్యావరణ సంస్థ ఉద్యమంలో భాగస్వాములు చేయడమే కాకుండా వారి ద్వారా ప్రతిఒక్కరిలో సామాజిక స్పృహను కలిగించే లక్ష్యంగా ఈ సదస్సు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. యువతకు స్ఫూర్తిదాయకమైన సందేశాలను అందిస్తూ వారిని దేశం కోసం అంకితం చేసేవిధంగా జీవన్‌లాల్ కృషి చేస్తున్నారని కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ సంస్థ బృందం పదేళ్లుగా తెలుగు రాష్ట్రాల్లో పర్యావరణ పరిరక్షణపై అనేక సదస్సులు ఏర్పాటు చేసిందని, అన్ని కార్యక్రమాల్లో తాను భాగస్వామిగా నిలుస్తున్నాని చెప్పారు. దేశం మీద ప్రేమ, దైవం మీద నమ్మకం ఉన్న ప్రతిఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం తప్ప మరొక ప్రత్యామ్నాయం లేదన్నారు. ఇన్‌కమ్ ట్యాక్స్ కమిషనర్ జీవన్‌లాల్ మాట్లాడుతూ తన జన్మదినం సందర్భంగా మహోన్నతమైన కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రజా గాయని విమలక్క, ప్రపంచ పర్యావరణ సంస్థ కార్యదర్శి నిఖిల్, సంస్థ జాతీయ అధ్యక్షుడు భద్ర, కోశాధికారి రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర కార్యాలయం ముట్టడి



బీజేపీ రాష్ట్ర కార్యాలయ ముట్టడికి యత్నిస్తున్న పాలమూరు యువగళం నేతలు

గన్‌ఫౌండ్రీ: పార్లమెంట్ ఎన్నికల సమయంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్ షా పాలమూరు గడ్డపై ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని పాలమూరు యువగళం వ్యవస్థాపక అధ్యక్షుడు టీకే.శివప్రసాద్ అన్నారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు జాతీయ హోదా సాధించలేని బీజేపీ ఎంపీల పనితీరును నిరసిస్తూ సోమవారం పాలమూరు యువగళం ఆధ్వర్యంలో నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుగా జాతీయ హోదా ఇవ్వకపోగా కనీసం నిధులు కూడా కేటాయించలేదని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. పార్లమెంటు సమావేశంలో ప్రాజెక్టుకు జాతీయ హోదా ప్రకటించాలని, లేదంటే బీజేపీ ఎంపీలను అడ్డుకుంటామని హెచ్చరించారు. అనంతరం బీజేపీ కార్యాలయం లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించిన నాయకులను పోలీసులు అడ్డుకుని వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు.

వ్యవసాయ ఉద్యోగుల బదిలీలను వెంటనే చేపట్టాలి



మాట్లాడుతున్న డాక్టర్ వైద్యనాథ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలో దీర్ఘకాలికంగా ఎదురుచూస్తున్న వ్యవసాయ ఉద్యోగుల బదిలీలను వెంటనే చేపట్టాలని తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వైద్యనాథ్ డిమాండ్ చేశారు. బాగ్‌లింగంపల్లిలో సోమవారం జరిగిన వ్యవసాయ అధికారుల సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. జీవో ఎంఎస్ నంబర్ 80 ప్రకారం నిష్పక్షపాతంగా బదిలీలు చేపట్టాలని కోరారు. దీర్ఘకాలంగా మండలాల్లో పనిచేస్తూ బదిలీల కోసం వ్యవసాయ అధికారులు, సహాయ వ్యవసాయ సంచాలకులు ఎదురుచూస్తున్నారని, అందరికీ ఆమోదయోగ్యంగా ఉండే విధంగా బదిలీలు నిర్వహించాలన్నారు. ఈ బదిలీలు ఉద్యోగం చేస్తున్న భార్యాభర్తలు, దివ్యాంగులు, దీర్ఘకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న వారికి, ఉద్యోగ విరమణకు దగ్గరలో ఉన్న వారికి, దీర్ఘకాలికంగా ఒకే చోట పనిచేస్తున్న ఉద్యోగులకు ఊరట లభిస్తుందన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రుణమాఫీ, రైతు భరోసా, రైతు బీమా, పంటల నమోదు వంటి కార్యక్రమాలు, రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వ్యవసాయ అధికారులు, సహాయ వ్యవసాయ సంచాలకులు సేవలు అందిస్తున్నారని గుర్తుచేశారు. బదిలీలు చేపడితే ప్రభుత్వానికి మంచి పేరు వచ్చేవిధంగా రైతులకు మరింత సేవ చేసే విధంగా ఉద్యోగులు కృషి చేస్తారన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి కృపాకర్‌రెడ్డితో పాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రాష్ట్రంలోని 33 జిల్లాలకు చెందిన అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యాధీశతీర్థ వారి చాతుర్మాస దీక్ష ప్రారంభం





సాక్షి, సిటీబ్యూరో: ఉడిపి జగద్గురు శ్రీమధ్వాచార్య మూల మహా సంస్థానం పలిమారు మఠానికి చెందిన విద్యాధీశతీర్థ శ్రీపాదుల వారి చాతుర్మాస దీక్ష హైదరాబాద్‌లో సోమవారం ప్రారంభమైంది. నగరానికి చేరుకున్న ఆయనకు భక్తులు ఘనంగా స్వాగతం పలికారు. బర్కత్‌పురలోని రాఘవేంద్ర స్వామి మఠం నుంచి కాచిగూడలో ఉన్న లింగంపల్లి రాఘవేంద్ర స్వామి మఠం వరకు శోభాయాత్ర నిర్వహించారు. భక్త బృందాల భజనలు, కోలాటలతో ఈ శోభాయాత్ర దేదీప్యమానంగా సాగింది. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. స్వామీజీ మాట్లాడుతూ చాతుర్మాస్య దీక్ష విశిష్టతను వివరించారు. ధర్మ పరిరక్షణకు ప్రజలు కట్టుబడి ఉండాలని, సమాజంలో పెరిగిన హింస, శత్రుత్వం, అక్రమాలను రూపుమాపడానికి అందరూ కృషి చేయాలని కోరారు. పేదలకు సహాయం చేయడమే భగవత్ సేవ అని స్వామీజీ పిలుపునిచ్చారు. వచ్చే నెల 18 వరకు చాతుర్మాస దీక్ష కొనసాగుతుంది. నగరంలోని పలు ప్రాంతాలను స్వామీజీ సందర్శించనున్నారు. శ్రీమధ్వాచార్యులు పూజించిన శ్రీరామ–సీత–లక్ష్మణుల విగ్రహాలకు ప్రతిరోజూ పీఠపూజ నిర్వహించనున్నారు.

ఉర్దూకు దూరం..!

- తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య – క్రమంగా తరగతుల ఎత్తివేత
- విద్యార్థులకు టీసీలిచ్చి సమీప పాఠశాలల్లో సర్దుబాటు చేస్తున్న వైనం
- వెక్కిరిస్తున్న టీచర్ల ఖాళీలు.. ఈసారి కూడా అడ్మిషన్లు అంతంతే..



రెండు పాఠశాలల్లో..

సాక్షి, సిటీబ్యూరో: ఉర్దూ మీడియంకు విద్యార్థులు దూరమవుతున్నారు. ప్రభుత్వ ఉర్దూ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సంఖ్య ఏటా తగ్గుతోంది. దీంతో ఉర్దూ పాఠశాలలు అస్తిత్వ సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. విద్యార్థులు ఉర్దూ కాకుండా ఇంగ్లిష్ మీడియం పాఠశాలవైపు మొగ్గు చూపుతున్నారు. ప్రాథమిక విద్యార్థుల్లో డ్రాపౌట్ రేటు కూడా పెరుగుతోంది. ఒకవైపు ఉపాధ్యాయుల కొరత, మరోవైపు కనీస వసతుల లేమితో క్రమంగా ఉర్దూ పాఠశాలల సంఖ్య పడిపోతోంది. ముస్లిం సామాజికవర్గం జనాభా అధికంగా గల హైదరాబాద్ జిల్లాలో సైతం ఉర్దూ మీడియంకు ఆదరణ లభించడం లేదు. విద్యార్థుల సంఖ్య తగ్గుముఖం పడుతుండటంతో పాటు బోధన సిబ్బంది సైతం లేక విద్యార్థులకు టీసీలు ఇచ్చి ఇతర పాఠశాలలకు పంపించి క్రమంగా ఉర్దూ మీడియం ఎత్తివేసే ప్రక్రియ ప్రారంభమైంది. ఈ విద్యా సంవత్సరం కూడా ఉర్దూ మీడియంలో అడ్మిషన్ల సంఖ్య మొక్కుబడిగా సాగింది.

తాజాగా నగరంలోని ప్రభుత్వ ఉర్దూ మీడియం న్యూముసారంబాగ్, కాచిగూడ పాఠశాలల్లో పదో తరగతిలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటంతో టీసీలు ఇచ్చి ఇతర పాఠశాలల్లో సర్దుబాటు చేశారు. దీంతో ఈ విద్యాసంవత్సరం పదో తరగతి ఎత్తేసినట్లయ్యింది. ఇదే పరిస్థితి బహదూర్‌పురా మండలంలో కూడా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. వాస్తవంగా ఉర్దూ పాఠశాలల పరిస్థితి ఇతర స్థానిక భాషా పాఠశాలల మాదిరిగానే ఉంటుంది. కొన్ని దశాబ్దాలుగా ఉర్దూ పాఠశాలల సంఖ్య గణనీయంగా తగ్గుతోంది. మౌలిక సదుపాయాలు, విద్యాపరమైన సమస్యలతో పాటు ముస్లిం సామాజికవర్గంలో అవగాహన కూడా క్షీణించడం ఇందుకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. పాఠశాలల్లో మౌలిక వసతులు లేకపోవడం, నాణ్యమైన విద్య అందడం లేదన్న ముందస్తు ఆలోచనే ఈ డ్రాపౌట్స్ పెరగడానికి ప్రధాన కారణమని తెలుస్తోంది.

ఇప్పటికే గురుకులాల్లో మంగళం

గత ప్రభుత్వం ఉర్దూ మీడియం గురుకులాలకు మంగళం పాడింది. 1986లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉర్దూలో నాణ్యమైన ఉచిత విద్య అందించేందుకు ఉర్దూ మీడియం గురుకులాలను ప్రారంభించింది. గత ప్రభుత్వం హయంలో తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ విద్యా సంస్థల సొసైటీ ఏర్పాటు అనంతరం 2017లో ఉర్దూ మీడియంలో ప్రవేశాలు నిలిచిపోయాయి. మూడు దశాబ్దాలుగా కొనసాగిన ఉర్దూ గురుకులాలు ఇంగ్లిష్ మీడియంగా మారిపోయాయి. తాజాగా ప్రభుత్వ ఉర్దూ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుముఖం పట్టిందన్న సాకుతో క్రమంగా ఉర్దూ తరగతులు ఎత్తివేత కార్యక్రమం కొనసాగుతోంది. దీంతో ఉర్దూ భాషా సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి.

సికింద్రాబాద్ క్లబ్‌కు నోటీసులిచ్చి.. చట్టప్రకారం ముందుకెళ్లండి

– ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రాజీవ్ రహదారిపై ప్యారడైజ్ జంక్షన్ నుంచి శామీర్‌పేట్ వరకు 18 కిలోమీటర్ల పొడవుతో చేపట్టనున్న ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో చట్టప్రకారం నిబంధనలు పాటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. సికింద్రాబాద్ క్లబ్‌కు నోటీసులు జారీ చేసి ముందుకు వెళ్లాలని మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ(హెచ్‌ఎండీఏ)కు స్పష్టం చేసింది. హైదరాబాద్‌కు స్టేట్ హైవే–1లో భాగంగా ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనుల కోసం హెచ్‌ఎండీఏకు అనుమతులిస్తూ మార్చి 1న రక్షణ శాఖ జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ సికింద్రాబాద్ క్లబ్ తరఫున కార్యదర్శి శ్రీగోగిరెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ అనుమతుల కారణంగా క్లబ్‌లోని 22 ఎకరాల నుంచి ఫ్లైఓవర్‌తో పాటు సొరంగం పనులు చేపడుతున్నారన్నారు. క్రీడలు, వినోదం కోసం సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంతంలో పికెట్‌లోని తోకట్టలో 1888లో 22 ఎకరాల్లో క్లబ్ ఏర్పాటైందని, ఇందులో శాశ్వత నిర్మాణాలు, భవనాలు, ఔట్ హౌస్‌లు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది సునీల్ బీ.గను వాదనలు వినిపిస్తూ.. '22 ఎకరాలు పూర్తిగా క్లబ్‌కు చెందిన ప్రైవేట్ ప్రాపర్టీ. దీనిపై కేంద్ర ప్రభుత్వానికి గానీ, కంటోన్మెంట్ చట్టం కింద పనిచేసే డిఫెన్స్ ఎస్టేట్ ఆఫీసర్‌కు గానీ ఎలాంటి హక్కులు, టైటిల్‌ను క్లెయిమ్ చేయలేరు. ఫ్లైఓవర్ నిర్మాణానికి అనుమతిస్తూ లేటర్ జారీ చేయలేరు. పిటిషనర్‌ను సంప్రదించకుండా చట్ట విరుద్ధంగా, ఏకపక్షంగా, సహజ న్యాయ సూత్రాలను పాటించకుండా.. చట్టంలో నిర్దేశించిన విధానాన్ని అనుసరించకుండా ఎలివేటెడ్ కారిడార్, సొరంగాల నిర్మాణం కోసం హెచ్‌ఎండీఏకు అనుమతి ఇవ్వడం చెల్లదు. కోర్టులు కూడా సదరు భూమిపై క్లబ్‌కే హక్కులు ఉంటాయని తీర్పులు కూడా ఇచ్చాయి. ఒక వ్యక్తి ఆస్తిని భూ సేకరణ కింది తీసుకునే ముందు పరిహారం చెల్లించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది. అయితే అందులో కూడా చట్టబద్ధమైన ప్రక్రియను అనుసరించాలి' అని పేర్కొన్నారు. హెచ్‌ఎండీఏ తరఫున స్టాండింగ్ కౌన్సిల్ నరసింహగౌడ్ వాదనలు వినిపిస్తూ.. 'నగరంలో విపరీతమైన ట్రాఫిక్‌ను తగ్గించేందుకు రాష్ట్ర రహదారి–1 రాజీవ్ రహదారిపై ఆరు లేన్లుగా ప్యారడైజ్ జంక్షన్ నుంచి శామీర్‌పేట్ వరకు(18 కి.మీ.) ఫ్లైఓవర్ నిర్మాణం చేపడుతున్నాం. ప్రైవేట్ భూములతోపాటు రక్షణశాఖ భూముల నుంచి నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఇందులో భాగంగా రక్షణ శాఖ అనుమతులు జారీ చేసింది' అని చెప్పారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. క్లబ్‌కు నోటీసులు ఇచ్చి, చట్టప్రకారం ముందుకు వెళ్లాలని ఆదేశించారు.





నగరంలోని గాడియం స్కూల్ స్పోర్టోపియా వేదికగా నిర్వహించిన ఆల్ ఇండియా జిమ్నాస్టిక్స్ పోటీలు ఘనంగా ముగిశాయి. ఈ జిమ్ క్విన్–2024 పోటీల్లో 170 పతకాలతో గాడియం స్కూల్ విజేతగా నిలిచింది. లెవల్ 1, 2 పోటీల్లో 98 స్వర్ణాలతో సహా 146 పతకాలను సాధించింది. 3, 4, 6 లెవెల్స్ విజయాలను కొనసాగించిన ఆరుగురు గాడియం జిమ్నాస్టులు 24 పతకాలు సాధించారు. ఇందులో 15 గోల్డ్ మెడల్స్ ఉండటం విశేషం. ఈ ప్రతిష్టాత్మక పోటీల్లో దేశవ్యాప్తంగా 600 మంది జిమ్నాస్ట్‌లు పోటీపడ్డారు. ముగింపు వేడుకల్లో అరబిందో ఫార్మా డైరెక్టర్ మదన్ మోహన్ రెడ్డి, నిత్యానంద రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గాడియం వ్యవస్థాపకులు కీర్తి రెడ్డి మాట్లాడుతూ.. జిమ్ క్విన్ 2024 నిర్వహణతో అథ్లెట్ల నైపుణ్యాలను పెంపొందించడానికి గాడియం స్పోర్టోపియా వేదికగా మారిందని సంతోషాన్ని వ్యక్తం చేశారు. పాఠశాల 10వ వార్షికోత్సవ వేడుకల్లో గాడియం చరిత్రలో గర్వించదగిన మైలురాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు.

– సాక్షి, సిటీబ్యూరో

170 పతకాలతో గాడియం హవా..

ప్రతి కళాశాలలో ప్రొ.జయశంకర్ జయంతి నిర్వహించాలి

– తెలంగాణ లెక్చరర్స్ ఫోరం చైర్మన్ డాక్టర్ కత్తి వెంకటస్వామి



మాట్లాడుతున్న చైర్మన్ డాక్టర్ కత్తి వెంకటస్వామి

కవాడిగూడ: తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి ప్రదాత ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వారోత్సవాలను ప్రతి కళాశాలలో ఘనంగా నిర్వహించాలని తెలంగాణ లెక్చరర్స్ ఫోరం(టీఎల్‌ఎఫ్) రాష్ట్ర చైర్మన్ డాక్టర్ కత్తి వెంకటస్వామి పేర్కొన్నారు. టీఎల్‌ఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర కమిటీ సమావేశం సోమవారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ లెక్చరర్స్ ఫోరం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు నిష్ణాతులైన విద్యావంతులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి విద్యా సదస్సులు నిర్వహించాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో మోడల్స్ స్కూల్స్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు పదోన్నతులతో పాటు నిబంధనలకు అనుకూలంగా సాధారణ బదిలీలను వెంటనే పూర్తిచేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని అన్నారు. ప్రైవేటు విద్యా సంస్థల్లో పనిచేస్తున్న టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రతతో పాటు హెల్త్ కార్డులు, 12 నెలల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీఎల్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి వేణు, కార్యనిర్వాహక అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు గోపినాథ్, అక్రమ్, ఫరీద్, తిరుపతి, రవి, జనార్దన్, ఆంజనేయులు, షాహిద్ తదితరులు పాల్గొన్నారు.

కీసరగుట్ట రామలింగేశ్వరుడికి క్షీరాభిషేకం



కీసర: కీసరగుట్ట శ్రీభవానీ రామలింగేశ్వర స్వామికి సోమవారం వేదపండితులు కన్నుల పండువగా క్షీరాభిషేకం నిర్వహించారు. ఉదయం గర్భాలయంలో కొలువైన శ్రీస్వామివారికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం అనంతరం క్షీరాభిషేకం, పుష్పాభిషేకం తదితర పూజలను నిర్వహించారు. అనంతరం స్వామివారికి నిర్వహించిన పల్లకీ సేవలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ప్రభుత్వ సెలవు రోజు కలిసి రావడంతో సోమవారం వివిధ ప్రాంతాల నుంచి స్వామి దర్శనం కోసం పెద్ద ఎత్తున భక్తులు కీసరగుట్టకు తరలివచ్చారు. మరో పక్క నగరంలోని ఈసీఐఎల్ తదితర ప్రాంతాల్లో స్థిరపడ్డ మార్వాడీ కులస్థులు కావడి పూజలో భాగంగా హరిద్వార్‌లోని గంగానది, బాసరలోని గోదావరి తదితర పుణ్య నదుల నుంచి సేకరించిన పవిత్ర జలాలను కుండల్లో(మట్టిపాత్ర)ల్లో తీసుకొని ఈసీఐఎల్ నుంచి కాలినడకన కీసరగుట్టకు తరలివచ్చి గర్భాలయంలో అభిషేక పూజకు అందజేశారు. అర్చకులు పవిత్ర జలాలతో స్వామివారికి అభిషేకం నిర్వహించారు. ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం, ఈఓ సుధాకర్‌రెడ్డి, అర్చకులు రవిశర్మ, బల్‌రాం శర్మ తదితరులు ఉన్నారు.



సాక్షి సిటీ ప్లస్
13
హైదరాబాద్, మంగళవారం, 30, జూలై, 2024

అఫర్డబుల్.. ఆర్ట్‌ఫుల్

సిటీలో ఆగస్టు 2 నుంచి ప్రారంభం



సాక్షి, సిటీబ్యూరో: దేశవ్యాప్తంగా కళాత్మక ఉత్పత్తులు, ఆకర్షణీయమైన శ్రేణిని ప్రదర్శించే అఫర్డబుల్ ఆర్ట్ ఇండియా ప్రారంభ ఎడిషన్‌కు నగరం ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ ప్రదర్శన ఆగస్టు 2 నుంచి 4 వరకూ బంజారాహిల్స్‌లోని తెలంగాణ క్రాఫ్ట్స్ కౌన్సిల్ ప్రాంగణంలో నిర్వహిస్తున్నారు. ఈ ఆర్ట్ షోలో సమకాలీన సృజనాత్మకత నుంచి సంప్రదాయ, పాతకాలపు ఆర్ట్ వర్క్స్ వరకూ విభిన్న రకాల కళారూపాలను ప్రదర్శిస్తారు. పట్టణ స్కెచ్‌లకు ప్రసిద్ధి చెందిన ప్రముఖ కళాకారులు అనితా అల్వారెస్ షోలాపిత్ శిల్పాలు, ఆభరణాలు, ఇండోర్ ల్యాంప్ షేడ్‌లలో నైపుణ్యం కలిగిన ఆశిష్ మలాకర్ కళాకృతులు, పాత పుస్తకాలతో రూపొందించే ప్రత్యేకమైన పేపర్ ఆర్ట్‌కు ప్రసిద్ధి చెందిన బానూ బాట్లిబోయ్ చిత్రాలు, నగర విశేషాలకు అద్దం పట్టే జైనాబ్ తంబావాలాకు చెందిన వాటర్ కలర్ కళాకృతులు ఈ ప్రదర్శనలో హైలెట్‌గా పేర్కొంటున్నారు. అందమైన, అపురూపమైన కళను ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండేలా చూడాలనే లక్ష్యంతో బారో మార్కెట్ ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు. ఈ ఈవెంట్ అసలైన కళాకృతులను అందుబాటు ధరల్లో కొనుగోలు చేయడానికి అరుదైన అవకాశాన్ని అందిస్తుందని హామీ ఇస్తున్నారు. ప్రదర్శనకు క్యూరేటర్‌గా శ్రీల ఛటర్జీ వ్యవహరిస్తారని నిర్వాహక సంస్థ ప్రతినిధులు తెలిపారు.

వండర్లాలో ఫ్రెండ్‌షిప్ డే

సాక్షి, సిటీబ్యూరో: అందరూ ఎంతో ఇష్టంగా ఎదురు చూసే ఫ్రెండ్‌షిప్ డే వేడుకల కోసం నగరంతో పాటు వండర్లా కూడా సిద్ధంగా ఉంది. ఇందులో భాగంగా ఆగస్టు 4న స్నేహితుల దినోత్సవం సందర్భంగా నగరంలోని ప్రతిష్టాత్మక అమ్యూజ్మెంట్ పార్క్ వండర్లా ప్రత్యేక ఆఫర్‌ను ప్రకటించింది. స్నేహానికి ప్రతీకగా ఆ రోజు వండర్లా టిక్కెట్ ఒకటి కొంటే మరొకటి ఉచితంగా అందిస్తున్నారు. ఈ ప్రత్యేక ఆఫర్ ఆన్‌లైన్‌లో మాత్రమే అందిస్తున్నామని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అరుణ్ కె.చిట్టిలపిల్లి తెలిపారు. లైవ్ డీజే, స్పెషల్ ఈవినింగ్ జుంబా సెషన్‌లు, ఫన్ గేమ్స్, ఉత్కంఠ భరిత పార్క్ రైడ్‌లు ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో పరిమిత సంఖ్యలో మాత్రమే ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. సాధారణ రోజుల్లో కన్నా పార్క్‌లు ఎక్కువ సేపు తెరిచి ఉంటాయన్నారు. బుక్కింగ్ కోసం https://bookings.wonderla.com/ లేదా హైదరాబాద్ పార్క్ - 084 146 76333, +91 91000 63636ను సంప్రదించవచ్చు.

'రూట్స్ టు రూట్స్' వర్క్‌షాప్

సాక్షి, సిటీబ్యూరో: విద్యార్థుల్లో కళల పట్ల ఆసక్తి పెంచేందుకు ఢిల్లీకి చెందిన స్వచ్ఛంద సంస్థ 'రూట్స్ టు రూట్స్' ఆధ్వర్యంలో నగరంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల్లో ఆర్ట్ వర్క్‌షాప్స్ నిర్వహిస్తోందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. భారతదేశపు నూతన విద్యా విధానానికి అనుగుణంగా, పాఠశాల విద్యలో కళలను భాగం చేయాలనే ఉద్దేశంతో ఈ వర్క్‌షాప్స్ నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగా జరిగే ముఖాముఖి సదస్సుల్లో ప్రముఖ కళాకారులు, కళలను బోధించే శిక్షకులు పాల్గొంటారని, ఆగస్టు 9 వరకూ జరుగుతాయన్నారు.

సినీ స్టార్‌తో భోజనం..

సాక్షి, సిటీబ్యూరో: విదేశాల్లో స్థిరపడిన భారతీయుల్లో మన అనే భావనను పెంపొందించే లక్ష్యంతో ఓ ప్రచార కార్యక్రమం చేపట్టినట్టు ప్రముఖ బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌ఎస్‌బీసీ సంస్థ ప్రతినిధులు తెలిపారు. దీని కోసం మన దేశానికి చెందిన గ్లోబల్ సూపర్ స్టార్ ప్రియాంక చోప్రా జోనాస్‌ను ప్రచారంలో భాగం చేశామని, 'సినీ స్టార్‌తో భోజనం' అంటూ, స్వదేశీ రుచులను గుర్తు చేస్తున్నామన్నారు. అంతర్జాతీయంగా పేరొందిన మిచెలిన్-స్టార్ రెస్టారెంట్ ఎగ్జిక్యూటివ్ చెఫ్, సిడ్ అహుజా కూడా ఈ ప్రచారంలో పాల్గొన్నారన్నారు.



క్రేజీ.. థీమ్స్..

వంట నుంచి వడ్డన దాకా..

ఆహారం వడ్డించడానికి ఇత్తడి పళ్లెం, నీళ్లు తాగడానికి రాగి, గాజు గ్లాసు, బిర్యానీ వండేందుకు మట్టి కుండలు, ఆహారం వడ్డించేందుకు ఇత్తడి గరిటెలు, స్పూన్లు.. ఇదంతా ఎప్పుడో పూర్వకాలం రోజులు అనుకుంటే పొరపాటు పడినట్లే.. హైదరాబాద్ నగరంలో తాజాగా హోటల్ యాజమాన్యాలు అవలంబిస్తున్న ట్రెండ్ ఇది. వివిధ రకాల థీమ్‌లతో ఏర్పాటు చేస్తున్న హోటల్స్‌లో రుచికరమైన ఆహారంతో పాటు, ఆహ్లాదకరమైన వాతావరణంలో యువతను ఆకట్టుకునేందుకు సెల్ఫీ పాయింట్లు, స్టార్ హీరోల ఫొటోలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ఫ్యాన్స్ సైతం ఖుషీ అవుతున్నారు. అదే సమయంలో కొత్తకొత్త పేర్లతో రెసిపీలను సిద్ధం చేస్తున్నారు. దీంతో ఆహార ప్రియులు లొట్టలేసుకుని తింటున్నారు.

- సాక్షి, సిటీబ్యూరో



- కొత్త థీమ్‌తో ఆకట్టుకుంటున్న హోటల్స్
- తినే పాత్రలపైనా ప్రత్యేక దృష్టి
- సెల్ఫీ పాయింట్ల వద్ద యూత్ జోష్
- స్టార్ హీరోల ఫ్లెక్సీలతో ఫ్యాన్స్ ఖుషీ



ఇటీవల కాలంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు పలు హోటళ్లపై దాడులు చేపట్టి, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. దీంతో కొందరు చేసిన చిన్న పొరపాట్లకు మొత్తం హోటల్ వ్యాపార రంగంపై ప్రభావం కనిపిస్తోంది. ఫలితంగా రొటీన్‌గా నడిచే హోటళ్లు ఆదరణ కోల్పోతున్నాయి. దీంతో ఈ ప్రభావం నుంచి బయటపడేందుకు ఎవరికి వారు ప్రత్యేకంగా బ్రాండ్ ఇమేజ్ క్రియేట్ చేసుకోవడం, దాన్ని ప్రమోట్ చేసుకోవడానికి కొత్తకొత్త ప్రయోగాలు చేస్తున్నారు. రొటీన్‌కు భిన్నంగా, కాస్త ధర ఎక్కువైనా మనకంటూ ఒక ల్యాండ్ మార్క్ ఏర్పాటు చేసుకోవాలని హోటల్ నిర్వాహకులు, యాజమాన్యాలు భావిస్తున్నాయి. ఆర్థికంగా వీటి నిర్వహణ భారమైనప్పటికీ పోటీ మార్కెట్‌లో తప్పదంటున్నారు. అదే సమయంలో ఆహారప్రియుల నుంచి ఊహించిన దానికంటే మంచి స్పందన వస్తుందని సంతోషపడుతున్నారు.



పార్టీలకు ప్రత్యేకంగా ఏర్పాట్లు

వివాహాది శుభకార్యాలకు ఫంక్షన్ హాళ్లు ఉన్నాయి. చిన్న కుటుంబం పుట్టినరోజు పార్టీ చేసుకుందామంటే ఫంక్షన్ హాల్‌కు వెళ్లే పరిస్థితి ఉండదు. ఇటువంటి వారి కోసం హోటళ్లలో 20 నుంచి 30 సీటింగ్‌తో ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నారు. కాంప్లిమెంటరీగా కేకులు సైతం ఉచితంగా అందిస్తామంటున్నారు.

హైదరాబాద్ అంటేనే దమ్ బిర్యానీకి ఫేమస్. అయితే ఇటీవల కొత్తగా ఏర్పాటు చేసిన ఓ హోటల్లో

బిర్యానీలకు స్థానిక పేర్లు..


వంటకాలకు స్థానిక పేర్లను పెడుతూ ఆకట్టుకుంటున్నారు. పాలకొల్లు ఫ్రై పీస్ బిర్యానీ, మొగల్తూరు మటన్ బిర్యానీ, రాజమండ్రి రొయ్యల బిర్యానీ, గుంటూరు మిర్చి కోడి బిర్యానీ, ఓజీ బిర్యానీ, నెల్లూరు చేపల పులుసు అంటూ కొత్తకొత్త పేర్లు మెనూలో కనిపిస్తున్నాయి. దీంతో పాటే దక్షిణ భారత దేశం రెసిపీలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. ఆహారం తయారీ విధానాన్ని యూట్యూబ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టా, రీల్స్‌లో పోస్ట్ చేస్తున్నారు.

మట్టి పాత్రలో..

ప్రస్తుత రోజుల్లో మట్టి పాత్రల్లో వంట చేయడం గ్రామీణ ప్రాంతాల్లో సైతం కనుమరుగైందనే చెప్పాలి. స్టీల్, అల్యూమినియం పాత్రలు మన్నిక ఎక్కువగా వస్తాయని, అంతా అటువైపు మొగ్గుచూపుతున్నారు. అయితే నగరంలోని హోటల్స్‌లో మాత్రం ప్రధానంగా కుండ బిర్యానీకి మంచి ఆదరణ లభిస్తోంది. అందుకే కొన్ని హోటళ్లలో నేరుగా కుండలోనే బిర్యానీ వండి, వడ్డిస్తున్నారు. పార్సిల్ తీసుకునే వారికి నేరుగా కుండతోనే డెలివరీ ఇస్తున్నారు. దీన్ని ఆహార ప్రియులు ఆస్వాదిస్తున్నారు.

ఆదరణ బాగుంది...

ఒక థీమ్ ఎంపిక చేసుకున్నాం. మార్కెట్‌లో ప్రత్యేకంగా ఉండాలనుకున్నాం. ఖర్చుకు ఎక్కడా వెనుకాడలేదు. సాధారణంగా భోజనం తినే ప్లేట్లు రూ.200నుంచి 500లో లభిస్తాయి. అయినా ఇత్తడి ప్లేట్లు పెడుతున్నాం. ఒక్కో ప్లేటు ధర రూ.3500 వరకూ ఉంది. అలాగే యూత్ ఎక్కడికి వెళ్లినా సెల్ఫీ మస్ట్ అన్నట్లు ఉన్నారు. దీనికోసం కొంత ప్లేస్ కేటాయించాం. వినియోగదారుల అభిరుచికి అనుగుణంగా అప్‌డేట్ అవుతున్నాం. ఫుడ్ క్వాలిటీలో ఎక్కడా రాజీపడటంలేదు. అందుకే అందరి ఆదరణ పొందగలుగుతున్నాం. - ప్రసాద్, అశోక్, అద్భుతాహారం నిర్వాహకులు, రాయదుర్గం





పుస్తకమే ఆకర్షణ

పుస్తకం తోడుంటే వెలకట్టలేని స్నేహితుడు వెన్నంటే ఉన్నట్టే. మంచి పుస్తకం నిండైన ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తోంది. మదిని కమ్మేసిన నిరాశ నిస్పృహలను దూరం చేసి ధైర్యాన్ని కూడగడుతుందంటారు సాహితీవేత్తలు. పుస్తక సాహిత్యం జీవన విధానాన్ని, పోరాట పటిమను అలవర్చుతుందంటారు. అలాంటి పుస్తక విలువను విశ్వవ్యాప్తం చేసేందుకు చిన్నారి ఆకర్షణ కంకణం కట్టుకుంది. పిన్న వయస్సులోనే కితాబ్ గొప్పతనాన్ని గుర్తించి ఎందరికో చదువుకునే భాగ్యాన్ని కలిగిస్తోంది. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 9,536 పుస్తకాలను సేకరించి 15 లైబ్రరీలను ఏర్పాటుచేసి తోటి చిన్నారులతో పాటు ప్రజల్లో పుస్తక పఠనంపై ఆసక్తిని రేపుతోంది. స్వయంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీయే ఈ చిన్నారి లైబ్రరీల ఏర్పాటు యజ్ఞం గురించి తెలుసుకుని, ఆమెను కలుసుకుని ప్రశంసల జల్లు కురిపించారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న ఆకర్షణ ఆమెకు ప్రేరణ కలిగించిన అంశాలు, లక్ష్యాలను గురించి 'సాక్షి'తో పంచుకున్నారు.

- సనత్‌నగర్

పుస్తక పఠనంపై ఆసక్తి రేపుతూ..

- కితాబ్‌తో విజ్ఞానాన్ని పంచుతూ..
- లైబ్రరీల ఏర్పాటు పరంపర కొనసాగిస్తూ..
- ఇప్పటివరకూ 15 గ్రంథాలయాల ఏర్పాటు..
- 25 లైబ్రరీల లక్ష్యం దిశగా అడుగులు..
- చిన్నారి ఆకర్షణ సంకల్పబలం.. రాష్ట్రపతి, ప్రధానమంత్రి, ఏపీ మాజీ సీఎం అభినందనలు..
- 25వ లైబ్రరీ ప్రారంభోత్సవానికి హాజరవుతానని ప్రధాని హామీ..



ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌తో ఆకర్షణ

సాక్షి: ఎన్నో ఏట నుంచి పుస్తక సేకరణ ప్రారంభించారు? ప్రేరణ కలిగించింది ఎవరు?

ఆకర్షణ: తొమ్మిది సంవత్సరాల వయస్సు నుంచి పుస్తకాలను సేకరించడం మొదలుపెట్టాను. 2021లో ఎంఎన్‌జే క్యాన్సర్ చిల్డ్రన్ ఆస్పత్రిలోని రోగులకు, వారి సహాయకులకు ఆహారాన్ని అందించేందుకు తల్లిదండ్రులతో కలిసి వెళ్లాను. అక్కడి పిల్లల అవసరాలను గుర్తించాను. ముఖ్యంగా కలరింగ్ బుక్స్‌తో పాటు వారు చదువుకునేందుకు అవసరమైన పుస్తకాలు ఊరటనిస్తాయని అనిపించింది. దీంతో పుస్తకాలను సేకరించి లైబ్రరీ ఏర్పాటుకు శ్రీకారం చుట్టాను. నన్ను ప్రేరేపించిన ఎంఎన్‌జే కేన్సర్ హాస్పటల్‌లోనే మొట్టమొదటి లైబ్రరీని ఏర్పాటుచేశాను.

సాక్షి: ఇప్పటి వరకూ ఎన్ని లైబ్రరీలను ఎక్కడెక్కడ ఏర్పాటు చేశారు.

ఆకర్షణ: ఇప్పటివరకూ 15 లైబ్రరీలను ఏర్పాటు చేశాను. ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రి, సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్, బోరబండ అల్లాపూర్ గాయత్రీనగర్ అసోసియేషన్, బాలికల కోసం జువైనల్ అబ్జర్వేషన్ హోమ్, కోయంబత్తూర్ సిటీ పోలీస్-స్ట్రీట్ లైబ్రరీ, చెన్నై బాయ్స్ క్లబ్-నోలంబూర్ పోలీస్‌స్టేషన్, సనత్‌నగర్ ఓల్డ్ ప్రభుత్వ పాఠశాల, సిద్దిపేట ఉమెన్ సేఫ్టీవింగ్ భరోసా సెంటర్, తమిళనాడు కన్యాకుమారి జిల్లాల్లోని కలితురై గ్రామం, అమీర్‌పేట స్టేడియం, ఏఎస్‌రావునగర్ బాలగోకులం భాగ్యనగర్, మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లాలోని ఎయిడ్స్ అనాథ చిన్నారుల గృహం, బోరబండ ఆదర్శ ఫౌండేషన్, బోయిగూడ అనాథ బాలికల వసతి గృహం, బొల్లారంలోని కలాడీ ఆది శంకర మేడోమ్‌లలో లైబ్రరీలను ఏర్పాటు చేయడం జరిగింది.


బాలగోకులంలో చిన్నారులతో కలిసి 11వ లైబ్రరీ ప్రారంభోత్సవంలో ఆకర్షణ

సాక్షి: ఇప్పటివరకూ ఎన్ని పుస్తకాలు సేకరణ చేశారు? ఎలా సేకరిస్తారు?

ఆకర్షణ: ఇప్పటివరకూ 9,536 పుస్తకాలను సేకరించాను. ఇందులో 8000 పుస్తకాలు ఇతరులు డొనేట్ చేసినవే. అపార్ట్‌మెంట్ల నివాసితులు, క్లాస్‌మేట్స్, బంధువుల కుటుంబాల నుంచి సేకరిస్తుంటాను. వారంతా చదివేసిన అనంతరం తమ వద్ద ఉన్న పుస్తకాలు నాకు అందజేస్తుంటారు. వాటిని కలుపుకుని స్వతహాగా నేను కొనుగోలు చేసిన కొన్ని పుస్తకాలతో లైబ్రరీలను ఏర్పాటు చేశాను.

సాక్షి: ప్రధాని మన్‌కీ బాత్‌లో మాట్లాడే అవకాశం ఏ విధంగా వచ్చింది.

ఆకర్షణ: నేను లైబ్రరీల ఏర్పాటు చేస్తున్న విషయాన్ని తెలుసుకున్న భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ కూడా లైబ్రరీ కార్యక్రమాల నిమిత్తం వెయ్యి పిల్లల పుస్తకాలను విరాళంగా ఇవ్వడానికి ముందుకువచ్చింది. ఈ నేపథ్యంలోనే 2023, సెప్టెంబర్ 24న ప్రధానమంత్రి మన్‌కీ బాత్ 105వ ఎపిసోడ్‌లో స్వయంగా మాట్లాడే అవకాశం దక్కింది.

సాక్షి: స్వయంగా ప్రధానితో ముచ్చటించినప్పుడు మీ ఫీలింగ్? ఆయన ఏమన్నారు?

ఆకర్షణ: ఇటీవల హైదరాబాద్ పర్యటనకు వచ్చిన ప్రధాని నరేంద్రమోదీని రాజ్‌భవన్‌లో స్వయంగా కలిసే అవకాశం వచ్చింది. ఈ కార్యక్రమాన్ని నిర్విరామంగా కొనసాగించు అని ఎంతగానో ప్రోత్సహించి అభినందించారు. నేను ఏర్పాటుచేయబోయే 25వ లైబ్రరీ ప్రారంభోత్సవానికి స్వయంగా వస్తానని హామీ ఇచ్చారు. అలాగే రాష్ట్రపతి ద్రౌపదిముర్ము, ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి, బొగ్గుగనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డితో పాటు పలువురు అధికారుల అభినందనలు మరువలేనివి.

సాక్షి: పుస్తకాల సేకరణకు ఇంకా ఎవరెవరి ప్రోత్సాహం ఉంది?

ఆకర్షణ: తెలంగాణ ఆధారిత మానేరు రచయితల సంఘం, బాల సాహిత్య పరిషత్, దక్కన్ సాహిత్య సభలు లైబ్రరీల ఏర్పాటుకు గాను వెయ్యి పుస్తకాలు విరాళంగా అందజేసేందుకు ముందుకువచ్చాయి.

సాక్షి: పిన్న వయస్సులోనే మీరు సాధించిన మరుపురాని జ్ఞాపకాలు?



ఆకర్షణ: న్యూఢిల్లీలో జరిగిన 75వ గణతంత్ర వేడుకలకు రక్షణ శాఖ నుంచి ఆహ్వానం ఎంతో ఆనందంగా ఉంది. అలాగే నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా నుంచి గుర్తింపు పత్రం, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్‌లో స్థానం దక్కడం మధురానుభూతిని కలిగించింది.

సాక్షి: మీ కుటుంబ నేపథ్యం?

ఆకర్షణ: తండ్రి సతీష్ హెల్త్‌కేర్ కంపెనీలో సీనియర్ మేనేజర్‌గా పనిచేస్తుండగా, తల్లి ప్రవిత గృహిణి. సనత్‌నగర్ లోధా అపార్ట్‌మెంట్‌లో ఉంటాం.

రాయిటర్స్ విజన్‌లో వెల్‌స్పన్

సాక్షి, సిటీబ్యూరో: సస్టెయినబుల్ హోమ్ సొల్యూషన్స్‌కు పేరొందిన వెల్‌స్పన్ లివింగ్ లిమిటెడ్, ప్రతిష్టాత్మకమైన 'రాయిటర్స్ విజన్ 2045' క్యాంపెయిన్‌లో పాల్గొంటున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఐక్యరాజ్యసమితి శతాబ్ది ఉత్సవ వేడుకల్లో భాగంగా ఈ ప్రచారం నిర్వహించనున్నారని, ఇందులో తాము పాల్గొనే అవకాశం లభించిందన్నారు. బెటర్ కాటన్ కాన్సెప్ట్ వంటి స్థిరమైన పద్ధతులను అవలంబిస్తూ, 2,000 పైగా మహిళా రైతులతో సహా 20,000 మంది రైతులతో చేతులు కలిపి తమ సంస్థ పనిచేస్తోందని వివరించారు.

శ్రవణమే.. నయనం

- సంగీత సరస్వతిని మెప్పించాడు..
- ఢోలక్ వాయించడంలో దిట్ట
- కంజీర, డప్పు వాయిస్తే మైమరపే
- అంధుడైన సరిపురం మహేశ్ ఘనత
- సంగీతంతో పాటు తెలుగులో నైపుణ్యత

పుట్టుకతోనే అంధత్వంతో అంతా చీకటి. కానీ తన కళతో చుట్టూ ఉన్న ప్రపంచానికి వెలుగులు పంచాడు. అంధత్వంతో పాటు పేదరికం పుట్టినప్పటి నుంచి అతడిని వెక్కిరిస్తూ వస్తోంది. అయినా తన సంకల్పం ముందు ఇవన్నీ దిగదుడుపే అయ్యాయి. ఢోలక్, కంజీర, రిథమ్ ప్యాడ్ వాయిస్తూ తన ప్రతిభను చాటుకుంటున్నాడు. అతడి పేరే సిరిపురం మహేశ్. మంచిర్యాల జిల్లా హాజీపురం మండలం దొనబండ మహేశ్ స్వగ్రామం. ఇటీవలే నిజాం కాలేజీలో డిగ్రీ పూర్తి చేసిన మహేశ్ తన ప్రతిభతో ఎంతో మందిలో స్ఫూర్తి నింపుతున్నాడు.

- సాక్షి, సిటీబ్యూరో



చిన్నప్పటి నుంచి సంగీతంపై ఆసక్తి ఉండేది. పుట్టుకతోనే చూపు లేకపోయినా తనకు వినికిడి శక్తి ఎక్కువగా ఉంటుందని తన నమ్మకం. శాంతారాం అనే తన చిన్ననాటి స్నేహితుడు ఢోలక్‌ను పరిచయం చేశాడు. అప్పటి నుంచి సంగీతంపై ఆసక్తి పెరిగిందని మహేశ్ పేర్కొన్నాడు. అయితే దుర్గం శంకర్ అనే మాస్టారు ఢోలక్‌లో మెళకువలు నేర్పించి, తనను ఇంతవరకూ తీసుకొచ్చాడని గుర్తు చేసుకున్నాడు. చాలా ఫంక్షన్లలో జరిగే ఆర్కెస్ట్రాల్లో వాయిద్య పరికరాలను వాయిస్తూ తన ప్రతిభను చాటుకుంటున్నాడు.



అవార్డులు, రివార్డులు

తెలుగు టాలెంట్స్ మ్యూజిక్ అవార్డు, తెలంగాణ ప్రభుత్వం కళోత్సవం సందర్భంగా రెండుసార్లు అవార్డు తనను వరించింది. ఆర్కెస్ట్రాలో ఢోలక్, కంజీర వాయిస్తుంటే చాలా మంది ఆశ్చర్యపోయి మెచ్చుకునే వారని మహేశ్ సంతోషం వ్యక్తం చేశారు. ఇక సంగీతంతో పాటు తెలుగులో కూడా ప్రావీణ్యం సాధించాడు మహేశ్. పేరడీ పాటలు, కవితలు కూడా రాస్తుంటాడు.

అదే నా కల..

భవిష్యత్తులో తెలుగు టీచర్‌గా స్థిరపడాలనేది తన కల అని చెబుతున్నాడు. అంధులకు తెలుగులో వ్యాకరణం నేర్చుకోవడం చాలా కష్టం. కానీ నిజామ్ కాలేజీలో చంద్రయ్య శివన్న అనే తెలుగు మాస్టారు ఎంతో ఓపికగా పాఠాలు నేర్పించేవారని చెప్పుకొచ్చారు. పదో తరగతి వరకూ బ్రెయిలీ లిపిలో పాఠాలు ఉండేవని, ఇంటర్ తర్వాత అంధులు పాఠాలు నేర్చుకోవడం చాలా ఇబ్బందిగా ఉంటుందని పేర్కొన్నాడు. చంద్రయ్య మాస్టారు పుస్తకాలను పీడీఎఫ్‌లోకి మార్చి తన లాంటి వారికి ఇచ్చేవారని చెప్పాడు.



లీగల్

తల్లిదండ్రులకు ఆ హక్కు ఉంటుంది!

ప్రదీప్, శాంత భార్యాభర్తలు. ఇద్దరూ 60 ఏళ్లకు పైబడిన వారే! ఇద్దరికీ బీపీ, సుగర్లున్నాయి. వాళ్లకిద్దరు పిల్లలు. మంచి జీతాలు గల ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. కానీ అమ్మానాన్నలను పూర్తిగా గాలికి వదిలేయడంతో దయనీయమైన స్థితిలో రోజులను గడుపుతున్నారు ఆ దంపతులు. పిల్లల నుంచి పోషణ కోసం వీరు కోర్టును ఆశ్రయించవచ్చా?

తల్లిదండ్రుల, వయోవృద్ధుల నిర్వహణ, సంక్షేమ చట్టం, 2007 కింద తల్లిదండ్రులకు, వయోవృద్ధులకు చాలా హక్కులే ఉన్నాయి. ముఖ్యంగా తమను తాము పోషించుకోలేని, తమ సంక్షేమాన్ని, తమ ఆరోగ్యాన్ని తాము పర్యవేక్షించుకోలేని తల్లిదండ్రులు, వయోవృద్ధులకు... తమ పిల్లలు, మనవళ్లు, మనవరాళ్లు లేదా బంధువుల (వయోవృద్ధుల ఆస్తికి వారసులు లేదా ఆర్థికంగా గానీ, మరేరకంగా గానీ లబ్ధి పొందిన వారు)ను మెయింటెనెన్స్ అడిగే హక్కును కలిపిస్తోందీ చట్టం. ఈ చట్టం కింద వయోవృద్ధులు, తల్లిదండ్రులు నేరుగా ట్రిబ్యునల్‌ను ఆశ్రయించవచ్చు (స్థానిక ఆర్డీఓ). అలా ఆశ్రయించలేని పరిస్థితుల్లో ఉంటే వాళ్ల పక్షాన ఓల్డ్ ఏజ్ హోమ్ లాంటి ఏ సంస్థ అయినా పిటిషన్ దాఖలు చేయవచ్చు. నోటీసులు అందిన 90 రోజులలోగా పిటిషన్‌పై విచారణ జరిపి ఆదేశాలు ఇవ్వవలసి ఉంటుంది. ఇంటెరిమ్ మెయింటెనెన్స్‌కు కూడా ఆదేశించవచ్చు. వారసులు, పిల్లలు లేదా బంధువులు ట్రిబ్యునల్ ముందుకు రానట్లయితే... ట్రిబ్యునల్ క్రిమినల్ కోర్ట్‌లా కూడా వ్యవహరించవచ్చు. స్థిరాస్తులకు సంబంధించి ఏ ఇతర చట్టాల్లో లేని వెసులుబాటు, హక్కు కేవలం ఈ చట్టంలోనే పేరెంట్స్, సీనియర్ సిటిజన్స్ కలిగి ఉన్నారు. ఏ ఇతర ప్రాపర్టీ చట్టాలకిందైనా ఒకసారి అమ్మేసిన లేదా గిఫ్ట్‌గా ఇచ్చిన స్థిరాస్తిని తిరిగి తీసుకోవడం కానీ రద్దు చేయడం కానీ కుదరదు. కానీ ఈ 2007 చట్టం కింద మాత్రం ఆస్తిని తమ సంతానానికి లేదా తన బంధువులకు లేదా మరే ఇతర వ్యక్తికైనా రాసిచ్చేటప్పుడు 'మమ్మల్ని చూసుకోవాల్సిన బాధ్యతను నిర్వర్తించాలి.. లాంటి నిబంధనతోనే ఈ ఆస్తిని రాసిస్తున్నాను' అంటూ ఆస్తిపత్రాలలో పొందుపరచి.. దాన్ని సదరు వారసులు ఉల్లంఘిస్తే.. తమ ఆస్తిని తాము తిరిగి తీసేసుకోవచ్చు.

చాలా సందర్భాలలో ఆస్తి రాయించుకున్న తర్వాత తల్లిదండ్రులను లేదా వృద్ధులను ఓల్డేజ్ హోమ్స్‌లో వదిలేయడం లేక సరిగ్గా పట్టించుకోకపోవడం చూస్తుంటాం. అలాంటి సందర్భాలకు ఈ చట్టం చక్కటి ఆయుధం. పైన తెలిపిన నిబంధన కలిగి ఉన్న ఆస్తి పత్రాలను మరెవరైనా కొనుగోలు చేస్తే, అలా కొనుక్కున్న వారిపైనా మెయింటెనెన్స్ విధించవచ్చు. అంతేకాదు వయోవృద్ధులను లేదా తల్లిదండ్రులను వదిలించుకుందామని వారిని ఎక్కడికైనా తీసుకెళ్లి వదిలేయడం లాంటివి చేస్తే అది నేరం. వారికి జరిమానాతో పాటు జైలు శిక్ష కూడా ఉంటుంది.



– శ్రీకాంత్ చింతల,
హైకోర్ట్ అడ్వకేట్

నాలుక అబద్ధం చెప్పదు

నీర్ దోసె అంటే నూనె వేయకుండా పెనం మీద నీటిని చల్లి వేసే దోసె. మైసూర్ మసాలా దోసె, రసం ఇడ్లీ, టొమాటో ఉప్మా, ఆనియన్ ఊతప్పం... ఇవన్నీ మనకు తెలిసినవే. ఖోట్టో... ఇది ఇడ్లీ పిండిని పనస ఆకులతో అల్లిన బుట్టలో వేసి ఆవిరి మీద ఉడికించే వంటకం. ఈ దక్షిణాది రుచుల పేరు చెబితే ముంబయి వాసుల నోట్లో నీళ్లూరతాయి. క్రికెట్ ప్లేయర్లు సునీల్ గవాస్కర్, సచిన్ టెండుల్కర్‌లు ఈ రుచుల కోసం ముంబయి నగరం, మాతుంగలో ఉన్న మైసూర్ కేఫ్‌ను విజిట్ చేసేవాళ్లు. స్వాతంత్య్రానికి ముందు 1936 నుంచి ముంబయిలో స్టవ్ వెలిగించిన ఈ కేఫ్‌కి గవాస్కర్, సచిన్‌ల కంటే ముందు ఏ ప్రముఖులు క్యూ కట్టారో తెలియదు. కొత్త పెళ్లికొడుకు అనంత్ అంబానీ ఆదివారాలు ఇక్కడే గడిచేవని ఇటీవల తెలిసింది. తన పెళ్లి వేడుకలో ఈ కేఫ్ స్టాల్ కూడా పెట్టించారు. వధువు రాధికా మర్చంట్‌కు ఈ కేఫ్ నిర్వహకురాలు శాంతెరీ నాయక్‌ను చూపిస్తూ 'మీట్ మైసూర్ కేఫ్ ఓనర్' అని పరిచయం చేశాడు. వధువు ఆ పెద్దావిడ పాదాలను తాకి నమస్కరించింది. ఈ వీడియోతో శాంతెరీ ఒక్కసారిగా దేశం దృష్టిని ఆకర్షించింది.

ముంబయి నగరం, మాతుంగ ఏరియాలో కింగ్స్ సర్కిల్ రైల్వేస్టేషన్ దగ్గర ఉంది మైసూర్ కేఫ్. శాంతెరీ నాయక్ మామగారు నాగేశ్ రామ నాయక్ ఈ కేఫ్‌ను స్థాపించాడు. కర్నాటక నుంచి ముంబయిలో అడుగు పెట్టి ఆహారమే తన కుటుంబానికి అన్నం పెడుతుందని నమ్మారాయన. ఆ నమ్మకాన్ని నిలబెట్టారు శాంతెరీ నాయక్. ఇప్పుడామె కుమారుడు నరేశ్ నాయక్ సహాయంతో కేఫ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 'బెస్ట్ సౌత్ ఇండియన్ రెస్టారెంట్' అనే ప్రజల ప్రశంసలే ఆమె అందుకున్న పురస్కారాలు. వివిధ ప్రదేశాలను పర్యటించడం ఆమె హాబీ. పర్యటనలో భాగంగా ఆయా ప్రదేశాల్లో ఏయే ఆహారాలు అందుబాటులో ఉంటున్నాయి, పర్యాటకులు ఏ రుచులను ఎక్కువగా ఇష్టపడుతున్నారో గమనిస్తూ, వాటిని రుచి చూస్తానని చెప్తారామె.

టూర్‌లో 'టేస్ట్' చూస్తాను



అనంత్ అంబానీ, రాధికా మర్చంట్‌లతో శాంతెరీ నాయక్

కస్టమర్ అభిప్రాయమే తుదితీర్పు

''వంటలను ఇష్టపడడమే నా సక్సెస్ ఫార్ములా. అమ్మకు సహాయం చేసే క్రమంలోనే రుచిగా వండడంలో మెళకువలు తెలిశాయి. అమ్మ వండిన పదార్థాలను ఇంటికి వచ్చిన అతిథులకు వడ్డించే బాధ్యత కూడా నాదే. వాళ్లకు ఏది నచ్చిందో అర్థమయ్యేది. అదే ఫార్ములాను కేఫ్ నిర్వహణలోనూ అనుసరించాను. మన ఉద్యోగులను నమ్మాలి, అంతకంటే ఎక్కువగా కస్టమర్లను నమ్మాలి. రుచి, అభిరుచుల విషయంలో కస్టమర్‌ల నోటి నుంచి వచ్చిన మాటే వేదవాక్కు. పదార్థాల రుచిని ఆస్వాదించిన నాలుక ఫీడ్ బ్యాక్ విషయంలో అబద్ధం చెప్పదు'' అంటారు శాంతెరీ నాయక్. డెబ్బైఏళ్ల వయసులో కూడా చురుగ్గా, కేఫ్ నిర్వహణ పట్ల శ్రద్ధగా ఉన్నారామె. వార్ధక్యం దేహానికి మాత్రమే, మనసుకు కాదు, పనిచేసే మనస్తత్వానికి కాదని నిరూపిస్తున్నారు శాంతెరీ నాయక్.



కుమారుడు నరేశ్‌నాయక్‌తో శాంతెరీ నాయక్



వచ్చేస్తాగా..!

సాహసం అంటే సునీతకు సరదా! అంతరిక్షంలో భారరహిత స్థితిలో తలకిందులుగా తేలియాడుతూ... 'డ్యూటీ' చేయటం ఆమెకొక విహారం. ఇక స్పేస్‌లో ఉన్నన్నాళ్లూ ఒక్క రోజు కూడా ఆమె వ్యాయామం ఆపలేదు! ఆరోగ్యానికి, ఎముకల దృఢత్వానికి మేలు చేసే ఎక్సర్‌సైజ్‌లే అన్నీ. మానసికంగా శక్తినిచ్చే సాధనకు సైతం ఏనాడూ ఆమె విరామం ఇవ్వలేదు. ఆ సాధనే... అనుదిన భగవద్గీత పఠనం. ప్రస్తుతం సునీత ఆ అంతరిక్షంలోనే చిక్కుబడిపోయారు. భూమిపై అందరూ ఆమె కోసం భయాందోళనలు చెందుతూ ఉంటే ఆమె మాత్రం... చిరునవ్వుతో... "వచ్చేస్తాగా..." అని తనే రివర్స్‌లో నాసాకు, భారతీయులకు నమ్మకం ఇస్తున్నారు!

సునీతా విలియమ్స్ గత 53 రోజులుగా అంతరిక్షంలోనే ఉండిపోయారు. సునీతను, సహ వ్యోమగామి బచ్ విల్మోర్‌ను భూకక్ష్యకు 400 కి.మీ ఎత్తున ఉన్న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్‌ఐ) విజయవంతంగా మోసుకెళ్లిన 'బోయింగ్ స్టార్‌లైనర్' వ్యోమనౌక తీరా వారిని అక్కడికి చేర్చాక చేతులెత్తేసింది. జూన్ 5న వాళ్లు వెళ్లారు. తిరిగి జూన్ 12కి, కనీసం జూన్ 15 కి వారు భూమి పైకి రావలసింది. స్టార్‌లైనర్‌లోని రాకెట్ మోటార్లు (థ్రస్టర్స్) మొరాయించటంతో విల్మోర్‌తో పాటుగా సునీత అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోనే ఉండిపోయారు. మరోవైపు నాసా టీమ్ భూమి మీద నుంచే ఆకాశంలోని స్టార్‌లైనర్‌కు నెలన్నరకు పైగా మరమ్మతులు చేస్తూ ఉంది. స్టార్‌లైనర్ మానవ ప్రయాణానికి పనికొస్తుందా లేదా అని ప్రత్యక్షంగా పరీక్షించేందుకు వెళ్లిన సునీత, విల్మోర్ అక్కడే ఉండిపోయారు. వారు ఎప్పటికి తిరిగొస్తారు అనే ప్రశ్నకైతే ఇప్పటి వరకు సమాధానం లేదు. తాజాగా చిన్న ఆశ మినుకుమంది! థ్రస్టర్స్‌ని మండించి చూసిన నాసాకు అవి పని చేయబోతున్న సంకేతాలు కనిపించాయి. ఇది గుడ్ న్యూస్. నాసాకే కాదు, సునీతా విలియమ్స్ సురక్షితంగా తిరిగి రావాలని ఆకాంక్షిస్తున్న యావత్భారతావనికి కూడా. ''స్టార్‌లైనర్ మమ్మల్ని భూమికి చేర్చుతుందని నా మనసు చెబుతోంది'' అని సునీత భూమి పైకి సందేశం పంపారు. ''ఆమె చాలా ధైర్యంగా ఉన్నారు'' అని సహ వ్యోమగామి విల్మోర్ ఆమె గురించి గొప్పగా చెప్పారు.



● వైరల్ అయిన సునీతా విలియమ్స్ స్పేస్ డాన్స్

అంతరిక్షంలో డాన్స్!

విల్మోర్ చెప్పారనే కాదు.. సునీతా విలియమ్స్ గట్టి అమ్మాయి. భూమి మీద ఉండి మనం ఆమె గురించి భయపడుతున్నాం కానీ.. అంతరిక్షంలో ఆమె ఉల్లాసంగా గడుపుతున్నారు. నాసా వారు ఇచ్చిన వీక్ ఆఫ్‌ని చక్కగా ఎంజాయ్ చేశారు. ఇంటికి ఫోన్ చేసి మాట్లాడారు. గేమ్స్ ఆడుతున్నారు కూడా. ఇంకా.. మైక్రో గ్రావిటీలో మొక్కలు నీటిని ఎలా సంగ్రహిస్తాయో సునీత పరీక్షిస్తున్నారు. నిజానికి రోదసీయానం సునీతా విలియమ్స్‌కి ఇదే మొదటిసారి కాదు. 2006లో, 2012లో ఐఎస్ఎస్‌కి వెళ్లారు. 322 రోజులు అంతరిక్షంలో గడిపారు. మొత్తం కలిపి 50 గంటల 40 నిముషాల పాటు స్పేస్ వాక్ చేశారు. ఈసారి అంతరిక్ష కేంద్రంలోకి వెళ్లగానే ఆనందంతో ఆమె డ్యాన్స్ చేసిన వీడియో వైరల్ అయింది కూడా. సునీతకు అంతరిక్ష యాత్ర ఇదే తొలిసారి కాకున్నా.. బోయింగ్ స్టార్ లైనర్‌తో మానవ సహిత యాత్రను నిర్వహించటం నాసాకు మొదటిసారే.

కన్నవారి కల

కల్పనా చావ్లా తర్వాత అంతరిక్షంలోకి వెళ్లిన భారతీయ మూలాలు కలిగిన రెండో మహిళ సునీతా విలియమ్స్. అమెరికాలోని ఒహాయో పట్టణంలో 1965లో జన్మించారు సునీత. ఆమె తండ్రి దీపక్ పాండ్యా గుజరాతీ. తల్లి ఉర్సులిన్ స్లావేనియా మహిళ. సునీత ఫిజిక్స్ లో డిగ్రీ చేశారు. ఇంజినీరింగ్ మేనేజ్‌మెంట్ లో మాస్టర్స్ డిగ్రీ చేశారు. అమెరికన్ నావికాదళంలో కొన్నాళ్లు డైవింగ్ ఆఫీసర్‌గా ఉద్యోగం చేశారు. 1998లో రోదసీయానంలో శిక్షణ తీసుకున్నారు. వ్యోమగామి కావాలన్నది మాత్రం తల్లిదండ్రుల కల. ఆ కల నెరవేరటానికి కూడా కారణం అమ్మానాన్నే అంటారు సునీత. సునీత త్వరగా భూమిపైకి తిరిగి రావాలని ఆకాంక్షిద్దాం.

సాగుబడి
పుష్యమి కార్తె: ఆగస్టు 2 వరకు
ఆశ్లేష కార్తె: ఆగస్టు 3 నుంచి

రసాయనిక అవశేషాలు లేని నాణ్యమైన పంట దిగుబడులు పండించి ప్రజారోగ్యానికి పెద్దపీట వేసే దిశగా ఆంధ్రప్రదేశ్‌లో గత ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన ఇండియా గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీసెస్ (ఐ.జి.ఎ.పి.- ఇండ్ గ్యాప్) మంచి ఫలితాలనిస్తున్నాయి. అనేక మంది రైతులు గ్యాప్ పద్ధతులకు అనుగుణంగా ఆహార పంటలు పండించేందుకు ఆసక్తి చూపుతున్నారు. రసాయనిక ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని దశల వారీగా తగ్గిస్తూ, రసాయనిక అవశేషాల్లేని నాణ్యమైన, అధిక పంట దిగుబడుల ఉత్పత్తి సాధించటం ఇండ్ గ్యాప్ పద్ధతిలో ముఖ్యమైన అంశం.



'ఇండ్ గ్యాప్' సాగు బాట.. రసాయనాల్లేని పంట!

తుంగభద్ర సేంద్రియ వ్యవసాయ ధాన్య విత్తన రైతుల పరస్పర సహాయ సహకార సంఘంలో సభ్యులైన రైతులు గ్యాప్ పద్ధతులను ఆచరిస్తూ ఆదర్శంగా నిలిచారు. 2023–24లో కర్నూలు జిల్లాలోని సీ.బెలగల్ మండలం కొండాపురం (రంగాపురం), గుండ్రేవుల గ్రామాల్లోని 50 మంది రైతులు ఈ సంఘంలో సభ్యులుగా ఉన్నారు. గ్యాప్ పద్ధతులను పాటిస్తూ బీపీటీ 5204 రకం వరి పంటను సాగు చేశారు. రైతులు ఒక్కొక్కరు అరెకరం నుంచి మూడు ఎకరాల వరకు మొత్తం 24.09 హెక్టార్లలో గ్యాప్ పద్ధతులకు అనుగుణంగా వరి పండించారు.

గ్యాప్ నిబంధనల ప్రకారం వరి సాగు పూర్తిగా వ్యవసాయ అధికారుల పర్యవేక్షణలో జరిగింది. 10–15 రోజులకోసారి డాక్టర్ వైఎస్ఆర్ పొలంబడి కార్యక్రమాన్ని గ్రామంలో నిర్వహించి రైతులకు గ్యాప్ పద్ధతులపై అవగాహన కల్పించారు. కర్నూలు ఏడీఏ సాలురెడ్డి, సి.బెలగల్ ఏవో మల్లేష్ యాదవ్, జిల్లా వనరుల కేంద్రం అధికారులు ప్రతి పొలంబడికి వెళ్లి పంటలను పరిశీలించి రైతులకు సూచనలు ఇస్తూ వచ్చారు.

కొండాపురం, గుండ్రేవుల గ్రామాల్లోని 50 మంది రైతుల్లో ప్రతి రైతు 100 శాతం గ్యాప్ పద్ధతులు పాటించారు. నాట్లకు ముందు సామూహికంగా పచ్చి రొట్ట ఎరువు పంట సాగు చేసి, పూత దశలో పొలంలో కలిపి దున్నేశారు. ఎకరాకు 3–4 టన్నుల పశువుల ఎరువు వేసుకున్నారు. కొందరు రైతులు వేపచెక్క, వర్మీ కంపోస్టు కలిపి వేసుకున్నారు. పురుగుల బెడదను తగ్గించుకునేందుకు ఎకరాకు 5–6 లింగాకర్షక బుట్టలు, జిగురు అట్టలు ఏర్పాటు చేసుకున్నారు. సాధారణంగా రసాయనిక వ్యవసాయం చేసే రైతులు ఈ ప్రాంతంలో ఎకరానికి 6–8 బస్తాల రసాయనిక ఎరువులు వేస్తూ ఉంటారు. గ్యాప్ పద్ధతిలో 4 బస్తాల వరకు రసాయనిక ఎరువులు, అనుమతించిన కొన్ని పురుగుమందులను తగు మోతాదులో మాత్రమే ఉపయోగిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. పంట సాగు కాలంలో ఏపీ ఆర్గానిక్ సీడ్ సర్టిఫికేషన్ ఏజెన్సీ అధికారుల బృందం మూడు దఫాలు పరిశీలించింది. వరి కోతలు పూర్తి కాగానే మూడు శ్యాంపుల్స్ సేకరించి గుంటూరులోని వ్యవసాయ శాఖ ల్యాబ్‌కు పంపారు. అక్కడ జరిపిన పరీక్షల్లో రసాయనిక అవశేషాల ప్రభావం జీరో ఉన్నట్లు స్పష్టం కావడంతో సర్టిఫికేషన్ అథారిటీ ఈ సొసైటీ రైతులకు ఉమ్మడిగా ఇండ్ గ్యాప్ సర్టిఫికెట్‌ను 2024 జనవరిలో జారీ చేసింది. ఆ తర్వాత రైతులు వరి ధాన్యాన్ని మిల్లింగ్ చేయించి బియ్యాన్ని మంచి ధరకు అమ్ముకున్నారు.

- రసాయనిక అవశేషాల్లేని పంటల కోసం సరికొత్త 'ఇండ్ గ్యాప్' సర్టిఫికేషన్
- దీనితో వరి సాగులో లాభపడిన తుంగభద్ర సహకార సంఘం రైతులు
- సాధారణ వరి సాగు కన్నా ఖర్చు తక్కువ, అధిక దిగుబడితో పాటు అధిక ధర పొందిన వైనం
- నగరాలు, పట్టణాల పరిసరాల్లో ఇండ్ గ్యాప్ పద్ధతిలో ధాన్యం, కూరగాయలు, పండ్లు సాగు చేస్తే రైతులకు, వినియోగదారులకూ మేలు!

ఇండ్ గ్యాప్, రసాయనిక వ్యవసాయ పద్ధతుల మధ్య వ్యత్యాసం


వివరాలు	రసాయనిక పద్ధతి	ఇండ్ గ్యాప్ పద్ధతి	వ్యత్యాసం
పంట	వరి	వరి	-
రకం	బీపీటీ-5204	బీపీటీ-5204	-
సాగు ఖర్చు	రూ. 37,000	రూ. 28,000	9000 (రూ./ఎకరాకు)
దిగుబడి	14.57	17.08	2.51 (క్విం/ఎకరాకు)
బియ్యం ధర	5,500	6,900	1400 (రూ. /క్విం.)
స్థూల ఆదాయం	80,148	1,17,887	37,739 (రూ./ఎకరాకు)

దిగుబడితో పాటు ధరా ఎక్కువే!

అతిగా రసాయన ఎరువులు, పురుగు మందులు వాడి ధాన్యం పండించిన రైతులు బియ్యం క్వింటాలు రూ.5,500 ప్రకారం విక్రయించుకుంటే, ఇండ్ గ్యాప్ సర్టిఫికెట్ పొందిన సహకార సంఘం రైతుల బియ్యానికి రూ.7,000 ధర లభించింది. మామూలుగా అయితే వరి సాగులో ఎకరాకు సగటున రూ. 45 వేల వరకు పెట్టుబడి వ్యయం అవుతుంది. ఇండ్ గ్యాప్ పద్ధతిలో ఖర్చు రూ.28 వేలు మాత్రమే. సగటున ఎకరాకు ధాన్యం దిగుబడి 2.51 క్వింటాళ్లు అదనంగా వచ్చింది. మొత్తం 50 మంది రైతులు 24.09 హెక్టార్లలో 102.9 టన్నుల దిగుబడి సాధించి రూ. 71 లక్షల ఆదాయం పొందారు. సాధారణ రసాయనిక వ్యవసాయ రైతులతో పోల్చితే ఇది రూ. 14.4 లక్షల అధికం కావటం విశేషం. ఈ స్ఫూర్తితో తుంగభద్ర సహకార సంఘం రైతులు ఈ ఏడాది కూడా గ్యాప్ పద్ధతిలోనే వరి సాగు కొనసాగిస్తున్నారు.

– గవిని శ్రీనివాసులు, సాక్షి, కర్నూలు (అగ్రికల్చర్)

నికరాదాయం పెరిగింది



8 ఎకరాల వ్యవసాయం చేస్తున్నా. నేను 2.75 ఎకరాల్లో ఇండ్ గ్యాప్ పద్ధతిలో వరి సాగు చేశాను. మిగతా పొలంలో పత్తి, ఉల్లి, మొక్కజొన్న పంటలు సాధారణ పద్ధతిలోనే పండిస్తున్నాను. సుస్థిర వ్యవసాయ కేంద్రం శాస్త్రవేత్తల సూచనలు చాలా ఏళ్లుగా పాటిస్తుండటంతో గ్యాప్ పద్ధతిని అనుసరించటం నాకు సులువైంది.వేప చెక్కను ఎక్కువగా వినియోగించడం, గో ఆధారిత పద్ధతులు పాటించడం వల్ల పంట భూముల్లో సూక్ష్మ జీవులు విశేషంగా అభివృద్ధి చెంది వరి పంట ఎదుగుదలకు తోడ్పడుతున్నాయి. కెమికల్స్ వాసన లేకుండా వరి పండించాను. మామూలుగా అయితే ఎకరాకు వరి సాగులో రూ.45–50 వేల వరకు పెట్టుబడి వ్యయం వస్తుంది. గ్యాప్ పద్ధతులు పాటించడం వల్ల ఎకరాకు రూ.28 వేలు చొప్పున 2.75 ఎకరాల్లో రూ. 77 వేలు ఖర్చయింది. 41 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వచ్చింది. మిల్లింగ్ చేయగా 27 క్వింటాళ్ల బియ్యం వచ్చాయి. కర్నూలు తీసుకెళ్లి క్వింటా రూ.7,000కు అమ్మాను. క్వింటాకు రూ. వంద రవాణా ఖర్చు వచ్చింది. రూ.1.09 లక్షల నికరాదాయం వచ్చింది. మా సంఘంలోని 50 మంది రైతుల్లో క్వింటా బియ్యం రూ.7,500కి అమ్మిన వాళ్లూ కొందరు ఉన్నారు. ఈ ఏడాది కూడా గ్యాప్ పద్ధతిలోనే వరి సాగు చేస్తున్నాం.

– పి.మధుసూదన్‌రెడ్డి (94900 96333), రైతు, కొండాపురం, సీ.బెలగల్ మండలం, కర్నూలు జిల్లా

ఇండ్ గ్యాప్ సర్టిఫికేషన్‌కు శ్రీకారం

ఇండ్ గ్యాప్ పద్ధతుల్లో పండించిన ఆహారోత్పత్తులకు దేశంలోనే కాదు, అంతర్జాతీయంగా కూడా ప్రత్యేక గుర్తింపు ఉంది. మన దేశంలో అమలయ్యే గ్యాప్ పద్ధతులకు కేంద్ర ప్రభుత్వ సంస్థ క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (క్యు.సి.ఐ.) 'ఇండ్ గ్యాప్' సర్టిఫికేషన్‌ను అందిస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లో గత ప్రభుత్వం 2023–24 ఖరీఫ్ నుంచి ఏపీ రాష్ట్ర సేంద్రియ ఉత్పత్తుల ధృవీకరణ సంస్థ ద్వారా ఈ ఇండ్ గ్యాప్ సర్టిఫికేషన్ వ్యవస్థ రైతులకు దేశంలోనే తొలిగా అందుబాటులోకి తెచ్చింది. 2023–24లో ఏపీలోని ప్రతి జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద ఒక పంటను గ్యాప్ పద్ధతిలో పొలంబడిలో భాగంగా సాగు చేయించడం విశేషం. ఈ సదుపాయాన్ని ఉపయోగించుకున్న అనేక సహకార సంఘాలు, ఎఫ్.పి.సి.లు వ్యవసాయ శాఖ పొలంబడి కార్యక్రమం ద్వారా ఇండ్ గ్యాప్ పద్ధతులను అనుసరించి లబ్ధిపొందటం విశేషం. విత్తన ధృవీకరణ సంస్థ ద్వారా ఉత్పత్తులపై పరీక్షలు చేయించి రైతులకు ఈ సర్టిఫికేషన్ ఇస్తారు. తద్వారా రైతులు మంచి మార్కెట్ ధరకు విక్రయించి మంచి నికరాదాయాన్ని పొందుతున్నారు. దిగుబడులపై ఎటువంటి ప్రతికూల ప్రభావం పడకుండా క్రమంగా కెమికల్ వాడకాన్ని తగ్గిస్తూ.. అదే సమయంలో సేంద్రియం వైపు మళ్లే విధంగా రైతుల్లో అవగాహన కల్పించడం గమనార్హం.

తిరుపతిలో 3,4 తేదీల్లో ఆర్గానిక్ ఉత్పత్తుల మేళా

ఆగస్టు 3, 4 తేదీల్లో తిరుపతిలోని తుడా బిల్డింగ్ వెనుక గల కచ్చపీ కళాక్షేత్రంలో ప్రకృతి/సేంద్రియ వ్యవసాయ పద్ధతుల్లో పండించిన ఆహారోత్పత్తులు, చేనేత వస్త్రాల మేళాను కనెక్ట్ టు ఫార్మర్స్ సంస్థ నిర్వహించనుంది. ఉ. 11 గం. నుంచి రాత్రి 8 వరకు అనేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 3వ తేదీ(శనివారం) ఉ. 11 గం.కు ప్రకృతి వనం వ్యవస్థాపకులు ఎంసీవీ ప్రసాద్ ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తారు. దేశవాళీ వరి విత్తన ప్రదర్శన ప్రారంభం. 4(ఆదివారం)న ఉ. 10.30 గం.కు దేశవాళీ వరి విత్తన పరిరక్షణ ప్రాముఖ్యతపై అక్బర్, బాపన్న అవగాహన కల్పిస్తారు. మట్టి వినాయక బొమ్మల తయారీపై శిక్షణ ఉంటుంది.

హైదరాబాద్‌లో పాలేకర్‌తో చర్చాగోష్ఠి నేడు

సుభాష్ పాలేకర్ కృషి (ఎస్.పి.కె.) పద్ధతిలో పర్యావరణ హితమైన అల్కలైన్ ఆహారోత్పత్తుల ఉత్పత్తి, మార్కెటింగ్ తదితర అంశాలపై ఈ నెల 30 (మంగళవారం)న హైదరాబాద్ ఫిల్మ్‌నగర్‌లో తెలుగు రాష్ట్రాల రైతులు, సామాజిక కార్యకర్తలు, సినీ ప్రముఖులు, రచయితలు, వైద్యులు, పాత్రికేయులతో పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ సుభాష్ పాలేకర్ చర్చాగోష్ఠి జరగనుంది. ఈ నెల 30(మంగళవారం)న మధ్యాహ్నం 3–6 గంటల మధ్య జూబ్లీ హిల్స్ ఫిల్మ్‌నగర్ కల్చరల్ సెంటర్ (ఫిలింనగర్ క్లబ్)లో చర్చాగోష్ఠి జరుగుతుందని నిర్వాహకులు వి.నరసింహారెడ్డి (98662 46111), నరేశ్ (99481 58570), విజయరామ్ (63091 11427) తెలిపారు. పాలేకర్ ఆంగ్ల ప్రసంగాన్ని అప్పటికప్పుడు తెలుగులోకి అనువదిస్తారు. ప్రవేశం ఉచితం.

4న మిరప, అపరాల సేంద్రియ సాగుపై శిక్షణ

సేంద్రియ పద్ధతిలో మిరప, అపరాల సాగు, వివిధ రకాల కషాయాలపై ఆగస్టు 4 (ఆదివారం) ఉ. 10 గంటల నుంచి హైదరాబాద్ ఖైరతాబాద్‌లోని దక్షిణ భారత హిందీ ప్రచార సభ ఆవరణలో రైతులకు నాగర్‌కర్నూల్‌కు చెందిన సీనియర్ ప్రకృతి వ్యవసాయదారు లావణ్యా రెడ్డి శిక్షణ ఇస్తారని నిర్వాహకులు, రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ డా. వై. వెంకటేశ్వరరావు తెలిపారు. వివరాలకు.. 95538 25532.

PARIS 2024
సాక్షి
మంగళవారం
30-7-2024

స్పోర్ట్స్



నాదల్‌పై జొకోవిచ్ పైచేయి

పారిస్ ఒలింపిక్స్ పురుషుల టెన్నిస్ ఈవెంట్ సింగిల్స్ విభాగంలో స్పెయిన్ దిగ్గజం రాఫెల్ నాదల్ పోరాటం ముగిసింది. సోమవారం జరిగిన రెండో రౌండ్ మ్యాచ్‌లో టాప్ సీడ్ నొవాక్ జొకోవిచ్ (సెర్బియా) 6–1, 6–4తో నాదల్‌ను ఓడించాడు. వీరిద్దరు ఇప్పటి వరకు 60 సార్లు తలపడ్డారు. జొకోవిచ్ 31 సార్లు గెలుపొందగా... నాదల్ 29 సార్లు విజయం సాధించాడు. వరుసగా ఐదో ఒలింపిక్స్‌లో పోటీపడుతున్న జొకోవిచ్‌కు ఒలింపిక్ స్వర్ణం లోటుగా ఉంది. 2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో సింగిల్స్‌లో కాంస్యం నెగ్గిన జొకోవిచ్... 2012 లండన్, 2016 రియో, 2020 టోక్యో ఒలింపిక్స్‌లో మాత్రం పతకాలు సాధించలేకపోయాడు.

హర్మీత్ దేశాయ్ పరాజయం

పారిస్ ఒలింపిక్స్ టేబుల్ టెన్నిస్ (టీటీ) పురుషుల సింగిల్స్‌లో భారత కథ ముగిసింది. ప్రిలిమినరీ రౌండ్ తొలి మ్యాచ్‌లో గెలిచి ప్రధాన ‘డ్రా’కు అర్హత సాధించిన భారత రెండో ర్యాంకర్ హర్మీత్ దేశాయ్ తొలి రౌండ్‌ను దాటలేకపోయాడు. మూడో సీడ్ ఫెలిక్స్ లెబ్రూన్ (ఫ్రాన్స్)తో 28 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో హర్మీత్ 8–11, 8–11, 6–11, 8–11తో ఓడిపోయాడు.

మరో కాంస్యం వేటలో

షూటింగ్ యువ తార మనూ భాకర్ రెండు రోజుల వ్యవధిలో తన రెండో ఒలింపిక్ పతకంపై గురి పెట్టింది. ఆదివారం మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో కాంస్య పతకం నెగ్గిన మనూ భాకర్‌కు ఈసారి సరబ్‌జోత్ సింగ్ జత కలిశాడు. ఈ జోడీ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ ఈవెంట్‌లో కాంస్య పతక పోరుకు అర్హత సాధించింది. జిన్ ఓయె–లీ వన్‌హో (దక్షిణ కొరియా) జంటతో నేడు జరిగే ఈ పోరులో గెలిస్తే ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన తొలి భారత ప్లేయర్‌గా మను చరిత్ర సృష్టిస్తుంది. వ్యక్తిగత విభాగంలో త్రుటిలో ఫైనల్ అవకాశాలు చేజార్చుకున్న సరబ్‌జోత్‌కు కూడా తొలి పతకం గెలుచుకునేందుకు ఇది మంచి అవకాశం. మరోవైపు సోమవారం పతకం కోసం బరిలోకి దిగిన షూటర్లలో అర్జున్ బబూతా నాలుగో స్థానంలో నిలిచి దురదృష్టవశాత్తూ కాంస్యం చేజార్చుకోగా, రమిత ఏడో స్థానంతో నిరాశగా నిష్క్రమించింది.

10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ ఈవెంట్‌లో మనూ భాకర్–సరబ్‌జోత్ జోడీ ముందంజ

- నేడు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి కాంస్య పతక పోరు
- నాలుగో స్థానంతో ముగించిన అర్జున్ బబూతా


మనూ భాకర్, సరబ్‌జోత్

పారిస్: ఒలింపిక్స్ షూటింగ్ సమరాల్లో భారత్‌కు సోమవారం మిశ్రమ ఫలితాలు లభించాయి. మనూ భాకర్–సరబ్‌జోత్ జోడీ కాంస్య పతకం గెలుచుకునే అవకాశాలు సృష్టించుకోగా... ఇతర షూటర్లు విఫలమయ్యారు. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో మనూ–సరబ్ జోడీ క్వాలిఫయింగ్‌లో మెరుగైన చక్కటి ప్రదర్శన కనబర్చింది. నేడు జరిగే కాంస్య పతక పోరులో మనూ–సరబ్ ద్వయం గెలిస్తే భారత్ ఖాతాలో షూటింగ్ నుంచి మరో పతకం చేరుతుంది. ఈ మ్యాచ్‌లో కొరియాకు చెందిన జిన్ ఓయె–లీ వన్‌హో జంటతో భారత జోడీ తలపడుతుంది. సోమవారం జరిగిన క్వాలిఫయింగ్ ఈవెంట్‌లో 580 స్కోరు సాధించిన భారత షూటింగ్ జంట పతకం కోసం ముందంజ వేసింది. మూడు సిరీస్‌లలో ఇద్దరు భారత షూటర్లు కలిసి వరుసగా 193, 195, 192 స్కోర్లు సాధించారు. తొలి రెండు సిరీస్‌లలో 98, 98 పాయింట్లు సాధించిన మనూ చివరి సిరీస్‌లో 95కే పరిమితం కావడం తుది ఫలితంపై ప్రభావం చూపించింది. సరబ్‌జోత్ 95, 97,


అర్జున్

97 స్కోర్లు నమోదు చేశాడు. నేటి భారత్ ప్రత్యర్థి కొరియా 579 స్కోరుతో నాలుగో స్థానంలో నిలిచింది. ఈ క్వాలిఫయింగ్ ఈవెంట్‌లో తొలి రెండు స్థానాలు సాధించిన టర్కీ (582), సెర్బియా (581) నేడు జరిగే ఫైనల్లో స్వర్ణ–రజత పతకం కోసం పోటీ పడతాయి. ఇదే ఈవెంట్‌లో బరిలోకి


రమిత

దిగిన మరో భారత జోడీ రిథమ్ సాంగ్వాన్–అర్జున్ సింగ్ చీమా ఓవరాల్‌గా 576 పాయింట్లు స్కోరు చేసి 10వ స్థానంతో ముగించింది.

బబూతా పోరాడినా...

పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్ ఫైనల్లో పతక ఆశలతో బరిలోకి దిగిన అర్జున్ బబూతాను చివరకు దురదృష్టం పలకరించింది. స్టేజ్–1లో పది షాట్‌ల తర్వాత 105 పాయింట్లతో అతను మూడో స్థానంతో మెరుగైన స్థితిలో నిలిచాడు. స్టేజ్–2 ఎలిమినేషన్ రౌండ్ తొలి సిరీస్‌లో కూడా 10.6, 10.6 స్కోర్లతో పతకావకాశాలు మెరుగుపర్చుకున్నాడు. అయితే ఇదే జోరును బబూతా కొనసాగించలేకపోయాడు. రెండో సిరీస్ తొలి షాట్‌లో పేలవంగా 9.9 స్కోరు చేయడం అతడిని బాగా దెబ్బ తీసింది. అయినా సరే... మూడు సిరీస్‌లు ముగిసిన తర్వాత 167.8 స్కోరుతో క్రొయేషియా షూటర్ మరిసిచ్‌తో సమంగా నిలిచాడు. కానీ నాలుగో సిరీస్ రెండో షాట్‌లో 10.1 మాత్రమే సాధించి వెనకబడిపోయాడు. ఓవరాల్‌గా 208.4 పాయింట్లతో నాలుగో స్థానమే దక్కింది. ఈ ఈవెంట్‌లో షెంగ్ లిహావో (చైనా–252.2), విక్టర్ లింగ్రెన్ (స్వీడన్–251.4), మిరాన్ మరిసిచ్ (క్రొయేషియా–230) స్వర్ణ, రజత, కాంస్యాలు గెలుచుకున్నారు. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మహిళల విభాగం ఫైనల్లో భారత షూటర్ రమిత జిందాల్ నిరాశపర్చింది. మొత్తం 145.3 పాయింట్లతో ఆమె ఏడో స్థానంతో ముగించింది. పురుషుల ట్రాప్ ఈవెంట్ క్వాలిఫయింగ్‌లో తొలి రోజు భారత షూటర్ పృథ్వీరాజ్ తొండైమన్ పేలవ ప్రదర్శనను కనబర్చాడు. 75 పాయింట్ల మూడు రౌండ్ల తర్వాత పృథ్వీరాజ్ 68 పాయింట్లు సాధించి ప్రస్తుతం 30వ (చివరి) స్థానంలో కొనసాగుతున్నాడు. అతను వరుసగా 22, 25, 21 పాయింట్లు స్కోరు చేశాడు. మంగళవారం మరో 25 పాయింట్లు చొప్పున రెండు రౌండ్‌లు జరుగుతాయి. ఆ తర్వాత ఓవరాల్ పాయింట్లను బట్టి టాప్–6లో నిలిచినవారు ఫైనల్స్‌కు అర్హత సాధిస్తారు.

పతకాల పట్టిక




ర్యాంక్	దేశం	స్వ	ర	కాం	మొ
1	దక్షిణ కొరియా	5	3	1	9
2	జపాన్	5	2	4	11
3	చైనా	5	2	2	9
4	ఫ్రాన్స్	4	7	3	14
5	ఆస్ట్రేలియా	4	3	0	7
6	అమెరికా	3	7	4	14
7	బ్రిటన్	2	4	3	9
25	భారత్	0	0	1	1

నోట్: స్వ-స్వర్ణం, ర-రజతం, కాం-కాంస్యం, మొ-మొత్తం. స్వర్ణాల సంఖ్య ఆధారంగా ర్యాంక్ వరుస క్రమాన్ని నిర్ణయిస్తారు.

ఐదు దేశాలు దాటి ఒలింపిక్స్ వరకు...

అఫ్గానిస్తాన్ శరణార్థి జూడో ప్లేయర్ అసాధారణ ప్రయాణం



పారిస్: అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) నేతృత్వంలోని శరణార్థి జట్టు తరఫున ఒలింపిక్స్‌లో పాల్గొంటున్న ఒక్కొక్కరిది ఒక్కో గాథ. ప్రతికూల పరిస్థితుల మధ్య పోరాటం, పట్టుదలతో విశ్వ క్రీడలకు వెళ్లాలని ప్రయత్నించే వారి ప్రయాణం అసాధారణం. ఇలాంటి వారిలో అఫ్గానిస్తాన్‌కు చెందిన సిబ్గతుల్లా అరబ్ ఒకడు. ఈ ఒలింపిక్స్‌లో అతను జూడో (81 కేజీల విభాగం)లో బరిలోకి దిగాడు. 2021లో అఫ్గానిస్తాన్ తాలిబాన్ల చేతుల్లోకి వెళ్లిపోయాక అక్కడి పరిస్థితులు మారిపోవడంతో అరబ్ ఆ దేశం నుంచి పారిపోయాడు. అప్పటికి 19 ఏళ్ల వయసులో ఉన్న అతను అఫ్గాన్ జాతీయ జూడో జట్టులోకి ఎంపికయ్యాడు కూడా. అక్కడి నుంచి బయల్దేరి తొమ్మిది నెలల పాటు ఎన్నో కష్టాలకు ఓర్చి ఇరాన్, టర్కీ, గ్రీస్, బోస్నియా అండ్ స్లొవేనియాలలో తలదాచుకుంటూ చివరకు జర్మనీ చేరాడు. డార్ట్‌మండ్ సమీపంలోని శరణార్థి శిబిరంలో తనలాగే ఇరాన్ నుంచి వచ్చిన కోచ్ ఆధ్వర్యంలో జూడోలో శిక్షణ కొనసాగించాడు. అక్కడే ఆటలో రాటుదేలిన అరబ్... యూరోపియన్ ఓపెన్ తదితర టోర్నీల్లో రాణించి ఎట్టకేలకు ఐఓసీ శరణార్థి టీమ్‌లోకి ఎంపికయ్యాడు. ఇప్పటికీ అరబ్ కుటుంబం అఫ్గానిస్తాన్‌లో ఉంటోంది. తన తల్లి, సోదరుడితో మాట్లాడుతుంటానని... భవిష్యత్తులో తన పరిస్థితి మెరుగవుతుందని అరబ్ ఆశాభావం వ్యక్తం చేశాడు.

మన బాణం విఫలం

క్వార్టర్ ఫైనల్లోనే ఓడిన భారత పురుషుల ఆర్చరీ జట్టు


ప్రవీణ్ తరుణ్‌దీప్ ధీరజ్

పారిస్: సీజన్‌లో రెగ్యులర్‌గా జరిగే ప్రపంచకప్ టోర్నీలలో పతకాలు సాధించే భారత ఆర్చర్లు ఒలింపిక్స్ క్రీడల్లో మాత్రం తమ వైఫల్యాన్ని కొనసాగిస్తున్నారు. ఆదివారం భారత మహిళల రికర్వ్ జట్టు నిరాశాజనక ప్రదర్శనతో క్వార్టర్ ఫైనల్లోనే వెనుదిరగ్గా... భారత పురుషుల రికర్వ్ జట్టు కూడా అదే బాటలో పయనించింది. ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ బొమ్మదేవర ధీరజ్, తరుణ్‌దీప్ రాయ్ (సిక్కిం), ప్రవీణ్ జాధవ్ (మహారాష్ట్ర)లతో కూడిన భారత బృందం లక్ష్యం దిశగా గురి తప్పి క్వార్టర్ ఫైనల్లోనే నిష్క్రమించింది. ర్యాంకింగ్ రౌండ్‌లో అద్భుత ఆటతీరుతో మూడో స్థానంలో నిలిచి తొలి రౌండ్‌లో ‘బై’ పొంది నేరుగా క్వార్టర్ ఫైనల్ ఆడిన భారత జట్టు ఈ అడ్డంకిని దాటలేకపోయింది. క్వార్టర్ ఫైనల్లో భారత జట్టు 2–6తో మెటి గజోజ్, బెర్కిమ్ తుమెర్, అబ్దుల్లాలతో కూడిన టర్కీ జట్టు చేతిలో ఓడిపోయింది. తొలి సెట్‌ను 57–53తో, రెండో సెట్‌ను 55–52తో నెగ్గిన టర్కీ 4–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. మూడో సెట్‌లో భారత జట్టు 55–54తో గెలిచి ఆధిక్యాన్ని 2–4కి తగ్గించింది. చివరిదైన నాలుగో సెట్‌లో టర్కీ బృందం 58–54తో నెగ్గి విజయాన్ని అందుకోవడంతోపాటు సెమీఫైనల్‌కు చేరింది. సెమీఫైనల్లో టర్కీ 4–5తో ఫ్రాన్స్ చేతిలో ఓడిపోయింది. అనంతరం కాంస్య పతక పోరులో టర్కీ 6–2తో చైనాపై గెలిచి కాంస్య పతకం సొంతం చేసుకుంది. మరోవైపు ఫైనల్లో దక్షిణ కొరియా 5–1తో ఫ్రాన్స్‌పై గెలిచి ఏడోసారి టీమ్ విభాగంలో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది.

‘డ్రా’తో గట్టెక్కిన భారత్


హర్మన్‌ప్రీత్

పారిస్: ఓటమి అంచుల్లో నుంచి భారత పురుషుల హాకీ జట్టు గట్టెక్కి ‘డ్రా’తో ఊపిరి పీల్చుకుంది. సోమవారం జరిగిన పూల్ ‘బి’ రెండో లీగ్ మ్యాచ్‌లో మాజీ ఒలింపిక్ చాంపియన్ అర్జెంటీనాతో జరిగిన మ్యాచ్‌ను భారత్ 1–1తో ‘డ్రా’గా ముగించింది. ఆట 22వ నిమిషంలో లుకాస్ మార్టినెజ్ గోల్‌తో అర్జెంటీనా 1–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. 36వ నిమిషంలో తమ ఆధిక్యాన్ని 2–0కు పెంచుకునే అవకాశం అర్జెంటీనాకు వచ్చింది. కానీ పెనాల్టీ స్ట్రోక్‌ను మైసో కసెల్లా వృథా చేశాడు. స్కోరును సమం చేసేందుకు భారత్ శక్తివంచన లేకుండా ప్రయత్నించింది. నిలకడగా పెనాల్టీ కార్నర్‌లు సంపాదించింది. కానీ వాటిని లక్ష్యానికి చేర్చడంలో విఫలమైంది. అయితే మరో నిమిషంలో ముగుస్తుందనగా భారత్‌కు 59వ నిమిషంలో తొమ్మిదో పెనాల్టీ కార్నర్ లభించింది. ఈ పెనాల్టీ కార్నర్‌ను కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ గోల్‌గా మలిచి స్కోరును సమం చేయడంతోపాటు భారత జట్టును ఓటమి నుంచి కాపాడాడు. నేడు జరిగే మూడో లీగ్ మ్యాచ్‌లో ఐర్లాండ్‌తో భారత్ ఆడుతుంది.

పారిస్‌లో భారతీయం

నేడు భారత క్రీడాకారుల షెడ్యూల్

హాకీ
పురుషుల పూల్ ‘బి’ మ్యాచ్: భారత్ X ఐర్లాండ్ (సాయంత్రం గం. 4:45 నుంచి).

ఆర్చరీ
మహిళల వ్యక్తిగత 1/32 ఎలిమినేషన్ రౌండ్: అంకిత భకత్ X వియోలెటా (పోలాండ్) (సాయంత్రం గం. 5:15 నుంచి), భజన్ కౌర్ X సిఫా (ఇండోనేసియా) (సాయంత్రం గం. 5:30 నుంచి). పురుషుల వ్యక్తిగత 1/32 ఎలిమినేషన్ రౌండ్: బొమ్మదేవర ధీరజ్ X ఆడమ్ లీ (చెక్ రిపబ్లిక్) (రాత్రి గం. 10:45 నుంచి).

బాక్సింగ్
పురుషుల 51 కేజీల ప్రిక్వార్టర్స్: అమిత్ పంఘాల్ X పాట్రిక్ చిన్‌యెంబా (జింబాబ్వే) (రాత్రి గం. 7:15 నుంచి). మహిళల 57 కేజీల మ్యాచ్: జైస్మిన్ లంబోరియా X నెస్తీ పెటెసియా (ఫిలిప్పీన్స్) (రాత్రి గం. 9:25 నుంచి). మహిళల 54 కేజీల ప్రిక్వార్టర్స్: ప్రీతి పవార్ X యెని మెర్సెలా (కొలంబియా) (అర్ధరాత్రి గం. 1.20 నుంచి).

బ్యాడ్మింటన్
పురుషుల డబుల్స్ గ్రూప్ మ్యాచ్: సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి X అల్ఫియన్ ఫజర్–మహమ్మద్ రియాన్ (ఇండోనేసియా) (సాయంత్రం గం. 5:30 నుంచి). మహిళల డబుల్స్ గ్రూప్ మ్యాచ్: అశ్విని పొన్నప్ప–తనీషా క్రాస్టో X సెట్యానా మాపసా–ఏంజెలా యూ (ఆస్ట్రేలియా) (సాయంత్రం గం. 6:20 నుంచి).

షూటింగ్
ట్రాప్ పురుషుల క్వాలిఫికేషన్: పృథ్వీరాజ్ (మధ్యాహ్నం గం. 12:30 నుంచి). ట్రాప్ మహిళల క్వాలిఫికేషన్: శ్రేయసి సింగ్, రాజేశ్వరి కుమారి (మధ్యాహ్నం గం. 12:30 నుంచి).
10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ కాంస్య పతక పోరు: భారత్ (మనూ భాకర్–సరబ్‌జోత్ సింగ్) X దక్షిణ కొరియా (జిన్ ఓయె–లీ వన్‌హో) (మధ్యాహ్నం గం. 1:00 నుంచి).

క్వార్టర్స్‌లో సాత్విక్–చిరాగ్ జోడీ



పారిస్: పతకమే లక్ష్యంగా పారిస్ ఒలింపిక్స్‌లో బరిలోకి దిగిన భారత బ్యాడ్మింటన్ స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి తొలి లక్ష్యాన్ని పూర్తి చేసింది. గ్రూప్ ‘సి’ నుంచి సాత్విక్–చిరాగ్...ఫజర్–అర్దియాంతో (ఇండోనేసియా) జోడీలు క్వార్టర్ ఫైనల్ బెర్త్‌లను ఖరారు చేసుకున్నాయి. గాయం కారణంగా గ్రూప్ ‘సి’లోని మార్క్ లమ్స్‌ఫుస్–మార్విన్ సిడెల్ (జర్మనీ) జోడీ వైదొలిగింది. ఇదే గ్రూప్‌లో ఉన్న లుకాస్ కోర్వీ–రొనాన్ లాబర్ (ఫ్రాన్స్) జంట ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ ఓడిపోయింది. దాంతో ఒక్కో మ్యాచ్‌లో నెగ్గిన భారత్, ఇండోనేసియా జోడీలు క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాయి. గ్రూప్ విజేతను నిర్ణయించే మ్యాచ్‌లో నేడు ఫజర్–అర్దియాంతోలతో సాత్విక్–చిరాగ్ తలపడతారు. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో సాత్విక్–చిరాగ్ జోడీ గ్రూప్ దశలోనే నిష్క్రమించింది.

అశ్విని–తనీషా అవుట్

మహిళల బ్యాడ్మింటన్ డబుల్స్ విభాగంలో అశ్విని పొన్నప్ప–తనీషా క్రాస్టో (భారత్) ద్వయం వరుసగా రెండో మ్యాచ్‌లో ఓడి క్వార్టర్ ఫైనల్ చేరే అవకాశాన్ని కోల్పోయింది. సోమవారం జరిగిన గ్రూప్ ‘సి’ రెండో లీగ్ మ్యాచ్‌లో అశ్విని–తనీషా జోడీ 11–21, 12–21తో నామి మత్సుయామ–చిహారు షిదా (జపాన్) జంట చేతిలో ఓడిపోయింది. మరోవైపు పురుషుల సింగిల్స్ గ్రూప్ ‘ఎల్’ రెండో మ్యాచ్‌లో లక్ష్య సేన్ (భారత్) 21–19, 21–14తో జూలియన్ కరాగి (బెల్జియం)పై గెలిచాడు. గ్వాటిమాలాకు చెందిన కెవిన్ కార్డన్ గాయంతో వైదొలిగాడు. ఫలితంగా కార్డన్‌పై లక్ష్య సేన్ గెలిచిన ఫలితాన్ని రద్దు చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం జరిగే చివరి లీగ్ మ్యాచ్‌లో జొనాథన్ క్రిస్టీ (ఇండోనేసియా)పై నెగ్గితేనే లక్ష్య సేన్ ప్రిక్వార్టర్ ఫైనల్ చేరుకుంటాడు.

బోపన్న జోడీ ఓటమి



పారిస్ ఒలింపిక్స్‌లో భారత వెటరన్ ప్లేయర్ రోహన్ బోపన్న నిరాశ పరిచాడు. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో బోపన్న–శ్రీరామ్ బాలాజీ జంట 5–7, 2–6తో వాసెలిన్–మోన్‌ఫిల్స్ (ఫ్రాన్స్) జోడీ చేతిలో ఓడింది. మ్యాచ్ అనంతరం బోపన్న మాట్లాడుతూ దేశం తరఫున ఇదే తన చివరి పోరు అని పేర్కొన్నాడు. ఇప్పటికే డేవిస్ కప్‌కు వీడ్కోలు పలికిన బోపన్న ఇకపై జాతీయ జట్టు తరఫున ఆడబోనని ప్రకటించాడు.
రెండు దశాబ్దాలకు పైగా సుదీర్ఘ కెరీర్‌లో బోపన్నకు ఒలింపిక్ పతకం అందని ద్రాక్షలాగే మిగిలింది. 2016 రియో ఒలింపిక్స్ మిక్స్‌డ్ డబుల్స్‌లో సానియా మీర్జాతో కలిసి నాలుగో స్థానంలో నిలిచిన బోపన్న.. ఇంత సుదీర్ఘ కాలం దేశానికి ప్రాతినిధ్యం వహించడాన్ని ఆనందించానని అన్నాడు. ఒలింపిక్స్ చరిత్రలో భారత్‌కు టెన్నిస్‌లో ఏకైక పతకం 1996 అట్లాంటా క్రీడల్లో (లియాండర్ పేస్–కాంస్యం) దక్కింది.

0.1 పాయింట్ తేడాతో స్వర్ణం



కొరియా టీనేజ్ షూటర్ సంచలనం

పారిస్ ఒలింపిక్స్‌లో దక్షిణ కొరియాకు చెందిన టీనేజ్ షూటర్ బాన్ హ్యోజిన్ 0.1 పాయింట్ తేడాతో స్వర్ణం కైవసం చేసుకుంది. సోమవారం జరిగిన 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మహిళల విభాగం ఫైనల్లో 16 ఏళ్ల బాన్ హ్యోజిన్ చివరి షాట్‌లో అత్యుత్తమ ప్రదర్శనతో పసిడి పతకం చేజిక్కించుకుంది. 22 షాట్లు ముగిసేసరికి బాన్ హ్యోజిన్‌తోపాటు 17 ఏళ్ల చైనా షూటర్ హువాంగ్ యూటింగ్ 251.8 పాయింట్లతో నిలిచారు. దీంతో విజేతను నిర్ణయించేందుకు ‘షూట్ ఆఫ్’ నిర్వహించగా.. అందులో బాన్ 10.4 స్కోరు చేయగా.. హువాంగ్ 10.3 పాయింట్లతో రెండో స్థానానికి పరిమితమైంది. తద్వారా బాన్ ఒలింపిక్ చాంపియన్‌గా నిలిచిన అతిపిన్న వయసు మహిళా షూటర్‌గా రికార్డుల్లోకెక్కింది. స్విట్జర్లాండ్ షూటర్ ఆడ్రే గొగ్నియాల్ 230.3 పాయింట్లతో కాంస్యం గెలుచుకుంది.

వచ్చే ఏడాది భారత్‌లో ఆసియా కప్ టి20 క్రికెట్ టోర్నీ

పురుషుల ఆసియాకప్ టోర్నమెంట్‌కు భారత్ ఆతిథ్యమివ్వనుంది. టి20 ఫార్మాట్‌లో జరిగే ఈ టోర్నీని వచ్చే ఏడాది సెప్టెంబర్‌లో నిర్వహించనున్నారు. 2026లో స్వదేశంలో జరిగే టి20 ప్రపంచకప్‌కు ముందుగా ఈ టోర్నీ నిర్వహిస్తారు. గతంలోనూ 2023 వన్డే ప్రపంచకప్‌కు సన్నాహకంగా పాకిస్తాన్‌లో ఆసియా కప్‌ను వన్డే ఫార్మాట్‌లో నిర్వహించారు. అయితే భారత్ అక్కడికి వెళ్లేందుకు నిరాకరించడంతో 'హైబ్రిడ్ మోడల్'తో భారత్ ఆడిన మ్యాచ్‌ల్ని శ్రీలంకలో ఏర్పాటు చేశారు. ఫైనల్లో శ్రీలంకపై గెలిచి భారత్ విజేతగా నిలిచింది. అనంతరం 2027 ఆసియా కప్‌కు బంగ్లాదేశ్ ఆతిథ్యమిస్తుంది. అదే ఏడాది దక్షిణాఫ్రికాలో వన్డే ప్రపంచకప్ ఉండటంతో బంగ్లాలో వన్డే ఫార్మాట్‌లో ఆసియాకప్ జరుగనుంది. ఈ రెండు టోర్నీల్లోనూ భారత్, శ్రీలంక, పాకిస్తాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్‌లతో పాటు టెస్టు హోదా దక్కని ఒక ఆసియా జట్టు పాల్గొంటుందని ఆసియా క్రికెట్ మండలి తెలిపింది.



చేరువై... దూరమై!

ఒలింపిక్స్ క్రీడల్లో భారత క్రీడాకారులకు త్రుటిలో చేజారిన పలు పతకాలు

చిక్కినట్లే చిక్కి చేజారితే కలిగే బాధ వర్ణనాతీతం! ఒలింపిక్స్ వంటి ప్రతిష్ఠాత్మక వేదికపై పతకం పట్టాలని ప్రతి అథ్లెట్ కలలు కంటాడు. ఏళ్ల తరబడి కఠోర సాధన, అలుపెరగని పోరాటం చేస్తూనే ఉంటారు. మరి అలాంటిది... మెడల్‌కు అత్యంత చేరువైన తర్వాత అందినట్లే అంది ఆ విజయం దూరమైతే కలిగే బాధ అంతా ఇంతా కాదు! ప్రస్తుతం జరుగుతున్న పారిస్ ఒలింపిక్స్ క్రీడల్లో పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఫైనల్లో భారత షూటర్ అర్జున్ బబుతాకు ఇలాంటి మనసు వికలమయ్యే అనుభవం ఎదురైంది. అయితే త్రుటిలో పతకాలు చేజార్చుకున్న భారత ప్లేయర్లలో అర్జున్ బబూతా మొదటి క్రీడాకారుడేమీ కాదు... గతంలోనూ పలుమార్లు విశ్వ క్రీడల్లో భారత్‌కు ఎదురైన ఇలాంటి చేదు అనుభవాలను పరిశీలిస్తే...

ఫుట్‌బాల్‌తో మొదలు



1956 మెల్‌బోర్న్ ఒలింపిక్స్‌లో భారత ఫుట్‌బాల్ జట్టు అద్భుత ప్రదర్శన కనబర్చింది. హైదరాబాదీ కోచ్ సయ్యద్ అబ్దుల్ రహీమ్ శిక్షణలో రాటుదేలిన మన జట్టు.. ప్రత్యర్థులకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా క్వార్టర్ ఫైనల్‌కు చేరింది. క్వార్టర్స్‌లో ఆతిథ్య ఆస్ట్రేలియాపై నెవిల్లె డిసౌజా హ్యాట్రిక్ గోల్స్‌తో విజృంభించడంతో సెమీస్‌లో అడుగుపెట్టి పతకం సాధించడం ఖాయమే అనిపించింది. అయితే యుగోస్లోవియాతో జరిగిన సెమీఫైనల్లో భారత్ 1–4తో పరాజయం పాలైంది. కాంస్య పతక పోరులోనూ తడబడ్డ భారత్ 0–3తో బల్గేరియా చేతిలో ఓడి నాలుగో స్థానంతో నిరాశగా వెనుదిరిగింది.

మిల్కా సింగ్ వెంట్రుకవాసిలో...



1960 రోమ్ ఒలింపిక్స్‌లో భారీ అంచనాల మధ్య బరిలోకి దిగిన భారత స్టార్ అథ్లెట్ మిల్కాసింగ్.. నాలుగో స్థానంతో సరిపెట్టుకున్నాడు. పురుషుల 400 మీటర్ల పరుగులో సమీప ప్రత్యర్థిని చూసే క్రమంలో క్షణకాలాన్ని వృథా చేసుకున్న మిల్కా.. దానికి జీవితకాల మూల్యం చెల్లించుకున్నాడు. రోమ్ ఒలింపిక్స్ అనుభవంతో అథ్లెటిక్స్‌కే వీడ్కోలు పలకాలని నిర్ణయించుకున్నాడు. అతి బలవంతంగా అతడిని తిరిగి ట్రాక్ ఎక్కించగా.. 1962 ఆసియా క్రీడల్లో రెండు స్వర్ణ పతకాలతో సత్తాచాటాడు.

మహిళల హాకీలో ఇలా..



1980 మాస్కో విశ్వ క్రీడల్లో భారత మహిళల హాకీ జట్టు చక్కటి అవకాశాన్ని అందిపుచ్చుకోలేకపోయింది. అఫ్గానిస్తాన్‌పై ఆతిథ్య సోవియట్ యూనియన్ దాడి చేసిన నేపథ్యంలో నెదర్లాండ్స్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ వంటి దేశాలు మాస్కో క్రీడలను బహిష్కరించాయి. దీంతో మన జట్టు పోడియంపై నిలవడం ఖాయమే అనిపించింది. ఆస్ట్రియా, పోలాండ్‌పై ఘనవిజయాలు సాధించిన మన మహిళల జట్టు పతకంపై ఆశలు రేపింది. అయితే ఆ తర్వాత జింబాబ్వేతో మ్యాచ్ 'డ్రా' కాగా.. చెకోస్లోవియా, సోవియట్ యూనియన్ చేతిలో ఓడి నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది.

పరుగుల రాణికి తీరని వ్యథ!



1984 లాస్‌ఏంజెలిస్ క్రీడల్లో పరుగుల రాణి పీటీ ఉషకు ఇలాంటి చేదు అనుభవమే ఎదురైంది. మహిళల 400 మీటర్ల హర్డిల్స్‌లో సెకనులో వందో వంతు తేడాతో పీటీ ఉష నాలుగో స్థానానికి పరిమితమైంది. అంతర్జాతీయ స్థాయిలో ఏ పోటీలోనైనా ఒక భారత అథ్లెట్ పతకం కోల్పోయిన అత్యల్ప తేడా ఇదే. ఫైనల్లో ఉష 55.42 సెకన్లలో లక్ష్యాన్ని చేరింది.



మహిళల హాకీ జట్టు మరోసారి

2020 టోక్యో ఒలింపిక్స్‌లో మరోసారి భారత మహిళల హాకీ జట్టుకు నిరాశ తప్పలేదు. 1980 మాస్కో క్రీడల్లో త్రుటిలో కాంస్యం చేజార్చుకున్న మహిళల జట్టు.. టోక్యోలోనూ అదే బాటలో నడిచింది. మూడుసార్లు ఒలింపిక్ చాంపియన్ ఆస్ట్రేలియాను మట్టికరిపించి ఆశలు రేపిన మన అమ్మాయిలు.. సెమీఫైనల్లో అర్జెంటీనా చేతిలో పరాజయం పాలయ్యారు. కాంస్య పతక పోరులోనైనా అద్భుతం చేస్తారనుకుంటే.. ఇంగ్లండ్‌తో పోరులో ఆరంభంలో ఆధిక్యం సాధించినా.. చివర్లో పట్టు విడిచి 3–4తో నాలుగో స్థానానికి పరిమితమయ్యారు. ఇదే క్రీడల్లో ఏమాత్రం అంచనాలు లేకుండా బరిలోకి దిగిన గోల్ఫర్ అదితి అశోక్ నాలుగో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని కోల్పోయింది.

జాయ్‌దీప్‌కు నిరాశ



2012 లండన్ ఒలింపిక్స్‌లో జాయ్‌దీప్ కర్మాకర్‌కు అర్జున్‌లాంటి అనుభవమే ఎదురైంది. పురుషుల 50 మీటర్ల రైఫిల్ ప్రోన్ విభాగంలో బరిలోకి దిగిన కర్మాకర్ క్వాలిఫికేషన్ రౌండ్‌లో చక్కటి ప్రదర్శన కనబర్చి ఏడో స్థానంతో ఫైనల్‌కు అర్హత సాధించాడు. అయితే తుదిపోరులో కాంస్యం గెలిచిన షూటర్ కంటే.. 1.9 పాయింట్లు వెనుకబడిన కర్మాకర్ నాలుగో స్థానంతో సరిపెట్టుకున్నాడు.

దీపా కర్మాకర్ త్రుటిలో...



2016 రియో ఒలింపిక్స్‌లో భారత స్టార్ జిమ్నాస్ట్ దీపా కర్మాకర్ త్రుటిలో కాంస్య పతకం చేజార్చుకుంది. వాల్ట్ ఫైనల్లో దీపా కర్మాకర్ 15.066 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచింది. కాంస్యం గెలిచిన జిమ్నాస్ట్‌కు దీపా కర్మాకర్‌కు మధ్య 0.150 పాయింట్ల తేడా మాత్రమే ఉండటం గమనార్హం. ఇదే క్రీడల్లో భారత షూటర్ అభినవ్ బింద్రా నాలుగో స్థానంలో నిలిచి కాంస్య పతకం చేజార్చుకున్నాడు.



ఈసారి ఇద్దరు..

2004 ఏథెన్స్ ఒలింపిక్స్‌లో లియాండర్ పేస్–మహేశ్ భూపతి జంట నాలుగో స్థానంలో నిలిచింది. భారత అత్యుత్తమ ద్వయంగా విశ్వక్రీడల బరిలోకి దిగిన పేస్–భూపతి హోరాహోరీగా సాగిన కాంస్య పతక పోరులో 6–7, 6–4, 14–16తో అన్‌సిచ్–లుబిసిచ్ (క్రొయేషియా) జోడీ చేతిలో పరాజయం పాలైంది.

–సాక్షి క్రీడా విభాగం

క్లీన్‌స్వీప్ లక్ష్యంగా...

శ్రీలంకతో భారత్ ఆఖరి పోరు నేడు

- సమరోత్సాహంతో సూర్యసేన
- ఒత్తిడిలో అసలంక బృందం
- రాత్రి 7 గంటల నుంచి 'సోనీ' నెట్‌వర్క్‌లో ప్రసారం



పల్లెకెలె: భారత్ రెండు రోజుల్లో రెండు మ్యాచ్‌లు గెలిచింది. టి20 సిరీస్‌ను 2–0తో కైవసం చేసుకుంది. ఇప్పుడు దీన్ని 3–0గా వైట్‌వాష్ చేసేందుకు భారత్ ఆఖరి పోరాటానికి సిద్ధమైంది. తీవ్ర ఒత్తిడిలో ఉన్న ఆతిథ్య శ్రీలంకపై ముచ్చటగా మూడో విజయం సాధించేందుకు సూర్యకుమార్ బృందం తహతహలాడుతోంది. మంగళవారం జరిగే మూడో టి20 బరిలోకి టీమిండియా గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది. బ్యాటర్లు, బౌలర్లు ఫామ్‌లో ఉండటంతో 'హ్యాట్రిక్' గెలుపుపై ఎవరికి అనుమానాల్లేవ్! మరోవైపు లంక సొంతగడ్డపై పరువు కోసం పాకులాడుతోంది. కనీసం ఆఖరి పోరులో గెలిచి క్లీన్‌స్వీప్ కాకుండా బయటపడాలని ఆరాటపడుతోంది.

టీమిండియాకు ఎదురుందా...

ఓపెనర్ యశస్వి జైస్వాల్ అదరగొడుతున్నాడు. గిల్ స్థానంలో రెండో టి20 ఆడిన సంజూ సామ్సన్ డకౌట్‌ను మరిచేలా మెరిపిస్తే ఇన్నింగ్స్‌కు ఢోకా ఉండదు. సూర్యకుమార్, రిషభ్ పంత్, హార్దిక్ పాండ్యాలు మిగతా పని కానిచ్చేస్తారు. బౌలర్లు అర్ష్‌దీప్, అక్షర్, రవి బిష్ణోయ్, సిరాజ్‌లు కూడా నిలకడగా రాణిస్తున్నారు. తొలి మ్యాచ్‌లో దూసుకెళ్తున్న లంక ఇన్నింగ్స్‌ను 30 పరుగుల వ్యవధిలో 9 వికెట్లను కూల్చారు. రెండో మ్యాచ్‌లో 32 పరుగుల వ్యవధిలో 7 వికెట్లను తీసిన టీమిండియా బౌలింగ్ దళం సత్తాచాటుకుంది.

ఈ ఒక్కటైనా గెలవాలని...

సిరీస్‌ను చేజార్చుకున్న శ్రీలంక ఆఖరి పోరులో గెలిచేందుకు సర్వశక్తులు ఒడ్డనుంది. వచ్చే నెల 2 నుంచి జరిగే వన్డే సిరీస్‌లో ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగాలంటే ఈ మ్యాచ్ తప్పక గెలవాలని ఆశిస్తోంది. నిలకడలేని బ్యాటింగ్, పసలేని బౌలింగ్ ఆతిథ్య జట్టుకు తలనొప్పిగా మారింది. భారత్ నుంచి వైట్‌వాష్ తప్పించుకోవాలంటే మాత్రం వ్యూహాలకు పదును పెట్టాలని జట్టు మేనేజ్‌మెంట్ భావిస్తోంది. ఓపెనర్ నిసాంక మాత్రమే రెండు మ్యాచ్‌ల్లో కుదురుగా ఆడాడు. మిగతా వారంతా భారత బౌలింగ్‌ను ఎదుర్కోలేకపోతున్నారు. ఇకపై లోపాలను అధిగమించి విజయాన్నందుకోవాలని లంక సేన పట్టుదలతో ఉంది.

పిచ్, వాతావరణం

వేదిక మారలేదు కానీ గత రెండు మ్యాచ్‌లు ఆడిన పిచ్‌పై కాకుండా వేరే పిచ్‌పై ఈ మ్యాచ్ జరుగుతుంది. బ్యాటింగ్‌కు అనుకూలమే అలాగే స్పిన్నర్లకు కలిసొచ్చే పిచ్. వర్ష సూచన ఉన్నప్పటికీ మ్యాచ్ జరుగుతుంది.


జట్లు (అంచనా)

భారత్: సూర్యకుమార్ (కెప్టెన్), యశస్వి, సంజూ సామ్సన్, రిషభ్ పంత్, రింకూ సింగ్, హార్దిక్ పాండ్యా, పరాగ్, అక్షర్, రవి బిష్ణోయ్, అర్ష్‌దీప్, సిరాజ్. **శ్రీలంక:** అసలంక (కెప్టెన్), నిసాంక, కుశాల్ మెండిస్, పెరీరా, కమిందు మెండిస్, షనక, హసరంగ, తీక్షణ, పతిరణ, మదుషంక, ఫెర్నాండో.

వన్డేలకు రోహిత్, కోహ్లి రెడీ

కొలంబో: వన్డే సిరీస్ కోసం కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ కోహ్లి సిద్ధమయ్యారు. వీరితో పాటు వన్డేలకు ఎంపికైన కుల్దీప్, హర్షిత్ రాణా, శ్రేయస్ అయ్యర్‌లు ఇప్పటికే కొలంబో చేరుకొని సోమవారం నుంచి నెట్స్‌లో చెమటోడ్చుతున్నారు. గత నెల కరీబియన్ గడ్డపై రెండో టి20 ప్రపంచకప్ గెలిచిన రోజే భారత స్టార్లు రోహిత్, కోహ్లి పొట్టి ఫార్మాట్‌కు గుడ్‌బై చెప్పారు. ఇప్పుడు మళ్లీ నెలరోజుల తర్వాత అంతర్జాతీయ వన్డేలు ఆడేందుకు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. కొలంబోలో అసిస్టెంట్ కోచ్ అభిషేక్ నాయర్ ట్రెయినింగ్‌లో వీళ్లంతా ప్రాక్టీస్‌లో నిమగ్నమయ్యారు. మూడు వన్డేలన్నీ ఇక్కడి ప్రేమదాస స్టేడియంలోనే ఆగస్టు 2, 4, 7 తేదీల్లో జరుగుతాయి.

సినిమా



• ప్రభాస్

పుష్ప గుచ్ఛం ఎవరికి?

ప్రభాస్ టైటిల్ రోల్‌లో రూపొందుతున్న తాజా పాన్ ఇండియా చిత్రం 'రాజా సాబ్'. మారుతి దర్శకత్వంలో ఈ సినిమాను టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ మూవీ నుంచి సోమవారం ఫ్యాన్ ఇండియా వీడియో గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఈ వీడియోలో బైక్ నడుపుకుంటూ వచ్చి, ఒకచోట ఆగి చేతిలోకి పుష్ప గుచ్ఛం తీసుకుని, బైక్ అద్దంలో తన ముఖాన్ని చూసి, మురిసిపోతూ పువ్వుల రెక్కలతో దిష్టి తీసుకుంటూ కనిపించాడు రాజా సాబ్. మరి... ఈ పుష్ప గుచ్ఛాన్ని ఎవరికి ఇస్తాడో సినిమాలో చూడాలి. ''రొమాంటిక్ హారర్ జానర్‌లో రూపొందుతోన్న చిత్రం 'రాజా సాబ్'. ప్రభాస్ ఇప్పటివరకూ చేయని జానర్‌తో పాటు ఆయన ఫ్యాన్స్‌కు గుర్తుండిపోయేలా ఈ మూవీని తెరకెక్కిస్తున్నారు మారుతి. 'రాజా సాబ్' షూటింగ్ 40 శాతం పూర్తయింది. ఆగస్టు 2న ఓ భారీ షెడ్యూల్ ఆరంభిస్తాం. 2025 ఏప్రిల్ 10న తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో ఈ మూవీని విడుదల చేయనున్నాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.



• తమన్నా

కామెడీ... హారర్

సప్తగిరి, ధనరాజ్, అజయ్, 'షకలక' శంకర్, మాళవికా సతీషన్, స్నేహా ఉల్లాల్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'భవనమ్'. బాలాచారి కూరెళ్ల దర్శకత్వంలో సూపర్ గుడ్ ఫిల్మ్స్ సమర్పణలో ఆర్బీ చౌదరి, వాకాడ అంజన్ కుమార్, వీరేంద్ర సీర్వి నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 9న రిలీజ్ కానుంది. ఈ చిత్రం ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో సప్తగిరి మాట్లాడుతూ– ''సూపర్ గుడ్ ఫిల్మ్స్ సంస్థ 95వ సినిమాగా ఇంతమంది కమెడియన్స్‌ని పెట్టి 'భవనమ్' వంటి హారర్ కామెడీ సినిమా చేసింది. ఈ బ్యానర్‌లో చేయాలనే ఆకాంక్ష ఈ సినిమాతో నెరవేరింది'' అన్నారు. ''సస్పెన్స్ థ్రిల్లర్, హారర్ నేపథ్యంలో రూపొందిన 'భవనమ్' అందర్నీ ఎంటర్‌టైన్ చేస్తుంది'' అన్నారు బాలాచారి. ''అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్ ఉన్న హారర్ కామెడీ మూవీ ఇది'' అన్నారు షకలక శంకర్. ''సూపర్ గుడ్ ఫిల్మ్స్‌లో మ్యూజిక్ చేయడం హ్యాపీగా ఉంది'' అన్నారు చరణ్ అర్జున్.



• సప్తగిరి, మాళవికా సతీషన్, షకలక శంకర్, బాలాచారి



• మధుబాల

రాణి పన్నగ

'చేపట్టిన కత్తులు వాళ్ల విజయాన్ని చెక్కుతాయి... అడ్డుపెట్టిన డాలులు శత్రు దాడిని అడ్డుకుంటాయి... మాతృస్వామ్య వ్యవస్థ ఆనవాళ్లు... నారీకోన మహారాణి పన్నగ... ఆమె కుమార్తె వీరనారి నెమలి... సదా యుద్ధానికి సిద్ధం' అంటూ మధుబాల లుక్‌ని విడుదల చేసింది 'కన్నప్ప' యూనిట్. ఈ చిత్రంలో రాణి పన్నగగా మధుబాల కనిపించనున్నారు. విష్ణు మంచు టైటిల్ రోల్‌లో రూపొందుతున్న చిత్రం 'కన్నప్ప'. మోహన్‌బాబు, మోహన్ లాల్, శరత్ కుమార్, ప్రభాస్, బ్రహ్మానందం, అక్షయ్ కుమార్ వంటి స్టార్స్ ఈ చిత్రంలో నటిస్తున్నారు. శివ భక్తుడు కన్నప్ప కథ నేపథ్యంలో ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వంలో డా. మోహన్ బాబు నిర్మిస్తున్న ఈ పాన్ ఇండియా మూవీ షూటింగ్ చివరి దశకు చేరుకుంది.

నే వంట చేస్తే...

నే వంట చేస్తే అందరూ ఓ పట్టు పట్టాల్సిందే అంటూ చేతిలో గరిటెలు పట్టుకుని వంట చేయడానికి రెడీ అవుతోంది రత్నమ్మ. మరి... ఆమె చేతి వంట ఎలా ఉంటుందో రుచి చూసినవాళ్లే చెప్పాలి. రత్నమ్మగా సంగీత నటిస్తున్న చిత్రం 'పరదా'. 'సినిమా బండి'తో దర్శకుడిగా మంచి ప్రశంసలు అందుకున్న ప్రవీణ్ కాండ్రేగుల దర్శకత్వం వహిస్తున్న రెండో చిత్రం ఇది. ఈ లేడీ ఓరియంటెడ్ మూవీలో అనుపమా పరమేశ్వరన్, దర్శనా రాజేంద్రన్, సంగీత లీడ్ రోల్స్ చేస్తున్నారు. సోమవారం సంగీత లుక్‌ని విడుదల చేశారు. శ్రీనివాసులు పీవీ, శ్రీధర్ మక్కువతో కలిసి విజయ్ డొంకాడ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: గోపీ సుందర్, కెమెరా: మృదుల్ సుజిత్ సేన్.



• సంగీత

బోనాల పండగలో...

బోనాల పండగ జోరుగా జరుగుతున్న సంగతి తెలిసిందే. తమన్నా కూడా బోనం ఎత్తారు. అయితే ఆమె పండగ చేసుకుంటున్నది 'ఓదెల 2' చిత్రం కోసం. తమన్నా లీడ్ రోల్‌లో మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్ వర్క్స్‌పై డి. మధు నిర్మిస్తున్న చిత్రం ఇది. దర్శకుడు సంపత్ నంది సూపర్‌విజన్‌లో 'ఓదెల రైల్వేస్టేషన్' (2021) సినిమాకి సీక్వెల్‌గా అశోక్ తేజ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది. ఈ బహు భాషా చిత్రం షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. భారీ మల్లన్న టెంపుల్ సెట్‌లో క్లైమాక్స్‌ని చిత్రీకరిస్తున్నారు. తమన్నా, ఇతర నటీనటులతో పాటు 800 మంది జూనియర్ ఆర్టిస్టులు షూటింగ్‌లో పాల్గొంటున్నారు. బోనాల సంబరాల నేపథ్యంలో సాగే ఎపిసోడ్ ఇది. ఈ సన్నివేశాల్లోని తమన్నా కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. ''ఈ సినిమాలోని పాత్ర కోసం తమన్నా శిక్షణ తీసుకున్నారు. యాక్షన్ సన్నివేశాలను ఆమె అద్భుతంగా చేస్తున్నారు'' అని మేకర్స్ పేర్కొన్నారు. హెబ్బా పటేల్, వశిష్ఠ ఎన్. సింహ, యువ, నాగమహేశ్, వంశీ, గగన్ విహారి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, కెమెరా: సౌందర్ రాజన్.

పదింటికే చలీ జ్వరం...



• రామ్, కావ్యా థాపర్

రామ్ పోతినేని హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపొందిన తాజా చిత్రం 'డబుల్ ఇస్మార్ట్'. వీరి కాంబినేషన్‌లో వచ్చిన హిట్ మూవీ 'ఇస్మార్ట్ శంకర్' (2019) కి సీక్వెల్‌గా 'డబుల్ ఇస్మార్ట్' రూపొందింది. కావ్యా థాపర్ హీరోయిన్‌గా నటించారు. పూరి కనెక్ట్స్‌పై పూరి జగన్నాథ్, ఛార్మీ కౌర్ నిర్మించిన ఈ చిత్రాన్ని ఆగస్టు 15న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ విడుదల చేస్తోంది. మణిశర్మ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'క్యా లఫ్డా..' అంటూ సాగే మూడో పాటని సోమవారం రిలీజ్ చేశారు. 'నరం నరం గరం గరం... పదింటికే చలీ జ్వరం, నీ ఊహలే నిరంతరం... పోతోందిరా నాలో శరం ...' అంటూ ఈ పాట సాగుతుంది. శ్రీ హర్ష ఈమాని సాహిత్యం అందించిన ఈ పాటని ధనుంజయ్ సీపాన, సింధూజ శ్రీనివాసన్ పాడారు. రామ్, కావ్యాల మధ్య వచ్చే రొమాంటిక్ సాంగ్ ఇది. ఈ చిత్రానికి కెమెరా: శ్యామ్ కె. నాయుడు, జియాని జియాన్నెలి.



ఆ కష్టాలు ఎలా ఉంటాయో చూశాను

– విజయ్ దేవరకొండ

''తెలుగు ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్' నిర్వహిస్తున్న దర్శక సంజీవని మహోత్సవంలో భాగం కావడం సంతోషంగా ఉంది. మీరంతా ఎన్నో కలలు కంటుంటారు. డ్రీమర్స్ కష్టాలు ఎలా ఉంటాయో హీరోగా ఎదగక ముందు చూశాను. స్థిరమైన ఆదాయం ఉండదు... భవిష్యత్ మీద భరోసా ఉండదు. కానీ, కలను సాకారం చేసుకోవడానికి ముందుకు సాగుతుంటారు'' అని హీరో విజయ్ దేవరకొండ అన్నారు. తెలుగు ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్ తమ సభ్యులకు హెల్త్ ఇన్సూరెన్స్ కార్డుల పంపిణీని 'దర్శక సంజీవని మహోత్సవం' పేరుతో హైదరాబాద్‌లో నిర్వహించింది. దివంగత దర్శకుడు డా. దాసరి నారాయణరావు పేరు మీద దాసరి హెల్త్ కార్డులను అందించారు. ''మధ్యాహ్న భోజనం పెట్టడంతో పాటు ఉచిత హెల్త్ కార్డ్స్ ఇవ్వడం మంచి ఆలోచన. ఈ అసోసియేషన్‌కు నా సహకారం ఉంటుంది'' అన్నారు ముఖ్య అతిథిగా పాల్గొన్న విజయ్ దేవరకొండ. ''అసోసియేషన్‌లోని 720 మంది హెల్త్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వారు, వారి కుటుంబ సభ్యులతో కలిపి 1920 మందికి హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించాం'' అన్నారు దర్శకుల సంఘం అధ్యక్షుడు వీరశంకర్.

ఉషా పరిణయం చిత్రాన్ని ఆదరించాలి

– సాయి దుర్గ తేజ్



• విజయభాస్కర్, సాయి దుర్గ తేజ్, శ్రీ కమల్

''విజయభాస్కర్‌గారి దర్శకత్వంలో నేను 'ప్రేమకావాలి' సినిమా చేయాల్సింది... మిస్ అయ్యింది. ఆది సాయికుమార్ 'రేయ్' చేయాలి... కానీ 'ప్రేమ కావాలి' చేశాడు. నేను 'రేయ్' చేశాను. విజయభాస్కర్‌గారు కొత్తవాళ్లతో చేసిన 'ఉషా పరిణయం' చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలి. అప్పుడే ఇలాంటి కొత్త సినిమాలు వస్తాయి'' అన్నారు హీరో సాయి దుర్గ తేజ్. శ్రీ కమల్, తాన్వీ ఆకాంక్ష జంటగా నటించిన చిత్రం 'ఉషా పరిణయం'. కె. విజయభాస్కర్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ మూవీ ఆగస్టు 2న విడుదలవుతోంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి ముఖ్య అతిథిగా హాజరైన సాయి దుర్గ తేజ్ మాట్లాడుతూ– ''నాకు ఎంతో ఆప్తుడైన సతీష్ అన్న కూతురు తాన్వీ ఆకాంక్షకి అన్నయ్యగా ఈ ఫంక్షన్‌కు వచ్చాను. ఈ మూవీ విజయం సాధించి యూనిట్‌కి మంచి పేరు తీసుకురావాలి'' అన్నారు. విజయభాస్కర్ మాట్లాడుతూ– ''14 ఏళ్ల క్రితం సాయి దుర్గ తేజ్‌ని నేనే హీరోగా పరిచయం చేయాల్సింది.. కానీ కుదరలేదు. మా ఫ్యామిలీ సపోర్ట్‌తో 'ఉషా పరిణయం' నిర్మించాను'' అన్నారు. శ్రీ కమల్ మాట్లాడుతూ– ''నాన్నగారి (కె. విజయభాస్కర్) పేరు నిలబెట్టడానికి ప్రయత్నిస్తాను'' అన్నారు.

దేవదాసు నుంచి విరాట పర్వం వరకూ...



• మోక్ష

''అలనాటి రామచంద్రుడు' క్లాసిక్, యూనివర్సల్ లవ్ స్టోరీ. ఇందులో నా పాత్ర పేరు ధరణి. చాలా హైపర్, అల్లరిగా ఉంటుంది. ప్రతి అమ్మాయి రిలేట్ చేసుకునేలా నా పాత్ర ఉంటుంది'' అన్నారు హీరోయిన్ మోక్ష. కృష్ణవంశీ, మోక్ష జంటగా చిలుకూరి ఆకాశ్ రెడ్డి దర్శకత్వం వహించిన చిత్రం 'అలనాటి రామచంద్రుడు'. హైమావతి, శ్రీరామ్ జడపోలు నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 2న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా మోక్ష మాట్లాడుతూ– ''నేను బెంగాలీ అమ్మాయిని. తెలుగులో నా మొదటి సినిమా 'లక్కీ లక్ష్మణ్'. 'అలనాటి రామచంద్రుడు' రెండో సినిమా. ఆకాశ్‌గారు చాలా మంచి విజన్‌తో తీసిన సినిమా ఇది. సావిత్రిగారి 'దేవదాసు' నుంచి అనుష్కగారి 'అరుంధతి', సాయి పల్లవిగారి 'విరాట పర్వం' వరకూ తెలుగు సినిమాలు చాలా ఎంజాయ్ చేశాను. 'సీతారామం, హను–మాన్' చిత్రాలు ఎంతగానో నచ్చాయి. హీరో నానీగారంటే ఇష్టం. ఆయనతో వర్క్ చేయాలని ఉంది. ప్రస్తుతం 'రామం రాఘవం' సినిమా చేస్తున్నాను. అలాగే నేను చేసిన ఒక మలయాళ సినిమా విడుదలకు రెడీ అవుతోంది'' అన్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	23	81,356
నిఫ్టీ ▲	1	24,836

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	17,418	▲	61
డోజోన్స్	40,561	▼	28
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,292	▲	7
డాక్స్	18,321	▼	97
షాంఘై	2,892	▲	1
నికాయ్	38,468	▲	801

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	68,800
బంగారం (99.5 స్వచ్ఛత)	68,525
వెండి (కిలో)	82,192

ఫారెక్స్ రేట్లు రూ.లలో

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	81.20	85.53
£	బ్రిటన్ పౌండ్	105.16	110.11
€	యూరో	88.37	92.87
¥	జపాన్ ఎన్ (100)	43.00	65.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	52.36	57.20
S$	సింగపూర్ డాలర్	60.00	64.69
SAR	సౌదీ రియాల్	21.43	22.99
UAE D	యూఏఈ దిర్హామ్	21.91	23.69
¥	చైనా యువాన్	10.66	12.48

25,000కు చేరి.. వెనక్కి

రికార్డు స్థాయి నుంచి నిఫ్టీ రివర్స్ ● ఐటీ, ఎఫ్‌ఎంసీజీ షేర్లలో లాభాల స్వీకరణ ● ఫ్లాట్‌గా ముగిసిన సూచీలు

ముంబై: ట్రేడింగ్ ప్రారంభంలోనే సరికొత్త రికార్డులు నమోదు చేసిన స్టాక్ సూచీలు ఇన్వెస్టర్ల లాభాల స్వీకరణతో సోమవారం ఫ్లాటుగా ముగిశాయి. అమెరికా ఫెడరల్ ద్రవ్య విధాన నిర్ణయాల వెల్లడి ముందు ఈక్విటీ మార్కెట్లో అప్రమత్తత చోటు చేసుకుంది. సెన్సెక్స్ 23 పాయింట్లు పెరిగి 81,356 వద్ద స్థిరపడింది. నిఫ్టీ ఒక పాయింటు పెరిగి 24,836 వద్ద నిలిచింది. జాతీయ, అంతర్జాతీయంగా నెలకొన్న సానుకూల పరిణామాల నేపథ్యంలో ఉదయం సూచీలు భారీ లాభాలతో మొదలయ్యాయి. ప్రథమార్ధంలో క్యాపిటల్ గూడ్స్, ఇండస్ట్రీయల్, రియల్టీ, ఆయిల్‌అండ్‌గ్యాస్, విద్యుత్ షేర్లు రాణించాయి. ఇంట్రాడేలో 576 పాయింట్లు బలపడి 81,908 వద్ద, నిఫ్టీ 165 పాయింట్లు ర్యాలీ చేసి 25 వేల పాయింట్ల మైలురాయికి అత్యంత చేరువలో **24,999.75** వద్ద సరికొత్త రికార్డులు నమోదు చేశాయి. మిడ్‌సెషన్ నుంచి గరిష్టాల వద్ద ఇన్వెస్టర్లు ఎఫ్‌ఎంసీజీ, ఐటీ, యుటిలిటీ, టెక్ షేర్లలో లాభాల స్వీకరణ మొగ్గుచూపారు. దీంతో సూచీలు ఆరంభ లాభాలు కోల్పోయి ఫ్లాటుగా ముగిశాయి. బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 1.17%, 0.80 శాతం రాణించాయి. ఈ వారంలోనే అమెరికా, బ్రిటన్, జపాన్ కేంద్ర బ్యాంకులు వడ్డీరేట్లపై నిర్ణయాలను వెల్లడించనున్న నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్లు స్వల్ప లాభాలతో కదలాడుతున్నాయి.



నవంబర్ 1 నుంచి ఇన్‌సైడర్ ట్రేడింగ్ నిబంధనలు

అస్సెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలకు సంబంధించి సవరించిన ఇన్‌సైడర్ ట్రేడింగ్ నిబంధనలు నవంబర్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ మేరకు సెబీ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇటీవలి కాలంలో మ్యూచువల్ ఫండ్స్ సంస్థల్లో ఫ్రంట్ రన్నింగ్ ఆరోపణలు వస్తుండడం తెలిసిందే. ఈ తరహా కార్యకలాపాలకు చెక్ పెట్టేందుకు వీలుగా మ్యూచువల్ ఫండ్స్ యూనిట్ల క్రయ, విక్రయాలను సైతం ఇన్‌సైడర్ ట్రేడింగ్ నిబంధనల పరిధిలోకి సెబీ తీసుకొచ్చింది.



ఫార్మా కాంట్రాక్ట్ తయారీకి బూస్ట్

● దన్నుగా అమెరికా బయోసెక్యూర్ చట్టం
● దేశీ సంస్థలకు కొత్త అవకాశాలు



దేశీ ఫార్మా కాంట్రాక్ట్ తయారీ వ్యాపార విభాగం త్వరలోనే రెట్టింపు కాగలదని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ప్రభుత్వ సంస్థలు చైనా ఫార్మా కంపెనీల కొనుగోళ్లు జరపకుండా అమెరికా బయోసెక్యూర్ చట్టాన్ని అమలు చేసే దిశగా అడుగులు వేస్తుండటం ఇందుకు ఊతమివ్వగలదని పేర్కొన్నాయి. చైనా నుంచి తయారీ కార్యకలాపాలు క్రమంగా భారత్‌కు మళ్లుతున్న నేపథ్యంలో కాంట్రాక్ట్ తయారీ సెగ్మెంట్ వచ్చే మూడేళ్లలో రెండింతలు కాగలదని, అలాగే కాంట్రాక్ట్ రీసెర్చ్ సెగ్మెంట్ మూడు రెట్లు వృద్ధి చెందగలదనే అంచనాలు నెలకొన్నాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. మోర్డోర్ ఇంటెలిజెన్స్ నివేదిక ప్రకారం 2024లో అంతర్జాతీయంగా కాంట్రాక్ట్ అభివృద్ధి, తయారీ సెగ్మెంట్ (సీడీఎంవో) 22.51 బిలియన్ డాలర్లుగా ఉంది. ఇది ఏటా 14.67 శాతం వృద్ధితో 2029 నాటికి 44.63 బిలియన్ డాలర్లకు చేరనుంది. ఇక ఫార్మా విభాగం గణాంకాల ప్రకారం దేశీయంగా కాంట్రాక్ట్ రీసెర్చ్ (సీఆర్‌వో) సెగ్మెంట్ వార్షికంగా 10.75 శాతం చక్రగతీయ వృద్ధితో 2030 నాటికి 2.5 బిలియన్ డాలర్లకు చేరనుంది. భారతీయ సీడీఎంఏ సెగ్మెంట్ ఇప్పటికే అభివృద్ధి చెందినా, బయోసెక్యూర్ చట్టం అమలనేది పరిశ్రమకు గణనీయంగా తోడ్పాటునిస్తుందని, వృద్ధిని మరింతగా పరుగులు పెట్టించగలదని కాంట్రాక్ట్ తయారీ సంస్థల వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం చైనా సీడీఎంవో పరిశ్రమకు అంతర్జాతీయంగా 8 శాతం మార్కెట్ వాటా ఉండగా, భారత్‌కు 2.7 శాతం వాటా ఉంది. చైనా వాటాను కొల్లగొట్టడానికి ఈ చట్టం భారత్‌కు బాగా ఉపకరించగలదని పరిశ్రమవర్గాలు తెలిపాయి. ఇప్పటికే పలు అమెరికన్ సంస్థలు ఉత్పత్తి కొనుగోళ్ల కోసం పలు భారతీయ కంపెనీలను సంప్రదిస్తున్నట్లు వివరించాయి. సుమారు 60 శాతం భారతీయ ఫార్మా కంపెనీలు కొత్త వ్యాపార అవకాశాలు వస్తున్నట్లు వెల్లడించాయి.

పోటీ కూడా ఉంది..

బయోసెక్యూర్ చట్టంతో ఉపయోగాలు ఉన్నప్పటికీ మన ఫార్మా కంపెనీలకు ఎకాయెకిన ప్రయోజనాలు వెంటనే లభించకపోవచ్చని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ఐర్లాండ్, సింగపూర్ వంటి దేశాల నుంచి మన కంపెనీలకు గట్టి పోటీ ఉండొచ్చని వివరించాయి. అమెరికాలో ప్రస్తుతం 120 ఔషధ ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయి. చైనా తోడ్పాటు ఉన్న ఈ ప్రాజెక్టులు మన వైపు మళ్లేందుకు సమయం పట్టే అవకాశం ఉందని పేర్కొన్నాయి. ప్రస్తుత ఒప్పందాలను మరికొంత కాలం కొనసాగించుకునేందుకు వీలు కల్పించే నిబంధనల వల్ల తక్షణం ఆర్థిక లబ్ధి చేకూరకపోవచ్చని వివరించాయి. అయితే, భారతీయ కంపెనీలకంటూ కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయి. సిప్లా, సింజీన్ వంటి సీడీఎంవోలు తక్కువ వ్యయాలతో ఔషధాలు తయారు చేయగలవు. అలాగే వాటికి సుశిక్షితులైన సిబ్బంది ఉన్నారు. అంతేగాకుండా పరిశ్రమకు ఊతమిచ్చేందుకు ప్రభుత్వం గ్రాంట్లు, రుణాలు కూడా అందిస్తోంది. మొత్తం మీద బయోసెక్యూర్ చట్టమనేది భారతీయ సీడీఎంవో విభాగానికి గేమ్ చేంజర్‌గా ఉండగలదని విశ్లేషకులు తెలిపారు. అయితే, ఇందుకోసం మౌలిక సదుపాయాలపై భారీగా పెట్టుబడులు పెట్టాల్సి ఉంటుందని, ప్రాజెక్టుల నిర్వహణకు పెద్ద యెత్తున నిపుణుల అవసరం ఉంటుందని పేర్కొన్నారు.

– సాక్షి, బిజినెస్ డెస్క్

ఇండియన్ బ్యాంక్ జూమ్

క్యూ1లో రూ. 2,403 కోట్ల లాభం



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ దిగ్గజం ఇండియన్ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) తొలి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 41 శాతం జంప్‌చేసి రూ. 2,403 కోట్లను తాకింది. మొండి రుణాలు తగ్గడం లాభాల్లో వృద్ధికి సహకరించింది. గతేడాది(2023–24) క్యూ1లో రూ. 1,709 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 14,759 కోట్ల నుంచి రూ. 16,945 కోట్లకు బలపడింది. వడ్డీ ఆదాయం రూ. 13,049 కోట్ల నుంచి రూ. 15,039 కోట్లకు ఎగసింది. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 5.47 శాతం నుంచి 3.77 శాతానికి దిగివచ్చాయి. నికర ఎన్‌పీఏలు 0.7 శాతం నుంచి 0.39 శాతానికి తగ్గాయి. మొండి రుణాలకు కేటాయింపులు రూ. 930 కోట్ల నుంచి తగ్గి రూ. 896 కోట్లకు పరిమితమయ్యాయి. కనీస మూలధన నిష్పత్తి 16.47 శాతంగా నమోదైంది.

ఇండియన్ బ్యాంక్ షేరు బీఎస్ఈలో 1 శాతం బలపడి రూ. 587 వద్ద ముగిసింది.

ఓలా @ రూ. 72–76

● ఆగస్టు 2–6 మధ్య ఐపీవో
● రూ. 6,100 కోట్ల సమీకరణ



ముంబై: ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన దిగ్గజం ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ పబ్లిక్ ఇష్యూకి రూ. 72–76 ధరల శ్రేణి ప్రకటించింది. ఇష్యూ ఆగస్ట్ 2న ప్రారంభమై 6న ముగియనుంది. దీనిలో భాగంగా రూ. 5,500 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటితోపాటు మరో 8.49 కోట్ల షేర్లను ప్రమోటర్లు, ప్రస్తుత ఇన్వెస్టర్లు విక్రయానికి ఉంచనున్నారు. వెరసి ఐపీవో ద్వారా రూ. 6,100 కోట్లు సమీకరించే ప్రణాళికల్లో ఉంది. పీఈ దిగ్గజం సాఫ్ట్‌బ్యాంక్‌కు పెట్టుబడులున్న కంపెనీ వ్యవస్థాపకుడు భవిష్ అగర్వాల్ 3.8 కోట్ల షేర్లను ఆఫర్ చేయనున్నారు. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 197 షేర్లకు(ఒక లాట్) దరఖాస్తు చేయవలసి ఉంటుంది. సమీకరణ నిధుల్లో సెల్ తయారీ ప్లాంటు సామర్థ్యాన్ని ప్రస్తుత 5 జీడబ్ల్యూహెచ్ నుంచి 6.4 జీడబ్ల్యూహెచ్‌కు పెంచనుంది. మరో రూ. 800 కోట్లు రుణ చెల్లింపులు, రూ. 350 కోట్లు కంపెనీ వృద్ధి కార్యక్రమాలకు వెచ్చించనుంది.

ఓలాకు మ్యాప్‌మైఇండియా నోటీసులు..

తమ డేటాను కాపీ కొట్టి ఓలా మ్యాప్స్ తయారు చేశారంటూ ఓలా ఎలక్ట్రిక్‌కు మ్యాప్‌మైఇండియా బ్రాండ్ మాతృ సంస్థ సీఈ ఇన్ఫో సిస్టమ్స్ (సీఈ ఇన్ఫో) లీగల్ నోటీసులు పంపించినట్లు సమాచారం. అయితే, ఇవన్నీ తప్పుడు ఆరోపణలని ఓలా ఖండించింది. నోటీసులకు తగు విధంగా స్పందిస్తామని స్పష్టం చేసింది.

1న సీగల్ ఇండియా ఐపీవో

మౌలిక సదుపాయాల కంపెనీ సీగల్ ఇండియా పబ్లిక్ ఇష్యూకి రూ. 380–401 ధరల శ్రేణి ప్రకటించింది. ఐపీవో ఆగస్ట్ 1న ప్రారంభమై 5న ముగియనుంది. ఇష్యూలో భాగంగా రూ. 684 కోట్లకుపైగా విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వెరసి ఐపీవో ద్వారా రూ. 1,253 కోట్లు సమీకరించే ప్రణాళికల్లో ఉంది.

సైయెంట్ డీఎల్‌ఎంకు బోయింగ్ ఆర్డరు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: విమానాల తయారీ దిగ్గజం బోయింగ్ నుంచి కాంట్రాక్టు లభించినట్లు సైయెంట్ డీఎల్‌ఎం వెల్లడించింది. 787 డ్రీమ్‌లైనర్ విమానాల కోసం బ్యాటరీ డయోడ్ మాడ్యూల్ (బీడీఎం) తయారీ కోసం ఈ ఒప్పందం కుదుర్చుకున్నట్లు వివరించింది. కమర్షియల్ విమానాల కోసం పవర్ ఎలక్ట్రానిక్స్ తయారీ, డిజైన్ సపోర్ట్‌కి సంబంధించి బోయింగ్ నుంచి ఇది తమకు తొలి ప్రాజెక్ట్ అని సైయెంట్ డీఎల్‌ఎం పేర్కొంది.



ఒప్పంద పత్రాలతో ప్రతినిధులు

యూనిటీ బ్యాంక్ శాఖల విస్తరణ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: కొత్త తరం డిజిటల్ ఫస్ట్ బ్యాంక్ అయిన యూనిటీ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ తాజాగా తమ కార్యకలాపాలను హైదరాబాద్‌కి విస్తరించింది. కూకట్‌పల్లి తదితర ప్రాంతాల్లో అయిదు శాఖలను ప్రారంభించింది. నిర్దిష్ట సేవింగ్స్ ఖాతాలపై 7.5 శాతం వరకు, ఎఫ్‌డీలపై 9.5 శాతం వరకు వడ్డీ రేట్లు అందిస్తున్నట్లు బ్యాంక్ ఎండీ ఇందర్‌జిత్ కామోత్రా తెలిపారు. అలాగే ఎంఎస్ఎంఈలకు ఆకర్షణీయమైన వడ్డీ రేట్లపై వ్యాపార రుణాలు అందిస్తున్నట్లు వివరించారు. సెంట్రమ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రమోట్ చేస్తున్న యూనిటీ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌కి రూ. 7,500 కోట్ల పైచిలుకు డిపాజిట్లు, రూ. 8,500 కోట్ల లోన్ బుక్ ఉంది. దేశవ్యాప్తంగా 20 రాష్ట్రాల్లో సుమారు 400 బ్యాంకింగ్ అవుట్‌లెట్స్ ఉన్నాయి. అయిదేళ్లలో 1 కోటి కస్టమర్లు, రూ. 50,000 కోట్ల లోన్ బుక్ సాధించాలని నిర్దేశించుకున్నట్లు ఇందర్‌జిత్ వివరించారు.



బ్యాంక్ ఎండీ ఇందర్‌జిత్ కామోత్రా

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

ఫైనాన్స్ డిజిటలైజేషన్‌తో కొత్తతరం బ్యాంకింగ్	లిస్టెడ్ కంపెనీగానే ఇండియా సిమెంట్స్: అల్ట్రాటెక్ సిమెంట్

భవిత

● గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- కరెంట్ అఫైర్స్ కోసం
ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 94 ఆఫీసర్ గ్రేడ్-బి పోస్టులు

ముంబైలోని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) సర్వీస్ బోర్డు దేశవ్యాప్తంగా ఉన్న ఆర్‌బీఐ శాఖల్లో ఆఫీసర్ గ్రేడ్-బి పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఎంపికైన అభ్యర్థులు దేశవ్యాప్తంగా ఉన్న ఆర్‌బీఐ శాఖల్లో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 94.
» **పోస్టుల వివరాలు:** ఆఫీసర్ గ్రేడ్ బి(డీఆర్)–జనరల్–66, ఆఫీసర్ ఇన్ గ్రేడ్ బి(డీఆర్)–డీఈపీఆర్–21, ఆఫీసర్ ఇన్ గ్రేడ్ బి(డీఆర్)–డీఎస్ఐఎం–07.
» **అర్హత:** సంబంధిత విభాగంలో డిగ్రీ/ఎంఏ/పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 01.07.2024 నాటికి 21 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
» **బేసిక్ పే స్కేల్:** నెలకు రూ.55,200 నుంచి రూ.99,750.
» **ఎంపిక విధానం:** ప్రిలిమినరీ, మెయిన్ పరీక్షలు, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ద్వారా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 25.07.2024
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 16.08.2024.
» **వెబ్‌సైట్:** http://www.rbi.org.in

ఇండియన్ నేవీలో 741 గ్రూప్ బి, గ్రూప్ సి పోస్టులు

ఇండియన్ నేవీలో గ్రూప్ బి, గ్రూప్ సి పోస్టుల భర్తీకి సివిలియన్ ఎంట్రన్స్ టెస్ట్(ఐఎన్‌సీఈటీ–01/2024) నిర్వహిస్తారు.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 741.
» **పోస్టుల వివరాలు:** గ్రూప్ బి పోస్టులు: ఛార్జ్‌మ్యాన్(అమ్యూనిషన్ వర్క్‌షాప్)–01, చార్జ్‌మ్యాన్(ఫ్యాక్టరీ)–10, ఛార్జ్‌మ్యాన్(మెకానిక్)–18, సైంటిఫిక్ అసిస్టెంట్–04.
» **గ్రూప్ సీ పోస్టులు:** డ్రాఫ్ట్స్‌మ్యాన్(కన్‌స్ట్రక్షన్)–02, ఫైర్‌మ్యాన్–444, ఫైర్ ఇంజన్ డ్రైవర్–58, ట్రేడ్స్‌మ్యాన్ మేట్–161, పెస్ట్ కంట్రోల్ వర్కర్–18, కుక్–09, ఎంటీఎస్(మినిస్టీరియల్)–16.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, 12వ తరగతి, సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** ఛార్జ్‌మ్యాన్(మెకానిక్), సైంటిఫిక్ అసిస్టెంట్ పోస్టులకు 30 ఏళ్లు మించకూడదు. ఫైర్‌మ్యాన్, ఫైర్ ఇంజన్ డ్రైవర్ పోస్టులకు 18 నుంచి 27 ఏళ్లలోపు ఉండాలి. మిగిలిన పోస్టులకు 18 నుంచి 27 ఏళ్లలోపు ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్లు గరిష్ఠ వయసులో సడలింపులు వర్తిస్తాయి.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 02.08.2024
» **వెబ్‌సైట్:** https://incet.cbtexam.in

ఏపీపీఎస్సీ-ఆర్ఐఎంసీలో 8 తరగతి ప్రవేశాలు

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ).. డెహ్రాడూన్(ఉత్తరాఖండ్)లోని రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కాలేజ్(ఆర్ఐఎంసీ)లో జూలై-2025 టర్మ్ ఎనిమిదో తరగతి ప్రవేశాలకు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బాలురు, బాలికల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** గుర్తింపు పొందిన పాఠశాల నుంచి 2025, జూలై 1వ తేదీ నాటికి ఏడో తరగతి చదువుతున్న లేదా ఏడో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులు.
» **వయసు:** 01.07.2025 నాటికి పదకొండున్నర ఏళ్లకు తగ్గకుండా పదమూడేళ్లకు మించకుండా ఉండాలి. అంటే.. 02.07.2012 నుంచి 01.01.2014 మధ్య జన్మించి ఉండాలి.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, వైవా వాయిస్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **పరీక్ష విధానం:** రాతపరీక్షలో మొత్తం మూడు పేపర్లు ఉంటాయి. అవి.. మ్యాథమేటిక్స్(200 మార్కులు), జనరల్ నాలెడ్జ్(75 మార్కులు), ఇంగ్లిష్ (125 మార్కులు) నుంచి ప్రశ్నలు ఉంటాయి. రాతపరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు వైవా వాయిస్(50 మార్కులు) నిర్వహిస్తారు. రాత పరీక్ష, వైవా వాయిస్ కలిపి మొత్తం 450 మార్కులకు ఉంటుంది. కనీస ఉత్తీర్ణతా మార్కులు 50 శాతం ఉండాలి. ఈ రెండింటిలో అర్హత సాధించిన అభ్యర్థులకు చివరిగా వైద్య పరీక్షలు నిర్వహిస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును అసిస్టెంట్ సెక్రటరీ (ఎగ్జామ్స్), ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్, న్యూ హెడ్స్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్స్ బిల్డింగ్, రెండో అంతస్తు, ఆర్టీఏ కార్యాలయం దగ్గర, ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం ఎదురుగా, ఎంజీ రోడ్డు, విజయవాడ చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 30.09.2024.
» **పరీక్ష తేది:** 01.12.2024.
» **వెబ్‌సైట్:** https://psc.ap.gov.in

ఎల్ఐసీ హెచ్ఎఫ్ఎల్‌లో 200 జూనియర్ అసిస్టెంట్ పోస్టులు

లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (హెచ్ఎఫ్ఎల్).. దేశవ్యాప్తంగా ఉన్న ఎల్ఐసీ హెచ్ఎఫ్ఎల్ కార్యాలయాల్లో జూనియర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 200.
» **రాష్ట్రాల వారీగా ఖాళీలు:** ఆంధ్రప్రదేశ్–12, అస్సాం–05, ఛత్తీస్‌గఢ్–06, గుజరాత్–05, హిమాచల్‌ప్రదేశ్–03, జమ్మూ కశ్మీర్–01, కర్ణాటక–38, మధ్యప్రదేశ్–12, మహారాష్ట్ర–53, పుదుచ్చేరి–01, సిక్కిం–01, తెలంగాణ–31, తమిళనాడు–10, ఉత్తరప్రదేశ్–17, పశ్చిమ బెంగాల్–05.
» **అర్హత:** కనీసం 60 శాతం మార్కులతో ఏదైనా విభాగంలో గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణతతో పాటు కంప్యూటర్ సిస్టమ్స్ ఆపరేటింగ్, వర్కింగ్ నాలెడ్జ్ తప్పనిసరిగా ఉండాలి. కంప్యూటర్ ఆపరేషన్స్/లాంగ్వేజ్‌లలో సర్టిఫికేట్/డిప్లొమా/డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 01.07.2024 నాటికి 21 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** పని ప్రదేశం ఆధారంగా నెలకు రూ.32,000 నుంచి రూ.35,200 ఉంటుంది.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ పరీక్ష, ఇంటర్వ్యూ, సర్టిఫికేట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **పరీక్ష విధానం:** ఆన్‌లైన్‌లో పరీక్ష జరుగుతుంది. మొత్తం 200 మార్కులకు 200 ప్రశ్నలు ఉంటాయి. ఇంగ్లిష్ లాంగ్వేజ్ (40 ప్రశ్నలు–40 మార్కులు), లాజికల్ రీజనింగ్(40 ప్రశ్నలు–40 మార్కులు), జనరల్ అవేర్‌నెస్ (40 ప్రశ్నలు–40 మార్కులు), న్యూమరికల్ ఎబిలిటీ(40 ప్రశ్నలు–40 మార్కులు), కంప్యూటర్ స్కిల్(40 ప్రశ్నలు–40 మార్కులు) సబ్జెక్టులు ఉంటాయి. పరీక్ష మాధ్యమం ఇంగ్లిష్‌లో ఉంటుంది. పరీక్ష వ్యవధి 120 నిమిషాలు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభతేది:** 25.07.2024
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరితేది:** 14.08.2024.
» **ఆన్‌లైన్ పరీక్ష తేది:** సెప్టెంబర్ 2024.
» **వెబ్‌సైట్:** www.lichousing.com

ఎస్‌బీఐలో.. స్పెషలిస్ట్ ఆఫీసర్

ట్రెడిషనల్, ప్రొఫెషనల్ కోర్సులు పూర్తి చేశారా.. ఆర్థిక రంగంలో పని అనుభవం ఉందా.. బ్యాంకింగ్ రంగంలో సమున్నత అవకాశం కోసం ఎదురు చూస్తున్నారా! అయితే.. మీకు చక్కటి అవకాశం స్వాగతం పలుకుతోంది!! అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు.. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ).. వెల్త్ మేనేజ్‌మెంట్ విభాగంలో మొత్తం 1,040 స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్ట్‌లకు నోటిఫికేషన్ విడుదలైంది. ఎంపికైతే ఆయా పోస్ట్‌ను అనుసరించి రూ.22 లక్షలు-రూ.66 లక్షల వరకు వార్షిక వేతనం అందుకోవచ్చు! ఈ నేపథ్యంలో.. ఎస్‌బీఐ స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్ట్‌లు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక విధానం, వేతనాలు తదతర వివరాలు..



బ్యాంక్ జాబ్స్

» 1,040 స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టులకు నోటిఫికేషన్
» ఇంటర్వ్యూలో ప్రతిభ ఆధారంగా ఎంపిక ప్రక్రియ
» అయిదేళ్ల కాంట్రాక్ట్ ప్రాతిపదికన నియామకాలు

ప్రభుత్వ రంగ బ్యాంకులు..సాంప్రదాయ బ్యాంకింగ్ కార్యకలాపాలతో పాటు మరెన్నో విభాగాల్లో సేవలందిస్తున్నాయి. ఆయా విభాగాల్లో కార్యకలాపాలు సజావుగా సాగేందుకు నిపుణులైన అభ్యర్థులను నియమించుకుంటున్నాయి. ఎస్‌బీఐ తాజా నోటిఫికేషన్ ఆ కోవలోనిదే! బ్యాంకులో కీలకమైన వెల్త్ మేనేజ్‌మెంట్ విభాగంలో ఈ పోస్ట్‌లను భర్తీ చేయనున్నారు. ఈ ఉద్యోగాలకు ఎంపికైన వారికి భారీ స్థాయిలో వేతనాలు అందించనున్నారు.

మొత్తం పోస్టుల సంఖ్య 1,040

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.. తాజాగా విడుదల చేసిన స్పెషలిస్ట్ కేడర్ ఆఫీసర్ నోటిఫికేషన్ ద్వారా మొత్తం 1,040 పోస్ట్‌లను భర్తీ చేయనుంది. వీటిల్లో సెంట్రల్ రీసెర్చ్ టీమ్ (ప్రొడక్ట్ లీడ్)–2 పోస్టులు, సెంట్రల్ రీసెర్చ్ టీమ్(సపోర్ట్)–2 పోస్టులు, ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్ మేనేజర్ (టెక్నాలజీ)–1 పోస్టులు, ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్ మేనేజర్ (బిజినెస్)–2 పోస్టులు,రిలేషన్‌షిప్ మేనేజర్–273 పోస్టులు, వైస్ ప్రెసిడెంట్–వెల్త్ –643 పోస్టులు, రిలేషన్‌షిప్ మేనేజర్–టీమ్ లీడ్–32 పోస్టులు, రీజనల్ హెడ్–6 పోస్టులు, ఇన్వెస్ట్‌మెంట్ స్పెషలిస్ట్–30 పోస్టులు, ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్–49 పోస్టులు ఉన్నాయి.

అర్హతలు వేర్వేరుగా

▪ వివిధ పోస్టులకు అర్హతలను కూడా వేర్వేరుగా నిర్దేశించారు. ఆయా పోస్ట్‌లను అనుసరించి బ్యాచిలర్ డిగ్రీ/ఎంబీఏ/నిర్దేశిత స్పెషలైజేషన్లలో పీజీ/పీజీడీఎం /పీజీడీబీఎం/బీటెక్/ఎంటెక్/సీఏ/సీఎఫ్ఏ/ ఎన్ఐఎస్ఎం సర్టిఫికెట్ ఉత్తీర్ణత ఉండాలి.
▪ **వయసు:** ఆయా పోస్ట్‌లను అనుసరించి కనిష్ఠంగా 23ఏళ్లు, గరిష్ఠంగా 50 ఏళ్లు ఉండాలి. విద్యార్హతలు, పని అనుభవం, వయో పరిమితికి సంబంధించి ఏప్రిల్ 1, 2024ను గడువు తేదీగా పేర్కొన్నారు.

ఇంటర్వ్యూలో ప్రతిభ ఆధారంగా

ఎస్‌బీఐ స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్ట్‌లకు ఇంటర్వ్యూలో ప్రతిభ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. వచ్చిన దరఖాస్తులను తొలుత వడపోస్తారు. అభ్యర్థులు పొందిన అకడమిక్ మార్కులు, పని అనుభవం ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేస్తారు. ఈ జాబితాలో నిలిచిన అభ్యర్థులకు పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఇంటర్వ్యూకు 100 మార్కులు కేటాయించారు. అభ్యర్థుల పని అనుభవం, ఇప్పటివరకు వారు నిర్వర్తించిన విధులు, బ్యాంకింగ్ రంగంలో తాజా పరిణామాలపై అవగాహన, వ్యక్తిగత దృక్పథం, వైఖరి వంటి అంశాలను పరిశీలిస్తారు. ఆ తర్వాత రిజర్వేషన్లు, ఇంటర్వ్యూలో పొందిన మార్కులు, పని అనుభవం వంటి వాటిని పరిగణనలోకి తీసుకుని తుది నియామకం ఖరారు చేస్తారు.

అయిదేళ్ల కాంట్రాక్ట్

ఎస్‌బీఐ స్పెషలిస్ట్ కేడర్ ఆఫీసర్ పోస్ట్‌లకు నిర్వహించే ఎంపిక ప్రక్రియలో విజయం సాధించి, నియామకాలు ఖరారు చేసుకున్న వారు అయిదేళ్ల పాటు బ్యాంకులో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. మొదటి ఏడాదిని ప్రొబేషన్ కాలంగా పరిగణిస్తారు. ఈ వ్యవధిలో వారు తమకు కేటాయించిన విభాగాల్లో ప్రణాళికల రూపకల్పన, నివేదికలు రూపొందించడం, ఉన్నతాధికారులకు సహకరించడం వంటి బాధ్యతలు చేపట్టాల్సి ఉంటుంది.

ముంబై, సర్కిల్ ఆఫీస్‌ల్లో

ఆయా పోస్ట్‌లకు ఎంపికైన వారు బ్యాంకు ప్రధాన కార్యాలయం ముంబైతోపాటు సర్కిల్ కార్యాలయాలల్లోనూ పని చేయాల్సి ఉంటుంది. సెంట్రల్ రీసెర్చ్ టీమ్ (ప్రొడక్ట్ లీడ్, సపోర్ట్), ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ మేనేజర్ (టెక్నాలజీ), ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్ మేనేజర్ (బిజినెస్) పోస్ట్‌ల అభ్యర్థులు ముంబై కార్యాలయంలోనే విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. మిగతా పోస్ట్‌లకు సంబంధించి బ్యాంకు సర్కిల్ ఆఫీస్‌లలో పని చేయాలి. దరఖాస్తు సమయంలోనే అభ్యర్థులు మూడు సర్కిల్ ఆఫీస్‌లను తమ ప్రాథమ్యాలుగా పేర్కొనొచ్చు.

రూ.లక్షల్లో వేతనాలు

సెంట్రల్ రీసెర్చ్ టీమ్ పోస్టుకు (ప్రొడక్ట్ లీడ్)కు రూ.61 లక్షలు; సెంట్రల్ రీసెర్చ్ టీమ్ పోస్టుకు (సపోర్ట్)కు రూ.20.5 లక్షలు; ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్ మేనేజర్ (టెక్నాలజీ), ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్ మేనేజర్(బిజినెస్), రిలేషన్‌షిప్ మేనేజర్ పోస్ట్‌లకు రూ.30 లక్షలు చొప్పున; వీపీ–వెల్త్‌కు రూ.45 లక్షలు; రిలేషన్‌షిప్ మేనేజర్ –టీమ్‌లీడ్‌కు రూ.52 లక్షలు; రీజనల్ హెడ్‌కు రూ.66.5 లక్షలు; ఇన్వెస్ట్‌మెంట్ స్పెషలిస్ట్‌కు రూ.44లక్షలు;ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్‌కు రూ.26.5 లక్షలుగా వార్షిక వేతనాన్ని నిర్దేశించారు.

ముఖ్య సమాచారం

▪ **దరఖాస్తు విధానం:** ఎస్‌బీఐ స్పెషలిస్ట్ కేడర్ ఆఫీసర్ పోస్ట్‌లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం ఎస్‌బీఐ బ్యాంక్ అధికారిక వెబ్‌సైట్‌లోని కెరీర్స్ విభాగంలో ద్వారా ఆ ప్రక్రియ పూర్తి చేయాలి.
▪ **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024, ఆగస్ట్ 8.
▪ **పర్సనల్ ఇంటర్వ్యూలు:** సెప్టెంబర్ రెండో వారంలో నిర్వహించే అవకాశం.
▪ **పర్సనల్ ఇంటర్వ్యూ కేంద్రాలు:** ముంబై.
▪ **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:**https://sbi.co.in/web/careers/current-openings

సిమ్ కార్డులతో సైబర్ నేరం!

సీఎస్‌బీ, ఐఎస్‌బీ సంయుక్త అధ్యయనంలో వెల్లడి


అధ్యయన నివేదికను విడుదల చేస్తున్న శిఖా గోయల్. చిత్రంలో ఐఎస్‌బీ ప్రొఫెసర్లు

సాక్షి, హైదరాబాద్: సైబర్ నేరగాళ్లు నకిలీ, కాలం చెల్లిన ఆధార్ కార్డులలో చిన్నారుల ఫొటోలను పెట్టి తయారు చేసిన పత్రాలతో సిమ్ కార్డులు తీసుకుని వాటిని సైబర్ నేరాలకు వినియోగిస్తున్నట్టు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (సీఎస్‌బీ), ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) సంయుక్తంగా నిర్వహించిన ఓ అధ్యయనం వెల్లడించింది. సిమ్ కార్డుల రిజిస్ట్రేషన్ సమయంలో కేవలం 64.5 శాతం మంది కస్టమర్లు మాత్రమే డిజిటల్ కేవైసీని ఆధార్‌తో లింక్ చేసుకుంటున్నట్టు నివేదిక తెల్పింది. 'టెలికామ్ సిమ్ సబ్‌స్క్రిప్షన్ ఫ్రాడ్స్–గ్లోబల్ పాలసీ ట్రెండ్స్, రిస్క్ మేనేజ్‌మెంట్ అండ్ రికమండేషన్స్' పేరిట నిర్వహించిన ఈ అధ్యయన నివేదికను టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ సోమవారం టీజీ సీఎస్‌బీ కార్యాలయంలో ఐఎస్‌బీ ప్రొఫెసర్లతో కలిసి విడుదల చేశారు. సీఏఎఫ్ (కస్టమర్ అక్విజేషన్ ఫారమ్స్)లోని సమాచారం ఆధారంగా ఈ అధ్యయనాన్ని చేపట్టినట్టు నివేదికలో పేర్కొన్నారు. హైదరాబాద్‌తో పాటు తెలంగాణ వ్యాప్తంగా పోలీస్ స్టేషన్లలో నమోదైన సైబర్ నేరాల్లో ఉన్న ఫోన్ నంబర్లకు సంబంధించి మొత్తం 1,600 సీఏఎఫ్‌ల వివరాలు విశ్లేషించినట్టు తెలిపారు. సైబర్ నేరగాళ్లు వినియోగించిన ఫోన్ నంబర్లను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మాడ్యూల్స్‌తో రియల్ టైంలో విశ్లేషించినట్టు వివరించారు.

సిమ్ కార్డులు పోతే సమాచారం ఇవ్వాలి: సీఎస్‌బీ డైరెక్టర్

సైబర్ నేరాల్లో సిమ్‌కార్డు సంబంధిత మోసాలు పెరుగుతున్నాయని, వీటిని అడ్డుకునేందుకు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అధ్యయనం అభిప్రాయపడింది. వినియోగదారుడి వివరాలు వెరిఫికేషన్‌లో చాలా లోపాలు ఉన్నట్టు అధ్యయనం తేల్చింది. ఓటీపీ అథెంటికేషన్‌లోనూ లోపాలు ఉన్నట్టు వెల్లడించింది. ప్రజలు సిమ్ కార్డులు పోగొట్టుకున్నా, చోరీకి గురైనా వెంటనే ఆ సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలని ఈ సందర్భంగా శిఖా గోయల్ సూచించారు. పోగొట్టుకున్న సిమ్ కార్డులను వినియోగించి సైబర్ నేరగాళ్లు నేరాలకు పాల్పడే అవకాశం ఉందని, అందులో మన వివరాలు ఉంటాయి కాబట్టి మనం చిక్కుల్లో పడతామని హెచ్చరించారు. అదేవిధంగా వ్యక్తిగత సమాచారాన్ని అవసరానికి మించి ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు. ఈ నివేదిక రూపకల్పనలో ఆపరేషన్స్ అడిషనల్ డీజీ స్టీఫెన్ రవీంద్ర, నిజామాబాద్ కమిషనర్ కల్మేశ్వర్ సింగనవర్, ఏసీబీ జాయింట్ డైరెక్టర్ రితిరాజ్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డేటా సైన్స్ ప్రొఫెసర్లు మనీశ్ గంగ్వార్, డా.శ్రుతిమంత్రిలు పాల్గొన్నారు.

సెక్యూరిటీ గార్డ్‌గా మాజీ సర్పంచ్

అభివృద్ధి పనులకు అప్పులు • బిల్లులు రాక అగచాట్లు


సెక్యూరిటీ గార్డ్‌గా విధులు నిర్వర్తిస్తున్న నాగేశ్వరరావు

నేలకొండపల్లి: ఆయన మొన్నటి వరకు పంచాయతీ ప్రథమ పౌరుడు. ప్రజల సమస్యలపై వివిధ కార్యాలయాలకు తిరుగుతూ పరిష్కారానికి పాటుపడ్డారు. గ్రామాభివృద్ధికి అందిన కాడల్లా అప్పులు తెచ్చారు. వాటి బిల్లులు అందకపోగా.. ఇంతలోనే పదవీకాలం ముగిసింది. దీంతో ఆర్థిక ఇబ్బందులను అధిగమించేందుకు సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం మల్లేపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్‌గా పనిచేసిన పొట్టపింజర నాగేశ్వరరావు ప్రస్తుతం నేలకొండపల్లిలోని ఓ ప్రైవేట్ కంపెనీ వద్ద సెక్యూరిటీ గార్డ్‌గా చేరారు. ఈ విషయమై నాగేశ్వరరావు మాట్లాడుతూ తనకు రూ.2 లక్షల మేర రావలసిన బిల్లులకు ఎంబీ అయినా అందడం లేదని వాపోయారు. దీంతో ఆర్థిక ఇబ్బందులను అధిగమించేందుకు గార్డ్‌గా పనిచేస్తున్నానని చెప్పారు. కాగా, ఈయనే కాక చాలామంది సర్పంచ్‌లకు రూ.లక్షల మేర బకాయిలు ఉండడంతో వ్యవసాయ కూలీలుగా, ఉపాధి హామీ పథకం కూలీలుగా జీవనం సాగిస్తున్నారు.

ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసై చోరీలు

సిద్దిపేట జిల్లా చేర్యాల వీఆర్‌ఏ అరెస్టు


వెల్లడిస్తున్న సీఐ రేణుక

రేగోడ్ (మెదక్): ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసై చోరీలకు పాల్పడుతున్న ఓ వీఆర్‌ఏను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు వివరాలను సోమవారం రేగోడ్ పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ రాజయ్యతో కలిసి అల్లాదుర్గం సీఐ రేణుక వెల్లడించారు. రేగోడ్ మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన రైతు సంగప్ప రెండున్నర గ్రాముల బంగారం, వ్యవసాయ పనుల పెట్టుబడి కోసం రూ.2.1 లక్షలు ఇంట్లో దాచి ఉంచాడు. ఈనెల 22న ఇంటికి తాళం వేసి భార్యతో కలిసి వ్యవసాయ పనులకు వెళ్లాడు. అదే గ్రామానికి చెందిన వీఆర్‌ఏ నిరూడి జ్ఞానేశ్వర్.. రైతు సంగప్ప ఇంట్లోకి చొరబడి బంగారం, డబ్బులు ఎత్తుకెళ్లాడు. పనికి వెళ్లిన దంపతులు ఇంటికి వచ్చేసరికి.. వేసిన తాళం వేసినట్లే ఉండటంతో చోరీ జరిగినట్టు గుర్తించలేదు. డబ్బుల కోసం 23న రాత్రి బీరువా తీయగా అందులోని బంగారం, నగదు కనిపించలేదు. మర్నాడు 24న పోలీసులకు బాధితుడు సంగప్ప ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు జ్ఞానేశ్వర్‌ను అనుమానంతో అదుపులోకి తీసుకొని విచారించగా నేరం ఒప్పుకున్నాడు. నిందితుడు జ్ఞానేశ్వర్ సిద్దిపేట జిల్లా చేర్యాలలో వీఆర్‌ఏగా పని చేస్తున్నాడని, ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసై చోరీలకు అలవాటు పడ్డాడని సీఐ తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని, రికవరీ చేసిన సొత్తును కోర్టులో డిపాజిట్ చేశామన్నారు.

సినారె తెలుగు జాతికి గర్వకారణం

గద్దర్ అవార్డులపై సినీ ప్రముఖులు స్పందించాలి: సీఎం రేవంత్‌రెడ్డి


శివశంకరికి పురస్కారాన్ని అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో వేం నరేందర్‌రెడ్డి, మురళీమోహన్, ఆది శ్రీనివాస్

గన్‌ఫౌండ్రీ (హైదరాబాద్): పద్మభూషణ్ డాక్టర్ సి.నారాయణరెడ్డి తెలుగు జాతికి గర్వకారణమని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. రవీంద్రభారతిలో సోమవారం శ్రీమతి సుశీల నారాయణరెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో డాక్టర్ సి.నారాయణరెడ్డి 93వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ తమిళ రచయిత్రి శివశంకరికి విశ్వంభర డాక్టర్ సినారె జాతీయ సాహిత్య పురస్కారాన్ని అందజేశారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. డాక్టర్ సి.నారాయణరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కాంస్య విగ్రహం ఏర్పాటు లేదా విద్యకు సంబంధించిన అంశాలపై మంత్రిమండలితో చర్చించి నిర్ణయం ప్రకటిస్తామని చెప్పారు. సినారె రచనలను ఎవరైనా గ్రంథరూపంలో తీసుకురావాలనుకుంటే సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. నంది అవార్డుల కంటే గొప్పగా డిసెంబర్ 9న గద్దర్ అవార్డులను ఇస్తామని ప్రకటించినప్పటికీ.. సినీ ప్రముఖుల నుండి స్పందన రాలేదని గుర్తు చేశారు. దీనిపై సినీ ప్రముఖులు ప్రతిపాదనలతో రావాలని కోరారు. అనంతరం సి.నారాయణరెడ్డి రచించిన 'సమన్వితం'' పుస్తకాన్ని సీఎం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, నటుడు మురళీమోహన్ పాల్గొన్నారు.

సీఎంకు 2025-26 పండుగల జాబితా

సాక్షి, హైదరాబాద్: విశ్వావసునామ సంవత్సరం 2025–26 పండుగల జాబితాను తెలంగాణ విద్వత్ సభ ఆధ్వర్యంలో పంచాంగకర్తలు, సిద్ధాంతులు సోమవారం సీఎం రేవంత్‌రెడ్డికి అందజేశారు. జూబ్లీహిల్స్‌లోని దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ నివాసంలో ఆమెకు కూడా ఈ జాబితాను అందించారు. ఈ సందర్భంగా విద్వత్ సభ బాధ్యులను సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సురేఖ అభినందించారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ హన్మంతరావు, భద్రకాళి దేవాలయ ప్రధానార్చకుడు భద్రకాళి శేషు, యాదాద్రి దేవస్థానం చైర్మన్ నర్సింహమూర్తి, ప్రధాన అర్చకుడు నర్సింహాచార్యులు, తెలంగాణ విద్వత్ సభ కార్యదర్శి శ్రీదివ్యజ్ఞాన సిద్ధాంతి, కోశాధికారి ఎంవీఆర్ శర్మ (దర్శనం శర్మ), వేదపండితులు నటరాజ శర్మ, సాయి దీక్షిత్ పాల్గొన్నారు.

సింగరేణి పాఠశాలల్లో సీబీఎస్‌ఈ బోధన

- వచ్చే ఏడాది నుంచి అమలు
- సింగరేణి సీఎండీ బలరామ్ వెల్లడి



సాక్షి, హైదరాబాద్: వచ్చే ఏడాది నుంచి సింగరేణి పాఠశాలల్లో సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్‌ఈ) విద్య బోధనను ప్రవేశపెట్టేందుకు యాజమాన్యం ముమ్మర ప్రయత్నాలు ప్రారంభించిందని సంస్థ సీఎండీ ఎన్ బలరామ్ తెలిపారు. ముందుగా రామగుండం–2 ఏరియాలోని ఎటింక్లైన్ కాలనీలోని సెక్టార్–3 సింగరేణి పాఠశాలలో సీబీఎస్‌ఈ బోధనను ప్రవేశ ప్రవేశపెట్టేందుకు యాజమాన్యం సన్నద్ధమైందని వెల్లడించారు. ఈ మేరకు కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఆధీనంలోని సీబీఎస్‌ఈకి దరఖాస్తు సమర్పించిందని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీబీఎస్‌ఈ ప్రధాన కార్యాలయం నుంచి త్వరలోనే ఉన్నతస్థాయి బృందం సింగరేణి పాఠశాలకు రానుందని వెల్లడించారు. ఆ బృందం సింగరేణి పాఠశాలను సందర్శించి అక్కడి తరగతి గదులు, పాఠశాల క్రీడా మైదానం, ప్రయోగ శాలలు, ఇతర మౌలిక వసతులు పరిశీలిస్తుందని వివరించారు. ఈ పని రానున్న మూడు నెలల్లో పూర్తయ్యే అవకాశం ఉందని చెప్పారు. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ సంతృప్తి చెందినట్లయితే ప్రాథమికంగా రామగుండం–2 ఏరియాలోని సెక్టార్–3 సింగరేణి పాఠశాలలో సీబీఎస్‌ఈ బోధనకు అనుమతించే అవకాశం ఉందని సీఎండీ బలరామ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

అత్తారింటికి దారేది..?

బాలింతకు తప్పని వరద కష్టం



వరదలో ట్రాక్టర్‌పై ప్రయాణిస్తున్న బాలింత

చింతలమానెపల్లి(సిర్పూర్): కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఉప్పొంగుతున్న వాగులు, ఒర్రెలతో గర్భిణులు, బాలింతలకు అవస్థలు తప్పడం లేదు. చింతలమానెపల్లి మండలం దిందా గ్రామానికి చెందిన శనిగారపు మమత పుట్టింటి నుంచి అత్తగారింటికి చేరుకోవడానికి నానాఇబ్బందులు పడాల్సి వచ్చింది. ప్రసవం కోసం పెంచికల్‌పేట్ మండలం ఎల్లూర్ గ్రామంలోని తల్లిగారింటికి వచ్చిన మమత.. మూడు నెలల అనంతరం దిందా గ్రామంలోని తన అత్తగారింటికి బయల్దేరింది. పది రోజులుగా కురుస్తున్న వర్షాలతో దిందాకు వెళ్లే మార్గంలోని వాగులో వరద పెరగడంతో అధికారులు రాకపోకలు నిలిపివేశారు. ప్రస్తుతం వరద కొంత తగ్గుముఖం పట్టగా ట్రాక్టర్లు, ఎడ్లబండ్లలో గ్రామస్తులు ప్రయాణాలు సాగిస్తున్నారు. సోమవారం భర్త శేఖర్‌తో కలిసి బాలింత మమత తన మూడు నెలల శిశువుతో ట్రాక్టర్‌పై వాగు దాటింది. పెద్దాపరేషన్ అయిన తనకు ట్రాక్టర్ ఎక్కడం, దిగడం ఇబ్బందిగా మారినా.. తప్పలేదని ఆమె వాపోయింది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

బిజినెస్ రీల్

డాక్టర్ రెడ్డీస్ బయోసిమిలర్‌పై సీహెచ్‌ఎంపీ సానుకూలత



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: యూరోపియన్ మార్కెట్లలో రిటుగ్జిమాబ్ బయోసిమిలర్ క్యాండిడేట్ ఐటక్స్‌రెడీని ప్రవేశపెట్టడంపై యూరోపియన్ మెడిసిన్స్ ఏజెన్సీ కమిటీ సీహెచ్‌ఎంపీ సానుకూల అభిప్రాయం వ్యక్తం చేసినట్లు డాక్టర్ రెడ్డీస్ ల్యాబరేటరీస్ తెలిపింది. తదుపరి యూరోపియన్ కమిషన్ దీన్ని సమీక్షించి యూరోపియన్ యూనియన్ సభ్య దేశాల్లోనూ, ఇతరత్రా నార్వే, ఐస్‌ల్యాండ్ తదితర దేశాల్లోనూ దీన్ని ప్రవేశపెట్టడంపై నిర్ణయం తీసుకుంటుందని పేర్కొంది. బ్రిటన్ ఔషధ, హెల్త్‌కేర్ ఉత్పత్తుల నియంత్రణ సంస్థ ఎంహెచ్ఆర్ఏకి విడిగా మార్కెటింగ్ అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోనున్నట్లు వివరించింది. ల్యుకేమియా, ఆర్థరైటిస్ వంటి అనారోగ్య సమస్యల చికిత్సలో వాడే రోష్ కంపెనీ ఔషధం మ్యాబ్‌థెరాకి బయోసిమిలర్‌గా డాక్టర్ రెడ్డీస్ దీన్ని రూపొందించింది.

టీఎస్‌హెచ్‌పీలో టాటా స్టీల్‌కు వాటా

557 కోట్ల షేర్లు కొనుగోలు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ మెటల్ దిగ్గజం టాటా స్టీల్ తాజాగా సింగపూర్ అనుబంధ సంస్థలో 557 కోట్లకుపైగా ఈక్విటీ షేర్లను కొనుగోలు చేసింది. ఇందుకు 87.5 కోట్ల డాలర్లు(సుమారు రూ. 7,324 కోట్లు) వెచ్చించింది. ఈక్విటీ షేర్ల సబ్‌స్క్రిప్షన్ ద్వారా టీ స్టీల్ హోల్డింగ్స్ పీటీఈ(టీఎస్‌హెచ్‌పీ)లో దశలవారీగా ఇన్వెస్ట్ చేసేందుకు మే నెలలోనే టాటా స్టీల్ బోర్డు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీనిలో భాగంగా తాజాగా 0.157 డాలర్ల ముఖవిలువగల 557,32,48,408 షేర్లను కొనుగోలు చేసినట్లు కంపెనీ వెల్లడించింది. దీంతో టీఎస్‌హెచ్‌పీ సొంత అనుబంధ సంస్థగా కొనసాగనున్నట్లు పేర్కొంది.

ఈ వార్తలతో టాటా స్టీల్ షేరు బీఎస్ఈలో దాదాపు యథాతథంగా రూ. 123 వద్ద ముగిసింది.

మైక్రోసాఫ్ట్‌తో పీడబ్ల్యూసీ ఇండియా జట్టు



న్యూఢిల్లీ: సైబర్‌సెక్యూరిటీ సేవలను మెరుగుపర్చే దిశగా మైక్రోసాఫ్ట్ ఇండియాతో చేతులు కలిపినట్లు పీడబ్ల్యూసీ ఇండియా వెల్లడించింది. సైబర్ ముప్పులను సమర్థంగా ఎదుర్కొనడంలో తమకున్న సామర్థ్యాలు, మైక్రోసాఫ్ట్ అధునాతన టెక్నాలజీల తోడ్పాటుతో కంపెనీలు సురక్షితంగా కార్యకలాపాలు నిర్వహించుకోగలవని పేర్కొంది. జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ చాట్‌బాట్ అయిన మైక్రోసాఫ్ట్ కోపైలట్, ఇన్సిడెంట్ రెస్పాన్స్ ఫీచర్లు ఇందుకు సహాయకరంగా ఉండగలవని వివరించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

30-7-2024

విశాఖ	485-00
చిత్తూరు	513-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	475-00
విజయవాడ	480-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	460-00
వరంగల్	462-00
రిటైల్ ధర	5.20

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
DIVISLAB	4,931.00	2.93
BPCL	338.4	2.92
LT	3,775.00	2.58
BAJAJFINSV	1,618.00	1.99
M&M	2,945.00	1.98

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BHARTIARTL	1,482.85	-2.08
TITAN	3,425.95	-1.95
CIPLA	1,553.00	-1.4
ITC	496.25	-1.18
TATACONSUM	1,200.05	-1.12

స్టాక్ మార్కెట్ డేటా


	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	11,273
ఎన్ఎస్ఈ	1,48,104
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	3,02,716
ఎఫ్ఐఐ	-2,475
డీఐఐ	+5,66

ముడిచమురు... (బ్యారెల్)

	రాత్రి 11.30కు	క్రితం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	75.89 $	77.16
బ్రెంట్	79.09 $	80.28

ఫైనాన్స్ డిజిటలైజేషన్‌తో కొత్తతరం బ్యాంకింగ్

దీనితో అందరికీ ఆర్థిక సేవల అందుబాటు
- ఇప్పటికే యూపీఐతో అందుతున్న సౌలభ్యతలను చూస్తున్నాం...
- ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్



ముంబై: ఫైనాన్స్‌లో డిజిటలైజేషన్ తదుపరి తరం బ్యాంకింగ్ సంస్కరణలకు మార్గం సుగమం చేస్తుందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్ పేర్కొన్నారు. తక్కువ వ్యయాలతో అందరికీ ఫైనాన్షియల్ సేవలు అందుబాటులోకి తీసుకురావడానికి ఫైనాన్స్ డిజిటలైజేషన్ దోహదపడుతుందని వివరించారు. 2023-24 కరెన్సీ అండ్ ఫైనాన్స్ రిపోర్ట్ (ఆర్‌సీఎఫ్)లో ఆయన ముందుమాట రాస్తూ, ఫ్లాగ్‌షిప్ యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) వినియోగదారుల రిటైల్ చెల్లింపుల విధానాన్ని విప్లవాత్మకంగా మార్చిందని పేర్కొన్నారు. ఈ కామర్స్ విభాగ పురోగతినీ ఇక్కడ పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. లావాదేవీలను వేగవంతంగా, ఎటువంటి ఇబ్బందులూ లేకుండా తేలిగ్గా నిర్వహించేలా చేసిందని గవర్నర్ చెప్పారు. డిజిటల్ కరెన్సీ రంగంలో ఈ-రూపాయి, సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీల(సీబీడీసీ) ప్రయోగాత్మక అమల్లో రిజర్వ్ బ్యాంక్ ముందంజలో ఉందని అన్నారు. ఓపెన్ క్రెడిట్ ఎనేబుల్‌మెంట్ నెట్‌వర్క్, డిజిటల్ కామర్స్ కోసం ఓపెన్ నెట్‌వర్క్, ఫ్రిక్షన్‌లెస్ క్రెడిట్ కోసం పబ్లిక్ టెక్ ప్లాట్‌ఫామ్ వంటి కార్యక్రమాలతో డిజిటల్ రుణ వ్యవస్థ శక్తివంతంగా మారుతోందన్నారు. బ్యాంకులు అలాగే నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలతో (ఎన్‌బీఎఫ్‌సీ) లెండింగ్ సర్వీస్ ప్రొవైడర్లుగా ఫిన్‌టెక్‌లు సహకరిస్తున్నాయని అన్నారు. ఇదే సమయంలో ఇప్పుడు డిజిటలైజేషన్ ఎదుర్కొంటున్న సైబర్ సెక్యూరిటీ, డేటా గోప్యత, డేటా బయాస్, వెండర్, థర్డ్-పార్టీ రిస్కులు వంటి సవాళ్లను పరిష్కరించాల్సి ఉందని ఆర్‌బీఐ గవర్నర్ అన్నారు. మరోవైపు డిజిటల్ విప్లవంలో భారత్ ముందంజలో ఉందని నివేదిక పేర్కొంది. భారత్ డిజిటల్ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం దేశ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో పదో వంతు వాటా కలిగి ఉందని 2026 నాటికి ఇది ఐదవ వంతుగా పురోగమిస్తుందని నివేదిక అంచనావేసింది.

ఆర్‌బీఐ ప్రస్థానంపై వెబ్ సిరీస్

రిజర్వ్ బ్యాంక్ తన తొంభై ఏళ్ల ప్రస్థానంపై అయిదు ఎపిసోడ్ల వెబ్ సిరీస్‌ను రూపొందించడంపై కసరత్తు చేస్తోంది. ఒక్కో ఎపిసోడ్ 25-30 నిమిషాల నిడివితో ఈ సిరీస్ సుమారు మూడు గంటలు ఉంటుంది. దీన్ని జాతీయ టీవీ ఛానల్స్, ఓటీటీ ప్లాట్‌ఫాంలలో ప్రసారం చేసే యోచన ఉన్నట్లు సిరీస్ నిర్మాణానికి టెండర్లను ఆహ్వానిస్తూ జారీ చేసిన పత్రంలో ఆర్‌బీఐ తెలిపింది. ఎకానమీలో రిజర్వ్ బ్యాంక్ ప్రాధాన్యత, దాని కార్యకలాపాలు మొదలైన వాటి గురించి అవగాహన కలిగించే విధంగా ఈ సిరీస్ ఉంటుంది. 1935లో ఏర్పాటైన ఆర్‌బీఐ ఈ ఏడాది ఏప్రిల్‌లో 90 సంవత్సరాలు పూర్తి చేసుకుంది.

విద్యుత్, ఇంధన రంగాల్లో ఉపాధి అవకాశాలు

ఏప్రిల్-సెప్టెంబర్ మధ్య 9 శాతం అధికం
- ఇంజనీర్లకు ఎక్కువ డిమాండ్
- టీమ్‌లీజ్ సర్వీసెస్ నివేదిక వెల్లడి



ముంబై: విద్యుత్, ఇంధన రంగాల్లో ఈ ఏడాది నియామకాలు సానుకూలంగా ఉండనున్నాయి. ముఖ్యంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లో (ఏప్రిల్-సెప్టెంబర్ మధ్య) ఈ రంగాల్లో నియామకాలు, క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చినప్పుడు 9 శాతం పెరుగుతాయని టీమ్‌లీజ్ సర్వీసెస్ 'ఎంప్లాయిమెంట్ అవుట్‌లుక్' నివేదిక తెలిపింది. 2070 నాటికి సున్నా కర్బన ఉద్గారాల (నెట్ జీరో) లక్ష్యం దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఉపాధి అవకాశాలకు మద్దతుగా నిలుస్తాయని ఈ నివేదిక పేర్కొంది. దేశ లక్ష్యాలకు అనుగుణంగా ఇంధన రంగం గణనీయమైన మార్పు దిశగా అడుగులు వేస్తున్నట్టు తెలిపింది. 23 రంగాలకు చెందిన 1,417 కంపెనీల ప్రతినిధులను అడిగి టీమ్‌లీజ్ ఈ నివేదికను రూపొందించింది.

ఢిల్లీలో అధికం

ఇంధన, విద్యుత్ రంగాల్లో ప్రస్తుత ఉపాధి అవకాశాల పరంగా ఢిల్లీ 56 శాతంతో అగ్రస్థానంలో ఉన్నట్టు ఈ నివేదిక తెలిపింది. బెంగళూరు 53 శాతం, ముంబై 52 శాతంతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఈ రంగంలో కొత్త ఉపాధి అవకాశాల పరంగా జైపూర్ 14 శాతంతో ముందుంది. బెంగళూరు, చెన్నై, వదోదర 13 శాతంతో వరుసగా తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. మెట్రోల్లో వృద్ధి అవకాశాలను గుర్తు చేస్తూనే, ద్వితీయ శ్రేణి పట్టణాలు కొత్త అవకాశాలు వేదికగా నిలుస్తున్నట్టు టీమ్‌లీజ్ నివేదిక పేర్కొంది. మౌలిక వసతుల అభివృద్ధి, విధానపరమైన ప్రోత్సాహకాలు, పునరుత్పాదక ఇంధన వనరుల విస్తరణ ఇందుకు మద్దతుగా నిలుస్తున్నట్టు తెలిపింది.

ఆర్థిక వృద్ధికి మద్దతు..

''విద్యుత్, ఇంధన రంగాల్లో 9 శాతం మేర ఉపాధి అవకాశాల విస్తరణ అన్నది పర్యావరణ అనుకూల భవిష్యత్ దిశగా స్పష్టమైన మార్గాన్ని సూచిస్తోంది. 62 శాతం పరిశ్రమ ప్రతినిధులు తమ సిబ్బందిని పెంచుకుంటున్నట్టు చెప్పారు. ఇండస్ట్రీ 4.0, క్రమానుగతంగా కర్బన రహితంగా మారాలన్న లక్ష్యాలు విద్యుత్, ఇంధన రంగాల్లో ఉపాధి అవకాశాలను పెంచుతున్నాయి. తద్వారా ఆర్థిక వృద్ధికి మద్దతుగా నిలుస్తున్నాయి'' అని టీమ్‌లీజ్ సర్వీసెస్ చీఫ్ స్ట్రాటజీ ఆఫీసర్ పి.సుబ్బురాతినమ్ తెలిపారు. విద్యుత్, ఇంధన రంగాల్లో ఇంజనీర్లకు డిమాండ్ ఎక్కువగా ఉంది. టీమ్‌లీజ్ సర్వేలో పాల్గొన్న వారిలో 67 శాతం వృద్ధి అవకాశాల గుర్తించి ప్రస్తావించారు. ఆ తర్వాత సేల్స్ (అమ్మకాలు) విభాగంలో ఎక్కువ డిమాండ్ ఉంది. ఎలక్ట్రిక్ వాహనాలు, ఎలక్ట్రిక్ వాహన మౌలిక వసతులు, ప్రీమియమైజేషన్ (ఖరీదైన ఉత్పత్తుల వినియోగం) ధోరణితో ఈ రంగంలో ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరగనున్నాయని ఈ నివేదిక తెలిపింది.

సెనోరెస్ ఫార్మా ఐపీవో బాట

సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు



న్యూఢిల్లీ: హెల్త్‌కేర్ రంగ కంపెనీ సెనోరెస్ ఫార్మాస్యూటికల్స్ పబ్లిక్ ఇష్యూకి వస్తోంది. ఇందుకు అనుమతించమంటూ క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి తాజాగా ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. ఐపీవోలో భాగంగా రూ. 500 కోట్ల ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 27 లక్షల షేర్లను ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. ప్రాస్పెక్టస్ ప్రకారం ప్రీఐపీవో ప్లేస్‌మెంట్‌లో భాగంగా రూ. 100 కోట్లను సమీకరించే యోచనలో ఉంది. దీంతో ఐపీవో పరిమాణాన్ని కుదించే అవకాశముంది. అర్హతగల కంపెనీ ఉద్యోగులకు కొంతమేర షేర్లను రిజర్వ్ చేయనుంది. ఈక్విటీ జారీ నిధుల్లో కొంతమేర అట్లాంటాలోని స్టెరైల్ ఇంజక్షన్ల తయారీ ప్లాంటు ఏర్పాటుకు వెచ్చించనుంది. ఈ బాటలో అనుబంధ సంస్థల వర్కింగ్ క్యాపిటల్, ఇతర సంస్థల కొనుగోళ్లు తదితరాలకు సైతం నిధులు వినియోగించనుంది.

ఇన్వెస్టర్ల కోసం సెబీ 'సేవ' చాట్‌బాట్

న్యూఢిల్లీ: మార్కెట్ సంబంధిత సమాచారాన్ని తెలుసుకునేందుకు ఇన్వెస్టర్ల సౌకర్యార్థం 'సేవ' పేరిట కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత చాట్‌బాట్‌ను సెబీ ఆవిష్కరించింది. ఇది ప్రస్తుతం సెక్యూరిటీల మార్కెట్, తాజా మాస్టర్ సర్క్యులర్లు, ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియలు మొదలైన వాటి గురించి సమాచారాన్ని ఇవ్వగలదు. యూజర్ల నుంచి వచ్చే అభిప్రాయాల మేరకు మరిన్ని అంశాలను దీనికి చేర్చనున్నట్లు సెబీ తెలిపింది.

లిస్టెడ్ కంపెనీగానే ఇండియా సిమెంట్స్

స్పష్టం చేసిన అల్ట్రాటెక్ సిమెంట్



న్యూఢిల్లీ: దక్షిణాదిన కార్యకలాపాలు విస్తరించిన ఇండియా సిమెంట్స్(ఐసీఎల్) స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టెడ్ కంపెనీగా కొనసాగుతుందని అల్ట్రాటెక్ సిమెంట్ తాజాగా పేర్కొంది. ఐసీఎల్‌ను డీలిస్ట్ చేసే యోచనలేదని ఆదిత్య బిర్లా గ్రూప్ సిమెంట్ దిగ్గజం తెలియజేసింది. వారాంతాన ఐసీఎల్ ప్రమోటర్ల నుంచి 32.72 శాతం వాటా కొనుగోలుకి ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు అల్ట్రాటెక్ వెల్లడించిన నేపథ్యంలో లిస్టింగ్ అంశానికి ప్రాధాన్యత ఏర్పడింది. డీల్ విలువ రూ. 3,954 కోట్లుకాగా.. ఇప్పటికే ఐసీఎల్‌లో 23 శాతం వాటా కలిగిన అల్ట్రాటెక్ దీంతో నిబంధనల ప్రకారం పబ్లిక్ వాటాదారుల నుంచి మరో 26 శాతం వాటా కొనుగోలుకి ఓపెన్ ఆఫర్‌ను ప్రకటించింది. షేరుకి రూ. 390 ధరలో 8.05 కోట్ల షేర్లను కొనుగోలు చేయనుంది. ఇందుకు అల్ట్రాటెక్ రూ. 3,142 కోట్లకుపైగా వెచ్చించనుంది. అయితే ఐపీఎల్ క్రికెట్ టీమ్.. చెన్నై సూపర్ కింగ్స్(సీఎస్‌కే) యాజమాన్యంలో ఎలాంటి మార్పు ఉండబోదని తెలుస్తోంది. ఐసీఎల్ ప్రమోటర్ ఎన్.శ్రీనివాసన్, కుటుంబ సభ్యులు ప్రమోటర్లుగా ఉన్న సంగతి తెలిసిందే. కాగా.. అల్ట్రాటెక్ తరఫున ఓపెన్ ఆఫర్‌ను చేపట్టిన యాక్సిస్ క్యాపిటల్.. ఐసీఎల్‌ను డీలిస్ట్ చేసే యోచనలేదన్న విషయాన్ని స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలియజేసింది. పూర్తిస్థాయిలో ఓపెన్ ఆఫర్ విజయవంతమైతే ఐసీఎల్‌లో అల్ట్రాటెక్ వాటా 81.49 శాతానికి చేరే వీలుంది!

బీఎస్ఈలో ఐసీఎల్ షేరు 0.7 శాతం నీరసించి రూ. 372 వద్ద ముగిసింది. ఓపెన్ ఆఫర్ ధరతో పోలిస్తే ఇది 4.6 శాతం డిస్కౌంట్.

గ్రామీణ మార్కెట్‌పై ఎఫ్‌ఎంసీజీ ఆశలు

6 శాతం వృద్ధి అంచనాలు
- గతేడాది 4.4 శాతమే
- ప్రీమియం ఉత్పత్తులకు పెరుగుతున్న ఆదరణ
- కాంటార్ వరల్డ్ ప్యానెల్ నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ: గ్రామీణ ప్రాంతాల్లో ఎఫ్‌ఎంసీజీ విక్రయాలు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పుంజుకుంటాయని కాంటార్ వరల్డ్ ప్యానెల్ నివేదిక అంచనా వేసింది. అమ్మకాల్లో 6.1 శాతం వృద్ధి ఉండొచ్చని తెలిపింది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో గ్రామీణ ప్రాంతాల్లో విక్రయాలు 4.4 శాతం పెరిగినట్టు వెల్లడించింది. ఇక పట్టణ ప్రాంతాల్లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఎఫ్‌ఎంసీజీ ఉత్పత్తుల విక్రయాలు ఫ్లాట్‌గా 4.2 శాతం మేర వృద్ధిని నమోదు చేయవచ్చంటూ తాజాగా విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లో ఒక్కసారి స్థిరత్వం నెలకొంటే అక్కడి నుంచి భారీ మార్పు కనిపించొచ్చని అభిప్రాయపడింది. పట్టణాలతో సమానంగా సమీప భవిష్యత్తులో పల్లెల్లోనూ అమ్మకాలు ఊపందుకోవచ్చని తెలిపింది. ఎఫ్‌ఎంసీజీ పరిశ్రమకు సగం అమ్మకాలు గ్రామీణ ప్రాంతాల నుంచే వస్తున్నట్టు గుర్తు చేసింది. ఎఫ్‌ఎంసీజీలో వృద్ధి జనాభా ఆధారంగానే ఉంటుంది కానీ, వినియోగం ఆధారంగా కాదని వివరించింది.

ఇవీ సమస్యలు..

ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, గ్రామీణ గృహ పరిమాణంలో తగ్గుదల, యుటిలిటీల కోసం (టెలిఫోన్, విద్యుత్, పెట్రోల్ తదితర) ఎక్కువగా ఖర్చు చేస్తుండడం, పొదుపుపై ఎక్కువగా దృష్టి పెట్టడం గ్రామీణ ప్రాంతాల్లో ఎఫ్‌ఎంసీజీ వినియోగంలో స్తబ్దతకు కారణాలుగా కాంటార్ నివేదిక పేర్కొంది. కరోనా విపత్తు తర్వాత నుంచి గ్రామీణ మార్కెట్లలో ఎఫ్‌ఎంసీజీ వినియోగం పడిపోవడం తెలిసిందే. గత ఆర్థిక సంవత్సరంలోనే ఇది పుంజుకుంది.

ప్రీమియం ఉత్పత్తులకు ఆదరణ

ఇతర రంగాల మాదిరే ఎఫ్‌ఎంసీజీలోనూ ప్రీమియమైజేషన్ (నాణ్యమైన, ఖరీదైన బ్రాండ్ల వైపు మొగ్గు) ధోరణి వృద్ధి చెందుతోందని కాంటార్ నివేదిక తెలిపింది. ఇది మెరుగైన జీవన ప్రమాణాలను తెలియజేస్తుందని అభిప్రాయం వ్యక్తం చేసింది. కొన్ని విభాగాలు వినియోగదారులకు మెరుగైన అనుభవాన్ని ఇస్తున్నట్టు, దీంతో ప్రీమియం ఉత్పత్తులకు ఎక్కువ చెల్లించేందుకు ముందుకు వస్తున్నట్టు తెలిపింది. ఆహారం, ఫేస్ స్క్రబ్/పీల్/మాస్క్, బాడీ వాష్, హెయిర్ కండీషనింగ్ సిరమ్, ముసేలి, కొరియన్ నూడుల్స్‌ను ఉదాహరణలుగా పేర్కొంది.

త్రైమాసిక ఫలితాలు

ఏసీసీ లాభం నేలచూపు

క్యూ1లో రూ. 361 కోట్లు



న్యూఢిల్లీ: సిమెంట్ రంగ దిగ్గజం ఏసీసీ ఈ ఆర్థిక సంవత్సరం(2024-25) తొలి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. ఏప్రిల్-జూన్(క్యూ1)లో నికర లాభం 22 శాతంపైగా క్షీణించి రూ. 361 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2023-24) ఇదే కాలంలో అదానీ గ్రూప్ సంస్థ రూ. 466 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 5,201 కోట్ల నుంచి నామమాత్రంగా తగ్గి రూ. 5,155 కోట్లకు చేరింది. అయితే మొత్తం వ్యయాలు 2 శాతం పెరిగి రూ. 4,741 కోట్లను దాటాయి. ఈ కాలంలో సిమెంట్, క్లింకర్ అమ్మకాలు 9 శాతం ఎగసి 10.2 మిలియన్ టన్నులను తాకాయి. గత ఐదేళ్లలో తొలి క్వార్టర్‌కు ఇవి అత్యధిక అమ్మకాలుకావడం గమనార్హం! సిమెంట్ బిజినెస్ ఆదాయం రూ. 4,852 కోట్లకు చేరగా.. రెడీమిక్స్ నుంచి 329 కోట్లు లభించింది.

ఫలితాల నేపథ్యంలో ఏసీసీ షేరు బీఎస్ఈలో 0.4 శాతం క్షీణించి రూ. 2,604 వద్ద ముగిసింది.

హెచ్‌పీసీఎల్ లాభం పతనం

క్యూ1లో రూ. 634 కోట్లకు పరిమితం



న్యూఢిల్లీ: ఇంధన రంగ ప్రభుత్వ దిగ్గజం హిందుస్తాన్ పెట్రోలియం(హెచ్‌పీసీఎల్) ఈ ఆర్థిక సంవత్సరం(2024-25) తొలి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. ఏప్రిల్-జూన్(క్యూ1)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 90 శాతం క్షీణించి రూ. 634 కోట్లకు పరిమితమైంది. రిఫైనరీ మార్జిన్లు క్షీణించడానికితోడు, ఇంధన ధరల తగ్గింపుతో మార్జిన్లు నీరసించడం ప్రభావం చూపింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో దాదాపు రూ. 6,766 కోట్లు ఆర్జించింది. ప్రతీ బ్యారల్ చమురు శుద్ధిపై స్థూల మార్జిన్లు(జీఆర్ఎం) 5.03 డాలర్లుగా నమోదైంది. గత క్యూ1లో 7.44 జీఆర్ఎం సాధించింది. 6.7 శాతం అధికంగా 5.67 మిలియన్ టన్నుల ముడిచమురును రిఫైన్ చేసింది. అయితే ఈ కాలంలో ఎగుమతులతో కలసి కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా 12.63 మిలియన్ టన్నుల అమ్మకాలను సాధించింది. ఇది 6.6 శాతం వృద్ధి.

ఫలితాల నేపథ్యంలో హెచ్‌పీసీఎల్ షేరు బీఎస్ఈలో 1.3 శాతం లాభంతో రూ. 381 వద్ద ముగిసింది.

నష్టాల నుంచి బయటపడ్డ స్ట్రయిడ్స్ ఫార్మా



న్యూఢిల్లీ: స్ట్రయిడ్స్ ఫార్మా జూన్ త్రైమాసికంలో రూ.84 కోట్ల లాభాన్ని నమోదు చేసింది. క్రితం ఏడాది ఇదే కాలంలో సంస్థ రూ.30 కోట్ల మేర నష్టాలను చవిచూడడం గమనార్హం. ఆదాయం 16 శాతం మేర వృద్ధి చెంది రూ.1,087 కోట్లకు చేరింది. లాభదాయకత, సామర్థ్యాలు, వృద్ధిపై దృష్టి సారించడంతో అన్ని మార్కెట్లలోనూ బలమైన పనితీరుకు దారితీసినట్టు సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్ అరుణ్ కుమార్ తెలిపారు. వ్యాపార నాణ్యతను పెంచుకోవడం ద్వారా ఇదే విధమైన పనితీరును కొనసాగించగలమన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. డిజిటైజేషన్, ఆటోమేషన్‌పై దృష్టి సారించినట్టు సంస్థ ఎండీ, సీఈవో బద్రీ కొమండూర్ తెలిపారు.

బీఎస్ఈలో కంపెనీ షేరు ఒక శాతం లాభపడి రూ.1,034 వద్ద క్లోజయింది.

మెప్పించిన కోల్గేట్ పామోలివ్



న్యూఢిల్లీ: కోల్గేట్ పామోలివ్ మెరుగైన పనితీరు ప్రదర్శించింది. జూన్ త్రైమాసికంలో రూ.364 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.274 కోట్లతో పోల్చి చూస్తే 33 శాతం వృద్ధి చెందింది. ఆదాయం సైతం 13 శాతం పెరిగి రూ.1,486 కోట్లకు చేరింది. ''జూన్ త్రైమాసికంలో గ్రామీణ మార్కెట్లలో డిమాండ్ పుంజుకోవడం కొనసాగింది. పట్టణ ప్రాంతాలతో పోలిస్తే మెరుగైన వృద్ధి నమోదైంది. దీనికితోడు టూత్‌పేస్ట్, టూత్‌బ్రష్, పర్సనల్ కేర్ విభాగాల్లో చక్కని పనితీరు ఆదాయంలో 13 శాతం వృద్ధికి దారితీసింది'' అని కోల్గేట్ పామోలివ్ ఇండియా తెలిపింది. వ్యయాలు 8 శాతం పెరిగి రూ.1,031 కోట్లుగా ఉన్నాయి. ముఖ్యంగా టూత్‌పేస్ట్ విభాగంలో రెండంకెల వృద్ధి నమోదైనట్టు కంపెనీ ఎండీ, సీఈవో ప్రభా నరసింహన్ తెలిపారు. ఉత్పత్తి శ్రేష్ఠత, బ్రాండ్ బలోపేతం, ఆవిష్కరణలపై తాము చేసిన పెట్టుబడులు మంచి ఫలితాలనిస్తున్నట్టు చెప్పారు. ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో కోల్గేట్ పామోలివ్ షేరు ఒకటిన్నర శాతం మేర లాభపడి రూ.3,209 వద్ద ముగిసింది.

అదానీ విల్‌మార్.. అదుర్స్

వంట నూనెల విభాగంలో బలమైన పనితీరు



న్యూఢిల్లీ: ఆహారం, వంటనూనెలు, ఎఫ్‌ఎంసీజీ విభాగాల్లో కార్యకలాపాలు నిర్వహించే అదానీ విల్‌మార్ లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో అంతమైన మూడు నెలల కాలానికి రూ.313 కోట్ల కన్సాలిడేటెడ్ లాభాన్ని ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే కాలంలో సంస్థ రూ.79 కోట్ల మేర నష్టాలను ఎదుర్కోవడంతో పోలిస్తే.. పనితీరు గణనీయంగా మెరుగుపడినట్టు తెలుస్తోంది. ఆదాయం రూ.12,994 కోట్ల నుంచి రూ.14,230 కోట్లకు వృద్ధి చెందింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంతో పోల్చి చూస్తే.. వంట నూనెల విభాగం ఆదాయం 8 శాతం వృద్ధితో రూ.10,649 కోట్లకు చేరింది. ఫుడ్, ఎఫ్‌ఎంసీజీ విభాగం ఆదాయం 40 శాతం వృద్ధితో రూ.1,533 కోట్లకు చేరింది. బ్రాండెడ్ స్టాపుల్స్ (ప్రధాన ఆహార పదార్థాలు) వైపు వినియోగదారులు మళ్లుతుండడం తమకు కలిసొస్తున్నట్టు అదానీ విల్‌మార్ ఎండీ, సీఈవో అంగ్షు మాలిక్ పేర్కొన్నారు. వంట నూనెలు, ఫుడ్, ఎఫ్‌ఎంసీజీలో రెండంకెల వృద్ధిని నమోదు చేసినట్టు చెప్పారు. ముఖ్యంగా వంట నూనెల ధరల్లో స్థిరత్వం మెరుగైన ఫలితాలకు దారితీసింది. ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో కంపెనీ షేరు 6 శాతం పెరిగి రూ.344 వద్ద ముగిసింది.

అరవింద్ లాభం డౌన్

క్యూ1లో రూ. 44 కోట్లు



న్యూఢిల్లీ: టెక్స్‌టైల్స్ రంగ కంపెనీ అరవింద్ లిమిటెడ్ ఈ ఆర్థిక సంవత్సరం(2024-25) తొలి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. ఏప్రిల్-జూన్(క్యూ1)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 37 శాతంపైగా క్షీణించి రూ. 44 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ.70 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం నామమాత్ర(1 శాతం) క్షీణతతో రూ. 1,831 కోట్లకు చేరింది. గత క్యూ1లో రూ. 1,853 కోట్ల టర్నోవర్ అందుకుంది. ఉద్యోగుల సమ్మె, సాధారణ ఎన్నికలు పనితీరును దెబ్బతీసినట్లు కంపెనీ పేర్కొంది. ప్రధానంగా సమ్మె ప్రభావంతో సుమారుగా ఆదాయంలో రూ. 200 కోట్లు, నిర్వహణ లాభంలో రూ. 60 కోట్లు చొప్పున నష్టపోయినట్లు తెలియజేసింది. కాగా.. మొత్తం వ్యయాలు నామమాత్రంగా పెరిగి రూ. 1,790 కోట్లకు చేరాయి.

ఫలితాల నేపథ్యంలో అరవింద్ షేరు బీఎస్ఈలో 3.3 శాతం క్షీణించి రూ. 374 వద్ద ముగిసింది.

అదానీ టోటల్ గ్యాస్ ఫర్వాలేదు

లాభంలో 20 శాతం వృద్ధి



న్యూఢిల్లీ: అదానీ గ్రూప్‌లో భాగమైన అదానీ టోటల్ గ్యాస్ జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో మెరుగైన పనితీరు చూపించింది. పట్టణ గ్యాస్ పంపిణీ విభాగంలో సేవలు అందిస్తున్న ఈ కంపెనీ రూ.177 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.148 కోట్లతో పోల్చి చూసినప్పుడు 20 శాతం వృద్ధి చెందింది. సీఎన్‌జీ, పైప్డ్ వంట గ్యాస్ విక్రయాలు పెరగడం ఇందుకు కలిసొచ్చింది. కార్యకలాపాల ద్వారా ఆదాయం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 9 శాతం పెరిగి రూ.1,237 కోట్లకు చేరుకుంది. సీఎన్‌జీ విక్రయాలు 20 శాతం పెరిగి 153 మిలియన్ స్టాండర్డ్ క్యుబిక్ మీటర్లు (ఎంఎంఎస్‌సీఎం)గా ఉన్నట్టు కంపెనీ తెలిపింది. పైప్డ్ వంట గ్యాస్ విక్రయాలు 11 శాతం పెరిగి 77 ఎంఎంఎస్‌సీఎంగా ఉన్నట్టు పేర్కొంది. సీఎన్‌జీ నెట్‌వర్క్ 559 స్టేషన్లకు విస్తరించింది. జూన్ క్వార్టర్‌లో కొత్తగా 12 సీఎన్‌జీ స్టేషన్లను ప్రారంభించింది. పైపుల ద్వారా వంటగ్యాస్ పంపిణీ 8.58 లక్షల ఇళ్లకు చేరింది. కొత్తగా 38,165 గృహ కనెక్షన్లను పెంచుకుంది. బీఎస్ఈలో అదానీ టోటల్ గ్యాస్ షేరు అర శాతం లాభపడి రూ.893 వద్ద క్లోజయింది.

అడ్మిషన్స్

కామన్ లా అడ్మిషన్ టెస్ట్(క్లాట్)-2025

దేశవ్యాప్తంగా ఉన్న నేషనల్ లా యూనివర్శిటీల్లో.. లా యూజీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే కామన్ లా అడ్మిషన్ టెస్ట్(క్లాట్) 2025 పరీక్ష నోటిఫికేషన్ విడుదలైంది.

- **అర్హత:** యూజీ కోర్సులకు 10+2, పీజీ కోర్సులకు ఎల్ఎల్బీ డిగ్రీలో ఉత్తీర్ణులై ఉండాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 15.07.2024.
- **ఆన్లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.10.2024.
- **పరీక్ష తేది:** 01.12.2024.
- **వెబ్సైట్:** consortiumofnlus.ac.in

ఇన్స్పైర్ మనక్ ప్రతిపాదనలకు ఆహ్వానం

వినూత్న ఆలోచనలు చేయడం, నూతన ఆవిష్కరణలపై ఆసక్తి ఉండి, శాస్త్రవేత్తలుగా రాణించాలనుకునే విద్యార్థులకు ఇన్స్పైర్ మనక్ మంచి వేదిక. 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న ప్రభుత్వ, ప్రైవేట్, గురుకులాల తదితర పాఠశాలల విద్యార్థులు ఈ ప్రోగ్రామ్కు దరఖాస్తు చేసుకోవచ్చు. ఉన్నత పాఠశాలల నుంచి ఐదు చొప్పున, ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి మూడు చొప్పున నామినేషన్లను స్వీకరిస్తారు.

పరిశోధనకు ప్రోత్సాహకం

- జిల్లా స్థాయిలో నిర్వహించిన నమూనా ప్రదర్శనల్లో ఉత్తమంగా ఉన్నవాటిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తారు. అక్కడ ప్రతిభ చాటితే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. ఈ స్థాయి ప్రాజెక్ట్లకు ప్రభుత్వం పెటెంట్ హక్కులను ఇస్తుంది.
- జాతీయ స్థాయి పోటీల్లో రాణిస్తే రాష్ట్రపతి, ప్రధానమంత్రిని కలుసుకునే అవకాశం లభిస్తుంది.
- జాతీయ స్థాయిలో ప్రదర్శనకు ఎంపికైన ప్రాజెక్టులకు సంబంధించిన విద్యార్థులకు రూ.25 వేలు వరకు శాస్త్ర, సాంకేతిక మండలిశాఖ అదనపు నిధులను కేటాయిస్తుంది.

దరఖాస్తు ఇలా

2024, సెప్టెంబర్ 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్లైన్లో వివరాలను నమోదు చేయాలి. పాఠశాల అథారిటీ ఐచ్ఛికాన్ని క్లిక్ చేసి వన్టైం రిజిస్ట్రేషన్ చేసి, పాఠశాల వివరాలను పొందుపర్చాలి. జిల్లా విద్యాశాఖ నుంచి ఆమోదం వచ్చిన తర్వాత ఈమెయిల్, యూజర్ ఐడీతో లింక్ రాగానే పాస్వర్డ్ నమోదు చేయాలి. దీని తర్వాత ప్రాజెక్ట్ నమూనాకు సంబంధించిన వివరాలను పొందుపర్చాలి.

- **వెబ్సైట్:** https://www.inspireawards-dst.gov.in

కరెంట్ అఫైర్స్



అంతర్జాతీయం

యునెస్కో వారసత్వ సంపదగా అహోమ్ సమాధులు

అహోమ్ చక్రవర్తుల సమాధులకు యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్ గుర్తింపు లభించింది. ఈశాన్య అస్సాంలో ఉన్న ఈ ప్రాంతం.. కల్చరల్ ప్రాపర్టీ కేటగిరీలో యునెస్కో గుర్తింపు పొందింది. ఈజిప్ట్ పిరమిడ్స్ తరహాలో తూర్పు అస్సాంను పాలించిన అహోమ్ చక్రవర్తులు ఇక్కడ తమ పూర్వీకుల సమాధులను కట్టారు. 'చరాయిడియో మైదమ్'ను చక్రవర్తుల ఖనన ప్రదేశంగా పిలుస్తారు. మైదమ్ అంటే పుట్ట తరహాలో భూమిపై ఎత్తుగా ఉంటుంది. తూర్పు అస్సాం ప్రాంతాన్ని సుమారు 600 ఏళ్ల పాటు అహోమ్ రాజులు పాలించారు. బ్రిటీషర్ల రాకకు పూర్వం ఇక్కడ ఆ రాజుల పాలనే ఉండేది. పిరమిడ్స్ తరహాలో ఇక్కడ సమాధులను నిర్మించారు. తాజాగా వీటికి గుర్తింపుతో భారత్లో యునెస్కో వారసత్వ గుర్తింపు పొందిన ప్రాంతాల సంఖ్య 43కి చేరింది.

దేశంలో పెరిగిన అటవీ విస్తీర్ణం

భారత్లో అటవీ విస్తీర్ణం పెరిగింది. 2010 నుంచి 2020 వరకు దేశంలో సుమారు 2.66 లక్షల హెక్టార్ల అటవీ ప్రాంతం పెరిగినట్లు ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఏవో) తన నివేదికలో పేర్కొంది. అటవీ శాతం పెరిగిన టాప్ 10 దేశాల్లో ఇండియా మూడో స్థానంలో ఉంది. జూలై 22న విడుదలైన నివేదికలో చైనా మొదటి స్థానంలో నిలిచింది. చైనాలో 19,37,000 హెక్టార్ల మేర అటవీ విస్తీర్ణం పెరిగినట్లు ఎఫ్ఏవో నివేదిక పేర్కొంది. ఆ తర్వాత రెండవ స్థానంలో ఆస్ట్రేలియా ఉంది. ఆస్ట్రేలియాలో 4,46,000 హెక్టార్ల మేర అటవీ ప్రాంతం పెరిగింది. టాప్ టెన్ దేశాల్లో చిలీ, వియత్నాం, టర్కీ,అమెరికా, ఫ్రాన్స్,ఇటలీ,రొమేనియా ఉన్నాయి.

అత్యంత వేడి దినంగా జూలై 22

గత 84 ఏళ్లలో అత్యధిక ఉష్ణోగ్రత నమోదైన రోజుగా జూలై 22వ తేదీ రికార్డు సృష్టించింది. ఆ రోజున ప్రపంచ సగటు ఉష్ణోగ్రత 17.15 డిగ్రీ సెల్సియస్గా నమోదైనట్లు యూరోపియన్ యూనియన్కు చెందిన కోపర్నికస్ క్లైమేట్ చేంజ్ సర్వీస్ (సీ3ఎస్) తెలిపింది. 1940 తర్వాత అత్యధిక ఉష్ణోగ్రత నమోదైన రోజు జూలై 22 అని సీ3ఎస్ తెలిపింది.

సింగపూర్ పాస్పోర్టు.. పవర్ ఫుల్

ప్రపంచంలోని అత్యంత శక్తివంతమైన పాస్పోర్టుల జాబితాను హెన్లే-పార్ట్నర్ సంస్థ (లండన్) విడుదల చేసింది. హెన్లే పాస్పోర్ట్ ఇండెక్స్ ప్రకారం-భారత పాస్పోర్ట్కు 82వ స్థానం దక్కింది. భారతీయ పాస్పోర్ట్తో 58 దేశాల్లో వీసా లేకుండా ప్రయాణించొచ్చు. ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్పోర్ట్ అసోసియేషన్ డేటా ఆధారంగా ర్యాంకలను రూపొందించారు. ప్రస్తుతం సెనగల్, తజికిస్తాన్ దేశాల ర్యాంక్లతో ఇండియా ర్యాంక్ సమంగా ఉంది. అత్యంత శక్తివంతమైన పాస్పోర్ట్ల్లో సింగపూర్ మొదటి స్థానం సొంతం చేసుకుంది. సింగపూర్ పాస్పోర్ట్తో 195 దేశాల్లో వీసా లేకుండానే ప్రయాణించొచ్చు.రెండో స్థానంలో జపాన్తోపాటు ఫ్రాన్స్, జర్మనీ, స్పెయిన్ దేశాలు ఉన్నాయి. ఈ దేశాలు పాస్పోర్ట్లు ఉన్నవారు 192 దేశాల్లో వీసా ఫ్రీ ఎంట్రీ ఇవ్వవచ్చు.

సముద్రం అట్టడుగున డార్క్ ఆక్సిజన్

సముద్రం అట్టడుగున డార్క్ ఆక్సిజన్ ఉత్పత్తి కావటం శాస్త్రవేత్తలను ఆశ్చర్యానికి గురి చేస్తోంది. దాదాపు 13 వేల అడుగుల లోతున ఉత్పత్తి అయ్యే ఆక్సిజన్ను డార్క్ ఆక్సిజన్ అంటారు. ఎలాంటి జీవి ప్రమేయం లేకుండా.. సూర్యరశ్మి పడకుండా పసిఫిక్ మహా సముద్రంలో ప్రాణవాయువు ఉత్పత్తి కావటమే అందుకు కారణం. దీన్ని బట్టి సముద్రపు అడుగు భాగంలో ఆక్సిజన్ను ఉత్పత్తి చేయొచ్చన్న అభిప్రాయం బలపడుతోందని స్కాటిష్ అసోసియేషన్ ఫర్ మెరైన్ సైన్సెస్ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. 2013లోనే తొలిసారిగా దీన్ని గుర్తించగా.. పూర్తి అధ్యయనం తర్వాత ఈ అంశాన్ని ఓ జర్నల్లో ప్రచురించారు.

జాతీయం

కేంద్ర ఆర్థిక సర్వే 2023-24

దేశ ఆర్థిక వ్యవస్థకు దిశా నిర్దేశం చేసేదిగా భావించే ఆర్థిక సర్వే 2023-24ను కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ జూలై 22వ తేదీ పార్లమెంట్లో ప్రవేశపెట్టారు. కేంద్ర ముఖ్య ఆర్థిక సలహాదారు వి.అనంత నాగేశ్వరన్ ఆధ్వర్యంలో ఈ నివేదికను రూపొందించారు. బడ్జెట్లో 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'పై చాలా నిర్ణయాలు తీసుకున్నట్లు చెప్పారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ ..'ఆర్థిక సర్వేలో 2024-25 ఆర్థిక సంవత్సారానికిగాను దేశ వాస్తవ జీడీపీ 6.5-7 శాతం వృద్ధి చెందుతుందని అంచనా. బడ్జెట్ 2024-25లో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్పై చాలా నిర్ణయాలు తీసుకున్నాం. దాదాపు 11 దశల్లో దీనిపై చర్చలు జరిగాయి. ముఖ్యంగా 63 నేరాలను డీక్రిమినైజేషన్ చేయడం వల్ల ప్రస్తుతం కంపెనీలు సమర్థంగా కొనసాగుతున్నాయి' అన్నారు.

'షింకున్ లా టన్నెల్' ప్రాజెక్టును ప్రారంభించిన మోదీ

ద్రాస్ సెక్టార్లో జూలై 26న 25వ కార్గిల్ విజయ్ దివస్లో పాల్గొన్న ప్రధాని మోదీ.. షింకున్ లా టన్నెల్ ప్రాజెక్టు పనులను వర్చువల్గా ప్రారంభించారు. లేహ్కు వెళ్లే రూట్లో ఈ టన్నెల్ను నిర్మిస్తున్నారు. ఈ టన్నెల్ సుమారు 4.1 కిలో మీటర్ల పొడవు ఉంటుంది. ఈ ట్విన్ ట్యూబ్ టన్నెల్ను సుమారు 15,800 అడుగుల ఎత్తులో నిర్మిస్తున్నారు. నిమి-పదుం-దర్చా రోడ్డు మార్గంలో ఈ టన్నెల్ను నిర్మిస్తున్నారు. ఎటువంటి వాతావరణ పరిస్థితుల్లో అయినా టన్నెల్ ద్వారా లేహ్కు వెళ్లేందుకు మార్గం సుగమం అవుతుంది.

దర్బార్ హాల్, అశోక్హాల్ పేర్లు మార్పు

రాష్ట్రపతి భవన్లోని రెండు హాళ్ల పేర్లను మార్చారు. దర్బార్ హాల్ను 'గణతంత్ర మండపం'గా.. అశోక హాల్ను 'అశోక మండపం'గా నామకరణం చేశారు. ఈ మేరకు రాష్ట్రపతి సెక్రటేరియట్ ఒక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రపతి భవన్ వాతావరణాన్ని భారతీయ సాంస్కృతిక విలువలు, తత్వాలను ప్రతిబింబించేలా చేసే ప్రయత్నమే ఇదని వివరించింది. దర్బార్ హాల్ను జాతీయ అవార్డులు ప్రదానం చేసేందుకు, ముఖ్యమైన వేడుకలు నిర్వహించేందుకు ఉపయోగిస్తుండగా.. అశోక్ హాల్ ఓ బాల్రూమ్గా ఉపయోగపడుతోంది.

రోహిణి-560 రాకెట్ పరీక్ష విజయవంతం

ఇస్రో శాస్త్రవేత్తలు జూలై 22వ తేదీన శ్రీహరికోటలోని షార్ సెంటర్ నుంచి రోహిణి-560 సౌండింగ్ రాకెట్ను ప్రయోగించారు. దేశీయంగా తాము అభివృద్ధి చేసిన ఎయిర్ బ్రీతింగ్ ప్రొపల్షన్ టెక్నాలజీని ప్రయోగించడమే ప్రయోగం లక్ష్యమని శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ రెండు దశల ఉప కక్ష్య సౌండింగ్ రాకెట్కు రెండు వైపులా ప్రొపల్షన్ వ్యవస్థలు సాలిడ్ మోటార్లు ఉంటాయి. ఇప్పటి వరకు తాము ప్రయోగించిన అతి భారీ సౌండింగ్ రాకెట్ ఇదేనని అన్నారు. ప్రయోగం సందర్భంగా రాకెట్ పనితీరును పరిశీలించేందుకు పరిగణనలోకి తీసుకున్న 110 పరామితులను సాధించామన్నారు.

యూనియన్ బడ్జెట్ 2024-25

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్.. జూలై 23న లోక్సభలో బడ్జెట్ 2024-25ను ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్ మొత్తంలో వివిధ రంగాలన్నింటికి కలిపి రూ.48.21 లక్షల కోట్ల కేటాయింపులు చేశారు. అంటే.. స్థూలంగా బడ్జెట్ పరిమాణం రూ.48.21 కోట్లు. ఇందులో మొత్తం ఆదాయాన్ని రూ.32.07 లక్షల కోట్లుగా.. దానిలో పన్ను ఆదాయన్ని రూ.28.83 లక్షల కోట్లుగా చూపించారు. ఈ ఏడాది ద్రవ్యలోటు 4.9 శాతంగా ఉండవచ్చని బడ్జెట్లో అంచనా వేశారు. అప్పులు, పన్నేతర ఆదాయాలు రూ.16 లక్షల కోట్లుగా అంచనా కట్టారు. అదేవిధంగా నూతన పింఛన్ విధానంలో త్వరలో మార్పులు చేయనున్నట్లు తెలిపారు. సంప్రదింపుల కమిటీ సిఫార్సుల ఆధారంగా త్వరలో నిర్ణయం తీసుకోనున్నట్లు చెప్పారు. ప్రత్యక్ష విదేశీ పెట్టుబడుల విధానంలోనూ, ఇతర దేశాల్లో భారత్ పెట్టుబడుల విధానంలోనూ సరళీకరణలు తీసుకురానున్నట్లు వెల్లడించారు. వాణిజ్య అనుకూల విధానాలకు జన్ విశ్వాస్ బిల్లుతో మరిన్ని సంస్కరణలు చేయనున్నట్లు తెలిపారు. భవిష్యత్ తరాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించనున్నట్లు చెప్పారు. యూఎల్పిన్ ద్వారా ప్రతి భూకమతానికి ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి భూకమతానికి భూ ఆధార్ ద్వారా గుర్తింపు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. దేశీయ విద్యాసంస్థల్లో ఉన్నత విద్య కోసం రూ.10 లక్షల వరకు రుణాలు ఇవ్వనున్నట్లు ప్రకటించారు.

రూ.2.62 లక్షల కోట్లతో రైల్వే పద్దు

కొత్త బడ్జెట్లో కేంద్రం భారతీయ రైల్వేకు రూ.2.62 లక్షల కోట్లు కేటాయించింది. రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ మీడియాతో మాట్లాడుతూ.. మొత్తం కేటాయింపుల్లో రూ.1.08 లక్షల కోట్ల నిధులను రైల్వే భద్రత వ్యవస్థల మెరుగు, రైల్వే మార్గాల్లో కవచ్ వ్యవస్థ ఇన్స్టాలేషన్కు వినియోగించనున్నట్లు తెలిపారు. ఆటోమేటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ వ్యవస్థ 'కవచ్' ఇన్స్టాలేషనే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యతల్లో ఒకటని చెప్పారు. రైల్వే భద్రతా చర్యల్లో భాగంగా పాత ట్రాకుల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తామని.. అదేవిధంగా సిగ్నలింగ్ వ్యవస్థ మెరుగుపరుస్తామని.. రైల్వే ఓవర్, అండర్ పాస్ బ్రిడ్జిలను నిర్మిస్తామని.. కవచ్ వ్యవస్థను ఇన్స్టాల్ చేస్తామని అశ్విని వైష్ణవ్ తెలిపారు. కవచ్4.0 ఇటీవల ఆమోదం పొందిందని, ఇన్స్టాలేషన్ను త్వరితగతిన చేపడతామని పేర్కొన్నారు.

వార్తల్లో వ్యక్తులు

అమెరికాలో భారత రాయబారిగా వినయ్ క్వాత్రా

భారత విదేశీ వ్యవహారాల శాఖ మాజీ కార్యదర్శి వినయ్ క్వాత్రా అమెరికాలో భారత రాయబారిగా నియమితులయ్యారు. ఇదివరకు పనిచేసిన తరణ్ జిత్ సంధు జనవరిలో పదవీ విరమణ చేయడంతో.. ఆ స్థానంలో వినయ్ క్వాత్రాను విదేశీ వ్యవహారాల శాఖ (ఎంఈఏ) నియమించింది. 1988లో ఐఎఫ్ఎస్ అధికారిగా విధుల్లో చేరిన వినయ్ క్వాత్రా వివిధ హోదాల్లో పనిచేశారు.

ప్రముఖ ఆర్థికవేత్త సి.టి.కురియన్ కన్నుమూత

ప్రముఖ ఆర్థిక వేత్త, మద్రాస్ క్రిస్టియన్ కళాశాల మాజీ ఆచార్యులు సి.టి.కురియన్ జూలై 23న చెన్నైలో కన్నుమూశారు.

క్రీడలు

ఒలింపిక్ కమిటీకి ఏకగ్రీవంగా ఎన్నికైన నీతా అంబానీ

రిలయన్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు నీతా అంబానీ అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) భారత ప్రతినిధిగా తిరిగి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జూలై 26 నుంచి ఆగస్టు 11 వరకు పారిస్లో జరగుతున్న ఒలింపిక్ క్రీడల్లో భాగంగా వివిధ దేశాలకు ప్రాతినిధ్యం వహించేందుకు అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ(ఐఓసీ)సభ్యులను ఎన్నుకున్నారు. అందులో భారత్ తరఫున నీతా అంబానీ తిరిగి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 2016లో రియో డి జెనీరోలో జరిగిన ఒలింపిక్ క్రీడల సందర్భంగా.. ఆమె తొలిసారి ఐఓసీ సభ్యురాలిగా ఎంపికయ్యారు. ఐఓసీలో చేరిన మొదటి భారతీయ మహిళగా ఆమె గుర్తింపు పొందారు.



ఎం.బాలలత, సబ్జెక్ట్ నిపుణులు

విద్య, ఉద్యోగ సమాచారం

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 94 ఆఫీసర్ గ్రేడ్-బి పోస్టులు

ముంబైలోని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) సర్వీస్ బోర్డు దేశవ్యాప్తంగా ఉన్న ఆర్బీఐ శాఖల్లో ఆఫీసర్ గ్రేడ్-బి పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఎంపికైన అభ్యర్థులు దేశవ్యాప్తంగా ఉన్న ఆర్బీఐ శాఖల్లో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 94.
- » **పోస్టుల వివరాలు:** ఆఫీసర్ గ్రేడ్ బి(డీఆర్)-జనరల్-66, ఆఫీసర్ ఇన్ గ్రేడ్ బి(డీఆర్)-డీఈపీఆర్-21, ఆఫీసర్ ఇన్ గ్రేడ్ బి(డీఆర్)-డీఎస్ఐఎం-07.
- » **అర్హత:** సంబంధిత విభాగంలో డిగ్రీ/ఎంఏ/పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- » **వయసు:** 01.07.2024 నాటికి 21 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
- » **బేసిక్ పే స్కేల్:** నెలకు రూ.55,200 నుంచి రూ.99,750.
- » **ఎంపిక విధానం:** ప్రిలిమినరీ, మెయిన్ పరీక్షలు, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ద్వారా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

- » **దరఖాస్తు విధానం:** ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 25.07.2024
- » **ఆన్లైన్ దరఖాస్తులకు చివరితేది:** 16.08.2024.
- » **వెబ్సైట్:** http://www.rbi.org.in

ఇండియన్ నేవీలో 741 గ్రూప్ బి, గ్రూప్ సి పోస్టులు

ఇండియన్ నేవీలో గ్రూప్ బి, గ్రూప్ సి పోస్టుల భర్తీకి సివిలియన్ ఎంట్రన్స్ టెస్ట్(ఐఎన్సీఈటీ-01/2024) నిర్వహిస్తారు.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 741.
- » **పోస్టుల వివరాలు:** గ్రూప్ బి పోస్టులు: ఛార్జ్మ్యాన్(అమ్యూనిషన్ వర్క్షాప్)-01, చార్జ్మ్యాన్(ఫ్యాక్టరీ)-10, ఛార్జ్మ్యాన్(మెకానిక్)-18, సైంటిఫిక్ అసిస్టెంట్-04.
- » **గ్రూప్ సీ పోస్టులు:** డ్రాఫ్ట్మ్యాన్(కన్స్ట్రక్షన్)-02, ఫైర్మ్యాన్-444, ఫైర్ ఇంజన్ డ్రైవర్-58, ట్రేడ్స్మ్యాన్ మేట్-161, పెస్ట్ కంట్రోల్ వర్కర్-18, కుక్-09, ఎంటీఎస్(మినిస్టీరియల్)-16.
- » **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, 12వ తరగతి, సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
- » **వయసు:** ఛార్జ్మ్యాన్(మెకానిక్), సైంటిఫిక్ అసిస్టెంట్ పోస్టులకు 30 ఏళ్లు మించకూడదు. ఫైర్మ్యాన్, ఫైర్ ఇంజన్ డ్రైవర్ పోస్టులకు 18 నుంచి 27 ఏళ్లలోపు ఉండాలి. మిగిలిన పోస్టులకు 18 నుంచి 27 ఏళ్లలోపు ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్లు గరిష్ఠ వయసులో సడలింపులు వర్తిస్తాయి.

ముఖ్య సమాచారం

- » **దరఖాస్తు విధానం:** ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్లైన్ దరఖాస్తులకు చివరితేది:** 02.08.2024
- » **వెబ్సైట్:** https://incet.cbtexam.in

ఏపీపీఎస్సీ-ఆర్ఐఎంసీలో 8 తరగతి ప్రవేశాలు

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ).. డెహ్రాడూన్(ఉత్తరాఖండ్)లోని రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కాలేజ్(ఆర్ఐఎంసీ)లో జూలై-2025 టర్మ్ ఎనిమిదో తరగతి ప్రవేశాలకు ఆంధ్రప్రదేశ్కు చెందిన బాలురు, బాలికల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- » **అర్హత:** గుర్తింపు పొందిన పాఠశాల నుంచి 2025, జూలై 1వ తేదీ నాటికి ఏడో తరగతి చదువుతున్న లేదా ఏడో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులు.
- » **వయసు:** 01.07.2025 నాటికి పదకొండున్నర ఏళ్లకు తగ్గకుండా పదమూడేళ్లకు మించకుండా ఉండాలి. అంటే.. 02.07.2012 నుంచి 01.01.2014 మధ్య జన్మించి ఉండాలి.
- » **ఎంపిక విధానం:** రాతపరీక్ష, వైవా వాయిస్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **పరీక్ష విధానం:** రాతపరీక్షలో మొత్తం మూడు పేపర్లు ఉంటాయి. అవి.. మ్యాథమేటిక్స్(200 మార్కులు), జనరల్ నాలెడ్జ్(75 మార్కులు), ఇంగ్లిష్ (125 మార్కులు) నుంచి ప్రశ్నలు ఉంటాయి. రాతపరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు వైవా వాయిస్(50 మార్కులు) నిర్వహిస్తారు. రాత పరీక్ష, వైవా వాయిస్ కలిపి మొత్తం 450 మార్కులకు ఉంటుంది. కనీస ఉత్తీర్ణతా మార్కులు 50 శాతం ఉండాలి. ఈ రెండింటిలో అర్హత సాధించిన అభ్యర్థులకు చివరిగా వైద్య పరీక్షలు నిర్వహిస్తారు.

ముఖ్య సమాచారం

- » **దరఖాస్తు విధానం:** ఆఫ్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును అసిస్టెంట్ సెక్రటరీ (ఎగ్జామ్స్), ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్, న్యూ హెడ్స్ ఆఫ్ ద డిపార్ట్మెంట్స్ బిల్డింగ్, రెండో అంతస్తు, ఆర్టీఏ కార్యాలయం దగ్గర, ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం ఎదురుగా, ఎంజీ రోడ్డు, విజయవాడ చిరునామకు పంపించాలి.
- » **దరఖాస్తులకు చివరితేది:** 30.09.2024.
- » **పరీక్ష తేది:** 01.12.2024.
- » **వెబ్సైట్:** https://psc.ap.gov.in

LIC HFL
LIC HOUSING FINANCE LTD
With you, for your dream home

ఎల్ఐసీ హెచ్ఎఫ్ఎల్లో 200 జూనియర్ అసిస్టెంట్ పోస్టులు

లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (హెచ్ఎఫ్ఎల్).. దేశవ్యాప్తంగా ఉన్న ఎల్ఐసీ హెచ్ఎఫ్ఎల్ కార్యాలయాల్లో జూనియర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

- » **మొత్తం ఖాళీల సంఖ్య:** 200.
- » **రాష్ట్రాల వారీగా ఖాళీలు:** ఆంధ్రప్రదేశ్-12, అస్సాం-05, ఛత్తీస్గఢ్-06, గుజరాత్-05, హిమాచల్ప్రదేశ్-03, జమ్మూ కశ్మీర్-01, కర్ణాటక-38, మధ్యప్రదేశ్-12, మహారాష్ట్ర-53, పుదుచ్చేరి-01, సిక్కిం-01, తెలంగాణ-31, తమిళనాడు-10, ఉత్తరప్రదేశ్-17, పశ్చిమ బెంగాల్-05.
- » **అర్హత:** కనీసం 60 శాతం మార్కులతో ఏదైనా విభాగంలో గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణతతో పాటు కంప్యూటర్ సిస్టమ్స్ ఆపరేటింగ్, వర్కింగ్ నాలెడ్జ్ తప్పనిసరిగా ఉండాలి. కంప్యూటర్ ఆపరేషన్స్/లాంగ్వేజ్లలో సర్టిఫికేట్/డిప్లొమా/డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
- » **వయసు:** 01.07.2024 నాటికి 21 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి.
- » **వేతనం:** పని ప్రదేశం ఆధారంగా నెలకు రూ.32,000 నుంచి రూ.35,200 ఉంటుంది.
- » **ఎంపిక విధానం:** ఆన్లైన్ పరీక్ష, ఇంటర్వ్యూ, సర్టిఫికేట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **పరీక్ష విధానం:** ఆన్లైన్లో పరీక్ష జరుగుతుంది. మొత్తం 200 మార్కులకు 200 ప్రశ్నలు ఉంటాయి. ఇంగ్లిష్ లాంగ్వేజ్ (40 ప్రశ్నలు-40 మార్కులు), లాజికల్ రీజనింగ్(40 ప్రశ్నలు-40 మార్కులు), జనరల్ అవేర్నెస్ (40 ప్రశ్నలు-40 మార్కులు), న్యూమరికల్ ఎబిలిటీ(40 ప్రశ్నలు-40 మార్కులు), కంప్యూటర్ స్కిల్(40 ప్రశ్నలు-40 మార్కులు) సబ్జెక్టులు ఉంటాయి. పరీక్ష మాధ్యమం ఇంగ్లిష్లో ఉంటుంది. పరీక్ష వ్యవధి 120 నిమిషాలు.

ముఖ్య సమాచారం

- » **దరఖాస్తు విధానం:** ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభతేది:** 25.07.2024
- » **ఆన్లైన్ రిజిస్ట్రేషన్కు చివరితేది:** 14.08.2024.
- » **ఆన్లైన్ పరీక్ష తేది:** సెప్టెంబర్ 2024.
- » **వెబ్సైట్:** www.lichousing.com

ఎస్బీఐలో.. స్పెషలిస్ట్ ఆఫీసర్

ట్రెడిషనల్, ప్రొఫెషనల్ కోర్సులు పూర్తి చేశారా.. ఆర్థిక రంగంలో పని అనుభవం ఉందా.. బ్యాంకింగ్ రంగంలో సమున్నత అవకాశం కోసం ఎదురు చూస్తున్నారా! అయితే.. మీకు చక్కటి అవకాశం స్వాగతం పలుకుతోంది!! అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు.. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ).. వెల్త్ మేనేజ్మెంట్ విభాగంలో మొత్తం 1,040 స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్ట్లకు నోటిఫికేషన్ విడుదలైంది. ఎంపికైతే ఆయా పోస్ట్లను అనుసరించి రూ.22 లక్షలు-రూ.66 లక్షల వరకు వార్షిక వేతనం అందుకోవచ్చు! ఈ నేపథ్యంలో.. ఎస్బీఐ స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్ట్లు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక విధానం, వేతనాలు తదతర వివరాలు..



» 1,040 స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టులకు నోటిఫికేషన్
» ఇంటర్వ్యూలో ప్రతిభ ఆధారంగా ఎంపిక ప్రక్రియ
» అయిదేళ్ల కాంట్రాక్ట్ ప్రాతిపదికన నియామకాలు

ప్రభుత్వ రంగ బ్యాంకులు..సాంప్రదాయ బ్యాంకింగ్ కార్యకలాపాలతో పాటు మరెన్నో విభాగాల్లో సేవలందిస్తున్నాయి. ఆయా విభాగాల్లో కార్యకలాపాలు సజావుగా సాగేందుకు నిపుణులైన అభ్యర్థులను నియమించుకుంటున్నాయి. ఎస్బీఐ తాజా నోటిఫికేషన్ ఆ కోవలోనిదే! బ్యాంకులో కీలకమైన వెల్త్ మేనేజ్మెంట్ విభాగంలో ఈ పోస్టలను భర్తీ చేయనున్నారు. ఈ ఉద్యోగాలకు ఎంపికైన వారికి భారీ స్థాయిలో వేతనాలు అందించనున్నారు.

మొత్తం పోస్టుల సంఖ్య 1,040

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.. తాజాగా విడుదల చేసిన స్పెషలిస్ట్ కేడర్ ఆఫీసర్ నోటిఫికేషన్ ద్వారా మొత్తం 1,040 పోస్ట్లను భర్తీ చేయనుంది. వీటిల్లో సెంట్రల్ రీసెర్చ్ టీమ్ (ప్రొడక్ట్ లీడ్)-2 పోస్టులు, సెంట్రల్ రీసెర్చ్ టీమ్(సపోర్ట్)-2 పోస్టులు, ప్రాజెక్ట్ డెవలప్మెంట్ మేనేజర్ (టెక్నాలజీ)-1 పోస్టులు, ప్రాజెక్ట్ డెవలప్మెంట్ మేనేజర్ (బిజినెస్)-2 పోస్టులు,రిలేషన్షిప్ మేనేజర్-273 పోస్టులు, వైస్ ప్రెసిడెంట్-వెల్త్ -643 పోస్టులు, రిలేషన్షిప్ మేనేజర్-టీమ్ లీడ్-32 పోస్టులు, రీజనల్ హెడ్-6 పోస్టులు, ఇన్వెస్ట్మెంట్ స్పెషలిస్ట్-30 పోస్టులు, ఇన్వెస్ట్మెంట్ ఆఫీసర్-49 పోస్టులు ఉన్నాయి.

అర్హతలు వేర్వేరుగా

- వివిధ పోస్టులకు అర్హతలను కూడా వేర్వేరుగా నిర్దేశించారు. ఆయా పోస్ట్లను అనుసరించి బ్యాచిలర్ డిగ్రీ/ఎంబీఏ/నిర్దేశిత స్పెషలైజేషన్లలో పీజీ/పీజీడీఎం /పీజీడీబీఎం/బీటెక్/ఎంటెక్/సీఏ/సీఎఫ్ఏ/ ఎన్ఐఎస్ఎం సర్టిఫికెట్ ఉత్తీర్ణత ఉండాలి.
- **వయసు:** ఆయా పోస్ట్లను అనుసరించి కనిష్ఠంగా 23ఏళ్లు, గరిష్ఠంగా 50 ఏళ్లు ఉండాలి. విద్యార్హతలు, పని అనుభవం, వయో పరిమితికి సంబంధించి ఏప్రిల్ 1, 2024ను గడువు తేదీగా పేర్కొన్నారు.

ఇంటర్వ్యూలో ప్రతిభ ఆధారంగా

ఎస్బీఐ స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్ట్లకు ఇంటర్వ్యూలో ప్రతిభ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. వచ్చిన దరఖాస్తులను తొలుత వడపోస్తారు. అభ్యర్థులు పొందిన అకడమిక్ మార్కులు, పని అనుభవం ఆధారంగా షార్ట్లిస్ట్ చేస్తారు. ఈ జాబితాలో నిలిచిన అభ్యర్థులకు పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఇంటర్వ్యూకు 100 మార్కులు కేటాయించారు. అభ్యర్థుల పని అనుభవం, ఇప్పటివరకు వారు నిర్వర్తించిన విధులు, బ్యాంకింగ్ రంగంలో తాజా పరిణామాలపై అవగాహన, వ్యక్తిగత దృక్పథం, వైఖరి వంటి అంశాలను పరిశీలిస్తారు. ఆ తర్వాత రిజర్వేషన్లు, ఇంటర్వ్యూలో పొందిన మార్కులు, పని అనుభవం వంటి వాటిని పరిగణనలోకి తీసుకుని తుది నియామకం ఖరారు చేస్తారు.

అయిదేళ్ల కాంట్రాక్ట్

ఎస్బీఐ స్పెషలిస్ట్ కేడర్ ఆఫీసర్ పోస్ట్లకు నిర్వహించే ఎంపిక ప్రక్రియలో విజయం సాధించి, నియామకాలు ఖరారు చేసుకున్న వారు అయిదేళ్ల పాటు బ్యాంకులో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. మొదటి ఏడాదిని ప్రొబేషన్ కాలంగా పరిగణిస్తారు. ఈ వ్యవధిలో వారు తమకు కేటాయించిన విభాగాల్లో ప్రణాళికల రూపకల్పన, నివేదికలు రూపొందించడం, ఉన్నతాధికారులకు సహకరించడం వంటి బాధ్యతలు చేపట్టాల్సి ఉంటుంది.

ముంబై, సర్కిల్ ఆఫీస్లల్లో

ఆయా పోస్ట్లకు ఎంపికైన వారు బ్యాంకు ప్రధాన కార్యాలయం ముంబైతోపాటు సర్కిల్ కార్యాలయాలల్లోనూ పని చేయాల్సి ఉంటుంది. సెంట్రల్ రీసెర్చ్ టీమ్ (ప్రొడక్ట్ లీడ్, సపోర్ట్), ప్రాజెక్ట్ మేనేజ్మెంట్ డెవలప్మెంట్ మేనేజర్ (టెక్నాలజీ), ప్రాజెక్ట్ డెవలప్మెంట్ మేనేజర్ (బిజినెస్) పోస్ట్ల అభ్యర్థులు ముంబై కార్యాలయంలోనే విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. మిగతా పోస్ట్లకు సంబంధించి బ్యాంకు సర్కిల్ ఆఫీస్లలో పని చేయాలి. దరఖాస్తు సమయంలోనే అభ్యర్థులు మూడు సర్కిల్ ఆఫీస్లను తమ ప్రాథమ్యాలుగా పేర్కొనొచ్చు.

రూ.లక్షల్లో వేతనాలు

సెంట్రల్ రీసెర్చ్ టీమ్ పోస్టుకు (ప్రొడక్ట్ లీడ్)కు రూ.61 లక్షలు; సెంట్రల్ రీసెర్చ్ టీమ్ పోస్టుకు (సపోర్ట్)కు రూ.20.5 లక్షలు; ప్రాజెక్ట్ డెవలప్మెంట్ మేనేజర్ (టెక్నాలజీ), ప్రాజెక్ట్ డెవలప్మెంట్ మేనేజర్(బిజినెస్), రిలేషన్షిప్ మేనేజర్ పోస్ట్లకు రూ.30 లక్షలు చొప్పున; వీపీ-వెల్త్కు రూ.45 లక్షలు; రిలేషన్షిప్ మేనేజర్ -టీమ్లీడ్కు రూ.52 లక్షలు; రీజనల్ హెడ్కు రూ.66.5 లక్షలు; ఇన్వెస్ట్మెంట్ స్పెషలిస్ట్కు రూ.44లక్షలు;ఇన్వెస్ట్మెంట్ ఆఫీసర్కు రూ.26.5 లక్షలుగా వార్షిక వేతనాన్ని నిర్దేశించారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఎస్బీఐ స్పెషలిస్ట్ కేడర్ ఆఫీసర్ పోస్ట్లకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం ఎస్బీఐ బ్యాంక్ అధికారిక వెబ్సైట్లోని కెరీర్స్ విభాగంలో ద్వారా ఆ ప్రక్రియ పూర్తి చేయాలి.
- **ఆన్లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024, ఆగస్ట్ 8.
- **పర్సనల్ ఇంటర్వ్యూలు:** సెప్టెంబర్ రెండో వారంలో నిర్వహించే అవకాశం.
- **పర్సనల్ ఇంటర్వ్యూ కేంద్రాలు:** ముంబై.
- **పూర్తి వివరాలకు వెబ్సైట్:** https://sbi.co.in/web/careers/current-openings